సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 232

బుధవారం 13-11-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'



నేడు మూడో టి20 మ్యాచ్

కేప్‌టౌన్‌లో జరిగే పోరులో భారత్, దక్షిణాఫ్రికా తలపడనున్నాయి

- 14లో



మిస్ టీన్ యూనివర్స్‌గా తృష్ణా రే

ఒడిశా యువతికి అందాల కిరీటం

- 6లో



అభివృద్ధికి బ్రేకుల్లో పీహెచ్‌డీ

మహారాష్ట్రలోని మహావికాస్ అఘాడీ కూటమి పార్టీలు అభివృద్ధికి బ్రేకులు వేయడంలో పీహెచ్‌డీ చేశాయని మోదీ మండిపడ్డారు.

వివరాలు 6లో ▸



పైచేయి ఎవరిదో!

జార్ఖండ్‌లోని మొత్తం 81 అసెంబ్లీ సీట్లకుగాను బుధవారం తొలి విడతలో 43 సీట్లకు పోలింగ్ జరగనుంది.

వివరాలు 6లో ▸



రాజ్యాంగం అంతానికి కుట్రలు

రాజ్యాంగాన్ని అంతం చేసేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సహా ప్రధాని మోదీ ప్రతిరోజూ పని చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



విదేశాంగ మంత్రిగా రూబియో

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్.. విదేశాంగ మంత్రిగా సెనేటర్ రూబియో, ఎన్ఎస్ఏగా మైక్ వాల్జ్‌లను ఎంపిక చేశారు.

వివరాలు 6లో ▸

అందరి బంధువులు ▼



దాదాపు 50 మంది అనాథలు, నిరాశ్రయులైన చిన్నారులకు ఆసరాగా నిలిచింది హైదరాబాద్‌లోని వాల్మీకి గురుకులం. సినీ దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి ఈ పిల్లలను కలిసింది. ఈ సమాజమే ఇటువంటి బాలలకు బంధుగణం అని మాట కలిపింది. నవంబర్ 14 చిల్డ్రన్స్ డే సందర్భంగా సాక్షి మీడియా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సంబంధించిన కథనం ఫ్యామిలీలో..

వివరాలు 13లో ▶

సాక్షి SAKSHI TV — నేటి మధ్యాహ్నం 12.15 గంటలకు సాక్షి టీవీలో

రాజకీయం గరం గరం



అధికార, ప్రతిపక్షాల ఆరోపణలు, ప్రత్యారోపణలు

- అవినీతి, అక్రమాలంటూ దుమ్మెత్తి పోసుకుంటున్న వైనం
- వేడి రాజేసిన ఫార్ములా ఈ-రేస్, అమృత్ టెండర్ల వ్యవహారం
- 'ఈ-రేస్‌కు చెల్లింపులు'పై కేటీఆర్‌పై కేసు, విచారణకు గవర్నర్ అనుమతి కోరిన ప్రభుత్వం
- అమృత్ టెండర్లపై కేంద్రానికి కేటీఆర్ ఫిర్యాదు
- తాజాగా వేడి పెంచుతున్న ఫోన్ ట్యాపింగ్
- కలెక్టర్‌పై దాడి ఘటనతో ముదురుతున్న రాజకీయ యుద్ధం

సాక్షి, హైదరాబాద్: అవినీతి, అక్రమాలంటూ ఆరోపణలు.. ప్రత్యారోపణలు, సవాళ్లు..ప్రతి సవాళ్లు, వ్యక్తిగత దూషణలు, కించపరిచే వ్యాఖ్యలు.. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు గత కొంతకాలంగా ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. గత పదేళ్ల పాలనపై విమర్శలు, ఆరోపణలతో, బీఆర్ఎస్ లక్ష్యంగా అధికార కాంగ్రెస్ దాడిని తీవ్రం చేస్తుంటే, విపక్ష బీఆర్ఎస్ కూడా నిత్యం సీఎం రేవంత్, మంత్రులు లక్ష్యంగా విరుచుకుపడుతోంది. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. ఈ-రేస్, అమృత్ టెండర్లు, ఫోన్ ట్యాపింగ్, వికారాబాద్ కలెక్టర్‌పై దాడి లాంటి ఉదంతాలు, వ్యవహారాలను తమ రాజకీయ లబ్ధికి ఉపయోగించుకునేలా రెండు పార్టీలూ మాటల యుద్ధానికి దిగుతున్నాయి. గల్లీలో, ఢిల్లీలో ఘాటైన వ్యాఖ్యలతో రాజకీయాన్ని వేడెక్కిస్తున్నాయి. ఇంకోవైపు మరో ప్రధాన పక్షం బీజేపీ.. ఈ రెండు పార్టీలపై విమర్శల జోరు పెంచుతూ పావులు కదుపుతోంది.

'దీపావళి బాంబుల'తో పెరిగిన వేడి

సీఎం రేవంత్, మంత్రులు ఒకవైపు.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్, బీఆర్ఎస్ నేతలు మరోవైపు అన్నట్టుగా పరస్పర ఆరోపణలు, విమర్శలతో రాష్ట్రంలో రాజకీయ వేడి కొనసాగుతోంది. ఇటీవల దీపావళికి బాంబులు పేలతాయంటూ రెవెన్యూ మంత్రి పొంగులేటి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఏం బాంబులు పేలతాయో, ఏ జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో ఫార్ములా–ఈ కార్ల రేసు వ్యవహారంలో విదేశీ కంపెనీకి రూ.55 కోట్లు ఎలాంటి

మిగతా 2వ పేజీలో ▶

కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎం!

ఎక్కడ ఎన్నికలు జరిగితే అక్కడికి తెలంగాణ నుంచే డబ్బు మూటలు: కేటీఆర్

- మహారాష్ట్రలో రూ.300 కోట్లతో ఎన్నికల ప్రకటనలు
- తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ అంటూ స్వయంగా పీఎం మోదీనే చెప్పారు
- నేను హైదరాబాద్‌కు వస్తున్నా.. దమ్ము ఉంటే ఏదైనా చేయండి

2లో

బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు

'ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అడ్డా' కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

- → రాష్ట్రంలో పరస్పర అవగాహనతో ముందుకెళ్తున్నాయి
- → కొన్నిసార్లు ప్రత్యక్షంగా, మరికొన్ని సందర్భాల్లో పరోక్షంగా సహకరించుకుంటున్నాయి
- → ఓ అవినీతి కేసులో కేటీఆర్ విచారణకు అనుమతి కోరితే గవర్నర్ కార్యాలయం పెండింగ్‌లో పెట్టింది
- → మరోవైపు కేంద్ర మంత్రులను కేటీఆర్ కలిశారు.. విచారణ భయంతోనే ఢిల్లీ వచ్చారు
- → మహారాష్ట్రలో కేసీఆర్ అభ్యర్థులను నిలపలేదేం?
- → దక్షిణాది రాష్ట్రాలపై మోదీ ప్రభుత్వం శీతకన్ను వేస్తోంది
- → దక్షిణాది రాష్ట్రాల ఆదాయంతో కేంద్రం నడుస్తున్నా..ఆ రాష్ట్రాలను పట్టించుకోవడం లేదు
- → 'నియోజకవర్గాల పునర్విభజన'పై కేంద్రం కమిషన్ ఏర్పాటు చేయాలన్న సీఎం
- → ప్రాణాలు, పదవులు త్యాగం చేసిన గాంధీ కుటుంబానికి డబ్బు అవసరం ఏముందని వ్యాఖ్య

> రెడ్డి పేరు మీద ఉన్న వారంతా నా బంధువులు కాదు. సృజన్ రెడ్డికి బీఆర్ఎస్ హయాంలోనే రూ. వేల కోట్ల కాంట్రాక్టులు వచ్చాయి. ఈ-రేస్ స్కామ్ నుంచి తప్పించుకోవడానికే కేటీఆర్ ఢిల్లీ వచ్చారు. అవినీతి పార్టీ అయిన బీజేపీని అంతం చేస్తామన్న కేటీఆర్... ఇప్పుడు బీజేపీ నేతలను ఎలా కలుస్తున్నారు?
> -సీఎం రేవంత్

2లో

ఊరంతా ఖాళీ..!

లగచర్ల, రోటిబండ, పులిచర్లకుంట తండాల్లో టెన్షన్ టెన్షన్

- అర్ధరాత్రి గ్రామాలను చుట్టుముట్టిన 300 మంది పోలీసులు
- 50 మంది రైతులు, యువకుల అరెస్టు.. ముందే తండాలు వదిలివెళ్లిన కొందరు
- రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపిన మహిళలు, చిన్నారులు, వృద్ధులు
- ఉదయం 8 గంటలకల్లా 3 గ్రామాలూ ఖాళీ

- వివరాలు 3లో▶

పోలీసులపై మంత్రి శ్రీధర్‌బాబు సీరియస్!

- ➤ సీఎం సొంత నియోజకవర్గంలో కలెక్టర్‌పై దాడి ఏంటి?
- ➤ సున్నిత అంశంపై ఐఏఎస్ అధికారి వస్తే భద్రతా చర్యలేవి అంటూ ఆగ్రహం

3లో

నలుగురు బీఆర్ఎస్ నేతలకు నోటీసులు?

- ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రమేయంపై మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల, పైళ్ల, బొల్లం మల్లయ్యను ప్రశ్నించనున్న పోలీసులు
- కేసులోని కీలక నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ అదనపు ఎస్పీ తిరుపతన్నతో వారు పలుమార్లు సంభాషించినట్లు గుర్తింపు
- ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు నోటీసు.. రేపు విచారణకు పోలీసుల ఎదుటకు..

- వివరాలు 5లో▶

'సీతారామ' అంచనాలు మోపెడు!



- భారీగా పెరగనున్న ప్రాజెక్టు అంచనా వ్యయం
- రూ.13,057 కోట్ల నుంచి రూ.19,800 కోట్లకు సవరణ ప్రతిపాదనలు
- పాలనా అనుమతులు కోరిన కొత్తగూడెం చీఫ్ ఇంజనీర్

-5లో



దమన నీతి.. అరాచక రీతి

ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులు నొక్కేస్తున్న బాబు సర్కారు

ఏపీలో పోలీసులను అడ్డుపెట్టుకుని నిరంకుశత్వం

- సామాన్య విషయాలపై పోస్టులు పెట్టినందుకు 680 మందికి నోటీసులు.. 147 మందిపై కేసులు.. ఇప్పటిదాకా 49 మందికి పైగా అరెస్టు
- సోషల్ మీడియా యాక్టివిస్టులపై కత్తికట్టిన సర్కారు
- అక్రమ కేసులతో చిత్రహింసలకు గురిచేస్తూ రాక్షసానందం
- ఫేక్ ఐడీలతో తప్పుడు పోస్టులు పెడుతున్నదీ వారే..
- ఆపై కేసులు పెట్టి వేధిస్తున్నదీ వారే
- వందలాది అక్రమ కేసులు.. వేలాది మందికి వేధింపులు
- రాజ్యాంగ హక్కులు కాలరాస్తూ కూటమి పెద్దల వికటాట్టహాసం

- వివరాలు 12లో▶



క్లుప్తంగా...

సీఎం రేవంత్‌రెడ్డితో నెదర్లాండ్స్ రాయబారి భేటీ



నెదర్లాండ్స్ రాయబారి మారిసా గెరార్డ్స్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో ఒక జాతీయ మీడియా కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని భారత్‌లో నెదర్లాండ్స్ రాయబారి మారిసా గెరార్డ్స్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఢిల్లీలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురు చర్చించారు. సమావేశంలో టీఎస్ఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ కూడా పాల్గొన్నారు.

చుక్కా రామయ్యకు బతికుండగానే పద్మ విభూషణ్ ఇవ్వాలి

కపిలవాయి దిలీప్‌కుమార్ డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య బతికుండగానే ఆయనకు పద్మ విభూషణ్ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం తరఫున ప్రతిపాదన పంపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కోరతానన్నారు. వృద్ధాప్యం, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న రామయ్యను ఈమధ్యే కలిశానని తెలిపారు. శాసన మండలిలో తాను, చుక్కా రామయ్య పక్కపక్కనే కూర్చునేవారమని, ఆయన ఎన్నో ప్రజా సమస్యలను మండలిలో లేవనెత్తారని గుర్తు చేశారు. కమ్యూనిస్టు వాదైనా తెలంగాణ ఉద్యమానికి మద్దతు ప్రకటించారని చెప్పారు.

'సర్వే వద్దు..'

చర్ల: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన సర్వేను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం చెన్నాపురం గ్రామానికి చెందిన గొత్తికోయ ఆదివాసీలు తిరస్కరించారు. ఎన్యుమరేటర్ మంగళవారం ఆ గ్రామానికి వెళ్లగా.. తమను ఎస్టీ జాబితాలో చేర్చడం లేదని, ఇలాంటి సర్వే తమకు అవసరం లేదని ఎన్యుమరేటర్‌ను వెనక్కి పంపించారు. కులం కాలంలో తమను ఎస్టీలుగా నమోదు చేయకుంటే అన్ని ఆదివాసీ గ్రామాల్లోనూ సర్వేను అడ్డుకుంటామని గోండు యువసేన నాయకుడు మడకం చందు హెచ్చరించారు.

గల్ఫ్ కార్మికుల సంఖ్య తేలితేనే సంక్షేమం


టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మన్ బీఎం.వినోద్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో గల్ఫ్ కార్మిక కుటుంబాలు స్పష్టమైన వివరాలు ఇవ్వాలని టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మన్ బీఎం.వినోద్‌కుమార్ కోరారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల కోసం సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే వారి లెక్కలు కూడా స్పష్టంగా తెలియాలన్నారు. కుటుంబ సర్వే ద్వారా దీనిపై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లకు గల్ఫ్ కార్మికుల కుటుంబ సభ్యులు పూర్తి వివరాలను చెప్పాలని సూచించారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని పట్టించుకోవద్దని ప్రజలకు సూచించారు. గల్ఫ్ కార్మికుల సంఖ్య తేలితే, వారి సంక్షేమానికి, సురక్షిత వలసలకు సరైన ప్రణాళికలు వేయడానికి ప్రభుత్వానికి అవకాశం ఉంటుందని టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి తెలిపారు.

డాక్టర్ల సంక్షేమం, భద్రతకే అత్యధిక ప్రాధాన్యం

తెలంగాణ ఐఎంఏ అధ్యక్షుడిగా ద్వారకానాథరెడ్డి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ద్వారకానాథరెడ్డి

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): తెలంగాణలో వైద్యుల సంక్షేమం, వృత్తిపరమైన భద్రతకు ప్రాధాన్యం ఇచ్చేలా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర కమిటీ చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలంగాణ ఐఎంఏ నూతన అధ్యక్షుడు దువ్వూరు ద్వారకానాథరెడ్డి చెప్పారు. మంగళవారం అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఇతర కార్యవర్గ సభ్యులతో కలిసి మాట్లాడారు. ఐఎంఏ రాష్ట్ర కమిటీని బలోపేతం చేయడానికి కొత్త సభ్యత్వాల నమోదు మీద ముందుగా దృష్టిపెడతామన్నారు. అనంతరం ప్రతి ఒక్క సభ్యుడికి వారి కుటుంబాల సంక్షేమం, భద్రతకు భరోసానిచ్చేలా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఐఎంఏ తరఫున న్యాయపరమైన వివాదాలను పరిష్కరించే చర్యలు తీసుకుంటామని ద్వారకానాథరెడ్డి తెలిపారు.

బీజేపీ బీఆర్ఎస్ కుమ్మక్కు

'ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అడ్డా' కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

- రాష్ట్రంలో పరస్పర అవగాహనతో ముందుకెళ్తున్నాయి
- మహారాష్ట్రలో కేసీఆర్ అభ్యర్థులను ఎందుకు నిలపలేదు?
- దక్షిణాది రాష్ట్రాలపై మోదీ శీతకన్ను
- 'నియోజకవర్గాల పునర్విభజన'పై కేంద్రం కమిషన్ ఏర్పాటు చేయాలన్న సీఎం



'ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అడ్డా' కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్‌లు పరస్పర అవగాహనతో ముందుకెళ్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రత్యక్షంగా, మరికొన్ని సందర్భాల్లో పరోక్షంగా రెండు పార్టీలూ సహకరించుకుంటున్నాయని చెప్పారు. 'అవినీతికి సంబంధించిన ఓ కేసులో కేటీఆర్‌ను 17 (ఎ) కింద విచారించేందుకు రాష్ట్ర అవినీతి నిరోధక విభాగం.. గవర్నర్ అనుమతి కోరింది. కానీ గత 15 రోజులుగా గవర్నర్ కార్యాలయం దీన్ని పెండింగ్‌లో పెట్టింది. ఇదే సమయంలో కేటీఆర్ ఢిల్లీ వచ్చి కేంద్ర మంత్రులను కలిశారు. దీన్నెలా చూడాలి? ఏసీబీ విచారణ భయంతోనే ఆయన ఢిల్లీ వచ్చారు. కేంద్రం కూడా గవర్నర్‌ను పిలిపించిందని అంటున్నారు. అదెంతవరకు నిజమో తెలియదు. మరోపక్క మహారాష్ట్రలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసి, అభ్యర్థులను బరిలో నిలుపుతామన్న కేసీఆర్ ఎందుకు నిలపలేదు? మహారాష్ట్ర వైపు ఎందుకు కన్నెత్తి చూడటం లేదు? మోదీకి వ్యతిరేకంగా ఒక్క ప్రకటన ఎందుకు చేయలేదు? తెలంగాణకు మద్దతుగా నిలిచిన శరద్ పవార్ పార్టీకి మద్దతుగా అయినా ఒక్కపని ఎందుకు చేయలేదు?..'సీఎం నిలదీశారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీలో నిర్వహించిన 'ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అడ్డా' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

జనాభా ఆధారంగా నిధుల పంపకాలా?

'దక్షిణాది రాష్ట్రాలపై ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం శీతకన్ను వేస్తోంది. దక్షిణాది రాష్ట్రాల ఆదాయంతో కేంద్రం నడుస్తున్నా.. ఆ రాష్ట్రాలను మాత్రం చిన్నచూపు చూస్తోంది. కేంద్రం నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు వస్తున్న నిధుల్లో కోత స్పష్టంగా కనిపిస్తోంది. ఇటువంటి సంకుచిత దృష్టి దేశానికి మంచిది కాదు. తెలంగాణ నుంచి ఒక రూపాయి దేశానికి వెళ్లిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి 40 పైసలు మాత్రమే వెనక్కి వస్తున్నాయి. అదే సమయంలో బిహార్ రూపాయి ఇస్తే రూ.7.06, ఉత్తర్‌ప్రదేశ్ రూపాయి ఇస్తే రూ.2.73 పొందుతున్నాయి. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులకు మోదీ మద్దతు ఇస్తే ప్రతి రాష్ట్రం ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను తయారు చేయగలదు. కుటుంబ నియంత్రణ చేయాలని ఒత్తిడి పెట్టిన కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు జనాభా ఆధారంగా నిధుల పంపకాలు ఎలా చేస్తుంది? మరోవైపు ప్రస్తుత జనాభా ఆధారంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుంది. అందువల్ల 1971 జనగణన ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేయాలి. నియోజకవర్గాల పునర్విభజనకు అవసరమైన టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్ (సూచన నిబంధనలు) కోసం కేంద్రం ఒక కమిషన్ ఏర్పాటు చేయాలి..' అని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

మోదీ గుజరాత్‌కు ప్రధానిలా వ్యవహరిస్తున్నారు

'మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు నరేంద్ర మోదీ గుజరాత్ సీఎంగా ఉండి గుజరాత్ మోడల్‌కు చేసిన ప్రచారానికి కేంద్రం ఎలాంటి ఆటంకం కలిగించలేదు. కానీ ఇప్పుడు ప్రధానమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను విస్మరిస్తున్నారు. ఆ రాష్ట్రాలను ఖతం చేసేందుకు ఆయన స్థాయిలో ప్రయత్నిస్తున్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరైనా పెట్టుబడిదారు ప్రయత్నిస్తే గుజరాత్ వెళ్లమని ప్రధానమంత్రి కార్యాలయం చెబుతోంది. ఆయన దేశ ప్రధానమంత్రిగా కాకుండా గుజరాత్‌కు ప్రధానమంత్రిలా వ్యవహరిస్తున్నారు..'అని సీఎం ధ్వజమెత్తారు.

నాయుడు, నితీశ్ లాంటి వారితో కేంద్రం నడుస్తోంది

'గడిచిన పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ ముమ్మాటికీ ఓటమి పాలయ్యారు. బీజేపీ ఈ దఫా 400 సీట్లు అని నినదించినా, 240 సీట్లే సాధించారు. కానీ కాంగ్రెస్ 40 నుంచి వందకు చేరింది. నంబర్లు చూస్తే ఎవరు గెలిచారో తెలుస్తుంది. ఇది బీజేపీ ఓటమి కాదు.. మోదీ ఓటమి. ఇప్పుడు నాయుడు, నితీశ్ లాంటి కొందరి సహకారంతో ప్రభుత్వం నడుస్తోంది.. ఇది మోదీ ఓటమే.

ఇందిరమ్మ మనవడు ఉండేందుకు ఒక్క గది లేదు

'తెలంగాణను కాంగ్రెస్ అధిష్టానం ఏటీఎంగా మార్చుకుందని మోదీ ఆరోపిస్తున్నారు. పదేపదే గాంధీ కుటుంబానికి వ్యతిరేకంగా అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. ఆ రాష్ట్రం ఏటీఎం..ఈ రాష్ట్రం ఏటీఎం అని ప్రధానమంత్రి హోదాలో ఆరోపణలు చేస్తున్నారు. ఇది సరైంది కాదు. ఎవరో కార్యకర్త, చిన్నాచితకా నేతలు వ్యాఖ్యలు చేస్తే వదిలేయవచ్చు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో జవహర్‌లాల్ నెహ్రూ, మోతీలాల్ నెహ్రూ పదేళ్లకు పైగా జైలు జీవితం గడిపారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీలకు ప్రధానమంత్రి పదవి స్వీకరించే అవకాశం వచ్చినా వదులుకున్నారు. ప్రాణాలను, పదవులను, ఇళ్లను త్యాగాలు చేసినవాళ్లకి డబ్బులెందుకు? మారుమూలన ఉన్న ఆదివాసీలకు ఇందిరమ్మ ఇళ్లు ఉన్నాయి. కానీ అదే ఇందిరమ్మ మనవడికి ఉండడానికి ఒక్క గది లేదు..'అని

సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు..

'తెలంగాణ రైజింగ్ అంటే ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడం. ఇదే తెలంగాణ మోడల్. సుపరిపాలన తెలంగాణ మోడల్. దాని అర్థం సంక్షేమం, అభివృద్ధి. కేవలం సంక్షేమం చేపడితే అభివృద్ధి ఉండదు. కేవలం అభివృద్ధిపై దృష్టి పెడితే పేదలకు ఏం దక్కదు. ఈ రెండింటినీ సమతుల్యం చేయడమే సుపరిపాలన. దానిని దృష్టిలో పెట్టుకొని పనిచేస్తున్నాం. పదేళ్లలో కేసీఆర్ పదిసార్లు సచివాలయానికి రాలేదు. నేను పది నెలలుగా ప్రతిరోజూ సచివాలయానికి వెళుతున్నా. ప్రతిపక్షంలో ఉండి ఆయన శాసనసభకు రావడం లేదు. వాళ్లు ధర్నా చౌక్‌ను మూసివేశారు. నేను అదే ధర్నా చౌక్‌ను ఓపెన్ చేశా. ఇప్పుడు హరీశ్‌రావు, కేటీఆర్ కూడా వారానికి రెండుసార్లు వచ్చి ధర్నా చౌక్‌కు వచ్చి కూర్చుంటున్నారు. మేం ఎంత ప్రజాస్వామ్యయుతంగా ఉన్నామో చూడండి. తెలంగాణ అప్రోచ్‌నే కాంగ్రెస్ అప్రోచ్. తెలంగాణ రైజింగ్ కాంగ్రెస్ అప్రోచ్..'అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తాను గతంలో కేసీఆర్‌కు ఫైనాన్స్ చేశానని.. టీఆర్ఎస్‌లో ఎన్నడూ పని చేయలేదని చెప్పారు. చంద్రబాబు నాయుడితో కలిసి పని చేశానని అన్నారు. అమెరికా ఎలక్టోరల్ సిస్టమ్‌లో తెలుగు ప్రజలు ఉన్నారని, వారు ఇప్పుడు అక్కడి ఎన్నికలను ప్రభావితం చేస్తున్నారని రేవంత్ చెప్పారు.

ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

మోదీ రాజకీయాలకు ఎక్స్‌పైరీ డేట్ వచ్చేసింది

రహస్య ఎజెండాను బయటపెట్టడంలో కాంగ్రెస్ విజయం సాధించింది. ప్రతి ఎన్నికల్లో మోదీ భావోద్వేగంతో కూడిన, విభజన రాజకీయాలు చేస్తున్నారు. వాటికి ఎక్స్‌పైరీ డేట్ వచ్చేసింది. కాంగ్రెస్ పార్టీ సైతం రాజకీయ ఫార్మాట్ మార్చుకోవాలి. టెస్ట్ మ్యాచ్‌లు ఆడటం మానేసి, 20-20 ఫార్మాట్ ఆడాలి..'అని రేవంత్ అన్నారు.

లగచర్ల ఘటనలో ఎవర్నీ వదిలిపెట్టం

ఎంతటివారైనా ఊచలు లెక్కపెట్టాల్సిందే

గవర్నర్ అనుమతి రాగానే కేటీఆర్‌పై చర్యలు

కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో సోమవారం కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని సీఎం అన్నారు. దాడులకు ప్రోత్సహించే వారిని, అండగా ఉన్న వారిని కూడా వదిలిపెట్టబోమని చెప్పారు. అలాంటివారు ఎంతటి వారైనా ఊచలు లెక్కపెట్టాల్సిందేనని హెచ్చరించారు. రెడ్డి పేరు మీద ఉన్న వారంతా తన బంధువులు కాదని, సృజన్‌రెడ్డికి బీఆర్ఎస్ హయాంలోనే వేల కోట్ల కాంట్రాక్టులు వచ్చాయని చెప్పారు. ఈ-రేస్ స్కామ్ నుంచి తప్పించుకునేందుకే కేటీఆర్ ఢిల్లీ వచ్చారని.. గవర్నర్ అనుమతి రాగానే కేటీఆర్‌పై చర్యలు ఉంటాయని అన్నారు. అవినీతి పార్టీ అయిన బీజేపీని అంతం చేస్తామన్న కేటీఆర్ ఇప్పుడు ఎలా బీజేపీ నేతలను కలుస్తున్నారని నిలదీశారు.

కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎం!

ఎక్కడ ఎన్నికలు జరిగితే అక్కడికి తెలంగాణ నుంచే డబ్బు మూటలు: కేటీఆర్

- మహారాష్ట్రలో రూ.300 కోట్లతో ఎన్నికల ప్రకటనలు
- తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ అంటూ స్వయంగా పీఎం మోదీనే చెప్పారు
- మీ కుంభకోణాలను దేశం ముందుకు తెచ్చేందుకు ఢిల్లీకి వచ్చా..
- నేను హైదరాబాద్‌కు వస్తున్నా.. దమ్ముంటే ఏదైనా చేయండని వ్యాఖ్య



మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో కేఆర్ సురేశ్‌రెడ్డి, బాల్క సుమన్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుతం రాహుల్ గాంధీకి తెలంగాణ రాష్ట్రం ఏటీఎంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎక్కడ ఎన్నికలు జరిగితే అక్కడికి తెలంగాణ నుంచే డబ్బు మూటలు వెళ్తున్నాయని ఆరోపించారు. మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దుల్లో భద్రతను పెంచాలని, ఆన్‌లైన్ లావాదేవీలపై మరింత నిఘా పెంచాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరుతున్నామన్నారు. పలు సందర్భాల్లో తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ కట్టాలంటూ వ్యాఖ్యానించిన ప్రధానమంత్రి మోదీ.. సీఎం రేవంత్‌రెడ్డి అవినీతిపై చర్యలు తీసుకోరా అంటూ ప్రశ్నించారు. అమృత్ స్కీంలో జరిగిన స్కాంపై కేంద్ర విజిలెన్స్ కమిషన్‌తో విచారణ జరిపించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యేలోపు ఈ స్కాంపై చర్యలు తీసుకోకపోతే తాము రాజ్యసభలో ఈ అంశాన్ని లేవనెత్తి దేశమంతా ఆలోచించేలా చేస్తామని కేంద్రమంత్రిని హెచ్చరించినట్లు చెప్పారు. మంగళవారం వసంత్‌విహార్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు సురేశ్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దామోదరరావు, మాజీ ఎంపీ బాల్క సుమన్, దాసోజు శ్రవణ్‌లతో కలిసి కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు.

కొడంగల్ వాసులకు విషం

సొంత బావమరిది సృజన్‌రెడ్డికి అమృతం ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ వాసులకు మాత్రం విషం ఇచ్చారని కేటీఆర్ మండిపడ్డారు. బావమరిది కంపెనీని అందలమెక్కించేందుకు రేవంత్ భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రుణమాఫీ, రైతుబంధు, పింఛన్లు, తులం బంగారం, మహిళలకు రూ.2,500 ఇచ్చేందుకు డబ్బు లేదు కానీ.. మహారాష్ట్రలో మాత్రం రూ.300 కోట్లతో పేపర్ యాడ్స్ ఇచ్చారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అవినీతిపై వివరాలిచ్చినా కేంద్రం ఇప్పటివరకూ విచారణ జరపలేదని మండిపడ్డారు. బీజేపీకి చెందిన 8 మంది ఎంపీలు ఎవరైనా రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిపై ప్రశ్నించారా అని నిలదీశారు. సీఎం హైదరాబాద్‌ను నాలుగు ముక్కలుగా చేసే కుట్రలో బీజేపీ ఎంపీలు మద్దతు పలుకుతున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ నుంచి పెట్టుబడులు బీజేపీపాలిత రాష్ట్రాలకు తరలించాలన్నదే రేవంత్ ఎజెండా అని వ్యాఖ్యానించారు.

రేవంత్ 26 సార్లు ఢిల్లీ వచ్చారు...

11 నెలల్లో 26 సార్లు ఢిల్లీకి వచ్చిన సీఎం రేవంత్ తెలంగాణకు రూ.26 పైసలు కూడా తీసుకురాలేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'నేను ఢిల్లీకి వస్తే మీకేం పని అని మంత్రి పొంగులేటి అంటున్నాడు. మీ కుంభకోణాలు, మీ చేతగాని పాలనను దేశ ప్రజల ముందుకు తెచ్చేందుకే ఢిల్లీకి వచ్చాను. పౌరసరఫరాల శాఖలో అవినీతి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీల లీలలు కూడా బయటపెట్టేందుకు మళ్లీ మళ్లీ ఢిల్లీకి వస్తాను. నేను ఈ సమావేశం అనంతరం హైదరాబాద్‌కు వస్తా.. మీకు (కాంగ్రెస్ ప్రభుత్వానికి) దమ్ముంటే ఏదైనా చేయండి. ఎన్ని ఏజెన్సీలనైనా రప్పించుకోండి'అని కేటీఆర్ అన్నారు. 2-3 వారాల క్రితం కోహినూర్ హోటల్లో పొంగులేటి అదానీని రహస్యంగా కలిసి కాళ్లు పట్టుకున్నారా లేదా అని వ్యాఖ్యానించారు.

కులగణన పేరుతో 75 ప్రశ్నలు

కేసీఆర్ పేరు తలవనిదే ఒక్కరోజు కూడా సీఎం రేవంత్‌కు నిద్రపట్టదని కేటీఆర్ విమర్శించారు. ప్రజలు కేసీఆర్ పేరు మర్చిపోతే సీఎంకు వచ్చిన బాధ ఏంటని ప్రశ్నించారు. కులగణనకు తాము వ్యతిరేకం కాదని, కానీ ఆ పేరుతో 75 ప్రశ్నలు వేయడమేంటని నిలదీశారు. ఎవరైనా కులం, మతం వివరాలు అడుగుతారని, కానీ.. మీ ఇంట్లో ఫ్రిజ్ ఉందా, టీవీ ఉందా, ఏసీ ఉందా అనే ప్రశ్నలు అడుగుతున్నారని దుయ్యబట్టారు. అవి లేకపోతే నువ్వేమైనా కొనిస్తావా అంటూ సీఎంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఎమ్మెల్యేలను మేకలను కొన్నట్లు కొంటున్నారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. రాష్ట్రంలో తమ పార్టీకి చెందిన పదిమంది ఎమ్మెల్యేలను కూడా ఇలాగే కొన్నారనే విషయం మర్చిపోవద్దన్నారు.

పనికిరాని పాలనలో ఆగం

పసలేని, పనికిరాని పాగల్ పాలనలో తెలంగాణ ఆగమవుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'తెలంగాణ తల్లడిల్లుతూ తిరగబడుతోంది. కుటుంబ దాహం కోసం జరుగుతున్న కుట్రలపై లగచర్ల పోరాడుతోంది. మా భూములు మాకేనని కొడంగల్ కొట్లాడుతోంది. కుట్రలు, కుతంత్రపు పాలనలో జనం కోపం కట్టలు తెంచుకుంటోంది. ధాన్యం కొనుగోళ్లు, మద్దతు ధర, హైడ్రా దౌర్జన్యాలు, మూసీలో ఇళ్ల కూల్చివేతలు ఇలా పలు అంశాలపై అనేక మంది ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆటో డ్రైవర్ల మహా ధర్నా, పెండింగ్ బకాయిల కోసం మాజీ సర్పంచ్‌ల నిరసన, పరీక్షల నిర్వహణపై విద్యార్థుల ఆగ్రహం, ఫార్మా పరిశ్రమలకు భూములు ఇవ్వమంటూ అన్నదాత కన్నెర్ర వంటి ఘటనలు రాష్ట్రంలో ప్రతీరోజు కనిపిస్తున్నాయి'అని కేటీఆర్ పేర్కొన్నారు.

గ్యారంటీల అమలుపై రేవంత్‌వి పచ్చి అబద్ధాలు

ముంబై మీడియా సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, ముంబై: తెలంగాణలో ఇచ్చిన గ్యారంటీలన్నీ పూర్తి చేశామని రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెబుతున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ తర్వాత మాత్రం ఇచ్చిన హామీలను మరిచిందని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముంబైలో మంగళవారం మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంతోపాటు రేవంత్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. తెలంగాణలో ఏడాదిగా కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తూ ప్రభుత్వాన్ని నడుపుతోందని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారానికి ముంబై వచ్చిన రేవంత్‌రెడ్డి మహారాష్ట్ర ప్రజలకూ ఇలాగే అబద్ధాలు చెప్పి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేస్తుందనేది వివరించేందుకే బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా తాను మహారాష్ట్ర ప్రజల ముందుకు వచ్చినట్టు చెప్పారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అన్ని హామీలను అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిన కాంగ్రెస్.. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణను ఒకప్పుడు బీఆర్ఎస్ లూటీ చేస్తే ఇప్పుడు కాంగ్రెస్ కూడా ఆ పనే చేస్తోందన్నారు.

విద్యుత్ శాఖ మంత్రుల సమావేశానికి హాజరైన భట్టి



కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్‌లాల్‌తో డిప్యూటీ సీఎం భట్టి కరచాలనం

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో జరిగిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల విద్యుత్ శాఖ మంత్రుల సమావేశానికి ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలో మంగళవారం ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో సెంటర్‌లో దీన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యుత్ శాఖమంత్రి మనోహర్‌లాల్‌తో భట్టి విక్రమార్క ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు విద్యుత్ అంశాలపై చర్చించారు. సమావేశంలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీ పాల్గొన్నారు.

సీఎం నోరు.. మూసీకంటే కంపు

పాలకులు పాపం చేస్తే రాష్ట్రానికే అరిష్టం: హరీశ్‌రావు

- దేవుళ్లపై ఒట్టేసి హామీలు మరిచినోళ్లు మనుషులేనా?



రాజన్న ఆలయంలో హరీశ్‌కు స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఇస్తున్న అర్చకులు, ఈవో

జగిత్యాల: మూసీకంటే ఎక్కువ కంపు సీఎం రేవంత్‌రెడ్డి నోటిలో ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు దుయ్యబట్టారు. ప్రజలకు అనేక హామీలు ఇచ్చి నెరవేరుస్తానని దేవుళ్లపై ఒట్టేశారని, ఒక్కటీ అమలు చేయలేదని, అలాంటి వారు మనుషులేనా అని వ్యాఖ్యానించారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ రైతుల కోసం చేసిన 25 కిలోమీటర్ల పాదయాత్ర మంగళవారం జగిత్యాలకు చేరింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హరీశ్‌రావు ప్రసంగించారు. ధాన్యం కొనుగోలు చేసేవారు లేక దళారుల పాలవుతోందని, క్వింటాల్‌ను రూ.1,800కే అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ రైతు సీఎంగా పేరు తెచ్చుకుంటే.. రేవంత్ బూతుల సీఎంగా పేరు తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. సీఎంకు ఇక్కడ వడ్లు ఎత్తడం చేతకావడం లేదని, కానీ, మహారాష్ట్రకు మాత్రం ఎన్నికల ఖర్చుకు డబ్బులు లోడ్ ఎత్తుతున్నారని మండిపడ్డారు. సీఎం ఇప్పటి వరకు చేసిందేమైనా ఉందంటే ఎమ్మెల్యేలను ఫైసల్ పెట్టి కొనడమేనని ఆరోపించారు. పాలకులు పాపం చేస్తే రాష్ట్రానికే అరిష్టమని, ముఖ్యమంత్రిని క్షమించాలని, ప్రజలను కాపాడాలని దేవుళ్లకు మొక్కానని పేర్కొన్నారు. సంజయ్ పాదయాత్రతోనైనా కళ్లు తెరిచి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రేవంత్ పాపం ప్రజలకు తగలొద్దని..

వేములవాడ రూరల్: రేవంత్ చేసిన పాపం రాష్ట్ర ప్రజలకు శాపం కావొద్దని వేములవాడ రాజన్నను వేడుకున్నానని హరీశ్‌రావు అన్నారు. రూ. 2 లక్షలకు పైగా రుణం ఉన్న రైతులు ఎందుకు కట్టాలని ప్రశ్నించారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని ఆయన మంగళవారం దర్శించుకున్నారు. రాజన్న సాక్షిగా ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి సీఎం మాట తప్పారన్నారు. తక్షణమే ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేసి దేవుడి దగ్గర క్షమాపణ కోరుకోవాలన్నారు.

ప్రభుత్వ తీరు అమానుషం

కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో గ్రామస్తులను పోలీసులు అరెస్టు చేయడం దారుణమని హరీశ్‌రావు అన్నారు. ఫార్మా కంపెనీకి భూములిచ్చేందుకు నిరాకరించిన రైతులను పోలీసులు బెదిరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్ధరాత్రి పోలీసులతో ప్రభుత్వం దమనకాండ చేయడం సరికాదంటూ ప్రభుత్వ తీరును ఖండించారు. ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోకుండా భూసేకరణ చేపట్టడం వెనుక ఉన్న రేవంత్‌రెడ్డి ఉద్దేశమేంటో చెప్పాలన్నారు. సీఎం వ్యక్తిగత ప్రయోజనాలకోసం చేపడుతున్న భూసేకరణను వెంటనే నిలిపివేయాలన్నారు. పోలీసుల అదుపులో ఉన్న గ్రామస్తులు, రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ డబ్బుతో మహారాష్ట్రలో ప్రచారం

- కాంగ్రెస్ ఎన్నికల ప్రచారానికి రూ.300 కోట్లు తరలింపు
- ఆ సొమ్ము అందజేసేందుకే ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి: జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సొమ్ముతో కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి రూ.300 కోట్ల తెలంగాణ సొమ్మును కాంగ్రెస్‌కు కప్పంగా కట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్తే.. కాంగ్రెస్, బీజేపీ బండారాన్ని బయట పెట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఢిల్లీ పర్యటనకు వెళ్లారని తెలిపారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, పార్టీ నేత ఆంజనేయగౌడ్‌తో కలిసి జగదీశ్‌రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు మొదలైందని పేర్కొన్నారు. వరిధాన్యం కొనుగోలు విషయంలో రైతులతో చెలగాటమాడుతూ పథకం ప్రకారమే దళారీలు, మిల్లర్లకు వదిలేశారని ఆరోపించారు. దళారీలు, మిల్లర్లతో కొందరు మంత్రులు కుమ్మక్కై వందల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. ఇందులో నల్లగొండ జిల్లాకు చెందిన ఓ మంత్రి కీలక పాత్ర పోషించారని తెలిపారు. లగచర్లలో తనపై దాడి జరగలేదని స్వయంగా కలెక్టర్ చెప్తున్నా ప్రభుత్వం రైతులపై కేసులు పెడుతోందని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఈ ఘటనతో బీఆర్ఎస్‌కు సంబంధం లేదని స్పష్టంచేశారు.

గరం గరం రాజకీయం

▶ మొదటి పేజీ తరువాయి

అనుమతులు లేకుండా చెల్లించారన్న దానిపై ఏసీబీ దర్యాప్తు ప్రారంభించడం, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసు నమోదు, విచారణకు ప్రభుత్వం గవర్నర్ అనుమతి కోరడం సంచలనం సృష్టించింది. దానికి ప్రతిగా అన్నట్లు మాజీ మంత్రి కేటీఆర్.. అమృత్ టెండర్ల వ్యవహారంలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని, ముఖ్యమంత్రి తన బావమరిదికి అర్హత లేకపోయినా రూ.1,100 కోట్లకు పైగా టెండర్ దక్కేలా చేశారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. అంతేగాకుండా కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిని కలిసి దీనిపై ఫిర్యాదు చేశారు. అమృత్ టెండర్లలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని కోరారు. ఈ ఆరోపణలను పలువురు మంత్రులు తిప్పికొట్టారు. తనను చుట్టుముడుతున్న కేసుల నుంచి తప్పించేలా కేంద్ర పెద్దల కాళ్లు పట్టుకోవడానికే కేటీఆర్ ఢిల్లీ వెళ్లారంటూ.. శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. అమృత్ టెండర్లపై కేటీఆర్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని సీఎం రేవంత్ ఖండించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో దూకుడు

ఫోన్ ట్యాపింగ్ కేసు ఇప్పుడు పోలీసు అధికారులను దాటి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల దిశగా సాగుతుండటం కూడా వేడిని రాజేస్తోంది. ఇప్పటికే చిరుమర్తి లింగయ్యకు నోటీసులు జారీ చేయగా మరో నలుగురు మాజీ ఎమ్మెల్యేలకు కూడా నోటీసులు జారీ చేశారనే సమాచారం సంచలనం సృష్టిస్తోంది. మరోవైపు సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో ఫార్మా సంస్థలకు అవసరమైన భూముల కోసం అభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, 'కడ' ప్రత్యేకాధికారి తదితరులపై జరిగిన దాడి కూడా పూర్తిగా రాజకీయ రంగు తీసుకుంది. ముందస్తు ప్రణాళికతోనే అధికారులపై దాడి జరిగిందని, దీనికి సూత్రధారి బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సురేష్ అని, ఆయన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి దాడికి ముందు పదుల సంఖ్యలో కాల్స్ చేసినట్లు అధికార పార్టీ ఆరోపణలు చేస్తోంది. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా బీఆర్ఎస్ అడ్డుపడుతోందని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించడం గమనార్హం. కాగా ఫార్మా వ్యవహారంలో కుటుంబ దాహం, స్వప్రయోజనాలు ఉన్నాయంటూ కేటీఆర్, హరీశ్ ధ్వజమెత్తారు. అధికారులపై దాడులను ఖండిస్తూనే.. రైతులను అరెస్టు చేస్తే సహించేది లేదని బీజేపీ ఎంపీ ఈటల వ్యాఖ్యానించారు. దాడిలో పోలీసుల వైఫల్యం ఉందని మరో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. లగచర్ల ఘటన ప్రభుత్వంపై ప్రజాగ్రహానికి నిదర్శనమని సీపీఎం పార్టీ వ్యాఖ్యానిస్తే.. అధికారులపై దాడిని ఒక పార్టీకి అంటగట్టి రైతులను కేసుల్లో ఇరికించవద్దని సీపీఐ సూచించింది.

క్లుప్తంగా...

లగచర్లలో రైతులపై అక్రమ కేసులు

అరెస్టులు ఆపకుంటే తిరుగుబాటు తప్పదు: ఎంపీ ఈటల హెచ్చరిక



సాక్షి, న్యూఢిల్లీ: వికారాబాద్ జిల్లా కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం లగచర్ల గ్రామంలో రైతులపై ప్రభుత్వం అక్రమంగా కేసులు పెడుతున్నదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. ఈ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఫార్మా కంపెనీలకు అవసరమైతే వారే భూసేకరణ చేసుకుంటారని, ప్రభుత్వం మధ్యలో బ్రోకర్‌లాగా వ్యవహరించాల్సిన అవసరం లేదని అన్నారు. ఇలాగే అక్రమ కేసులు పెడితే యావత్ తెలంగాణ సమాజం తిరుగుబాటు చేస్తుందని హెచ్చరించారు. తమ భూములు లాక్కొని ఉపాధిపై దెబ్బకొట్టొద్దని రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వినకుండా ఫార్మా కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూములను అప్పజెప్పే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ ప్రక్రియను వ్యతిరేకిస్తూ స్వయంగా బీజేపీ ఎంపీ డీకే అరుణ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించినా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. లగచర్ల ఘటనను అడ్డం పెట్టుకొని కొడంగల్ చుట్టుపక్కల మండలాల్లో ఇంటర్నెట్, కరెంటు బంద్ చేసి వందల మంది పోలీసులను గ్రామాల్లో మోహరించి అరెస్టు చేయడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు.

వికారాబాద్ ఘటన రైతుల ఆగ్రహానికి సూచిక: తమ్మినేని



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోని లగచర్ల గ్రామంలో జరిగిన ఘటన రైతుల ఆగ్రహాన్ని సూచిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ భూములను కోల్పోవడానికి సిద్ధంగా లేరనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా గమనించాలని హితవు పలికారు. జిల్లా కలెక్టర్, అధికారులు చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ నిరసనలతో ప్రారంభమై ప్రతిఘటనకు దారితీసిందని తెలిపారు. రైతులపై ఎలాంటి కేసులు నమోదు చేయొద్దని ఆయన కోరారు. రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల ఫార్మాసిటీపై ఎన్నికల ముందు ఇచ్చిన మాట మార్చడంతో అక్కడ కూడా ఆందోళనలు సాగుతున్నాయన్నారు. కాగా, మహబూబాబాద్ జిల్లా గార్లలో తమ్మినేని మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు.

దాడిపై సమగ్ర దర్యాప్తు చేయండి

డీజీపీకి ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి వినతిపత్రం



సాక్షి, హైదరాబాద్: ఫార్మా పరిశ్రమ ఏర్పాటుకు స్థల సేకరణ కోసం గ్రామసభ నిర్వహించేందుకు వికారాబాద్ జిల్లా లగచర్ల వెళ్లిన కలెక్టర్, ఇతర అధికారులపై దాడులకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర డీజీపీ జితేందర్‌ను కోరింది. ఈ మేరకు జేఏసీ చైర్మన్ వి లచ్చిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం డీజీపీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం లచ్చిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ స్పెషల్ ఆఫీసర్ కే వెంకట్‌రెడ్డి ఇతర అధికారులపై పక్కా పథకం ప్రకారమే దాడి జరిగిందని ఆరోపించారు. దాడి వెనుక ఉన్నవారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్లు తెలిపారు. డీజీపీని కలిసిన వారిలో జేఏసీ నాయకులు కె.రామకృష్ణ, ఎస్.రాములు, రమేష్ పాక, పూల్‌సింగ్ చౌహాన్, రాధ, తెలంగాణ నిర్మల, చంద్రశేఖర్‌గౌడ్, రాబర్ట్ బ్రూస్, పుష్పలత, తిరుపతి, విజయ్‌కుమార్, హరీందర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో దాడులకు చోటు లేదు

తెలంగాణ ఉద్యోగుల సంఘం

సాక్షి, హైదరాబాద్: ఫార్మా కంపెనీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయానికి వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఉద్యోగులపై జరిగిన దాడిని తెలంగాణ ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖండించింది. దీనిపై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. మంగళవారం తెలంగాణ ఉద్యోగుల సంఘం అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలపై అభ్యంతరాలు ఉంటే ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం విధానాల మార్పు కోసం కృషి చేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో దాడులకు చోటు లేదని, దాడుల సంస్కృతి మంచిది కాదని హితవు పలికారు. సమావేశంలో సంఘం చైర్మన్ పద్మాచారి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మఠం రవీంద్ర కుమార్, హరీశ్‌కుమార్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడు కృష్ణారావు, జాకబ్, కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊరంతా ఖాళీ

లగచర్ల, రోటిబండ, పులిచర్లకుంట తండాల్లో టెన్షన్ టెన్షన్

- అర్ధరాత్రి గ్రామాలను చుట్టుముట్టిన 300 మంది పోలీసులు
- 50 మంది రైతులు, యువకుల అరెస్టు.. ముందే తండాలు వదిలివెళ్లిన కొందరు
- రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపిన మహిళలు, చిన్నారులు, వృద్ధులు
- ఉదయం 8 గంటలకల్లా మూడు గ్రామాలూ ఖాళీ



నిర్మానుష్యంగా లగచర్ల, పులిచెర్లకుంట తండా వీధులు

కొడంగల్/దుద్యాల్/పరిగి/పూడూరు: కలెక్టర్‌పై జరిగిన దాడితో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లతో పాటు మరో రెండు గ్రామాల్లో సోమవారం రాత్రి భయానక వాతావరణం నెలకొంది. మంగళవారం ఉదయానికల్లా మూడు గ్రామాలూ నిర్మానుష్యంగా మారిపోయాయి. ఇక్కడ ఫార్మా సిటీ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న స్థానికులు భూ సేకరణ సమావేశానికి హాజరైన కలెక్టర్ సహా ఉన్నతాధికారులపై దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాత్రి ఒంటిగంట సమయంలో లగచర్లకు చేరుకున్న సుమారు 300 మంది సాయుధ పోలీసులు 2 గంటల ప్రాంతంలో లగచర్ల, రోటిబండతండా, పులిచెర్లకుంట తండాలను అష్ట దిగ్బంధనం చేశారు. ఇళ్లలో నిద్రిస్తున్న రైతులు, యువకులను అదుపులోకి తీసుకున్నారు. పిలిచినా స్పందించని వారి తలుపులు బద్దలుకొట్టి లోనికి వెళ్లారు. మూడు గ్రామాల్లో సుమారు 50 మందికి పైగా అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే అనుమానితులను గుర్తించిన పోలీసులు వారి సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

ఏ ఇంటిని చూసినా తాళాలే..

అర్ధరాత్రి వేళ పోలీసులు తమ కుటుంబ సభ్యులను తీసుకెళ్లడంతో మహిళలు భయాందోళనకు గురయ్యారు. అయితే ఎప్పుడైనా పోలీసులు దాడి చేసే అవకాశం ఉందని ఊహించిన పలువురు సాయంత్రంలోపే బంధువుల ఇళ్లకు వెళ్లిపోయారు. రాత్రి వేళ పోలీసులు రావడంతో భయకంపితులైన మిగిలిన వారు ఉదయాన్నే ఇతర గ్రామాలకు తరలివెళ్లారు. దీంతో ఉదయం 8 గంటల లోపే గ్రామాలు ఖాళీ అయిపోయాయి. గ్రామాల్లో ఏ ఇంటిని చూసినా తాళాలే దర్శనమిచ్చాయి. పశువులు, గొర్రెలు, మేకలు మాత్రం దొడ్లలోనే ఉన్నాయి.

పోలీసుల అదుపులోనే 16 మంది

అనుమానంతో అదుపులోకి తీసుకున్న సుమారు 50 మందిని పోలీసులు మంగళవారం తెల్లవారుజామున పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు చూపిస్తూ విచారణ నిర్వహించారు. దాడికి పాల్పడిన వారి, ఇందుకు ప్రేరేపించిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఘటనతో సంబంధం ఉన్న 16 మందిని పీఎస్‌లోనే ఉంచుకుని మిగిలిన వారిని వదిలేశారు. 16 మందికి పరిగి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. వీరిని కొడంగల్ న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా రైతుల దాడిలో గాయపడిన కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి సోమవారం సాయంత్రం నిమ్స్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు.

ఫోన్ లాక్కెళ్లారు.. పరీక్షలు ఉన్నాయన్నా వినలేదు



అర్ధరాత్రి వేళ పోలీసులు వచ్చారు. అప్పుడు మా అత్త దేవీబాయి, నేను మాత్రమే ఇంట్లో ఉన్నాం. ఇల్లంతా వెతికిన పోలీసులు మగవారు ఎవరూ లేరని గమనించి నా ఫోన్ లాక్కెళ్లారు. నేను పరిగిలోని పల్లవి కాలేజీలో డిగ్రీ చదువుతున్నా. మంగళవారం ప్రాక్టికల్ పరీక్షలు ఉన్నాయని, ఫోన్ ద్వారా ప్రిపేర్ కావాలి సార్ అని బతిమాలినా వినలేదు.

– అనూష, పులిచెర్లకుంట తండా

బీఆర్‌ఎస్ నేతల అరెస్టు

లగచర్లలో ఫార్మా బాధిత రైతులను పరామర్శించేందుకు బయలుదేరిన బీఆర్‌ఎస్ నేతలు.. మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, కొప్పుల మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, కార్తీక్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ నుంచి లగచర్లకు వెళ్తుండగా చన్గోముల్ పోలీస్ స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. సుమారు 40 నిమిషాల తర్వాత హైదరాబాద్ పంపించేశారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తెలంగాణ ప్రజల బతుకులను బజారుకీడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దుర్మార్గపు పాలన కొనసాగుతోందని అన్నారు. ఫార్మా కంపెనీ కోసం తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములను లాక్కుని, వారి జీవితాలను నాశనం చేయాలని చూస్తున్నారన్నారు. రైతులపై పెట్టిన కేసులను బేషరతుగా వెనక్కి తీసుకోని పక్షంలో బీఆర్‌ఎస్ తరఫున ఆందోళన తప్పదని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలు, ప్రతీకారేచ్ఛతోనే ఇలాంటి దుష్పరిణామాలు జరుగుతున్నాయని ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. బీఆర్‌ఎస్ ఏనాడూ అధికారులపై దాడులను ప్రోత్సహించలేదన్నారు.

పోలీసులపై మంత్రి శ్రీధర్‌బాబు సీరియస్!

- సీఎం సొంత నియోజకవర్గంలో కలెక్టర్‌పై దాడి ఏంటి?
- సున్నిత అంశంపై ఐఏఎస్ అధికారి వస్తే భద్రతా చర్యలేవి?
- సచివాలయంలో పోలీస్ అధికారులతో మంత్రి సమావేశం
- కుట్ర కోణం ఉంది.. చర్యలు తీసుకుంటాం: ఐజీ సత్యనారాయణ



సాక్షి, హైదరాబాద్: ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన జిల్లా కలెక్టర్, ఇతర అధికారులపై వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామంలో జరిగిన దాడి ఘటనలో పోలీస్ యంత్రాంగం వ్యవహరించిన తీరుపై పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్ పరిధిలో జరిగిన ఈ దాడి ద్వారా ప్రజలకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ఆయన ప్రశ్నించినట్లు సమాచారం. ఈ దాడిలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ త్రుటిలో తప్పించుకోగా.. కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డ విషయం తెలిసిందే. డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి మీద కూడా స్థానికులు దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఐజీ సత్యనారాయణతోపాటు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ, డీఎస్పీ, ఇతర అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో పోలీస్ యంత్రాంగం వ్యవహరించిన తీరును తప్పుపట్టినట్లు తెలిసింది.

కనీస భద్రతా ఏర్పాట్లు చేయరా?

ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు వందలాది ఎకరాలను రైతుల నుంచి సేకరించడమనేది ఓ సున్నితమైన అంశం కాగా.. దానిపై స్వయంగా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర అధికారులు గ్రామానికి వెళ్లినప్పుడు ఎలా వ్యవహరించాలో తెలియదా అని మంత్రి శ్రీధర్‌బాబు పోలీస్ అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. వారం రోజులుగా అధికారులపై దాడి చేయాలని ప్లాన్ చేసినట్లు చెబుతున్నారని, ఈ విషయాన్ని ఇంటెలిజెన్స్, పోలీస్ శాఖ ఎందుకు తేలిగ్గా తీసుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలకు ఇలాంటి ఘటనలు ఊతమిస్తున్నాయని ఆయన తప్పుపట్టినట్లు సమాచారం. సోమవారం జరిగిన ఘటనల గురించి జిల్లా కలెక్టర్, డీఎస్పీలను వివరంగా అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ప్రజాభిప్రాయ సేకరణ వేదిక వద్ద సురేష్ అనే బీఆర్‌ఎస్ యువజన నాయకుడు గ్రామానికి రమ్మని కలెక్టర్‌ను ఆహ్వానించినప్పుడు స్థానిక సీఐ కలెక్టర్‌ను వారించినట్లు ఐజీ సత్యనారాయణ మంత్రికి వివరించారని తెలిసింది. దాడికి గ్రామంలో ప్రణాళిక చేసినట్లు సమాచారం ఉందని, కారం చల్లి అలజడి సృష్టించే ప్రయత్నాలు జరిగినట్లు ఐజీ చెప్పారని సమాచారం. అయినా మనవాళ్లే కదా అని గ్రామానికి వెళ్లారని, కలెక్టర్ వెనుక కారులో ముగ్గురు డీఎస్పీలు, ఇతర పోలీస్ యంత్రాంగం కూడా వెళ్లిన విషయాన్ని వివరించారని తెలిసింది. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నామని, అక్కడున్న 120 మందిలో 57 మందిని అదుపులోకి తీసుకొని, 16 మందిని రిమాండ్ చేశామన్నారు.

ఎవరినీ వదలం: ఐజీ సత్యనారాయణ

లగచర్ల ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామని, త్వరలోనే కుట్రదారులను కనిపెడతామని ఐజీ సత్యనారాయణ 'సాక్షి'కి తెలిపారు. సురేష్ అనే వ్యక్తి కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించి ముందస్తు ప్రణాళిక ప్రకారం గ్రామానికి తీసుకెళ్లారన్నారు. సురేష్ వెనుక ఉన్న వ్యక్తుల గురించి కూడా విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. సురేష్ పరారీలో ఉన్నారని, ఆయన కాల్‌లిస్ట్‌ను విశ్లేషిస్తున్నామని తెలిపారు. ఈ కుట్రలో ఉన్న వారెవరినీ వదిలే ప్రసక్తే లేదని, కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

కుట్రదారులెవరో తేలుస్తాం: శ్రీధర్‌బాబు

కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులపై జరిగిన దాడిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. వేదిక వద్దకు ప్రజలను రాకుండా చేసి, కలెక్టర్‌ను గ్రామానికి తీసుకెళ్లి, ప్రజలను రెచ్చగొట్టి ఆయనపై దాడికి పాల్పడ్డారని అన్నారు. కలెక్టర్‌ను పథకం ప్రకారం లగచర్లకు తీసుకెళ్లి, దాడి చేయించడానికి ఉసిగొల్పిందెవరో విచారణలో తేలుతుందని చెప్పారు. మంగళవారం సీఎల్పీ కార్యాలయంలో శ్రీధర్‌బాబు విలేకరులతో మాట్లాడారు. 'ప్రభుత్వ కార్యక్రమాలకు అడ్డుతగిలే వారిని ఉపేక్షించం. ప్రధాన ప్రతిపక్షం ప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుకుంటోంది. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా ఎవరు కుట్రలు చేస్తున్నారో బయటపెడతాం. రైతుల ప్రయోజనాలను పక్కన పెట్టి రాజకీయ లబ్ధి కోసం చేసే కుట్రలను వెలికితీస్తాం. పోలీస్, ఇంటెలిజెన్స్, ప్రభుత్వ అధికారుల్లో ఎవరి వైఫల్యం ఉందో విచారణ జరిపిస్తాం. ప్రజాభిప్రాయం ప్రకారమే ఫార్మా కంపెనీ విషయంలో ముందుకెళ్తాం' అని శ్రీధర్‌బాబు చెప్పారు. జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్యను తమ ప్రభుత్వం పరిష్కరించిందని, భవిష్యత్తులో కూడా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో సీఎం సానుకూలంగా ఉన్నారని శ్రీధర్‌బాబు చెప్పారు.

సీఎం ఇలాఖాలో దాడులా?

- ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీస్ ఉన్నతాధికారులు
- స్వయంగా పర్యవేక్షిస్తున్న శాంతిభద్రతల అడిషనల్ డీజీ
- ప్రధాన నిందితుడు సురేశ్.. పట్నం నరేందర్‌రెడ్డి అనుచరుడిగా గుర్తింపు?

సాక్షి, హైదరాబాద్: లగచర్ల గ్రామంలో సోమవారం అధికారులపై దాడి ఘటనను పోలీస్‌శాఖ సీరియస్‌గా తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఏకంగా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులపై దాడులకు దిగడం పోలీసు అధికారులను విస్మయానికి గురిచేసింది. ముందస్తు కుట్రతోనే అధికారులపై దాడికి పాల్పడినట్టు అనుమానిస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు ఘటన పూర్వాపరాలపై మరింత లోతుగా దృష్టి పెట్టారు. దాడికి గ్రామస్తులను ప్రేరేపించిన వారెవరన్నదానిపై ఆరా తీస్తున్నారు. డీజీపీ జితేందర్, శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ ఇప్పటికే జోనల్ ఐజీ సత్యనారాయణ, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డిల నుంచి నివేదిక తెప్పించుకున్నారు. ఈ మేరకు జరుగుతున్న లోతైన విచారణను మహేశ్ భగవత్ పర్యవేక్షిస్తుండగా, ఘటనకు సంబంధించిన దర్యాప్తును జోనల్ ఐజీ సత్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు.

వైఫల్యం ఆరోపణలు కొట్టేస్తున్న ఉన్నతాధికారులు..: ఇంటెలిజెన్స్ వైఫల్యం, పోలీసుల బందోబస్తు పరంగా సరైన ఏర్పాట్లు చేయలేదన్న ఆరోపణలను పోలీస్ ఉన్నతాధికారులు కొట్టేస్తున్నారు. ప్రజల అభిప్రాయం తీసుకోవాలన్న ఉద్దేశంతో కలెక్టర్ అకస్మాత్తుగా లగచర్ల గ్రామానికి వెళ్లారని చెబుతున్నారు. పోలీస్ ఫోర్స్ వచ్చేలోపే కర్రలు, రాళ్లతో దాడులకు దిగడాన్నిబట్టి చూస్తే ముందస్తు కుట్ర కోణం ఉందనే విషయం అర్థఅవుతోందని అంటున్నారు. ఇప్పటికే 55 మందిని గుర్తించామని, 20 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు ఐజీ సత్యనారాయణ తెలిపారు. ఈ కేసులో ఏ-1గా ఉన్న సురేష్ పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నామని చెప్పారు. నాలుగు దర్యాప్తు బృందాలతో పాటు సైబర్ క్రైం బృందాలను కూడా రంగంలోకి దింపినట్టు తెలిపారు.

దాడికి ముందు నరేందర్‌రెడ్డి, కేటీఆర్‌తో మాట్లాడిన సురేష్?..: ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సురేష్.. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రధాన అనుచరుడు అని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. దాడి జరిగే కొన్ని గంటల ముందు పట్నం నరేందర్‌రెడ్డితో సురేష్ 42 సార్లు ఫోన్లో మాట్లాడాడని, సురేష్‌తో మాట్లాడుతూనే పట్నం నరేందర్‌రెడ్డి ఆరుసార్లు మాజీ మంత్రి కేటీఆర్‌తో మాట్లాడాడనే ప్రచారం జరుగుతోంది. కాగా సురేష్‌పై ఇప్పటికే రేప్ కేసుతో సహా పలు కేసులు ఉన్నట్లు తెలుస్తోంది.

రైతుల బాధను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి

వికారాబాద్ ఘటనపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ కలెక్టర్‌పై దాడి చేయడం సరైంది కాదని, అదే సమయంలో ప్రభుత్వం కూడా రైతుల ఆవేదనను అర్థం చేసుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ వ్యాఖ్యానించారు. దాడి చేశారనే నెపంతో ఒక రాజకీయ పార్టీపై ముద్ర వేసి చర్యలు తీసుకోవద్దన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కులగణన మంచి కార్యక్రమమని, అనవసరమైన ప్రశ్నలతో దీనిని వివాదాస్పదం చేసుకోద్దని ప్రభుత్వానికి చెప్పారు. బీఆర్‌ఎస్ రాజకీయ కుట్రను అనుసరిస్తున్నట్టు కనిపిస్తోందని, పేదల భుజాలపై తుపాకులు పెట్టి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. కేటీఆర్‌కు రక్షణ కవచం కావాలని, అందుకే ఆయనకు కమ్యూనిస్టులు గుర్తుకొస్తున్నారని, కానీ తాము ప్రజలకు మాత్రమే కవచంగా ఉంటామని చెప్పారు. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయొద్దని ప్రభుత్వానికి సూచించారు. కులగణన విషయంలో రెండు మూడు అంశాలు అభ్యంతరకరంగా ఉన్నాయని, ఆస్తులు, ఆదాయం, అప్పులు లాంటి సమాచారం ఎందుకు అడుగుతున్నారని నిలదీశారు. మూసీ, హైడ్రా విషయంలో ఈ నెల 14న మేధావులతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు

డెడికేటెడ్ కమిషన్‌కు పార్టీలు, కుల సంఘాల వినతి



బూసానికి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్ గౌడ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు డెడికేటెడ్ కమిషన్‌ను కోరాయి. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల నిర్ధారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు రెండోరోజు కుల సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నుంచి వినతులు, సలహాలు, సూచనలను స్వీకరించారు. మంగళవారం కమిషన్ కార్యాలయానికి వివిధ వర్గాలకు చెందిన నాయకులు, ప్రతినిధులు పెద్దఎత్తున హాజరయ్యారు. దాదాపు 42 రకాల విజ్ఞాపనలు కమిషన్‌కు అందాయి. బీఆర్‌ఎస్ పార్టీ తరపున మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ వేరువేరుగా కమిషన్‌కు వినతులు సమర్పించారు. జనాభాలో బీసీల వాటాను తేల్చి, ఆ మేరకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. డెడికేటెడ్ కమిషన్ బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో విచారణ చేపట్టనుంది.

పొట్టులో కూరుకుపోయి మూగ కూలీ మృతి

సెల్‌ఫోన్ రింగ్‌తో గుర్తించిన కుటుంబ సభ్యులు



యాదగిరి (ఫైల్)

శివ్వంపేట (నర్సాపూర్): డీసీఎంలో పొట్టు లోడ్ చేసేందుకు వెళ్లిన మూగ కూలీ అందులో కూరుకుపోయి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. మెదక్ జిల్లా గుండ్లపల్లి గ్రామానికి చెందిన లింగంపల్లి యాదగిరి (42) మూగవాడు. సోమవారం సాయంత్రం గ్రామానికి చెందిన పొట్టు వ్యాపారి శేఖర్ డీసీఎంలో పొట్టు లోడ్ చేసేందుకు డీసీఎం డ్రైవర్‌తో వెళ్లాడు. దంతన్‌పల్లిలోని ఓ రైస్‌మిల్ నుంచి పొట్టు నింపేందుకు వాహనం ఇరువైపులా కవర్ చుట్టారు. డ్రైవర్ అందులో పొట్టు లోడ్ చేస్తుండగా యాదగిరి వాహనం పైన ఉండి బొర్రెల్లో పొట్టును సరి చేస్తున్నాడు. ఈ క్రమంలో అందులో కూరుకుపోయాడు. ఇది గుర్తించని ట్రాక్టర్ డ్రైవర్ పొట్టుని లోడింగ్ చేశాడు. యాదగిరి కనిపించకపోవడంతో ఇంటికి వెళ్లిపోయాడనుకొని ట్రాక్టర్, డీసీఎం డ్రైవర్లు పొట్టు లారీని అక్కడే నిలిపేసి వెళ్లిపోయారు. రాత్రి యాదగిరి ఇంటికి రాకపోవడంతో భార్య శోభ, కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. పొట్టు లోడింగ్ చేసి ఉంచిన డీసీఎం వద్దకు చేరుకొని యాదగిరి సెల్‌కు ఫోన్ చేయగా బొర్రెలో రింగ్ సౌండ్ గుర్తించి బయటకు తీయగా అప్పటికే చనిపోయాడు. ఘటనా స్థలానికి ఇన్‌చార్జి ఎస్సై రాజు, ఏఎస్సై శ్రీనివాస్ సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.


సచివాలయ అధికారుల సంఘం ఎన్నికల నోటిఫికేషన్

నేటి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు, 18న ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సెక్రటేరియట్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీఎస్‌ఓఏ) కార్యవర్గ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. సంఘ అధ్యక్షుడితో పాటు అసోసియేట్ ప్రెసిడెంట్, ముగ్గురు ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రెటరీ, అడిషనల్ సెక్రెటరీ 2, జాయింట్ సెక్రెటరీ 3, ఆర్గనైజింగ్ సెక్రెటరీ, పబ్లిసిటీ సెక్రెటరీ, ట్రెజరర్, 5 ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ పదవులకు ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి ఎస్.శంకర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ, 5 గంటల వరకు అర్హత ఉన్న నామినేషన్ల ప్రకటన, 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణ, 5 గంటలకు తుది జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు అసోసియేషన్ బిల్డింగ్‌లో పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. నామినేషన్ పత్రాలు, ఫీజు, ఓటరు జాబితా తదితరాలన్నీ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

'అనర్హత' అప్పీళ్లపై తీర్పు రిజర్వు

- అసెంబ్లీ కార్యదర్శి అప్పీళ్లపై సుదీర్ఘ వాదనలు
- సింగిల్ జడ్జి తీర్పును కొట్టేయాలన్న అడ్వొకేట్ జనరల్
- వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వు చేసిన సీజే ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీళ్లపై హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును రిజర్వు చేసింది. ఇందులో రాజ్యాంగ పరమైన అంశాలు ఇమిడి ఉండటంతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని ధర్మాసనం సెప్టెంబర్ 30న అప్పీళ్లు దాఖలైన నాటి నుంచి ఇరుపక్షాల తరఫున సుదీర్ఘ వాదనలు విన్నది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి, న్యాయ శాఖ ముఖ్య కార్యదర్శి తరఫున రవీంద్ర శ్రీవాస్తవ, ఫిరాయింపు ఎమ్మెల్యేల తరఫున న్యాయవాదులు శ్రీరఘురాం, మయూర్‌రెడ్డి, జంధ్యాల రవిశంకర్.. అలాగే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల తరఫున న్యాయవాది గండ్ర మోహన్‌రావు, బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తరఫున న్యాయవాది జె.ప్రభాకర్ వారంపాటు రోజువారీగా వాదనలు వినిపించారు. మంగళవారం వాదనలు ముగించిన ధర్మాసనం తీర్పు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి కడియం శ్రీహరి, కొత్తగూడెం నుంచి తెల్లం వెంకట్రావు బీఆర్‌ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరడాన్ని సవాల్ చేస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఖైరతాబాద్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్లు దాఖలు చేశారు. అలాగే దానంను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా స్పీకర్ సమయం ఇవ్వడం లేదంటూ బీజేపీ పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. అనర్హత పిటిషన్లపై విచారణ షెడ్యూల్‌ను నాలుగు వారాల్లోగా ఖరారు చేయాలని అసెంబ్లీ స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశిస్తూ సెప్టెంబర్ 9న సింగిల్ జడ్జి తీర్పునిచ్చారు. ఈ తీర్పులో ఇచ్చిన గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని అసెంబ్లీ కార్యదర్శి సెప్టెంబర్ 30న హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ అప్పీళ్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టి వాదనలు ముగించింది.

ఎక్కువ మంది జడ్జీలు ఇచ్చిన తీర్పే ఫైనల్

పార్టీ ఫిరాయింపులపై గతంలో సుప్రీంకోర్టు ధర్మాసనాలు ఇచ్చిన తీర్పులను ఏజీ మంగళవారం ప్రస్తావించారు. 'ఐదుగురు జడ్జీల సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను పక్కకు పెట్టడం సరికాదు. ముగ్గురు జడ్జీల సుప్రీంకోర్టు ధర్మాసనం చెప్పింది పరిగణనలోకి తీసుకోవాలని చెప్పడం అర్థరహితం. ఎప్పుడైనా, ఏ కోర్టయినా విస్తృత ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలే ఫైనల్. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు సమంజసం కాదు. తీర్పు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలి' అని కోరారు. అనంతరం ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది.



అన్ని జీవించే ప్రాణులు, వాళ్లు ఎవరైనా కానీ,
వాళ్లు గతంలో నీకు ఏమైనా చేయనీ – వాళ్లందరికీ
నిజమైన సంతోషం దొరకాలని కోరుకోవాలి.
– థానిస్సరో భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 13 నవంబర్ 2024

నయవంచనకు నకలు పత్రం!

దొంగ హామీలతో, వక్రమార్గంలో అయిదు నెలలక్రితం అధికారాన్ని చేజిక్కించుకున్న నాటినుంచీ అనామతు పద్దులతో తప్పించుకు తిరుగుతున్న ఆంధ్రప్రదేశ్ ఎన్డీయే కూటమి సర్కారు 'తప్పనిసరి తద్దినం'లా సోమవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఘనమైన అంకెలు చూసి జనం నవ్విపోరా అన్న వెరపు లేకుండా రూ. 2,94,427 కోట్లతో ఈ బడ్జెట్ తీసుకొచ్చారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ. 2.35 లక్షల కోట్లు, మూలధన వ్యయం రూ. 32,712 కోట్లు, ద్రవ్యలోటు రూ. 68,742 కోట్లు, రెవెన్యూ లోటు రూ. 34,743 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. మొన్నటి ఎన్నికల్లో భూమ్యాకాశాలను ఏకం చేస్తూ మోత మోగించిన సూపర్ సిక్స్ హామీల జాడ లేకుండా... అంచనా వేస్తున్న పన్ను రాబడి రూ. 24,000 కోట్లూ వచ్చే మార్గమేమిటో చెప్పకుండా ఆద్యంతం లొసుగులు, లోపాలతో బడ్జెట్ తీసుకురావడం బాబు సర్కారుకే చెల్లింది. ఈమాత్రం బడ్జెట్ కోసం అయిదు నెలలు ఎందుకు ఆగాల్సివచ్చిందో కూటమి నేతలే చెప్పాలి. 53.58 లక్షలమంది రైతులకు రూ. 20,000 చొప్పున రూ. 10,716.74 కోట్లు కేటాయించాల్సిన 'అన్నదాత సుఖీభవ' పథకానికి కేవలం వెయ్యి కోట్లు మాత్రమే విదిల్చి రైతు సంక్షేమమే లక్ష్యమంటూ బీరాలు పోవటం... 84 లక్షల మంది విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకం కింద రూ. 12,600 కోట్లు కావాల్సి వుండగా కేవలం రూ. 5,387.03 కోట్లు కేటాయించి ఊరుకోవటం దుస్సాహసానికి పరాకాష్ఠ.

రైతులకు జగన్‌మోహన్ రెడ్డి హయాంలో విజయవంతంగా అమలైన ఉచిత పంటల బీమా పథకానికి ఈ ఖరీఫ్ సీజన్ తర్వాత మంగళం పాడుతున్నట్టు ప్రభుత్వమే చెప్పింది. ఇక రూ. 3 లక్షల వరకూ సున్నావడ్డీ రాయితీ, డ్రిప్ పరికరాలపై 90 శాతం సబ్సిడీ వగైరాల గురించి ప్రస్తావన లేదు. అలాగే ధరల స్థిరీకరణ నిధికీ, ప్రకృతి వైపరీత్యాల నిధికీ ఇచ్చిందేమీ లేదు! అయినా రైతు సంక్షేమానికి కట్టుబడివున్నారట! పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి మహిళకూ ప్రతి నెలా రూ. 1,500 చొప్పున ఏడాదికి రూ. 18,000 ఇస్తామని చెప్పిన 'ఆడబిడ్డ' నిధికి రూ. 32,400 కోట్లు కేటాయించాల్సి వుండగా ఇచ్చింది సున్నా. ఏడాదిలో ఇంటింటికీ మూడు సిలెండర్లు ఉచితమని ఊదరగొట్టిన పథకం కింద కోటీ 54 లక్షల కుటుంబాల కోసం రూ. 4,000 కోట్లు అవసరం కాగా దానికోసం కేటాయించింది కేవలం రూ. 895 కోట్లు! ఈ అరకొర మొత్తంతో ఇంటికో సిలెండరైనా ఇవ్వగలుగుతారా? లబ్ధిదారుల జాబితాకు అడ్డగోలుగా కోత పెడితే తప్ప ఇది అసాధ్యం. నిరుద్యోగ యువతకు నెలకు రూ. 3,000 చొప్పున ఏడాదిలో కోటిమందికి మొత్తం రూ. 36,000 కోట్లు కావాల్సి వుండగా దాని ఊసే లేదు! జాబ్ క్యాలెండర్, డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు వగైరాల గురించిన ప్రస్తావన లేదు. అంకుర సంస్థలకు ప్రాజెక్టు వ్యయంలో రూ. 10 లక్షల వరకూ సబ్సిడీ ఇస్తామని చెప్పిన వాగ్దానానికి సైతం చోటులేదు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి తగినన్ని నిధులు కేటాయిస్తే, చెప్పిన రీతిలో సబ్సిడీ సొమ్ము అందిస్తే ఉద్యోగ కల్పన సాధ్యమవుతుంది. కానీ వీటి గురించి మాట్లాడింది లేదు. ఆ రంగానికి బాబు హయాంలో పెట్టిపోయిన బకాయిలు కరోనా మహమ్మారి విజృంభించిన కాలంలో సైతం చెల్లించి ఆ పరిశ్రమలకు ఊపిరులూదిన జగన్ సర్కారుకూ, ఈ మాయదారి కూటమి ప్రభుత్వానికీ పోలికెక్కడ! యువతకు ఏటా లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ మాట దేవుడెరుగు – మూడు లక్షలమంది వలంటీర్లకు మంగళం పాడినట్టు బడ్జెట్ అధికారికంగా తేల్చి చెప్పింది. కాపు వర్గానికి సైతం మొండిచెయ్యి చూపారు.

'బడ్జెట్ అంటే అంకెల సముదాయం మాత్రమే కాదు... అది మనం పాటిస్తున్న విలువలు, ఆకాంక్షల వ్యక్తీకరణ' అని ఒకనాటి అమెరికా ఆర్థిక మంత్రి జాకబ్ ల్యూ ఉవాచ. పీఠంపై పేరాశతో మొన్నటి ఎన్నికల్లో ఎడాపెడా వాగ్దానాలిచ్చినవారి నుంచి విలువలేమి ఆశించగలం? వారికి జనం ఆకాంక్షలెలా అర్థమవుతాయి? అందుకే– వంచనాత్మక విన్యాసాలు ఆగలేదు. బడ్జెట్‌లో అంకెల గారడీ సరే, బయట పారిశ్రామికవేత్తలతో సైతం బాబు అదే మాదిరి స్వోత్కర్షలకు పోయారు. రానున్న రోజుల్లో ఏకంగా 15 శాతం వృద్ధి రేటు సాధిస్తారట! అవకాశాల కల్పనతో సంపద సృష్టించి, పేదల జీవన ప్రమాణాలు పెంచుతారట!! కూటమి సర్కారు గద్దెనెక్కినప్పటి నుంచీ పన్ను రాబడి మైనస్‌లోకి పోయిందని సాక్షాత్తూ కాగ్ చెప్పింది. జగన్ సర్కారు హయాంలో మొన్న ఏప్రిల్‌లో పన్ను రాబడిలో దాదాపు 11 శాతం వృద్ధి నమోదు కాగా, ఆ తర్వాత తగ్గటం సంగతలా వుంచి మైనస్‌లోకి పోయింది. మే నెలలో –2.8 శాతం, ఆ తర్వాత వరసగా –8.9, –5.3, –1.9, –4.5 శాతాలకు పడిపోయిందని కాగ్ నివేదిక బయటపెట్టింది. వాస్తవం ఇలావుంటే పన్ను రాబడి కింద అదనంగా రూ. 24,000 కోట్లు వస్తాయని బడ్జెట్ నమ్మబలుకుతోంది. అంటే రానున్న కాలంలో అదనపు పన్నుల మోత మోగుతుందన్నమాట!

జగన్ ప్రభుత్వం చేసిన అప్పుల గురించి గడచిన అయిదేళ్ళూ సాగించిన దుష్ప్రచారం అంతా ఇంతా కాదు. కూటమి నేతలు, వారి వందిమాగధ మీడియా నోటికొచ్చినట్టు రూ. 12 లక్షల కోట్లు, రూ. 14 లక్షల కోట్లు అంటూ తప్పుడు ప్రచారాలు చేశారు. తీరా మొన్న మార్చి 31 నాటికి ఆ అప్పు రూ. 6.46 లక్షల కోట్లని తాజా బడ్జెట్ వెల్లడించింది. ఇందులో గ్యారెంటీల కింద తెచ్చిన అప్పు రూ. 1,54,797 కోట్లనూ తీసేస్తే నికరంగా ఉన్నది రూ. 4.91 లక్షల కోట్లు మాత్రమే! నిజానికి ఈ బడ్జెట్ చదివిన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ఈ విషయంలో గతంలో తప్పుడు ప్రచారం చేశామని క్షమాపణలు చెప్పాలి. కానీ ఆపాటి నిజాయితీ ఆశించటం అత్యాశే. మొత్తానికి నయవంచనకూ, నేల విడిచిన సాముకూ ఈ బడ్జెట్ అసలు సిసలు ఉదాహరణ.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.ద్వాదశి ఉ.10.02 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** రేవతి రా.1.47 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** ప.2.39 నుండి 4.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.23 నుండి 12.11 వరకు, **అమృతఘడియలు:** రా.11.31 నుండి 1.01 వరకు, క్షీరాబ్ధి ద్వాదశి.

సూర్యోదయం : 6.07
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

రైతులు అడగాల్సిన 'మహా' నమూనా

దేశంలో ప్రజా సమస్యలు వెనుకబడిన పరిస్థితులలో మహారాష్ట్రలో నవంబర్ 20న శాసనసభ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడి కొన్ని రైతు సంఘాలు 38 డిమాండ్లతో 'రైతు మేనిఫెస్టో' ప్రకటించి రాజకీయ పార్టీలకు సవాలు విసిరాయి. మేనిఫెస్టోను సమర్థించే వారికే ఓటు వేస్తామని చెప్పాయి. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరల(ఎంఎస్‌పీ)కి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం బోనస్ అందించడం, 10 హెక్టార్ల లోపు భూమి ఉన్నవారికి రుణమాఫీ చేయడం లాంటివి ఇందులో ఉన్నాయి. ఈ డిమాండ్లు గొంతెమ్మ కోర్కెలు కావు. వ్యవసాయాన్ని, రైతును బతికించుకోవడానికి అడుగుతున్నవే. అన్ని రాష్ట్రాల్లోనూ ఈ తరహా చైతన్యానికి మహారాష్ట్ర మేనిఫెస్టో ఒక నమూనా కావాలి!

విశ్లేషణ



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

అమెరికా, చైనా, రష్యా, బ్రెజిల్, జపాన్ వంటివి వ్యవసాయ రంగంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు దూసుకు వెళుతుండగా, భారత దేశంలో రైతాంగం ఇంకా నేల చూపులు చూస్తోంది. కనీస మద్దతు ధరల కోసం, రుణమాఫీ కోసం రోడ్ల మీదకొచ్చి ఉద్యమాలు చేస్తూ రైతులు పోలీసుల లాఠీల దెబ్బలు తింటున్నారు. వ్యవసాయం గిట్టుబాటుకాక, చేసిన అప్పులు తీర్చేదారిలేక, బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. నిజం చెప్పాలంటే, భారతదేశ రైతాంగం వెతలు ముగింపులేని డైలీ టీవీ సీరియల్‌లా కొనసాగుతున్నాయి.

ఈ తరుణంలో మహారాష్ట్ర రైతు సంఘాలు ఉమ్మడిగా 'రైతు మేనిఫెస్టో' ప్రకటించి రాజకీయ పార్టీలకు సవాలు విసరడం విశేషం. అనేక దశాబ్దాలుగా రైతాంగం తరుపున పోరాడుతున్న సామాజిక కార్యకర్తలు, ప్రముఖ జర్నలిస్టులైన పాలగుమ్మి సాయినాథ్, దినేష్ అబ్రాల్ నేతృత్వంలో రూపొందిన 38 డిమాండ్లతో కూడిన 'రైతు మేనిఫెస్టో'లో నిజానికి కొత్త అంశాలేమీలేవు. రైతులు అనాదిగా ఎదుర్కొంటున్న సమస్యలే. అందులో ప్రధానమైనవి: కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరల(ఎంఎస్‌పీ)కి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం బోనస్ అందించాలి; 10 హెక్టార్లలోపు భూమి ఉన్న రైతాంగానికి రుణమాఫీ చేయాలి; ప్రధాన మంత్రి గ్యారంటీ పథకాన్ని కొన్ని రాష్ట్రాలకు బదులుగా అన్ని రాష్ట్రాలకు వర్తింపజేయాలి; పర్యాటకం, మౌలిక సదుపాయాల పేరుతో సముద్రతీర ప్రాంత మత్స్యకార కుటుంబాలను బలవంతంగా వెళ్లగొట్టడం మానుకోవాలి; ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతాంగ సమస్యలను చర్చించడానికి అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలి. ఇవిగాక, ఇంకా భూమికి సంబంధించినవి, కౌలు రైతులకు వర్తింపజేసేవి, బలవన్మరణాలకు పాల్పడ్డ రైతాంగ కుటుంబాలకు అందించే పరిహారం మొదలైనవి ఉన్నాయి.

గొంతెమ్మ కోర్కెలు కావు!

ఈ డిమాండ్లు వ్యవసాయాన్ని, రైతును బతికించుకొని దేశానికి ఆహార భద్రత చేకూర్చడానికి అడుగుతున్నవే. దేశంలో అతిపెద్ద రాష్ట్రాల్లో మహారాష్ట్ర ఒకటి. పారిశ్రామికంగా అగ్రస్థాయిలో ఉన్న రాష్ట్రాల సరసన ఉన్నది. అయినా, బలవన్మరణాలకు పాల్పడే రైతుల సంఖ్య దేశంలోనే మొదటిస్థానంలో ఉంది. ఇది ఒక సామాజిక, రాజకీయ వైచిత్రి. కారణం మహారాష్ట్రలోని అన్ని ప్రాంతాలు ఒకే రీతిలో ఉండవు. విదర్భలో వర్షాభావం వల్ల పంటలు దెబ్బతింటున్నాయి. ఇక్కడ పత్తి, సోయాబీన్, ఉల్లి, చెరకు పంటలను రైతులు ఎక్కువగా పండిస్తున్నారు. వీటికి కేంద్రం ప్రకటించే మద్దతు ధరల కంటే తక్కువ ధరలు లభిస్తున్నందున కేరళ, కర్ణాటక తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా 20 శాతం బోనస్ ప్రకటించాలని రైతు సంఘాలు చేస్తున్న డిమాండ్‌లో హేతుబద్ధత ఉంది.



ఇక, అధికారంలోకి రావడం కోసం రైతాంగాన్ని ప్రసన్నం చేసుకోవడానికి నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రధానమంత్రి గ్యారంటీ పథకాన్ని ప్రకటించిందిగానీ దానిని అన్ని రాష్ట్రాలకు వర్తింపజేయకుండా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల ఎన్నికల ముందు అక్కడ అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీని తమ రాష్ట్రంలో కూడా అమలు చేయమని మహారాష్ట్ర రైతాంగం డిమాండ్ చేయడంలో అనౌచిత్యం కనపడదు. కేంద్ర పథకం కొన్ని రాష్ట్రాల్లోనే అమలు చేయడం సమాఖ్య స్ఫూర్తికి విఘాతంగా పరిణమించదా? పీఎం గ్యారంటీ ద్వారా ఎంఎస్‌పీకి 30 శాతం బోనస్ అందిస్తారు. ఈ పథకం అన్ని రాష్ట్రాలకు అమలు చేస్తేనే కేంద్ర ప్రభుత్వానికి రైతాంగం పట్ల చిత్తశుద్ధి ఉన్నట్లు!

వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధ

దేశం శాస్త్ర సాంకేతిక రంగాలలో, ఇన్ఫర్మేషన్, బయోటెక్నాలజీ రంగాలలో ముందంజ వేసిన మాట నిజమే. వ్యవసాయ రంగంలో అదే రకమైన ప్రగతి ఎందుకు జరగడం లేదు? నాలుగైదు దశాబ్దాల క్రితం పట్టిపీడించిన సమస్యలు నేటికీ వ్యవసాయాన్ని వీడకపోవడానికి కారణం ఏమిటి? 2004లో దేశంలో పత్తి ఉత్పాదకత హెక్టారుకు సగటున 446 కిలోలు ఉండగా, రెండు దశాబ్దాల తర్వాత 2023 నాటికి ఆ మొత్తం 470 కిలోలకు మాత్రమే చేరింది. అదే చైనాలో 2004లో 496 కిలోలు ఉండగా, 2023 నాటికి 1,990 కిలోలకు చేరింది. పత్తి ఒక్కటే కాదు... వరి, గోధుమ, మొక్కజొన్న, సోయా తదితర పంటల ఉత్పాదకతలో మన వృద్ధిరేటు 10 శాతం ఉంటే... చైనా, అమెరికా, బ్రెజిల్, ఇజ్రాయెల్ తదితర దేశాలు రెండు దశాబ్దాల వ్యవధిలో 400 శాతం వృద్ధిరేటు సాధించాయి. ఇందుకు కారణం వాతావరణ మార్పుల్ని, చీడ పీడల్ని సమర్థవంతంగా తట్టుకొని మొలకెత్తగల జన్యుపరమైన వంగడాలను ఆ దేశాల వ్యవసాయ శాస్త్రవేత్తలు సృష్టించగలుగుతున్నారు.

దేశీయ వ్యవసాయ రంగంలో సాంకేతిక వినియోగం గణనీయంగా పెరిగినప్పటికీ, ఇతర రంగాలతో పోలిస్తే తక్కువే. వ్యవసాయ రంగంలో సైతం కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని అభివృద్ధి చెందిన దేశాలు వేగవంతం చేశాయి. భూసార పరీక్షలు చేయడం, ఏ ప్రాంతంలో ఏ పంటలు వేయవచ్చు, ఏ పంటకు ఎంత దిగుబడి వస్తుంది, వాతావరణ మార్పులు ఏ విధంగా ఉంటాయి మొదలైన సమాచారాన్ని 'కృత్రిమ మేధ' అందిస్తుంది. పంట తెగుళ్లను చాలా ముందుగానే ప్రారంభ దశలోనే గుర్తించడం ఈ టెక్నాలజీ ద్వారా సాధ్యపడుతుంది. ఏ పంటకు ఎంత నీరు, ఎరువు అవసరమో తెలియజేస్తుంది. భూసారాన్ని పెంచడం కూడా ఈ విధానంలో సాధ్యమవుతుందని శాస్త్రజ్ఞులు వెల్లడిస్తున్నారు. పండ్ల సాగులో కొన్ని దేశాలు రోబోటిక్స్‌ను వినియోగిస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఏఐ, రోబోటిక్స్ వ్యవసాయ రంగ ముఖచిత్రాన్ని మార్చివేయడం ఖాయమని శాస్త్రజ్ఞులు నమ్ముతున్నారు. వ్యవసాయ విద్య, పరిశోధనలు, విస్తరణ, పాడి, ఉద్యాన మొదలైన రంగాలను బలోపేతం చేయడానికి ఇటీవల కేంద్ర కేబినెట్ 'డిజిటల్ అగ్రికల్చర్ మిషన్' పథకాన్ని ప్రారంభించింది. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం.

అన్ని రాష్ట్రాల్లోనూ...

అధిక మొత్తంలో ధర చెల్లించి పప్పు ధాన్యాల్ని దిగుమతి చేసుకొనే బదులుగా, ప్రోత్సాహకాలు అందిస్తే రైతులే అధికంగా పంటలు వేస్తారు. కానీ, కేంద్రం అందుకు చొరవ చూపడం లేదు. దాంతో, పప్పు ధాన్యాల సాగు, ఉత్పత్తిలో క్షీణత కనిపిస్తోంది. మరోపక్క, దేశంలోని తీర ప్రాంత రాష్ట్రాలలో పర్యాటకం, మౌలిక సదుపాయాల వృద్ధిపేరుతో అక్కడి మత్స్యకారుల్ని వెళ్లగొట్టడం ఎక్కువైంది. నిజానికి వ్యవసాయానికి అనుబంధ పరిశ్రమగా పరిగణిస్తున్న మత్స్యరంగంలోనే అధిక వృద్ధి నమోదవుతోంది. రొయ్యలు, చేపల ఎగుమతిలో భారతదేశం అగ్రగామిగా ఉంది. ఈ రంగంపై ఆధారపడిన కోట్లాది మంది మెరుగైన ఉపాధి పొందుతున్నారు. కానీ సముద్రానికీ, మత్స్యకారులకూ ఉండే బంధాన్ని దెబ్బతీసే యత్నాలు జరుగుతున్నాయి. ఈ అంశాన్ని మహారాష్ట్ర రైతు సంఘాలు రైతు మేనిఫెస్టో ద్వారా దేశ ప్రజల దృష్టికి తెచ్చాయి. తమ మేనిఫెస్టోను సమర్థించే వారికే ఓటు వేస్తామని పార్టీలకతీతంగా రైతులు చెప్పడాన్ని ఆహ్వానించాలి. ఒక్క మహారాష్ట్రయే కాదు... అన్ని రాష్ట్రాలు ప్రతి అసెంబ్లీ సమావేశాలలో ఒకటి, రెండు రోజులు ప్రత్యేకంగా రైతాంగ సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు కనుగొనడానికీ, తదనుగుణంగా ప్రణాళికలు రూపొందించడానికీ చొరవ చూపాలి. ఇందుకు మహారాష్ట్ర రైతు మేనిఫెస్టో ఓ మోడల్ కావాలి.

వ్యాసకర్త ఏపీ శాసనమండలి సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎందుకు మాట్లాడటం?



భారత సెలబ్రిటీలకు ఒక సలహా. మీకు ఏమీ తెలియని విషయాల గురించి మాట్లాడటం మానుకోండి.

– సుధీర్ మిశ్రా, దర్శకుడు

సానుకూల నిర్ణయం?



తర్వాతి విదేశాంగ మంత్రిగా మార్కో రూబియో, జాతీయ భద్రతా సలహాదారుగా మైక్ వాల్ట్జ్ ఎంపికలను చూస్తుంటే, అమెరికా సంబంధాలు తైవాన్, ఇండియాతో బలంగా కొనసాగుతాయనీ, వాటికి ప్రాధాన్యం ఉంటుందనీ తెలుస్తోంది.

– సనా హాశ్మీ, ఫెలో

పాత పగ?



అందరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఇందిరాగాంధీ ముందు సాగిలపడినా, హన్స్‌రాజ్ ఖన్నా మాత్రం ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా నిలబడ్డారు. దానికి భారీ మూల్యం చెల్లించారు (ప్రధాన న్యాయమూర్తి కాలేకపోయారు). ఆయన సంజీవ్ ఖన్నా బాబాయి. రాజ్యాంగ సంరక్షకుడైన రాహుల్ గాంధీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సంజీవ్ ఖన్నా ప్రమాణ స్వీకారోత్సవానికి గైర్హాజరయ్యారు. వాళ్లు మర్చిపోరు!

– ఆనంద్ రంగనాథన్, 'స్వరాజ్య' గౌరవ సంపాదకుడు

దగ్గరి దూరం



ఇస్లామాబాద్‌లో 'మార్గల్లా డైలాగ్'కు హాజరవుతున్నాను. ఒకప్పుడు పాకిస్తాన్‌కు భూమార్గంలో వెళ్లడం గొప్ప అనుభవంగా ఉండేది. మన రెండు దేశాలు అత్యంత దగ్గరగా ఉంటాయి. అయినా దూరంగా ఉంటాయి. ఇంతకంటే విషాదం మరొకటి ఉండదు.

– ప్రవీణ్ సహానీ, ఆర్మీ మాజీ ఉన్నతాధికారి

సహజ అవకాశం



మీకు తెలుసా? సాధారణ డేటా సెంటర్ల కంటే, కృత్రి మేధ(ఏఐ) డేటా సెంటర్లు 10-20 రెట్లు ఎక్కువ శక్తిని వాడతాయి. శక్తిమంతమైన పరికరమైన ఏఐకి చాలా ఎక్కువ విద్యుత్ కావాలి. ఇప్పుడు ఏఐ ఒక చిన్న దేశం నెదర్లాండ్స్ అంతటి విద్యుత్‌ను వాడుతోంది. 2027కల్లా మధ్యస్థ దేశం అర్జెంటీనాతో సమానమైన విద్యుత్ అవసరం. దీన్ని అవకాశంగా మలుచుకోవడానికి ఇండియా సిద్ధంగా ఉండాలి.

– అనిల్ అగర్వాల్, పారిశ్రామికవేత్త

ప్రాధాన్యం లేదా?



చూస్తుంటే అమెరికా నూతన మంత్రివర్గంలో (భారతీయ మూలాలున్న) తులసి గబ్బార్డ్, వివేక్ రామస్వామికి ప్రాధాన్యం ఉన్న పదవులు దక్కేలా లేవు. హిందూ అమెరికన్లు రాజకీయ అంచనాలు వేయడం అలవర్చుకోవాల్సింది. వారు వివేక్, తులసికి మద్దతుగా నిలబడాల్సింది. కానీ వాళ్లు (డెమొక్రాట్) రో ఖన్నాను ఎంపిక చేసుకున్నారు.

– సి. రామ్‌ప్రసాద్, ఆంట్రప్రెన్యూర్

ఇన్ని చావులా?



పదేళ్లలో భారతదేశంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 15.3 లక్షల మంది చనిపోయారు. కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, పది వేల కిలోమీటర్లకు 250 మరణాలు ఉంటున్నాయి. అదే అమెరికా, చైనా, ఆస్ట్రేలియాలలో ఇవే సంఖ్యలు: 57, 119, 11.

– ఖాలిద్ బేగ్, యూట్యూబర్

ఇన్ బాక్స్

కఠిన శిక్షలతోనే కల్తీకి అడ్డుకట్ట

ఇటీవల నిర్మల్ లోని ఓ హోటల్‌లో నాన్ వెజ్ తిన్న యువతి ఫుడ్ పాయిజన్ అయి మృతి చెందింది. హైదరాబాద్‌లో మోమోస్ తిని మరో మహిళ చనిపోయింది. కాగజ్ నగర్‌లోని మరో హోటల్‌లో చికెన్ మండీ తిన్న పలువురు తీవ్ర కడుపు, తలనొప్పి, వాంతులతో ఆస్పత్రిలో చేరారు. ఇలాంటి ఘటనలు ప్రతిరోజూ ఏదో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. అయినా వీటిని అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయి.

హోటళ్లు, ఫుట్ పాత్‌లపై నోరూరించే వంటకాల వెనక అనేక నాసిరకం ఆహార పదార్థాలు దాగి ఉన్నాయి. కనీస ప్రమాణాలు పాటించకుండా మాంసాహారాన్ని నిల్వ ఉంచుతున్నారు. వాటికే రంగులద్ది మళ్లీమళ్లీ నూనెలో వేయించి వేడివేడిగా పొగలు కక్కిస్తూ వడ్డిస్తున్నారు. పలుచోట్ల రోగాల బారిన పడిన జంతువుల మాంసాన్ని సైతం వినియోగించిన ఘటనలు వెలుగుచూశాయి. నాసిరకం నూనెలు, అనుమతిలేని రంగులు మితిమీరి వాడుతున్నారు. కలుషిత, కల్తీ ఆహారం వల్ల అతిసారం నుంచి క్యాన్సర్ల వరకు దాదాపు 200 రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. గుండె, ఊపిరితిత్తులు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మ సంబంధిత సమస్యలు వస్తాయని చెబుతున్నారు. ఆహార పదార్థాల తయారీలో రుచి, రంగు కోసం హానికరమైన రసాయనాలు, రంగులను కలుపుతుండడంతో దేశంలో సుమారు 10 కోట్ల మంది వివిధ వ్యాధులతో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది.

'ఆహార కల్తీ నిరోధక చట్టం–1954' కఠిన శిక్షలను నిర్దేశించింది. ఆహార, పానీయాలను కల్తీ చేసి అమ్మేవారికి 6 నెలల తప్పనిసరి జైలుశిక్షతో పాటు రూ. 25 వేల జరిమానా విధించాలని పార్లమెంటరీ ప్యానెల్ సైతం ఏడాది క్రితం సిఫారసు చేసింది. అయితే హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిత్యం తనిఖీలు చేస్తూ కలుషిత ఆహారాన్ని గుర్తిస్తున్నా... వారికి శిక్షలు మాత్రం పడడం లేదు. జరిమానాలతో బయటికొచ్చి మళ్లీ అదే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం నాసిరకం (సబ్ స్టాండర్డ్) ఆహారం అని తేలితే జాయింట్ కలెక్టర్ వద్ద నేరస్థుడిని ప్రవేశపెట్టి జరిమానా లేదా 6 నెలల జైలుశిక్ష వేసే అవకాశం ఉంది. సబ్ స్టాండర్డ్ కేసుల్లో వెయ్యి నుంచి రూ. 2 లక్షల వరకూ జరిమానా చెల్లించి నేరస్థులు బయటపడుతున్నారు. కల్తీ ఆహారం అని తేలితే క్రిమినల్ కేసు బుక్ చేయాలి. వారికి గరిష్ఠంగా రెండేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. ఒకవేళ కల్తీ ఆహారం తిని ఎవరైనా చనిపోయినట్లు నిరూపిస్తే గరిష్ఠంగా ఏడేళ్ల శిక్ష విధించేందుకు చట్టంలో సెక్షన్లున్నాయి. పూర్తి స్థాయిలో కఠిన శిక్షలు అమలైతేనే హోటళ్లు, రెస్టారెంట్లు, రోడ్ సైడ్ ఫుడ్ బిజినెస్‌లో కల్తీని అరికట్టగలం.

– ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్

జీవనశైలి మార్పే మధుమేహానికి మందు!

మధుమేహం (డయాబెటిస్) బాధితులు దాదాపు ప్రతి కుటుంబంలో ఉంటున్నారు. ఇంతగా వ్యాప్తి చెందుతున్నా ప్రజలు దీని నిరోధానికి తగిన జాగ్రత్తలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. ముఖ్యంగా మన దేశంలో మధుమేహం చాప కింద నీరులా చాలా వేగంగా వ్యాప్తి చెందుతోంది. మధుమేహం వ్యాప్తి విషయంలో భారత్ మొదటి స్థానంలో ఉంది. దేశంలో మన రెండు తెలుగు రాష్ట్రాలు మొదటి వరుసలో ఉన్నాయి. గతంలో ఎక్కువగా 50 నుంచి 60 ఏళ్ల వయసుగల వారిలో గుర్తించిన మధుమేహం, ఇప్పుడు 30 నుంచి 40 సంవత్సరాల్లోపే గుర్తించడం కనిపిస్తోంది. ఇది భారతీయులకు ఆందోళన కలిగించే విషయమే.

మధుమేహ సమస్య గ్లోబల్ సమస్య. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇన్సులిన్ ఆవిష్కర్తలలో ఒకరైన సర్ ఫ్రెడరిక్ బ్యాంటింగ్ జన్మదినమైన నవంబర్ 14వ తేదీన 'ప్రపంచ మధుమేహ నిరోధక దినం' (వరల్డ్ డయాబెటిస్ డే)గా ప్రకటించింది. అధిక శాతం ప్రజల్లో శారీరక శ్రమ తగ్గిపోయింది. చాలామందిలో మానసిక ఒత్తిడి తప్ప, శారీరక కదలికలు లేవు. వీటికి తోడు పర్యావరణ మార్పులు, వంశపారంపర్యత్వం, జీవన సరళిలో వచ్చిన అసంగత మార్పులు... మధుమేహం రావడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధి నుంచి బయటపడవచ్చు. తల్లిదండ్రులలో ఇద్దరికీ మధుమేహం ఉన్నా, వారి పిల్లలలో కేవలం 7% మందిలో మాత్రమే జీవిత కాలంలో మధుమేహం బారిన పడ్డట్టు పరిశోధనలు చెప్పడం ఇందుకు నిదర్శనం.



మన తాత ముత్తాతలు దంచిన లేదా తక్కువ పాలిష్ పట్టిన బియ్యం, చిరుధాన్యాలు తినేవారు. వాటిలో విటమిన్స్, ఫైబర్ ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు ఎక్కువగా పాలిష్ పట్టిన బియ్యాన్ని వాడుతున్నాం. చిరుధాన్యాలు తినడం మానేశాం. దీనికి తోడు ప్యాక్డ్ ఫుడ్స్, రెడీ టు ఈట్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్ వాడకం పెరిగిపోయింది. కాలినడక తగ్గిపోయింది. వాహనాల వినియోగం పెరిగిపోయింది. చాలామందిలో కుటుంబ, వృత్తి, సామాజిక పర సమస్యలు పెరిగిపోయి మానసిక ఒత్తిడి, ఆందోళనలు అధిక మయ్యాయి. ఇవన్నీ ఇన్సులిన్ రెసిస్టెన్స్‌కు కారణాలే. ఊబకాయం తెలుసుకునేందుకు బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) కీలక పాత్ర పోషిస్తుంది. ఇది పెరిగే కొద్దీ శరీరంలో కొవ్వు శాతం పెరిగిపోతుందని అర్థం. బీఎంఐ ఎక్కువగా కలవారే ఎక్కువగా మధుమేహం బారిన పడుతున్నారని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు.

చేసే పనికి తగ్గ పోషకాహారం, వ్యాయామం తప్పనిసరి. ఊబకాయస్థుల శరీరం బరువు 7 శాతం తగ్గితే మధుమేహం వచ్చే అవకాశాలు 60 శాతం తగ్గిపోతాయని వైద్య పరిశోధనలు రుజువు చేస్తున్నాయి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా 30 నిమిషాలైనా నడక, అవకాశం ఉన్నవారు ఈదటం, పరుగెత్తడం వల్ల మంచి ప్రయోజనాలు ఉంటాయి. గంటల తరబడి కుర్చీలో కూర్చోకుండా మధ్య మధ్య లేచి నాలుగు అడుగులు వేయడం మంచిదని వైద్య పరిశోధకులు చెబుతున్నారు. దీనివల్ల శరీరం రిలాక్స్ అవుతుంది. మానసికంగా ఉత్సాహంగా ఉంటుంది. వ్యాయామంతో పాటు ఆహారం కూడా ముఖ్యం. జంతు సంబంధ ఆహారం కంటే మొక్కల నుండి లభించే శాకాహారం శ్రేయస్కరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పీచు పదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి. ప్రజారోగ్యం పైన, ఆర్థిక వ్యవస్థ మీద అత్యంత ప్రభావం చూపే మధుమేహం నిరోధంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై బాధ్యతగా వ్యవహరించాలి.

– డా॥ టి. సేవకుమార్ । ఎస్.హెచ్.ఓ. హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ వ్యవస్థాపకులు (రేపు వరల్డ్ డయాబెటిస్ డే)

అందరిలోనూ దేవుడు!

స్వామి వివేకానంద 28 ఏళ్ల వయసులో రాజస్థాన్‌లో ప్రభుత్వ న్యాయవాది అయిన ఒక ముస్లిం కోరిక మేరకు ఆయన ఇంట్లో కొంతకాలం ఉన్నారు. ఆ ఇంటికి వెళ్లిన కొద్ది రోజుల్లోనే ఆయనకు చాలా మంది పరిచయమయ్యారు. వారిలో ఒకరు జగ్మోహన్. ఆయన రాజస్థాన్‌కు చెందిన ఖేత్రీ రాజు ప్రత్యేక కార్యదర్శి. ఒకరోజు జగ్మోహన్ వచ్చినప్పుడు వివేకానందులవారు నిద్రపోతున్నారు. జగ్మోహన్ ఆయనను చూసి 'ఈయన ఓ మామూలు సాధువు. సరైన వ్యక్తిలా అన్పించటం లేద'ని లోలోపల అనుకున్నారు. కాస్సేపటికి స్వామి వివేకానంద మేల్కొన్నారు.

జ్యోతిర్మయం

అప్పుడు జగ్మోహన్ 'మీరేమో ఓ హిందూ సాధువు. కానీ మీరు ఓ ముస్లింతో కలిసి ఉంటున్నారు. ఎలా' అని అడిగారు. ఈ ప్రశ్నకు వివేకానంద ఇలా చెప్పారు: 'మీరేమంటున్నారు? నేను ఓ సాధువును. నేను మీ సామాజిక కట్టుబాట్లన్నింటినీ దాటి వచ్చిన వాడిని. నేను ఓ కాలువ శుభ్రం చేసే మనిషితోనూ కలిసి భోం చేయగలను. నేను అంతటా భగవంతుడిని చూస్తున్నాను. ఓ సాధారణ జీవిలోనూ భగవంతుడిని చూస్తున్నాను. నాకు ఒకరు ఎక్కువా, మరొకరు తక్కువా కాదు. నాకందరూ సమానులే' అంటూ తన విధానాన్ని నిక్కచ్చిగా చెప్పారు. దీంతో జగ్మోహన్ కంగుతిన్నారు. ఆయనకు వివేకానంద పట్ల అభిమానమేర్పడింది. అంతేకాదు, తమ రాజు ఖేత్రీ కూడా స్వామిని కలిస్తే బాగుంటుందనుకున్నారు. 'మీరు మా ఆస్థానానికి రావాలి' అని అడిగారు. ఎల్లుండి వస్తానని వివేకానంద మాట ఇచ్చారు. అలాగే 1891 జూన్ నాలుగో తేదీన ఆయన రాజును కలిశారు. ఖేత్రీ మహారాజు అజిత్ సింగ్ వివేకానందుల వారిని బాగా అర్థం చేసుకున్నారు. అంతేకాదు, ఆయన శిష్యులలో ఒకరయ్యారు.

– యామిజాల జగదీశ్



పులి దాడిలో చనిపోయిన ఎద్దు వద్ద విలపిస్తున్న రైతు

పులి దాడి... ఎద్దు మృతి

పెంబి: నిర్మల్ జిల్లాలో పక్షం రోజులుగా సంచరిస్తున్న పెద్దపులి పెంబి మండలం అంకెన గ్రామ పంచాయతీ పరిధి బుర్కరేగడి గ్రామంలో సోమవారం రాత్రి ఓ ఎద్దుపై దాడి చేసి చంపేసింది. గ్రామంలోని కుమురం గంగాధర్ తన ఎడ్లను రోజువారీలాగానే చేను వద్ద కట్టేశాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో అటుగా వచ్చిన పెద్దపులి ఎద్దుపై దాడి చేసి చంపింది. గంగాధర్ మంగళవారం ఉదయం చేను వద్దకు వెళ్లేసరికి ఎద్దు చనిపోయి ఉంది. పులి చంపినట్లు అనుమానించి అటవీ అధికారులకు సమాచారమిచ్చాడు. మామడ ఎఫ్ఆర్‌వో అవినాశ్ ఘటనా స్థలం సమీపంలో పులి పాదముద్రలను గుర్తించారు. పులి దాడి చేయడంతోనే ఎద్దు చనిపోయినట్లు నిర్ధారించారు.

పిచ్చికుక్క దాడిలో ఆరుగురికి గాయాలు

మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రం పరిధిలోని పాదుమూరు, మంగపేట, గంపోనిగూడెం గ్రామాల్లో పిచ్చికుక్క దాడిచేసి ఆరుగురిని గాయపరిచింది. పాదుమూరు ముస్లింవాడ నుంచి మంగపేట, గంపోనిగూడెం వైపు రోడ్డువెంట వెళ్తూ మంగపేటకు చెందిన బోడ నర్సమ్మ, ముత్తమ్మ, రహీం, బోరునర్సాపురానికి చెందిన అప్పమ్మ, కమలాపురానికి చెందిన శివ, తిమ్మంపేటకు చెందిన శ్రీలను గాయపరిచింది. బాధితులను మంగపేట పీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు.

నలుగురు బీఆర్ఎస్ నేతలకు నోటీసులు?

- ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యేలకు తాఖీదులు
- లిస్టులో మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల, పైళ్ల, బొల్లం మల్లయ్య
- ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు నోటీసు



మర్రి జనార్దన్‌రెడ్డి | గువ్వల బాలరాజు | పైళ్ల శేఖర్‌రెడ్డి | బొల్లం మల్లయ్య

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్‌కు చెందిన మరో నలుగురు మాజీ ఎంఎల్ఏలకు పోలీసులు నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిసింది. మర్రి జనార్దన్‌రెడ్డి (నాగర్‌కర్నూల్), గువ్వల బాలరాజు (అచ్చంపేట) పైళ్ల శేఖర్‌రెడ్డి (భువనగిరి), బొల్లం మల్లయ్యయాదవ్ (కోదాడ)కు నోటీసులు సిద్ధం చేసినట్లు సమాచారం. ఇప్పటికే నకిరేకల్ మాజీ ఎంఎల్ఏ చిరుమర్తి లింగయ్యకు నోటీసు చేరిన విషయం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరోలో మాజీ అదనపు ఎస్పీ మేకల తిరుపతన్నతో వీరు తరచూ సంభాషించినట్లు గుర్తించారు. 2022 అక్టోబర్‌లో జరిగిన మునుగోడు ఉప ఎన్నిక, గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో వీరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, సందేశాలను ఇటీవల పోలీసులు వెలికితీశారు. ఈ నేతలతో తిరుపతన్న నిత్యం టచ్‌లో ఉంటూ, ప్రత్యర్థి పార్టీల్లో క్రియాశీలకంగా ఉన్న నాయకుల ఫోన్లను ట్యాప్ చేసి వారి కదలికలపై నిఘా పెట్టినట్లు గుర్తించారు. ఎన్నికల కోసం ప్రత్యర్థి పార్టీల నేతలు తరలించిన నగదును ఫోన్ ట్యాపింగ్ ద్వారానే తెలుసుకొని స్వాధీనం చేసుకున్నట్లు తేల్చారు.

రేపు విచారణకు చిరుమర్తి

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈ నెల 9న నోటీసు అందుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య.. ఈ కేసులో విచారణ అధికారిగా వ్యవహరిస్తున్న జూబ్లీహిల్స్ ఏసీపీ ఎదుట గురువారం మధ్యాహ్నం హాజరు కావాలని నిర్ణయించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తొలుత పోలీసులు, రెండో దఫాలో ఎమ్మెల్యేల ప్రమేయం వెలుగుచూసిన దృష్ట్యా మరింత లోతుగా దర్యాప్తు జరపటంపై పోలీసులు దృష్టి సారించినట్లు సమాచారం.

'సీతారామ' అంచనాలు మోపెడు!

- భారీగా పెరగనున్న ప్రాజెక్టు అంచనా వ్యయం... రూ.13,057 కోట్ల నుంచి రూ.19,800 కోట్లకు సవరణ ప్రతిపాదనలు
- పాలనా అనుమతులు కోరిన సీఈ

సాక్షి, హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల పథకం అంచనా వ్యయం మరింతగా పెంచేందుకు రంగం సిద్ధమైంది. 2016 ఫిబ్రవరి 18న రూ.7,926.14 కోట్ల అంచనా వ్యయంతో గత ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులు జారీ చేసింది. ఆ తర్వాత 2018 ఆగస్టు 2న రూ.13,057.98 కోట్లకు అంచనా వ్యయాన్ని పెంచింది. తాజాగా అంచనా వ్యయాన్ని రూ.19,800 కోట్లకు సవరిస్తూ పాలనాపర అనుమతులు జారీ చేయాలని ప్రాజెక్టు నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న కొత్తగూడెం చీఫ్ ఇంజనీర్ ఎ.శ్రీనివాస్ రెడ్డి నీటిపారుదల శాఖకు ప్రతిపాదనలు సమర్పించారు. సరైన అనుమతులు లేకుండానే ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం, ఇతర పనులకు నీటిపారుదల శాఖ ఇటీవల రూ.1,842 కోట్ల అంచనాతో టెండర్లను ఆహ్వానించడంపై ఇటీవల అధికారుల మధ్య వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టెండర్లను ఆహ్వానించిన అనంతరం పాలనాపర అనుమతులు కోరుతూ ప్రతిపాదనలను సమర్పించడం గమనార్హం.

16 ప్యాకేజీలుగా కాల్వల పనులు

3,28,853 ఎకరాల కొత్త ఆయకట్టు, 3,45,534 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించడానికి సీతారామ ప్రాజెక్టును చేపట్టారు. ప్రాజెక్టులో భాగమైన పంప్‌హౌస్‌ల నిర్మాణం, ఇతర ప్రధాన పనులు పూర్తికాగా, డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణం జరగాల్సి ఉంది. ప్రాధాన్యత ప్రాజెక్టుల జాబితాలో సీతారామను చేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సత్వరంగా డిస్ట్రిబ్యూటరీల పనుల పూర్తికి ఆదేశించింది. ప్రాజెక్టు కాల్వల పనులను 16 ప్యాకేజీలుగా విభజించగా, 1-8 ప్యాకేజీల కింద ప్రధాన కాల్వ, 9-12 ప్యాకేజీలుగా సత్తుపల్లి ట్రంక్ కాల్వ, 13-16 ప్యాకేజీలుగా పాలేరు లింక్ కాల్వ పనులను చేర్చారు. ఇక డిస్ట్రిబ్యూటరీల పనులను మరో 8 ప్యాకేజీలుగా విభజించి రూ.3,858.93 కోట్ల అంచనాలతో అనుమతుల కోసం ప్రతిపాదనలను సమర్పించారు. గతంలో నిర్వహించిన ఓ సమీక్షలో డిస్ట్రిబ్యూటరీల



పనులకు తక్షణమే టెండర్లను జరపాలని ప్రభుత్వం ఆదేశించడంతో రూ.1,842 కోట్ల అంచనాలతో కొత్తగూడెం సీఈ టెండర్లను ఆహ్వానించారు. అందులో కేవలం రూ.768 కోట్లకే పరిపాలన అనుమతి ఉండగా, రూ.1,074 కోట్ల పనులకు అనుమతి లేకపోవడం వివాదంగా మారింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన ఓ సమీక్షలో ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్, సీఈ ఎ.శ్రీనివాస్ రెడ్డి ఘర్షణకు దిగి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో ప్రభుత్వం వారిద్దరిని మందలించి సంజాయిషీ కోరింది. దీంతో కొత్తగూడెం సీఈ శ్రీనివాస్ రెడ్డి ఎట్టకేలకు పాలనాపర అనుమతుల కోసం తాజాగా ప్రతిపాదనలు సమర్పించడం గమనార్హం. ప్రామాణిక ధరల పట్టిక 2024-25 ఆధారంగా అంచనాలను రూ.19,800 కోట్లకు పెంచాలని ఆయన కోరారు. స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ ఈ ప్రతిపాదనలను పరిశీలించి అనుమతుల కోసం సిఫారసు చేయాలా? వద్దా? అని నిర్ణయం తీసుకోనుంది.



ముద్దగా అయిన అన్నం చూపుతున్న విద్యార్థులు

ముద్ద అన్నం.. తింటే కడుపు నొస్తోంది

- తిమ్మాపూర్ 'గురుకులం'లో ఆకలికేకలు

తిమ్మాపూర్: 'వారం రోజులుగా హాస్టళ్లలో అన్నం నాసిరకంగా ఉంటోంది. ముద్దలు ముద్దలుగా ఉండటంతో పాటు వాసన వస్తోంది. తినలేకపోతున్నాం. ఆకలవుతోందని తింటే కడుపునొస్తోంది. దీంతో చాలా మంది విద్యార్థులు ఆస్పత్రి పాలవుతున్నారు. హాస్టల్ అధికారులు విషయాన్ని బయటకు తెలియనివ్వడం లేదు. మేము అధికారులకు ఫిర్యాదు చేస్తే ఎవరూ పట్టించుకోవడం లేదు. వారంరోజులుగా కడుపునిండా తిండిలేక నీరసించిపోతున్నాం' అంటూ కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీ మహాత్మా జ్యోతిబాపూలే బాలుర పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తల్లిదండ్రులతో కలిసి ఆందోళనకు దిగారు.

బియ్యంలో కల్తీ లేదు: ప్రిన్సిపాల్

రామకృష్ణ కాలనీలోని జ్యోతిబాపూలే బాలుర గురుకులంలో 450 మంది విద్యార్థులు ఉన్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచే గురుకుల భోజనం చార్జీలను ప్రభుత్వం 40 శాతం పెంచింది. తక్షణం అమల్లోకి వస్తుందని ప్రకటించింది. అయినా అధికారులు మెనూ మార్చకపోగా, నాసిరకంగా అన్నం పెట్టడంపై విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారానికి రెండుసార్లు మాంసాహారం పెట్టాల్సి ఉండగా సరిగ్గా పెట్టడం లేదని, కోడిగుడ్లు వారానికి రెండు మూడే ఇస్తున్నారని తెలిపారు. వారం రోజులుగా ఓపిక పట్టిన విద్యార్థులు మంగళవారం తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ప్రిన్సిపాల్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ భోజనం ఎలా తినాలని నిలదీశారు. మీ పిల్లలకు ఇలాగే పెడుతున్నారా అని ప్రశ్నించారు. సివిల్ సప్లయ్ అధికారులు నాసిరకం బియ్యం పంపుతున్నారని, దాంతో మెత్తగా అవుతోందని, బియ్యంలో ఎలాంటి కల్తీ లేదని, కావాలనే కొంతమంది ఆరోపణలు చేస్తున్నారని ప్రిన్సిపాల్ వెంకటరమణ తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న గురుకులంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే.. మిగతా వాటి పరిస్థితి ఏంటని విద్యార్థి సంఘ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

పనికెళ్లి తిరిగొస్తుండగా..

కారు ఢీకొని ఇద్దరు మహిళల దుర్మరణం; మరో ఇద్దరికి గాయాలు



కుక్క అమృత(ఫైల్) | కుక్క భాగ్య(ఫైల్)

పెద్దపల్లి రూరల్: కూలీ పనులు చేస్తూ పొట్టపోసుకునే ఇద్దరు అభాగ్యులను కారు రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రంగంపల్లి శివారులో మంగళవారం వేకువజామున ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రంగంపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌కు సోమవారం రాత్రి ఓ విందు పనికి వెళ్లిన కుక్క భాగ్య (46), కుక్క అమృత (48), కుక్క పద్మ, కుక్క కాంత పని ముగించుకుని మంగళవారం వేకువజామున తమ ఇళ్లకు బయలుదేరారు. కాలినడకన రాజీవ్ రహదారి పక్కనుంచి వస్తుండగా వేగంగా వచ్చిన కారు వారిని ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భాగ్య, అమృత ఘటనా స్థలంలోనే చనిపోయారు. తీవ్రంగా గాయపడిన పద్మ పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. కాంత గాయాలతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వీరంతా పెద్దపల్లి ఉదయ్‌నగర్‌కు చెందిన పాలెవాళ్లుగా పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భాగ్యకు నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. వారిలో ముగ్గురికి వివాహమవగా, దివ్యాంగురాలైన మరో కూతురు నవ్య ఇంటి వద్దే ఉంటోంది. భర్త కనకయ్య హమాలీగా పనిచేస్తున్నాడు. అమృత భర్త నర్సయ్య కూడా హమాలీగా పనిచేస్తున్నాడు. వారికి ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై లక్ష్మణ్‌కుమార్ సందర్శించారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని ఆత్మహత్యపై హెచ్‌ఆర్సీలో ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: బాసర ట్రిపుల్ ఐటీలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతూ స్వాతిప్రియ అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై విచారణ జరపాలని రాష్ట్ర మానవ హక్కుల సంఘం (హెచ్‌ఆర్సీ)లో న్యాయవాది రేవంత్ ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి మృతికి కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. వర్సిటీలో తరచూ విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతూ అనుమానాస్పదంగా మృతి చెందుతున్న సంఘటనలను సుమోటోగా విచారణకు స్వీకరించాలని కోరారు.

ప్రాంతాల పోరులో... పైచేయి ఎవరిదో!

ఆసక్తికరంగా జార్ఖండ్ అసెంబ్లీ పోరు ● జేఎంఎం కంచుకోటలుగా కొల్హాన్, సంథాల్

నార్త్ చోటానాగపూర్, పాలములో బీజేపీ హవా ● సౌత్ చోటానాగపూర్‌లో ఇరు కూటముల కొట్లాట



రాజకీయ అస్థిరతకు మారుపేరైన జార్ఖండ్ మరోసారి అసెంబ్లీ ఎన్నికల పోరుకు సిద్ధమైంది. ప్రజాకర్షక పథకాల సాయంతో అధికారాన్ని నిలబెట్టుకోవాలని జేఎంఎం సారథ్యంలోని ఇండియా కూటమి ఆశపడుతోంది. జనాభాలో మెజారిటీ అయిన గిరిజనులతో పాటు ముస్లిం మైనారిటీల్లో సీఎం హేమంత్ సోరెన్‌కు ఉన్న ఆదరణ గట్టెక్కిస్తుందని నమ్ముతోంది. ఎన్డీఏ సారథి బీజేపీ మాత్రం ఐదేళ్లనాడు చేజారిన అధికారాన్ని ఎలాగైనా ఒడిసిపట్టాలని ఉవ్విళ్లూరుతోంది. హేమంత్ తదితరుల అవినీతినే ప్రధానాస్త్రంగా చేసుకుంది. గత ఎన్నికల్లో ముఖం చాటేసిన గిరిజనులను ప్రసన్నం చేసుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తోంది. వలసలు తదితరాలను ప్రస్తావిస్తూ వారిని ఆకట్టుకునే పనిలో పడింది. 81 అసెంబ్లీ స్థానాల్లో 43 సీట్లకు బుధవారం తొలి విడతలో పోలింగ్ జరగనుంది. మిగతా 38 స్థానాలకు నవంబర్ 20న పోలింగ్ జరుగుతుంది. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అంశాలెన్ని ఉన్నా జనాభాలో 35 శాతంగా ఉన్న గిరిజనులే మరోసారి ఫలితాన్ని నిర్దేశించనున్నారు. ప్రాంతాలవారీగా చూస్తే గిరిజనులు ఏకంగా 60 శాతముండే కొల్హాన్, సంథాల్ పరగణాల్లో జేఎంఎంకు తిరుగులేని పట్టుంది. 25 అసెంబ్లీ స్థానాలున్న కీలకమైన నార్త్ చోటానాగపూర్‌తో పాటు ఎస్సీ ప్రాబల్య పాలము ప్రాంతంపై బీజేపీ ఆధిపత్యం సాగుతోంది. ఐదో ప్రాంతమైన సౌత్ చోటానాగపూర్‌లో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఇరు కూటములు పోటాపోటీగా తలపడ్డాయి.

సంథాల్ పరగణా

అత్యంత వెనకబడ్డ జిల్లాలున్న ఈ ప్రాంతం ఇటు బిహార్, అటు పశ్చిమబెంగాల్‌తో సరిహద్దులు పంచుకుంటుంది. ఇక్కడి 18 అసెంబ్లీ స్థానాల్లో ఏడు ఎస్టీ, ఒకటి ఎస్సీ రిజర్వుడు సీట్లు. ఎస్సీలు 8 శాతముంటే ఎస్టీలు 28, ముస్లింలు 23 శాతమున్నారు.

2019 అసెంబ్లీ ఎన్నికల్లో: ఇండియా కూటమి ఏకంగా 13 స్థానాలు గెలుచుకోగా బీజేపీకి 5 మాత్రమే దక్కాయి.

లోక్‌సభ ఎన్నికల్లో: 10 అసెంబ్లీ స్థానాల పరిధిలో ఇండియా కూటమి ఆధిపత్యం సాగగా 8 బీజేపీని ఆదరించాయి.

కొల్హాన్

ఒడిశా, పశ్చిమబెంగాల్‌తో సరిహద్దులు పంచుకునే ఈ ప్రాంతంలో 14 అసెంబ్లీ స్థానాలున్నాయి. వాటిలో ఒక ఎస్సీ, 9 ఎస్టీ స్థానాలున్నాయి. ఇక్కడ ఎస్టీలు ఏకంగా 42 శాతం కాగా ఎస్సీలు కేవలం 5 శాతమే ఉంటారు. ముస్లింలు 6 శాతమున్నారు. ఈసారి అధికారం దక్కాలంటే నార్త్ చోటానాగ్‌పూర్‌లో ఆదరణను నిలబెట్టుకుంటూ సంతాల్, కొల్హాన్ ప్రాంతాల్లో పాగా వేయడం ఆ పార్టీకి తప్పనిసరి. ఇందుకోసం ఇటీవలే జేఎంఎం నుంచి వచ్చిన మాజీ సీఎం చంపయ్ సోరెన్‌పై బీజేపీ ఆశలు పెట్టుకుంది. అక్రమ వలసల అంశం ఈ ప్రాంతంలో తమకు బాగా కలిసొస్తుందని అంచనా వేస్తోంది.

2019 అసెంబ్లీ ఎన్నికల్లో: ఇండియా కూటమికి 13 స్థానాలు దక్కగా బీజేపీ పూర్తిగా చతికిలపడింది

లోక్‌సభ ఎన్నికల్లో: ఏకంగా 8 అసెంబ్లీ స్థానాల పరిధిలో బీజేపీకి ఆదరణ దక్కింది.

పాలము

ఇటు బిహార్, అటు ఛత్తీస్‌గఢ్‌తో సరిహద్దులున్న ప్రాంతం. 9 అసెంబ్లీ స్థానాల్లో రెండు ఎస్సీ, ఒక ఎస్టీ సీట్లున్నాయి. 25 శాతం ఎస్సీలుండటం బీజేపీకి కలిసొచ్చే అంశం.

2019 అసెంబ్లీ ఎన్నికల్లో: ఇండియా కూటమికి ఐదు సీట్లు దక్కగా బీజేపీ మూడింటితో సరిపెట్టుకుంది.

లోక్‌సభ ఎన్నికల్లో: ఏకంగా 8 అసెంబ్లీ సీట్ల పరిధిలో బీజేపీ ఆధిపత్యమే సాగింది.

నార్త్ చోటానాగ్‌పూర్

25 అసెంబ్లీ స్థానాలున్న అతి కీలక ప్రాంతం. బిహార్, పశ్చిమబెంగాల్‌తో సరిహద్దులున్నాయి. ఈ ప్రాంతంలో ఒక్క ఎస్టీ రిజర్వుడు స్థానం కూడా లేకపోవడం విశేషం. ఇక్కడ బిహార్ తదితర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వాళ్లు ఎక్కువ. 17 శాతం ఎస్సీలు, 16 శాతం ముస్లింలుంటే ఎస్టీలు కేవలం 9 శాతమే ఉన్నారు.

2019 అసెంబ్లీ ఎన్నికల్లో: బీజేపీ 10, ఇండియా కూటమి 11 సీట్లు గెలుచుకున్నాయి.

లోక్‌సభ ఎన్నికల్లో: ఏకంగా 24 అసెంబ్లీ స్థానాల పరిధిలో బీజేపీ హవాయే సాగింది. ఈ పరిణామం కమలనాథుల్లో హుషారు పెంచింది.

సౌత్ చోటానాగ్‌పూర్

ఛత్తీస్‌గఢ్, ఒడిశాలతో సరిహద్దులున్న ఈ ప్రాంతం 15 అసెంబ్లీ స్థానాలకు నిలయం. 11 ఎస్టీ, ఒకే ఒక్క ఎస్సీ స్థానమున్నాయి. ఇక్కడ ఎస్టీలు ఏకంగా 51 శాతముంటారు. ముస్లింలు 11 శాతం కాగా ఎస్సీలు కేవలం 5 శాతమున్నారు.

2019 అసెంబ్లీ ఎన్నికల్లో: ఇండియా కూటమి 8, బీజేపీ ఐదు సీట్లు గెలుచుకున్నాయి.

లోక్‌సభ ఎన్నికల్లో: బీజేపీకి ఎదురుగాలి వీచింది. ఆ పార్టీ 4 అసెంబ్లీ స్థానాల పరిధిలోనే మెరుగైన ప్రదర్శన చేసింది. మిగతా 11 చోట్లా ఇండియా కూటమి హవాయే సాగింది.

\- సాక్షి, నేషనల్ డెస్క్

67 శాతం రెడ్ అలర్ట్ స్థానాలే!

● 174 మందిపై కేసులు
● 235 మంది కోటీశ్వరులు

సాక్షి, న్యూఢిల్లీ: జార్ఖండ్‌లో బుధవారం తొలి దశలో పోలింగ్ జరగనున్న 43 అసెంబ్లీ స్థానాల్లో 29 రెడ్ అలర్ట్ నియోజకవర్గాలున్నాయి! బరిలోని అభ్యర్థుల్లో ముగ్గురు, అంతకంటే ఎక్కువ మందిపై క్రిమినల్ కేసులుంటే వాటిని రెడ్ అలర్ట్ స్థానాలుగా పరిగణిస్తారు. ఇక 174 (26%) మందిపై క్రిమినల్ కేసులున్నట్టు జార్ఖండ్ ఎలక్షన్ వాచ్, అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫారమ్స్ (ఏడీఆర్) వెల్లడించాయి. వీరిలో ఇందులో 127 (19%) మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులున్నాయి. బీజేపీకి చెందిన 36 మంది అభ్యర్థుల్లో 20 మంది (56%), 17 మంది కాంగ్రెస్ అభ్యర్థుల్లో 11 మంది (65%), 23 మంది జేఎంఎం అభ్యర్థుల్లో 11 (48%) మందిపై క్రిమినల్ కేసులున్నాయి. 11 మందిపై మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులున్నాయి. అభ్యర్థుల్లో 235 మంది (34%) కోటీశ్వరులు. బీజేపీలో 30 మంది (83%), కాంగ్రెస్‌లో 18 మంది (78%) కోటీశ్వరులున్నారు.



మిస్ టీన్ యూనివర్స్‌గా తృష్ణా రే

ఒడిశా యువతి తృష్ణా రే 'మిస్ టీన్ యూనివర్స్–2024' కిరీటం గెలుచుకుంది. దక్షిణాఫ్రికాలోని కింబర్లీ నగరంలో ఈ నెల 1 నుంచి 9వ తేదీ దాకా జరిగిన మిస్ టీన్ యూనివర్స్ పోటీలో విజేతగా నిలిచింది. పెరూ, దక్షిణాఫ్రికా, బ్రెజిల్, కెన్యా, పోర్చుగల్, నెదర్లాండ్స్ తదితర దేశాల నుంచి 10 మంది ఫైనల్‌కు చేరుకోగా, ఇండియా నుంచి ప్రాతినిధ్యం వహించిన 19 ఏళ్ల తృష్ణా రే వారందరినీ వెనక్కి నెట్టి అందాల సుందరి కిరీటం సొంతం చేసుకుంది. పెరూ దేశానికి చెందిన అన్నే థార్సెన్ మొదటి రన్నరప్‌గా, నమీబియాకు చెందిన ఆంద్రి రెండో రన్నరప్‌గా నిలిచారు. కల్నల్ దిలీప్ కుమార్ రే, రాజశ్రీ రే దంపతుల కుమార్తె అయిన తృష్ణా రే ప్రస్తుతం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని కేఐఐటీ యూనివర్సిటీలో ఫ్యాషన్ టెక్నాలజీ చదువుతోంది.

\- న్యూఢిల్లీ

జనంపైకి దూసుకెళ్లిన కారు

35 మంది మృతి, 43 మందికి గాయాలు

బీజింగ్: జనంపైకి కారు దూసుకెళ్లిన ఘటనలో 35 మంది చనిపోగా 43 మంది గాయపడ్డారు. ఈ దుర్ఘటన చైనా రాజధాని బీజింగ్‌కు 2,200 కిలోమీటర్ల దూరంలోని జుహైలో సోమవారం చోటుచేసుకుంది. ఫాన్ అనే 62 ఏళ్ల వ్యక్తి సోమవారం రాత్రి 7.48 గంటల సమయంలో నగరంలోని స్పోర్ట్స్ సెంటర్‌లో వ్యాయామం చేస్తున్న వారిపైకి కారును వేగంగా నడిపాడు. ఘటన జరిగిన వెంటనే అధికారులు ఫాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా లేదా కావాలని చేసిందా తెలియాల్సి ఉంది. దోషికి కఠిన శిక్ష పడేలా చూడాలని అధికారులను అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆదేశించారు. ఘటనకు సంబంధించిన సమాచారమేదీ చైనా సామాజిక మాధ్యమా ల్లో కనిపించడంలేదు.

జార్ఖండ్ తొలి దశకు సర్వం సిద్ధం

43 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరగనున్న పోలింగ్

రాంచీ: జార్ఖండ్ శాసనసభ ఎన్నికల తొలి విడత పోలింగ్ నిర్వహణకు ఎన్నికల అధికారులు సర్వం సిద్ధంచేశారు. బుధవారం తొలి దశలో 43 నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనుంది. సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర సాయుధ పోలీసు బలగాలను మోహరించారు. తొలిదశ పోలింగ్ జరుగుతున్న 43 స్థానాల్లో 17 జనరల్, 20 ఎస్టీ రిజర్వ్, ఆరు ఎస్సీ రిజర్వ్ స్థానాలున్నాయి. మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి, బీజేపీ నేత చంపయి సోరెన్ పోటీ చేస్తున్న సెరాయ్‌కెల్లా నియోజకవర్గంలోనూ బుధవారమే పోలింగ్ జరుగుతోంది. కాంగ్రెస్ నేత అజయ్‌కుమార్ జంషెడ్‌పూర్ ఈస్ట్ నుంచి బరిలో దిగారు. ఇక్కడ జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఒడిశా గవర్నర్ రఘుబర్‌దాస్ కోడలు పూర్ణిమా సాహూ పోటీచేస్తున్నారు. జంషెడ్‌పూర్‌లో మాజీ ముఖ్యమంత్రి మధు కోడా సతీమణి గీత బీజేపీ తరఫున బరిలో దిగారు. ఇక్కడ కాంగ్రెస్ నేత సోనారాం సింకూ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. జంషెడ్‌పూర్ వెస్ట్ నుంచి కాంగ్రెస్ నేత, ఆరోగ్య మంత్రి బన్నా గుప్తా పోటీచేస్తున్నారు. ఈయనపై జేడీయూ నేత సరయూరాయ్ బరిలోకి దిగారు. సరయూరాయ్ 2019లో నాటి ముఖ్యమంత్రి రఘుబర్‌దాస్‌నే ఓడించడం విశేషం. రాంచీలో ఈసారి జేఎంఎం ప్రస్తుత రాజ్యసభ సభ్యులైన మహువా మాఝీని రంగంలోకి దింపింది. ఐదవ జార్ఖండ్ శాసనసభ కాలపరిమితి వచ్చే ఏడాది జనవరి ఐదో తేదీన ముగియనున్న నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మిగతా 38 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 20న రెండో విడతలో పోలింగ్ జరగనుంది. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు.

10 రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు

బుధవారమే 10 రాష్ట్రాల్లోని 31 అసెంబ్లీ స్థానాలకు, కేరళలో వయనాడ్ లోక్‌సభ స్థానానికీ ఉప ఎన్నికలు జరగనున్నాయి. రెండుచోట్ల పోటీచేసి గెలిచిన రాహుల్‌గాంధీ వయనాడ్‌లో రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. కాంగ్రెస్ నుంచి ప్రియాంకా గాంధీ వాద్రా తొలిసారి ప్రత్యక్ష ఎన్నికలను ఎదుర్కొంటున్నారు. ఆమెపై ఎల్‌డీఎఫ్ నుంచి సత్యాన్ మోకేరీ, బీజేపీ తరఫున నవ్య హరిదాస్ నిలబడ్డారు. ఇక 31 ఎమ్మెల్యే స్థానాల్లో రాజస్తాన్‌లో 7, పశ్చిమబెంగాల్‌లో 6, అస్సాంలో 5, బిహార్‌లో 4, కర్నాటకలో 3 మధ్యప్రదేశ్‌లో 2, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, కేరళ, మేఘాలయాల్లో ఒక్కో స్థానం ఉన్నాయి.

అత్యవసర కేసులపై మౌఖిక విజ్ఞప్తులకు నో

సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పష్టీకరణ

న్యూఢిల్లీ: అత్యవసరంగా విచారించాల్సిన కేసుల జాబితాలలో చేర్చడం లేదా కేసులను అత్యవసరంగా విచారణ చేపట్టడంపై న్యాయవాదుల నుంచి మౌఖిక విజ్ఞప్తులను ఇకపై అనుమతించబోమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా మంగళవారం స్పష్టంచేశారు. కేవలం నోటిమాటతో చెబితే సరిపోదని తేల్చిచెప్పారు. ఇలాంటి వినతుల కోసం ఈ–మెయిల్స్ లేదా లిఖితపూర్వక లేఖలు పంపాలని లాయర్లకు సూచించారు. ఆయా కేసులను ఎందుకు అత్యవసరంగా విచారణకు స్వీకరించాలో చెబుతూ కారణాలు వెల్లడించాలని అన్నారు. నూతన సీజేఐగా సోమవారం బాధ్యతలు చేపట్టిన జస్టిస్ సంజీవ్ ఖన్నా న్యాయ వ్యవస్థల్లో సంస్కరణలకు పెద్దపీట వేయాలని యోచిస్తున్నారు. మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహిస్తామని తెలిపారు.



క్షిపణి ప్రయోగం విజయవంతం

మంగళవారం ఒడిశా తీరంలోని చాందీపూర్ ప్రయోగశాల నుంచి విజయవంతంగా దూసుకెళ్తున్న లాంగ్ రేంజ్ లాండ్ అటాక్ క్రూయిజ్ మిసైల్ (ఎల్‌ఆర్‌ఎల్‌ఏసీఎం). సైంటిస్టులతో పాటు త్రివిధ దళాల ఉన్నతాధికారులు దీన్ని వీక్షించారు. ప్రయోగ సందర్భంగా క్షిపణిలోని అన్ని వ్యవస్థలూ అద్భుత పనితీరు కనబరిచినట్టు రక్షణ శాఖ ప్రకటించింది. క్షిపణి పూర్తి కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించినట్టు వెల్లడించింది. పనితీరును మెరుగుపరిచే అత్యాధునిక వైమానిక, సాఫ్ట్‌వేర్ వ్యవస్థలు దీని సొంతం. డీఆర్‌డీఓతో కలిసి ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (బెంగళూరు) ఈ క్షిపణిని తయారు చేసింది. బీఈఎల్ తదితర సంస్థలు కూడా ఇందులో భాగం పంచుకున్నాయి. వాహనాల నుంచి కూడా ప్రయోగించగలగడం ఈ క్షిపణి ప్రత్యేకత. ప్రయోగాన్ని విజయవంతం చేసిన సైంటిస్టులను రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభినందించారు.

\- న్యూఢిల్లీ

అభివృద్ధికి బ్రేకులు వేయడంలో పీహెచ్‌డీ

● ప్రతిపక్షాలపై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం
● కాంగ్రెస్ రిజర్వేషన్ల వ్యతిరేక పార్టీ అని ధ్వజం
● మహారాష్ట్రలో మోదీ ఎన్నికల ప్రచారం

చంద్రాపూర్/షోలాపూర్: మహారాష్ట్రలో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)పై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. ఆ కూటమిలో ఉన్న పార్టీలన్నీ అవినీతికి మారుపేరు అని మండిపడ్డారు. అవినీతి పార్టీలు జట్టుకట్టాయని అన్నారు. అభివృద్ధికి బ్రేకులు వేయడంలో ఎంవీఏ పార్టీలు పీహెచ్‌డీ చేశాయని, కాంగ్రెస్ పార్టీ డబుల్ పీహెచ్‌డీ చేసిందని ధ్వజమెత్తారు. మంగళవారం చంద్రాపూర్, షోలాపూర్‌లో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ మాట్లాడారు. అభివృద్ధి చేయడం చేతకాని పార్టీలకు అభివృద్ధిని అడ్డుకోవడం మాత్రమే తెలుసని విమర్శించారు. చంద్రాపూర్ ప్రజలు రైలు మార్గం కావాలని దశాబ్దాలుగా కోరుతున్నారని, కాంగ్రెస్ కూటమి ఆ ప్రయత్నం నెరవేరనివ్వలేదని అన్నారు. మహాయుతి పాలనలో మహారాష్ట్రలో ప్రతిపక్షాలకు అందనంత వేగంతో అభివృద్ధి జరుగుతోందని వివరించారు. మరో ఐదేళ్లపాటు ఇదే వేగంతో ప్రగతి కొనసాగిస్తామని, అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమికి అధికారం అప్పగించాలని కోరారు. బీజేపీ మేనిఫెస్టో 'మహారాష్ట్ర వికాస్ కీ గ్యారంటీ'గా మారడం ఖాయమన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అంటే అర్థం డబుల్ స్పీడ్ డెవలప్‌మెంట్ అని వివరించారు. ప్రధాని మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...

బడుగులను కాంగ్రెస్ ఎదగనివ్వలేదు

''దేశాన్ని పాలించడానికే జన్మించామని కాంగ్రెస్ రాజకుటుంబం భావిస్తోంది. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలను కాంగ్రెస్ పైకి ఎదగనివ్వలేదు. రిజర్వేషన్ల గురించి మాట్లాడితే ఆ పార్టీకి చిరాకు పుడుతోంది. దళితులు, గిరిజనులు, బీసీలు అనుభవిస్తున్న ప్రత్యేక హక్కులను ప్రశ్నిస్తూ 1980వ దశకంలో రాజీవ్‌గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రకటనలు ఇచ్చింది. ఆ పాత ప్రకటనలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ రిజర్వేషన్ వ్యతిరేక వైఖరిని వీటిని బట్టి అర్థం చేసుకోవచ్చు. సమాజాన్ని కులాల పేరిట ముక్కలు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రమాదకరమైన ఆట ఆడుతోంది. ఒకవేళ గిరిజనులను కులాల వారీగా విడదీస్తే వారి గుర్తింపు, బలం కనుమరుగవుతాయి.



సీఎం సీటు కోసం పోటీ

విపక్ష మహా వికాస్ అఘాడీలో డ్రైవర్ సీటు కోసం అంతర్గత యుద్ధం కొనసాగుతోంది. అక్కడ జరుగుతున్న తొక్కిసలాటను మీరు చూడొచ్చు. కూటమి నేతలంతా ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ పడుతున్నారు. టగ్–ఆఫ్–వార్ నడుస్తోంది. ముఖ్యమంత్రి అభ్యర్థి పేర్లను ప్రకటించడంలో ఓ పార్టీ రోజంతా బిజీగా ఉంటోంది. కాంగ్రెస్ ప్రయత్నాలను కొట్టిపారేయడంలో మరో పార్టీ బిజీగా గడుపుతోంది. పదవుల కోసం కొట్టుకొనే ఇలాంటి నాయకులు స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలరా? మహారాష్ట్ర ప్రజలకు సుస్థిర ప్రభుత్వాన్ని అందించే సత్తా మహాయుతికి మాత్రమే ఉంది. అభివృద్ధి కొనసాగాలంటే స్థిరమైన ప్రభుత్వం ఉండాలి'' అని ప్రధాని మోదీ తేల్చిచెప్పారు.



వయనాడ్ అడ్వెంచర్ పార్కులో రాహుల్ సాహసం

రాజ్యాంగం అంతానికి కుట్రలు

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ ఆగ్రహం

గోండియా/న్యూఢిల్లీ: మన దేశ రాజ్యాంగాన్ని అంతం చేసేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ తోపాటు ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిరోజూ 24 గంటలూ పని చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగాన్ని చదవలేదని తాను గ్యారంటీగా చెప్పగలనని అన్నారు. ఒకవేళ నిజంగా ఆయన చదివి ఉంటే రాజ్యాంగంలో రాసి ఉన్న అంశాలను తప్పనిసరిగా గౌరవించేవారని పేర్కొన్నారు. ఐక్యత, సమానత్వం, అన్ని మతాల పట్ల గౌరవాన్ని రాజ్యాంగం బోధిస్తోందని గుర్తుచేశారు. విద్వేషం, అణచివేత, అసమానత్వాన్ని వ్యతిరేకిస్తోందని తెలిపారు. మంగళవారం మహారాష్ట్రలోని గోండియాలో ఎన్నికల ప్రచార సభలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. పదేళ్లలో ఎంతమంది రైతుల రుణాలను మాఫీ చేశారో ప్రధానిని ప్రశ్నించాలని ప్రజలను కోరారు. ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చివేయడం రాజ్యాంగబద్ధమేనా? అని నిలదీశారు. రాజ్యాంగాన్ని బలహీనపర్చడం బీజేపీకి అలవాటేనని మండిపడ్డారు.

అత్యున్నత పర్యాటక కేంద్రంగా వయనాడ్

కేరళలోని వయనాడ్‌ను అత్యున్నత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని తాను, తన సోదరి ప్రియాంకాగాంధీ వాద్రా సంకల్పించామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక వీడియోను తన యూట్యూబ్ ఖాతాలో విడుదల చేశారు. సోమవారం ప్రియాంకతో కలిసి వయనాడ్ అడ్వెంచర్ పార్కును సందర్శించిన దృశ్యాలను పంచుకున్నారు. ఇటీవల ప్రకృతి విపత్తుల కారణంగా తీవ్రంగా నష్టపోయినప్పటికీ వయనాడ్ ప్రజల్లో ఆత్మస్థైర్యం తగ్గిపోలేదని, వారిని చూసి స్ఫూర్తిని పొందామని పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రియాంక పోటీ చేస్తున్న వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నిక బుధవారం జరగనున్న సంగతి తెలిసిందే.

తల్లి, సోదరిని రజాకార్లు చంపేసినా

ముస్లిం ఓట్ల కోసం ఖర్గే మౌనం: యోగి

అమరావతి: ''కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే తల్లి, సోదరి నిజాం హయాంలో రజాకార్ల దాడిలో చనిపోయారు. అయినా ముస్లింల ఓట్లు పోతాయనే భయంతో ఆయన మౌనంగా ఉంటున్నారు'' అని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. ఖర్గే సొంతూరు వరవట్టిని రజాకార్లు భస్మీపటలం చేశారన్నారు. అయినా రాజకీయ ప్రయోజనాల కోసం తన బాధాకరమైన వ్యక్తిగత జ్ఞాపకాలను ఖర్గే అణచి వేస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్రలోని అమరావతిలో మంగళవారం బీజేపీ ఎన్నికల ర్యాలీలో యోగి ప్రసంగించారు. తన కాషాయ వస్త్రధారణ తదితరాలపై ఖర్గే విమర్శలకు ఆయన తిప్పికొట్టారు. గత అఘాయిత్యాలను ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ మరుగున పెడుతోందన్నారు. 1946లో ముస్లింలీగ్‌తో సయోధ్య కుదుర్చుకున్న కాంగ్రెస్ దేశ విభజనకు, హిందువుల ఊచకోతకు కారణమైందన్నారు. ''స్వాతంత్య్ర ఉద్యమాన్ని గమనించిన నిజాం ఇకపై స్వతంత్రంగా ఉండటం వీలు కాదని గ్రహించే, హిందువులపై దారుణాలకు తెగించాడు. నైజాం ప్రాంత హిందువులను మహారాష్ట్రకు వచ్చి ప్రాణాలు కాపాడు కోవాల్సిందిగా అంబేడ్కర్ సూచించారు'' అని చెప్పారు. ప్రజల మధ్య విభేదాలు ప్రమాదకరమని యోగి అన్నారు. ''ఒక్కటిగా లేకుంటే ఉంటే మీ కుమార్తెలకు భద్రత ఉండదు. ఆలయాలపై దాడులు జరుగుతాయి'' అన్నారు.

అమెరికా విదేశాంగ మంత్రిగా రూబియో

● జాతీయ భద్రతా సలహాదారుగా మైక్ వాల్జ్
● ఇద్దరూ భారత్‌కు అనుకూలురే

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ కీలక పదవులకు ఎంపికలను వేగిరం చేశారు. విదేశాంగ మంత్రిగా ఫ్లోరిడా సెనేటర్ మార్కో రూబియో(53)ను, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) పదవికి కాంగ్రెస్ సభ్యుడు మైక్ వాల్జ్ (50)లను ఎంపిక చేశారు. రూబియో, వాల్జ్‌ల ఎంపికను ట్రంప్ రెండో హయాంలో భారత్– అమెరికాల మధ్య సన్నిహిత సంబంధాలకు కొనసాగింపుగా భావిస్తు న్నారు. భారత్‌కు మిత్రుడిగా పేరున్న రూబియో, భారత్–అమెరికా సంబంధాలను మెరుగుపర్చడంలో కీలకంగా ఉంటున్నారు. ట్రంప్‌కు నమ్మినబంటుగా పేరున్న వాల్జ్ భారత్‌కు పాత మిత్రుడే. భారతీయ అమెరికన్ల పక్షాన మాట్లాడే వాల్జ్, ఇండియా కంగ్రెషనల్ కాకస్‌కు సహాధ్యక్షుడిగా ఉండటం గమనార్హం. వీరిద్దరితోపాటు యునైటెడ్ స్టేట్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్టివ్ ఏజెన్సీ(ఈపీఏ) హెడ్‌గా కాంగ్రెస్ మాజీ సభ్యుడు లీ జెల్డిన్ పేరును ట్రంప్ ప్రకటించారు. అయితే తాజా ఎంపికలపై ట్రంప్ యంత్రాంగం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఇండియా కాకస్ హెడ్‌కు ఎన్ఎస్ఏ బాధ్యతలు

భారత్ కాకస్ కో–చైర్‌గా ఉన్న వాల్జ్ ఎన్ఎస్ఏ హోదాలో ట్రంప్ విధానాలకు అనుగుణంగా కఠిన విధానాలను తీసుకొస్తారని భావిస్తున్నారు. ఈ నియామకానికి సెనేట్ ఆమోదం అవసరం లేదు. అమెరికా ఆర్మీలో కల్నల్‌గా అఫ్గానిస్తాన్, పశ్చిమాసియా, ఆఫ్రికాల్లో పనిచేశారు. వీరోచితంగా పోరాడినందుకు ప్రతిష్టాత్మక గ్రీన్ బెరెట్ గౌరవం పొందారు. వాల్జ్ 2019 నుంచి అమెరికా కాంగ్రెస్ సభ్యుడిగా ఉన్నారు. ఆర్మ్‌డ్ సర్వీసెస్ కమిటీ చైర్మన్‌గా 2021లో అఫ్గానిస్తాన్ నుంచి అమెరికా సేనల ఉపసంహరణపై అధ్యక్షుడు జో బైడెన్‌ను నిలదీసి వార్తల్లో కెక్కారు. ప్రాంతీయ సుస్థిరత సాధనకు చైనాపై కఠిన వైఖరి, భారత్ వంటి ప్రజాస్వామిక దేశాలతో బలమైన పొత్తులు అవసరమన్నది ఈయన వాదన. 2023లో ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా క్యాపిటల్ హిల్ వద్ద ప్రసంగాన్ని ఏర్పాటు చేయడంలో ఈయన కీలక పాత్ర పోషించారు.



మార్కో రూబియో



మైక్ వాల్జ్

ఏమిటీ ఇండియా కాకస్..?

అమెరికా కాంగ్రెస్‌లో భాగమైన ఇండియా కాకస్ భారత్ అనుకూల విధానాల రూపకల్పనలో చురుగ్గా వ్యవహరిస్తుంది. భారత్–అమెరికా ఆర్థిక వ్యవస్థ, భద్రతలను ప్రభావితం చేస్తుంది. 2004లో అప్పటి సెనేటర్లు, విదేశాంగమంత్రి హిల్లరీ క్లింటన్, జాన్ కార్నిన్‌లు నెలకొల్పారు. ప్రస్తుతం 40 మంది సభ్యులున్న ఈ కమిటీ సెనేట్‌లో అతిపెద్ద కాకస్‌గా గుర్తింపు పొందింది.




ముక్కుపుటాలు అదరగొట్టే 'శవ' పుష్పం

చూట్టానికి బాగా ఎదిగిన మొలకలా కనిపిస్తోంది కదా. కానీ నిజానికి ఇదో పువ్వు! భారీ పరిమాణంతో పాటు ముక్కుపుటాలను అదరగొట్టే కుళ్లిన మాంసం తరహా కంపు వాసన దీని స్పెషాలిటీ. అందుకే దీన్ని కార్ప్స్ ఫ్లవర్ అని పిలుస్తారు. పదేళ్లకోసారి మాత్రమే పూయడం దీని మరో ప్రత్యేకత. పూసిన ఒకట్రెండు రోజుల్లో వాడిపోతుంది. తాజాగా ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరంలోని బొటానికల్ గార్డెన్‌లో ఇలా కనువిందు చేసింది. దీన్ని చూసేందుకు జనాలు తండోపతండాలుగా తరలివస్తున్నారు. దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుంటూనే ఆసక్తిగా పదేపదే వాసన చూసి మరీ వెళ్తున్నారు! అంతరిస్తున్న జాబితాలో ఉన్న ఈ పువ్వు శాస్త్రీయ నామం అమర్ఫోఫలస్ టైటానియం. టైటన్ ఆరమ్ అని కూడా పిలుస్తారు. దీన్ని అడిలైడ్ నుంచి 2021లో మెల్‌బోర్న్‌కు తరలించారు. అప్పటినుంచీ ఎప్పుడు వికసిస్తుందా అని ఎదురు చూస్తున్నట్టు సిబ్బంది చెప్పుకొచ్చారు.

\- మెల్‌బోర్న్

సాక్షి హైదరాబాద్

బుధవారం। 13। నవంబర్। 2024



భాగ్యనగరాన్ని.. కమ్మేస్తున్న 'క్లౌడ్స్'..
కరోనా అనంతరం నగరవాసుల ఆహారంలో మార్పులు వచ్చాయి. ముఖ్యంగా క్లౌడ్ కిచెన్. ఆన్‌లైన్‌లోనే ఫుడ్ ఆర్డర్ పెట్టేంతగా మార్పు వచ్చింది. - సిటీప్లస్‌లో



క్రేజీ 'క్యాండిల్ లైట్ కన్సర్ట్'
లైవ్ యువర్ సిటీ పేరుతో ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన 'క్యాండిల్ లైట్ కన్సర్ట్' నగరానికి వచ్చేసింది. 'ట్రిబ్యూట్ టు కోల్డ్ ప్లే' పేరుతో హైదరాబద్‌లోనూ జరగనుంది. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం 32.0/21.0

వాతావరణం
నగరంలో బుధవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్ఠంగా 32, కనిష్ఠంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

కుటుంబ వివరాలు నమోదు..



బంజారాహిల్స్: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తన కుటుంబ వివరాలను నమోదు చేసుకున్నారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 ఉప కమిషనర్ ప్రశాంతి స్థానిక ఎన్యుమరేటర్లతో కలిసి మేయర్ నివాసానికి వెళ్లారు. కుటుంబ సర్వేలో భాగంగా ప్రశ్నావళితో కూడిన దరఖాస్తును ఆమెకు అందజేశారు. తమ కుటుంబ వివరాలను మేయర్ భర్తీ చేసి ఎన్యుమరేటర్‌కు అందజేశారు.



ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత తన కుటుంబ వివరాలను ఎన్యుమరేటర్లకు అందజేశారు. ఎన్యుమరేటర్లు మంగళవారం బంజారాహిల్స్ రోడ్డు నంబర్–14లోని కవిత నివాసానికి వెళ్లి వివరాలు సేకరించారు.



రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ కుటుంబ వివరాలను వెల్లడించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–13లోని ఆయన నివాసానికి జూబ్లీహిల్స్ సర్కిల్–18 ఏఎంసీ శ్రీనివాస్, సూపర్‌వైజర్ భావ్‌సింగ్, ఎన్యుమరేటర్ సురేఖారాణిలకు ఆయన వివరాలు అందజేశారు.

నయాపూల్ టు చార్మినార్

- ఆర్కిటెక్చరల్ లైటింగ్‌తో వెలుగు జిలుగులు
- రూ.8.19 కోట్లతో త్వరలో పనులు

సాక్షి, సిటీబ్యూరో: చారిత్రక ప్రశస్తి కలిగిన నయాపూల్ నుంచి చార్మినార్ వరకు, లాడ్‌బజార్, చార్మినార్ సమీపంలోని నాలుగు ఆర్చిలు, పరిసరాల్లోని ఇతరత్రా ఐకానిక్ ప్రాంతాలను ప్రత్యేకంగా ఆర్కిటెక్చరల్ లైటింగ్‌తో, వెలుగు జిలుగులతో ఆ ప్రాంతాలకు మరింత ప్రత్యేకతను అద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. స్వచ్ఛ భారత్ మిషన్‌లోని ఐకానిక్ ప్రాంతాల ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ పనులు చేపట్టనున్నారు. కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నివేదించిన వివరాలను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ పనులకు రూ.8.19 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన అనుమతులు జారీ చేసింది. బీఓక్యూ విధానంలో టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని సూచించింది. ఎన్‌టీపీసీ సీఎస్సార్ నిధులను ఇందుకు వినియోగించాల్సిందిగా సూచించింది. ఈ మేరకు మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు.

మూసీపై 'మురుగు నీటి శుద్ధి' కేంద్రాలు

- ఇప్పటికే దీనిపై అయిదు ఎస్టీపీలు
- తుది దశలో మరో అయిదింటి నిర్మాణాలు
- మరో మూడింటికి టెండర్ల ఆహ్వానం





నాగోలులో నిర్మించిన ఎస్టీపీ

ప్రణాళికతో ప్రక్షాళన

సాక్షి, సిటీబ్యూరో: మూసీ ప్రక్షాళనలో భాగంగా మురుగు నీటి శుద్ధి కోసం ముందస్తు ప్రణాళిక సిద్ధమవుతోంది. జలమండలి ఇప్పటికే వంద శాతం మురుగు నీటి శుద్ధిలో భాగంగా మూసీ నదిపై మురుగు నీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నిర్మాణాలను చేపట్టింది. మహా నగర పరిధిలోని మురుగు నీరు 80 శాతానికిపైగా మూసీలో చేరుతోంది. మిగిలిన 20 శాతం స్థానిక చెరువుల్లో కలుస్తోంది. నదీ పరీవాహకం పొడవునా.. ఇరువైపులా మురుగు మూసీలో కలుస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్ అర్బన్ ఆగ్లోమెరేషన్ పరిధిలో రోజువారీగా 2,815 ఎంఎల్డీల మురుగు నీరు ఉత్పన్నమవుతోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో 1,650 ఎంఎల్డీలు ఉండగా.. మురుగు నీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) ద్వారా 714.30 ఎంఎల్డీల మురుగు నీటిని శుద్ధి చేసి మూసీలోకి వదులుతున్నారు. మరోవైపు రోడ్లపై ఉండే చెత్తా చెదారం, ఇసుక, కంకర వంటి నిర్మాణ సామగ్రి, వాహనాలు కడిగిన నీరు, వ్యాపారులు పారబోసే వ్యర్థాలు కూడా మురుగు నీటిలో కలిసి మూసీలోకి చేరుతున్నాయి. ఈ నీటిని శుద్ధి చేసే సామర్థ్యం ప్రస్తుతం పరిమితంగా ఉన్న ఎస్టీపీలకు లేకపోవడంతో సరిపడా ఎస్టీపీల నిర్మాణాలకు సిద్ధమైంది. రెండేళ్ల క్రితం మూసీపై అయిదు ఎస్టీపీల నిర్మాణం చేపట్టగా, అందులో ఒకటి పూర్తయింది. మిగిలిన నాలుగు నిర్మాణ చివరి దశలో ఉన్నాయి.

ఇప్పటికే..

ప్రస్తుతం మూసీ పరీవాహక పరిధిలో అంబర్‌పేట (339 ఎంఎల్డీలు), నల్ల చెరువు (30 ఎంఎల్డీ), నాగోల్ (172 ఎంఎల్డీ), అత్తాపూర్- (51 ఎంఎల్డీ) అత్తాపూర్–2 (23 ఎంఎల్డీ)ల సామర్థ్యం గల ఎస్టీపీలు ఉన్నాయి. రెండేళ్ల క్రితం అంబర్‌పేటలో (212.5 ఎంఎల్డీ), నల్ల చెరువు (86.5 ఎంఎల్డీ), నాగోల్ (320 ఎంఎల్డీ), అత్తాపూర్‌లో (64 ఎంఎల్డీ), అత్తాపూర్–2లో (41 ఎంఎల్డీ) సామర్థ్యం గల ఎస్టీపీల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అందులో నల్లచెరువు ఎస్టీపీ ప్రారంభానికి నోచుకోగా మిగిలిన నాలుగు నిర్మాణ, ట్రయల్ దశలో ఉన్నట్లు జలమండలి అధికారులు చెబుతున్నారు.

తాజాగా మరో మూడింటికి టెండర్లు

మూసీ ప్రక్షాళనలో భాగంగా ఈ నదిపై మరో మూడు మురుగునీటి శుద్ధి కేంద్రాలను నిర్మించనున్నారు. నదీ పరీవాహక పరిధిలో సంగం బాపూఘాట్ వద్ద 34.5 ఎంఎల్డీ, నల్ల చెరువు వద్ద 36.5 ఎంఎల్డీలు, నార్సింగ్ వద్ద 34.5 ఎంఎల్డీ సామర్థ్యం గల మురుగు శుద్ధి కేంద్రాల నిర్మాణానికి టెండర్లను ఆహ్వానించారు.

మూసీలో కలవకుండా..

గ్రేటర్‌లోని జీహెచ్‌ఎంసీ, ఓఆర్‌ఆర్ మధ్య సుమారు 972.00 ఎంఎల్‌డీ సామర్థ్యం గల 39 ఎస్టీపీలను నిర్మించి మురుగు నీరు మూసీలో కలవకుండా కట్టడి చేసేందుకు కసరత్తు కొనసాగుతోంది. అమృత్ 2.0లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇస్తూ రూ.3,849 కోట్లు మంజూరు చేసింది. ఎస్టీపీలను మూడు ప్యాకేజీల్లో నిర్మించి మురుగును మూసీలో కలవకుండా చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో రూ.64 కోట్లతో ఒక ఎస్టీపీ, హామ్ పద్ధతిలో రూ.1,878 కోట్లతో ప్యాకేజీ–1లో 16 ఎస్టీపీలు, రూ.1906 కోట్లతో ప్యాకేజీ–2లో 22 ఎస్టీపీలను నిర్మించనుంది. తాజాగా మరో 22 ఎస్టీపీలకు టెండర్లు ఆహ్వానించారు. మరో 17 ఎస్టీపీలకు టెండర్లు ఆహ్వానించాల్సి ఉంది.

ప్లంబింగ్ లీకేజీలతోనే పరేషాన్

- బెంగళూరు వలే హైదరాబాద్‌లో 'డే జీరో' పరిస్థితి రాదు
- ఈ నెల 21- 23 తేదీల్లో హైటెక్స్ వేదికగా సదస్సు

గృహాల్లో సుమారు 30- 40 శాతం నీటి వృథా



ప్లంబింగ్ ఇంజనీరింగ్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న ఐపీఏ ప్రతినిధులు

సాక్షి, సిటీబ్యూరో: నీరు కేవలం ఒక వనరు మాత్రమే కాదు. అది ఆర్థిక వ్యవస్థకు జీవనాధారం. అలాంటి నీరు ప్లంబింగ్ లీకేజీల కారణంగా 30–40 శాతం వృథా అవుతోందని ఇండియన్ ప్లంబింగ్ అసోసియేషన్ (ఐపీఏ) తెలిపింది. 'వాటర్ ది కరెన్సీ' థీమ్ ఆధారంగా ఈ నెల 21- 23 తేదీల్లో హైటెక్స్‌లో '30వ ప్లంబింగ్ కాన్ఫరెన్స్' జరగనుంది. 9 ఏళ్ల తర్వాత దేశంలో నిర్వహిస్తున్న అతిపెద్ద సదస్సు ఇదే. మంగళవారం సదస్సు వివరాలను ఐపీఏ హైదరాబాద్ చైర్మన్ సంజయ్ భిలారో వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. 'ఆహార, పంట ఉత్పత్తుల ఎగుమతులు కూడా నీటి క్షీణతకు పరోక్ష కారణం. వరి, పత్తి, పంచదార వంటివి ఉత్పత్తి చేసేందుకు ఎక్కువ నీరు అవసరం. ఆయా పంటలను ఉత్పత్తి చేసే ప్రాంతాలలో నీటి వినియోగం తక్కువగానే ఉన్నా ఆ పంటలు నీటి వనరుల క్షీణతకు కారణమవుతున్నాయి. 70 శాతం అంటువ్యాధులు అపరిశుభ్ర నీటి కారణంగానే ప్రబలుతున్నాయి' అని సంజయ్ భిలారో పేర్కొన్నారు.

'డే జీరో' హైదరాబాద్‌లో రాదు..

ఒక నగరంలో నీటి సరఫరా దాదాపు పూర్తిగా తగ్గిపోయిన పరిస్థితిని 'డే జీరో'గా పరిగణిస్తుంటారు. 'డే జీరో' చేరుకున్నప్పుడు కుళాయి నీళ్ల సరఫరాకు ఆంక్షలు, మున్సిపాలిటీల్లో పరిమిత స్థాయిలో నీటి వినియోగం వంటి పరిస్థితులు ఏర్పడతాయి. ఇటీవల బెంగళూరు, చెన్నైలలో ఈ తరహా విపత్కర స్థితులను చూశామని, హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితులు రావని ప్లంబింగ్ అసోసియేషన్ తెల్పి చెప్పింది. ఎందుకంటే ఇక్కడున్న పుష్కలమైన నీటి వనరులతో రెండు దశాబ్దాల కాలం వరకూ ఎలాంటి ఇబ్బందులు లేవని వివరించారు.

9 ఏళ్ల తర్వాత సదస్సు..

9 ఏళ్ల తర్వాత జరగనున్న ఈ సదస్సులో స్థిరమైన నీటి నిర్వహణ, వినూత్న ప్లంబింగ్ పద్ధతులు, ఆతిథ్య రంగంలో నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత, జలం–వారసత్వం వంటి ఎన్నో అంశాలపై బృంద చర్చలు, సాంకేతిక సెషన్లు ఉంటాయి. ముఖ్య అతిథిగా ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ప్రధాన వక్తగా ఇండియాలో డెన్మార్క్ రాయభారి సోరెన్ నార్రెలుండ్ కన్నిక్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ డిప్యూటీ అడ్వైజర్ డాక్టర్ రమాకాంత్, వాటర్ ఆడిట్ కౌన్సిల్ చైర్మన్, నీతి ఆయోగ్ మాజీ అడ్వైజర్ అవినాష్ మిశ్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి సుమారు 1,500 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు.

పాదచారి నడిచేలా!

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో ఎన్నో ఫుట్ ఓవర్ బ్రిడ్జీ (ఎఫ్‌ఓబీ)లు ఉన్నాయి. కానీ.. పాదచారులు వాటిని వినియోగించుకోవడం లేదు. నిర్వహణ లోపం, చెత్తా చెదారం పేరుకుపోయి ఉండటం. పరిశుభ్రత కానరాకపోవడం ఇందుకు కారణాలు. అన్నింటికీ మించి లిఫ్టులు లేక, ఉన్న ప్రాంతాల్లో అవి పని చేయక.. ఎంతో ఎత్తు వరకు నిచ్చెన మెట్లు ఎక్కాల్సి, దిగాల్సి రావడం. అన్ని మెట్లు ఎక్కి అలసిపోయే బదులు నడిచేందుకు చోటు లేని ప్రాంతాల్లో సైతం రోడ్డు డివైడర్‌ను దూకడానికైనా సిద్ధపడుతున్న వారే ఎక్కువగా ఉన్నారు. దీంతో పాదచారులు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకని కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఎఫ్‌ఓబీలను వినియోగించుకునేవారు లేక వెలవెలబోతున్నాయి.

ప్రైవేటుకు నిర్వహణ..

ఎట్టకేలకు విషయం అర్థమైన జీహెచ్‌ఎంసీ ఎఫ్‌ఓబీల నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా ఎఫ్‌ఓబీల ఎస్కలేటర్లు, ఎలివేటర్ల నిర్వహణ కోసం ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లను ఆహ్వానించింది. ఎస్కలేటర్లు, ఎలివేటర్లు లేని ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేసి నిర్వహించాల్సి ఉంటుంది.

నిర్వహణలో భాగంగా..

ప్రజలు వినియోగించుకునేలా ఎఫ్‌ఓబీలను వాడుకలోకి తెచ్చేందుకుగాను నిర్వహణ చేపట్టే ఏజెన్సీలు వాటిని ప్రజలు సునాయాసంగా వినియోగించుకునేలా ఉంచాలి. అందుకుగాను క్రమం తప్పకుండా తనిఖీలు చేసి అవసరమైన సర్వీసింగులు, మరమ్మతులు చేయాలి. దెబ్బతిన్న స్పేర్ పార్ట్స్ స్థానే 24 గంటల్లోగా కొత్తవి అమర్చాలి. ప్రతి ఎఫ్‌ఓబీ వద్ద ఇద్దరు కేర్ టేకర్లను షిఫ్టుకొకరు చొప్పున నియమించాలి. వారు ఎఫ్‌ఓబీల క్యాబిన్లు శుభ్రంగా, సౌకర్యంగా ఉండేలా చూడాలి.ఎస్కలేటర్ల హ్యాండ్ రెయిల్స్, మెట్లు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఉండాలి. లైటింగ్ ఏర్పాట్లుండాలి. డిస్‌ప్లే పనిచేస్తుండాలి. పనిచేసే ఫోన్ ఉండాలి. సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉండాలి. సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత అధికారికి తెలియజేయాలి.

ప్రైవేటు ఏజెన్సీలకు ఎఫ్‌ఓబీల నిర్వహణ బాధ్యత

- టెండర్లు పిలిచిన జీహెచ్‌ఎంసీ

నగరంలో ఎఫ్‌ఓబీలున్న ప్రాంతాలు : పాతవి

అనూ టెక్స్ (సైనిక్‌పురి), హెచ్‌పీ పెట్రోల్ బంక్ (రామంతాపూర్), నేషనల్ పోలీస్ అకాడమీ (రాజేంద్రనగర్), గగన్‌పహాడ్, మహావీర్ హాస్పిటల్, ఎన్‌ఎండీసీ (మాసాబ్‌ట్యాంక్), ఎన్టీఆర్ మార్గ్ (ట్యాంక్‌బండ్), గ్రీన్‌లాండ్స్ గెస్ట్ హౌస్, ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, ముఫకంజా కాలేజ్(బంజారాహిల్స్), భారతీయ విద్యాభవన్ స్కూల్ (ఫిల్మ్‌నగర్), వెల్స్‌ఫార్గో (ఖాజాగూడ), ఐఎస్‌బీ, ఐటీసీ కోహినూర్, మియాపూర్ క్రాస్‌రోడ్స్, ఆల్విన్ క్రాస్‌రోడ్స్(మదీనగూడ), మలేషియన్ టౌన్‌షిప్, కేపీహెచ్‌బీ–4 ఫేజ్, కళామందిర్(కేపీహెచ్‌బీ కాలనీ), ఐడీపీఎల్, మెట్టుగూడ, రైల్‌నిలయం, హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్ (బేగంపేట).

కొత్తవి

బాలానగర్, చెన్నై షాపింగ్ మాల్ (మదీనగూడ), మియాపూర్, ఈఎస్‌ఐ హాస్పిటల్ (ఎర్రగడ్డ), హైదరాబాద్ సెంట్రల్ మాల్, నేరేడ్‌మెట్ బస్టాప్, సెయింట్ ఆన్స్ స్కూల్ (సికింద్రాబాద్), తార్నాక, స్వప్న థియేటర్ (రాజేంద్రనగర్), ఒమర్ హోటల్, రంగభుజంగ థియేటర్, మూసాపేట క్రాస్‌రోడ్స్.



గొంతు కోసి.. కడుపులో పొడిచి..

అనుమానంతో భార్యను చంపిన భర్త

- అగ్ని ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నం
- బెడ్రూంలో పెట్రోల్ పోసి నిప్పంటించిన నిందితుడు



ఖమర్ బేగం (ఫైల్)

చాంద్రాయణగుట్ట: భార్యపై అనుమానంతో ఓ భర్త అమానుషానికి తెగబడ్డాడు. కత్తితో గొంతు కోసి.. ఆపై కడుపులో పొడిచి ఆమెను దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ హషమాబాద్ ప్రాంతానికి చెందిన ఫయాజ్ ఖురేషి (25), ఖమర్ బేగం (23) దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు హదీ ఉన్నీసా (5), జునైద్ (3)లు ఉన్నారు. ఫయాజ్ ఖురేషి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆరేళ్ల పాటు సజావుగా సాగిన వీరి కాపురంలో కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. భార్య ఖమర్ బేగం ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న ఫయాజ్ తరచూ గొడవపడేవాడు. ఇందులో భాగంగా సోమవారం మరోసారి దంపతుల మధ్య గొడవ జరిగింది. ఇరువురి మధ్య మాటామాటా పెరగడంతో తీవ్ర కోపోద్రిక్తుడైన ఫయాజ్ కత్తితో భార్య ఖమర్ బేగం గొంతు కోసి.. ఆపై కడుపులో పొడిచి హత్య చేశాడు.

అనంతరం హత్యను అగ్ని ప్రమాదంగా మార్చేందుకు బయట పార్కు చేసిన ద్విచక్ర వాహనం నుంచి పెట్రోల్‌ను తీసుకొచ్చి బెడ్రూంలో పోసి మంటలంటించాడు. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఫయాజ్ బయటికి పారిపోయాడు. ఇది గమనించిన స్థానికులు నీళ్లతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అనంతరం కుటుంబ సభ్యులకు, బండ్లగూడ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం పరారీలో ఉన్న ఫయాజ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు వర్సిటీ సాహితీ పురస్కారాల ప్రదానం

నాంపల్లి: వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలను అందించిన పది మంది తెలుగు రచయితలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారాలు ప్రదానం చేసింది. ఒక్కో రచయితకు రూ.20,116 నగదు, శాలువా, ప్రశంస పత్రాలను అందజేసింది. మంగళవారం సాయంత్రం వర్సిటీలోని ఎన్‌టీఆర్ కళా మందిరంలో ఏర్పాటు చేసిన ప్రదానోత్సవ సభకు వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి ప్రసంగించారు. తెలుగు సాహిత్యం, లలిత కళల్లో విశేషమైన కృషి చేసిన ప్రముఖులకు సాహితీ పురస్కారాలను ప్రదానం చేస్తున్న తెలుగు వర్సిటీ.. లలిత కళల్లో విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దుతోందన్నారు. కళాకారుల జీవితాలు స్థిరీకరణ పొందడానికి ప్రణాళికలను రూపొందించాలని ఆయన సూచించారు. తెలుగు విశ్వవిద్యాలయంలోని అంతర్జాతీయ తెలుగు కేంద్రం ద్వారా దేశ విదేశాల్లో తెలుగు భాష, సంస్కృతిని మరింత ప్రచారం చేయడానికి కృషి చేయాలని ఆచార్య వెలుదండ నిత్యానందరావుకు ఆయన సూచించారు. సభకు అధ్యక్షత వహించిన ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ.. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి వికాస తోడ్పాటుకు నూతన సంస్కరణలు తేవాలనే సంకల్పంతో మూలనిధిని ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు. తొలుత తన వంతుగా రూ.50 వేలు చెక్కు రూపంలో రిజిస్ట్రార్‌కు అందజేసినట్లు చెప్పారు. తెలుగు భాషాభిమానులు, వాణిజ్య సంస్థలు విరాళాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్ రావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య వై.రెడ్డి శ్యామల, విస్తరణ సేవా విభాగం సహాయ సంచాలకులు రింగు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతలతో డాక్టర్ కేవీ రమణాచారి, ఆచార్య వెలుదండ నిత్యానందరావు, ఆచార్య తంగెడ కిషన్ రావు తదితరులు

పీఎం విశ్వకర్మ పథకాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఎం విశ్వకర్మ పథకం అమలులో నిర్లక్ష్యంపై హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం అమలు తీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 19,206 మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 236 మందికి మాత్రమే రుణాలు అందించిన అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో యుద్ధ ప్రాతిపదికన పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పక్షం రోజుల తర్వాత సమావేశం ఏర్పాటు చేసి అధికారులు చేపట్టిన చర్యలపై సమీక్షిస్తామని చెప్పారు. సమావేశంలో జీఎండీ ఏసీ ప్రవీణ్ కుమార్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ రైల్వే స్టేషన్‌లో

జన ఔషధి కేంద్రం నేడు ప్రారంభం

నగరంలోని కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం అందుబాటులోకి రానుంది. బుధవారం ఉదయం 9.30 గంటలకు కాచిగూడతో పాటు దేశవ్యాప్తంగా 18 ప్రదేశాల్లో భారతీయ జన ఔషధి కేంద్రాలను ప్రధాని నరేంద్ర మోదీ రిమోట్ వీడియో లింక్ ద్వారా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేయనున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు. ప్రత్యేక కేంద్రాల ద్వారా ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన మందులను అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ సంక్షేమ పథకాన్ని చేపట్టింది.

– సాక్షి, సిటీబ్యూరో



అనుమతి నిరాకరణపై వివరణివ్వండి: హైకోర్టు

'సుల్తాన్ ఉల్ ఉలూమ్' అంశంలో ఏఐసీటీఈకి నోటీసులు

సాక్షి, హైదరాబాద్: 'సుల్తాన్ ఉల్ ఉలూమ్' కాలేజీలకు అనుమతి నిరాకరణపై వివరణ ఇవ్వాలని ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ)ని హైకోర్టు ఆదేశించింది. సింగిల్ జడ్జి తీర్పు కారణంగా విద్యార్థులకు నష్టం జరిగే అవకాశం లేనందున ప్రస్తుతానికి ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. 2024–25 విద్యా సంవత్సరానికి కూడా విద్యార్థులు ఆయా కాలేజీల్లో చేరారని, అయితే భవిష్యత్ ఏదైనా ఇబ్బంది వస్తే కోర్టును ఆశ్రయించేలా అప్పిలెంట్‌కు స్వేచ్ఛ ఇస్తున్నామని చెప్పింది. సుల్తాన్ ఉల్ ఉలూమ్ సొసైటీ ఆధ్వర్యంలో నడిచే కళాశాలలు ఉన్న భూమిపై యాజమాన్య హక్కులు లేదా టైటిల్‌ను సమర్పించలేకపోవడం, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు(ఓసీ), భవనాలకు సంబంధించిన ఇతర పత్రాలు సమర్పించకపోవడంతో 2017లో కోర్సుల అనుమతి కొనసాగింపునకు ఏఐసీటీఈ నిరాకరించింది. దీన్ని సవాల్ చేస్తూ సొసైటీ హైకోర్టులో 2017లో పిటిషన్ దాఖలు చేసింది. దాదాపు 6 వేల మంది విద్యార్థుల భవిష్యత్‌ను ప్రభావితం చేసే అంశం కావడంతో పెండింగ్‌లోని కేసుల గురించి విద్యార్థులకు తెలియజేయాలనే షరతుతో కోర్సులకు సింగిల్ జడ్జి తొలుత అనుమతిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ఏఐసీటీఈ అనుమతి ఇవ్వకపోవడాన్ని సమర్థిస్తూ ఇటీవల తీర్పు వెలువరించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ సొసైటీ అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. అప్పిలెంట్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ద్విసభ్య ధర్మాసనం, సుప్రీంకోర్టు సమర్థించాయని చెప్పారు. భూ వివాదం పెండింగ్‌లో ఉన్నా పొజిషన్‌లో అప్పిలెంట్ సొసైటీ ఉందని వెల్లడించారు. సింగిల్ జడ్జి తీర్పుపై స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం .. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని సింగిల్ జడ్జి చెప్పినందున మధ్యంతర ఉత్తర్వులకు నిరాకరించింది. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా కోర్టును ఆశ్రయించేందుకు స్వేచ్ఛనిచ్చింది.

సిటీ కాలేజీలో విద్యా ప్రమాణాలు స్ఫూర్తిదాయకం

ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టా రెడ్డి



చార్మినార్: ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు బోధన, పరిశోధనల్లో వినూత్న పంథాలను అవలంబిస్తూ ఉత్తమ పనితీరును కనబరుస్తున్నాయని, సిటీ కాలేజీ దేశంలోనే అత్యున్నత నాక్ గ్రేడ్ సాధించి స్ఫూర్తిదాయకంగా నిలిచిందని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టా రెడ్డి అన్నారు. దేశంలో అత్యున్నత నాక్ గ్రేడ్ సాధించిన సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్, కళాశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ఆచార్య రాజేందర్ సింగ్, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డా.నీరజ, వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా, అధ్యాపక బృందంతో కలసి మండలి చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్, సిటీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందాన్ని అభినందిస్తూ అతి త్వరలో మండలి చేపట్టబోయే విద్యా సంస్కరణల అమలులో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని అధ్యాపకులకు సూచించారు. అతి వేగంగా జరుగుతున్న సాంకేతిక అభివృద్ధి, సామాజిక మార్పులకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలలో కూడా మార్పు రావలసిన అవసరం ఉందని, ఈ దిశగా మండలి ఆలోచనలు చేస్తున్నదని అన్నారు. మండలి చైర్మన్‌ను కలిసిన వారిలో సిటీ కళాశాల ఆచార్యులు డా.శ్రీనివాస్, కె.శ్రీకాంత్, డా.నైన వినోదిని, డా.మల్లికార్జున రావు, డా.ఝాన్సీ, డా.శ్రీనివాస రెడ్డి ఉన్నారు.

ఏజెంట్ చేతిలో మోసపోయా..

లక్డీకాపూల్: ఏజెంట్ చేతిలో మోసపోయి అతి కష్టం మీద ఆర్మేనియా నుంచి తిరిగి వచ్చినట్టు జగిత్యాలకు చెందిన కూన రాములు ప్రవాసీ ప్రజావాణిలో వాపోయారు. ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆయన అర్జీ పెట్టుకున్నారు. యూరప్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.3.50 లక్షలు తీసుకున్న ఏజెంట్ ఆర్మేనియాకు తీసుకెళ్లాడన్నారు. అక్కడ ఉద్యోగం ఇప్పించకుండానే తనను ఇండియాకు తిరిగి పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఒక ఏజెన్సీ ద్వారా గత ఏడాది సెప్టెంబరు 25న తాను ఆర్మేనియాకు వెళ్లినట్టు తెలిపారు. అక్కడ ఉద్యోగం లభించకపోవడంతో ఈ ఏడాది జనవరి 30న తిరిగి వచ్చినట్టు చెప్పారు. ఆర్మేనియా నుంచి వాపస్ రావడానికి తనకు రూ.1.45 లక్షలు ఖర్చయిందని వాపోయారు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాల్సిందిగా ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఆదుకోండి

ప్రవాసీ ప్రజావాణిలో ఓ బాధితుడి మొర

మొత్తం 748 దరఖాస్తులు

ప్రజావాణిలో మొత్తం 748 దరఖాస్తులు అందాయి. అందులో మైనార్టీ వెల్ఫేర్ శాఖ సంబంధించి 420 అర్జీలు ఉన్నాయి. వాటిలో చాలా వరకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోరుతూ దాఖలు చేసుకున్న అర్జీలే అత్యధికంగా ఉన్నాయి. ఈ క్రమంలో, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కు 110, విద్యుత్ శాఖ కు 80, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 59, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏ, యూడీ)శాఖ సంబంధించి 14, ప్రవాసి ప్రజావాణికి సంబంధించి 02, ఇతర శాఖలకు సంబంధించి 63 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ చిన్నారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఆల్ ఇండియా స్కూల్ చెస్ టోర్నమెంట్‌కు సర్వం సిద్ధం



చార్మినార్: ఈ నెల 14న జరగనున్న ఆల్ ఇండియా జవహర్‌లాల్ నెహ్రూ స్కూల్ చెస్ టోర్నమెంట్, ఓపెన్ స్కూల్ చెస్ టోర్నమెంట్లకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని నిర్వాహకులు మహమ్మద్ అబ్దుల్ రిజ్వాన్, మహమ్మద్ అబ్దుల్ రహీం తెలిపారు. బుధవారం మొగల్‌పురాలోని ఉర్దూ ఘర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నగరంలో జరిగే ఈ పోటీలలో ఆటగాళ్లందరూ అన్ని రౌండ్లు ఆడవచ్చునన్నారు. బాల బాలికల కోసం అండర్ 16 విభాగంలో ఈ పోటీలుంటాయన్నారు. పార్టిసిపెంట్ సర్టిఫికెట్లతో పాటు విజేతలకు ప్రైజ్ మనీ, మెరిట్ సర్టిఫికెట్, మెడల్స్‌ను అదే రోజు అందజేయడం జరుగుతుందన్నారు. జనవరి 1, 2008 తర్వాత జన్మించిన వారు ఈ టోర్నమెంట్‌కు అర్హులన్నారు. మరిన్ని వివరాల కోసం 8500212306 వాట్సాప్ నెంబర్లో సంప్రదించాలన్నారు.

బీఆర్ఎస్ లీడర్లపై కాంగ్రెస్ నేతల ఫిర్యాదు



బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న టీపీసీసీ లీగల్ సెల్ వైస్‌చైర్మన్ ఎస్.ప్రకాష్‌రెడ్డి

బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల ప్రతిష్ఠను దెబ్బతీసేవిధంగా కొందరు బీఆర్ఎస్ లీడర్లు ప్రయత్నిస్తున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలంటూ టీపీసీసీ లీగల్ సెల్ డిపార్ట్‌మెంట్ వైస్‌చైర్మన్ ఎస్.ప్రకాష్‌రెడ్డి మంగళవారం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 8వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ పాదయాత్రలో భాగంగా ఇచ్చిన ప్రకటనలను కొందరు బీఆర్ఎస్ నాయకులు తమ రాజకీయ, స్వార్థ ప్రయోజనాల కోసం వినియోగించుకుంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, రేవంత్‌రెడ్డిని ప్రతిష్ఠను దెబ్బతీసేవిధంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. వాస్తవాలకు దూరంగా బీఆర్ఎస్ లీడర్లు ఇటీవల బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులో చేశారని, ఇందుకు కౌంటర్‌గా తాను అదే బీఆర్ఎస్ లీడర్ల పైన ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. నిరాధారమైన ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ లీడర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

న్యాయవాదిపై కత్తితో దాడి

గాయపర్చి ఫోన్ ఎత్తుకెళ్లిన ఆగంతకులు



కళ్యాణ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

ఖైరతాబాద్: ఐమాక్స్ థియేటర్ సమీపంలో వాకింగ్‌కు వెళ్తున్న ఓ న్యాయవాదిపై ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడి చేశారు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఖైరతాబాద్ ఇందిరానగర్‌లో ఉండే ఆవుల కళ్యాణ్ వంశీకర్ అడ్వొకేట్, బీజేపీ లీగల్ సెల్ సభ్యులుగా ఉన్నాడు. మంగళవారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో వాకింగ్ కోసం తన పెంపుడు కుక్కను తీసుకొని ఐమాక్స్ ఎదురుగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నుంచి మింట్ కాంపౌండ్ వైపుకు బయల్దేరాడు. గజ్జలమ్మ టెంపుల్ ముందుకు రాగానే గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు స్కూటీపై వచ్చి కళ్యాణ్ ముందు ఆపారు. వెనుక కూర్చున్న వ్యక్తి దిగి దగ్గరకు వచ్చి ఏ బ్రీడ్ డాగ్ అంటూ మాటలు కలిపాడు. మీరెవరు అని అడుగుతుండగానే..ఆ వ్యక్తి అకస్మాత్తుగా కత్తి తీసి దాడి చేశాడు. ఎడమచేతిపై రెండు చోట్ల, ఛాతిపై, నడుం, వీపు మీద గాయాలయ్యాయి. ఈ దాడి క్రమంలోనే అగంతకులు కళ్యాణ్ ఫోన్ తీసుకొని పారిపోయారు. చికిత్స నిమిత్తం కళ్యాణ్‌ను మొదట గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ఆ తర్వాత లక్డీకాపూల్‌లోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు 309(4)(6) సెక్షన్ల కింద కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. దాడి చేసిన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేస్తున్నారు. కాగా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కళ్యాణ్‌ను ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలు పరామర్శించారు. కళ్యాణ్‌పై దాడి చేసిన నిందితులను పోలీసులు వెంటనే పట్టుకోవాలని, సంఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

అడిగినంత ఇచ్చాం.. అయినా కూలుస్తారా..?

ఇబ్రహీంపట్నం రూరల్: 'అడిగినంత ఇచ్చుకున్నాం.. అండగా ఉంటామన్నారు.. అయినా మా ఇళ్లను కూలుస్తారా' అంటూ బిల్డర్లు అధికారులను అడ్డుకున్నారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని టీసీఎస్ ఎదురుగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను మంగళవారం టౌన్‌ప్లానింగ్ అధికారి అబీబ్‌ఉన్నీసాబేగం ఆధ్వర్యంలో కూల్చివేశారు. అనుమతులు జీప్లస్ టూ తీసుకొని బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారని అధికారులు కొరడా జులిపిస్తుండగా జేసీబీకి ఓ మాజీ ఉద్యోగి అడ్డు తగిలాడు. ×మీ కమిషనర్ మా వద్ద రూ.రెండు లక్షలు ముడుపులు తీసుకున్నాడు. మళ్లీ మీకేం కావాలి.. మీకు లంచం ఇవ్వనందుకే కూల్చివేస్తున్నారా☆ అంటూ టౌన్‌ప్లానింగ్ అధికారిని నిలదీశారు. మరోచోట కూడా ఇలాంటి సంఘటనే ఎదురైంది. ఇప్పటికే కలిశాం కదా మళ్లీ తమను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరికి డబ్బులు ఇచ్చారో వారినే అడగండి అంటూ టీపీఓ సమాధానం ఇచ్చారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే సహించేది లేదని హెచ్చరించారు.

హైదరాబాద్ మార్కెట్ కమిటీకి నూతన కార్యవర్గం

చైర్‌పర్సన్‌గా సీహెచ్.లక్ష్మి, వైస్ చైర్మన్‌గా కోట్ల శ్రీనివాస్



చెకోలేకర్ లక్ష్మి



కోట్ల శ్రీనివాస్

చాదర్‌ఘాట్: హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీకి ప్రభుత్వం నూతన కమిటీని నియమించింది. మంగళవారం ప్రభుత్వం విడుదల చేసిన మార్కెట్ కమిటీల నియామకాల్లో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు కూడా కార్యవర్గాన్ని ప్రకటించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మలక్‌పేట నియోజకవర్గం సీనియర్ నాయకురాలు చెకోలేకర్ లక్ష్మి నియమితులయ్యారు. వైస్‌చైర్మన్‌గా టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ నియమితులయ్యారు. డైరెక్టర్లుగా ఎస్.రామారావు, శ్రీనివాస్‌గౌడ్, ఎండీ షకీల్, ప్రత్యూష, సత్యనారాయణ, సాయిరాం, మస్రత్ సుల్తానా, అశోక్‌గౌడ్, శివాజీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్‌చైర్మన్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ఆశయాల మేరకు హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం, మార్కెట్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు.

గ్రూప్-3 నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఈ నెల 17,18 తేదీల్లో జరిగే గ్రూప్- 3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం పోలీస్, నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 17న రెండు పేపర్లు ఉంటాయని తెలిపారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో పేపర్ ఉంటాయన్నారు. 18న ఉదయం మూడో పేపర్ ఉంటుందన్నారు. అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు అనుమతిస్తారన్నారు. 9.30 తర్వాత వస్తే అనుమతించేది లేదన్నారు. పరీక్షలకు జిల్లాలో 56,394 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్టు చెప్పారు. ఫ్లయింగ్‌స్క్వాడ్, ఐడెంటిఫికేషన్ అధికారులు, శాఖాపరమైన అధికారులు, నోడల్ అధికారులు చేయాల్సిన పనులను వివరించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. సమావేశంలో నోడల్ అధికారి రామారావు, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు తదిత రులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన

ఇబ్రహీంపట్నం: గ్రూప్–3 పరీక్షల నిర్వహణకు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పా టు చేసే స్ట్రాంగ్ రూంను అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మంగళవారం పరిశీలించారు. పోలీసులకు పలు సూచనలు చేశారు. పరీక్షలకు మండల పరిధిలో 20 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 14 వేల మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ప్రశ్నపత్రాలు ఈనెల 15న రానున్న నేపథ్యంలో వాటిని భద్రపరిచేందుకు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో స్ట్రాంగ్‌రూంను ఏర్పాటు చేస్తున్నారు. ప్రశ్నపత్రాలు రాగానే స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచి, ఆ గదిని సీల్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆమె పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి ప్రశ్నాపత్రాలు భద్రపరిచే గదిని పరిశీలించారు.


గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

సాక్షి, సిటీబ్యూరో: టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.ముకుంద రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మొత్తం 45918 మంది అభ్యర్థులు హాజరు కానున్నందంతో 102 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పీడబ్ల్యూడీ అభ్యర్థుల కోసం 27 కేంద్రాలను కేటాయించామని, ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు టీజీపీఎస్సీ సూచనలు పాటించి సహకరించాలన్నారు. పరీక్ష జరిగేటప్పుడు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఏఎన్ఎం, మందులను అందుబాటులో ఉంచాలన్నారు.

అక్రమంగా నగదు బదిలీ.. కేసు నమోదు

పోచారం: ఓ వ్యక్తి తన ఫోన్ తీసుకొని అక్రమంగా నగదు బదిలీ చేశాడని పోచారం పోలీస్ స్టేషన్‌లో ఓ మహిళ మంగళవారం ఫిర్యాదు చేశారు. సీఐ రాజు తెలిపిన ప్రకారం.. సింగపూర్ టౌన్‌షిప్‌లో హాస్టల్ నిర్వహిస్తున్న బాదావత్ జ్యోతి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్నోజిగూడ బ్రాంచిలో రూ. 5 లక్షలు డిపాజిట్ చేసింది. గత నెల 26న బ్యాంక్‌కు వెళ్లి అకౌంట్ స్టేట్‌మెంట్ తీసుకుంది. తనకు తెలికుండా టౌన్‌షిప్‌కు చెందిన రోహిత్, సూర్య అకౌంట్లకు రూ.3,59,542 బదిలీ అయినట్లు గమనించారు. ఆమె కొడుకు రిషి (15)తో ఆడుకోవడానికి వచ్చిన రోహిత్ తనకు తెలియకుండా ఫోన్ తీసుకొని డబ్బు బదిలీ చేశాడని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య



శ్రవణ్‌కుమార్ (ఫైల్)

చిక్కడపల్లి: ఆర్థిక సమస్యలు కారణంగా ఓ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ తెలిపిన కథనం ప్రకారం... సిద్దిపేట్ జిల్లా కొమురవెల్లి మండలం, తపసుపెల్లి గ్రామానికి చెందిన కొడిత్యాల శ్రవణ్‌కుమార్(34) చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఎనిమిదేళ్లుగా కవాడిగూడ డివిజన్‌లోని బండమైసమ్మ ప్రాంతంలోని టిస్కో సంస్థలో ఔట్ స్కోరింగ్‌పై ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రవణ్ కుటుంబ సభ్యులు బయట నుంచి తలుపుతట్టినా ఎంతకూ తీయకపోవడంతో కిటికీలోంచి చూడగా చనిపోయి ఉన్నాడు. ఇతడికి భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం భార్య గర్భవతి అని, కొద్దిరోజులుగా శ్రవణ్ తీవ్ర ఆర్థిక సమస్యలతో ఉన్నాడని స్నేహితులు, స్థానికులు తెలిపారు. ఎనిమిది రోజులుగా ఉద్యోగానికి వెళ్లలేదన్నారు. ఎస్ఐ మౌనిక కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పురుగుల మందు డబ్బాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీం బృందం వివరాలను సేకరించారు.

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం

డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయంజాల్: రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య కోరారు. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కోహెడలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు ఉచితంగా బస్తాలను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, తుర్కయంజాల్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వే సక్రమంగా నిర్వహించాలి

జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర సర్వేను సజావుగా జరిగేలా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ పేర్కొన్నారు. మండలంలోని ఉప్పరిగూడలో మంగళవారం ఆయన పర్యటించారు. ముందుగా గ్రామంలోని కంపోస్టు యార్డు, పల్లె ప్రకృతివనంను పరిశీలించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న సర్వే తీరును పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి ఎక్కడ అని ప్రశ్నించారు. ముందస్తు సమాచారం లేకుండా విధులకు హాజరు కాకపోవడంపై పంచాయతీ కార్యదర్శి రిషిక నేతకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

కార్లు అద్దెకు తీసుకుని..

- రుణం తీసుకున్న కిలాడీ లేడీ
- పోలీసుల అదుపులో నిందితులు

గచ్చిబౌలి: సెల్ఫ్ డ్రైవ్ కోసం కార్లు అద్దెకు ఇస్తే రోజుకు రూ.2 వేల నుంచి రూ.5 వేలు ఇస్తానని నమ్మబలికిన ఓ కిలాడీ లేడీ ఘరానా మోసానికి పాల్పడింది. అద్దెకు ఇచ్చిన కార్ల ఆచూకీ తెలియకపోవడంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. డీఐ సతీష్, బాధితులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. టెలికాంనగర్‌లో నివాసం ఉండే ఉష(48) సెల్ఫ్ డ్రైవ్ కోసం కార్లు అద్దెకు ఇస్తే రోజుకు రెండు వేల నుంచి ఐదు వేలు చెల్లిస్తానని నమ్మబలికారు. ఎక్కువ అద్దె వస్తుందని ఆశపడ్డ పలువురు కార్ల యజమానులు ఉషాకు అప్పగించారు. మూడు నెలలైనా అద్దె డబ్బులు ఇవ్వకపోవడంతో ఆమెను నిలదీసినా ఫలితం కనిపించలేదు. దీంతో శంషాబాద్‌కు చెందిన గణేశ్ అనే వ్యక్తి రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారించగా ఉష తాను అద్దెకు తీసుకున్న కార్లను అత్తాపూర్‌లో నివాసం ఉండే సాగర్, అనిల్‌లకు అప్పగించి రూ.4 లక్షలు రుణం తీసుకున్నట్లు తేలింది. వీరు జియోట్యాగ్‌లు తొలగించి కార్లను కర్నాటకలోని బీదర్‌కు తరలించారు. దీంతో ఉషాతో పాటు డ్రైవర్ మల్లేష్‌పై కేసు నమోదు చేశారు. కార్లను కుదువపెట్టుకున్న సాగర్, అనిల్‌లు పరారీలో ఉన్నారు. ఉషను రాయదుర్గం పోలీసులు విచారిస్తున్నారు. వీరి చెరలో 20కి పైగా కార్లు ఉన్నట్లు డీఐ తెలిపారు.

నైపుణ్యం ఉంటేనే ఉద్యోగ అవకాశాలు



ఇండక్షన్ ప్రోగ్రాంలో వీఆర్‌కే ప్రసాద్, లక్ష్మణ్ నాయక్ తదితరులు

బంజారాహిల్స్: సైఫాబాద్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో పీజీ విద్యార్థులకు మంగళవారం ఇండక్షన్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగాలాండ్ ఇక్ఫాయ్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ వీఆర్‌కే ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏ రంగంలోనైనా నైపుణ్యం అవసరం అన్నారు. అప్పుడే మంచి ఫలితాలను సాధించడంతో పాటు కెరీర్ ఉన్నతంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని తీసుకురావడం ద్వారా విద్యార్థులకు అనేక ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. విద్యార్థులు రీసెర్చ్, ఐటీ రంగాలపై దృష్టి పెట్టాలని సూచించారు. చదువుతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకునేలా వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అండర్ గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్థులకు ఉపయోగపడే ఇండక్షన్ ప్రోగ్రాంను నిర్వహించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్‌కు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ నవనీత, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

సుల్తాన్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జాఫర్ జావెద్

బంజారాహిల్స్: ఇంజినీరింగ్ విద్యార్థులు రోజు రోజుకూ పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా వారి నైపుణ్యాలను పెంచుకోవడంతో పాటు మరింత మెరుగుపరుచుకోవాలని సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్ అన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీ ఆవరణలో విప్రో టాలెంట్ నెక్స్ జావా కోర్సును పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సు వల్ల నైపుణ్యాలు మెరుపర్చుకోవడంతో పాటు ఉద్యోగ అవకాశాల్లో కూడా ఉపయోగపడుతుందని అన్నారు. కాలేజీ నుంచి 77 మంది విద్యార్థులు 150 గంటల ఈ



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న జాఫర్ జావెద్, తదితరులు

కోర్సును పూర్తి చేశారని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థులు వారి నైపుణ్యాలను పెంచుకునేందుకు విప్రో టెక్నాలజీస్ దేశ వ్యాప్తంగా 150 కాలేజీల విద్యార్థులకు ఈ శిక్షణ ఇస్తుందని కాలేజీ రిజిస్ట్రార్ నర్సింహారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఫరూఖ్ బాషా, ప్రొఫెసర్ సయ్యద్ షబ్బీర్ అహ్మద్, అయేషా నాజ్, అస్రార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

'కులగణనను వ్యతిరేకించే వారు ప్రజా ద్రోహులే'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళీ మనోహర్

పంజగుట్ట: ఎవరైతే కులగణనను వ్యతిరేకిస్తారో వారు ప్రజా ద్రోహులే అని పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ ప్రతినిధులు అన్నారు. కులగణన ఎంతో చారిత్రాత్మకమైనదని, రాష్ట్ర పునర్నిర్మాణానికి కుల సర్వే శాస్త్రీయతను కల్పిస్తుందని వారు పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ మురళీమనోహర్ మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కులగణనకు ఎందుకు అని అడుగుతున్నారని కానీ అధికారం ఏ కులం గుప్పిట్లో ఉంది, బడ్జెట్ కేటాయింపులు ఏ కులానికి ఎక్కువగా అందుతున్నాయి, ఏ సామాజిక వర్గాలు ఎంత అభివృద్ధికి నోచుకున్నారు, ఏ స్థాయిలో ఎవరు ప్రభుత్వ పథకాలు పొందుతున్నారు, విద్యా, ఉద్యోగాల్లో ఎవర్గం ముందజలో ఉంది అన్ని విషయాలు ఈ ప్రశ్నల ద్వారా తెలుస్తాయన్నారు. ప్రొఫెసర్ సింహాద్రి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. విస్సా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ సమగ్ర కుల సర్వే చేసి ఆ రిపోర్టు ఆధారంగా తమకు అనుకూలమైన వారికే మేలు చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు, ప్రొఫెసర్ వినుకొండ తిరుమలి, ప్రొఫెసర్ సుదర్శన్ రావు, దేవల్ల సమ్మయ్య, సతీష్ కొట్టే, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులను అత్యంత వెనకబడిన జాబితాలో చేర్చాలి

పంజగుట్ట: గంగపుత్రులను అత్యంత వెనుకబడిన కులాల జాబితాలో చేర్చాలని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టంగుటూరి రాజేష్ ఖన్నా కోరారు. గంగపుత్రులను ఎం.బీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ మంగళవారం ఖైరతాబాద్‌లోని తెలంగాణ బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ నిరంజన్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రాజేష్ ఖన్నా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2018 జులై 26వ తేదీన 36 కులాలను ఎం.బీసీ జాబితాలో చేర్చిందని కానీ బీసీ ఎ (1) జాబితాలో ఉన్న గంగపుత్రులను అత్యంత వెనకబడిన తరగతుల జాబితాలో చేర్చకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో గంగపుత్రులు కేవలం చేపల వేటనే వారి జీవనోపాధిగా జీవిస్తూ కడు పేదరికం అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరక్షరాస్యత, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో తీవ్ర వెనకబడి ఉన్నారని తెలిపారు. దేశంలో పలు రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీలుగా ఉన్న గంగపుత్రులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి అత్యంత వెనకబడిన కులాల జాబితాలో చేర్చాలని కోరారు. దీనికి స్పందించిన చైర్మన్ రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి సమస్య తీసుకువెళతానని చెప్పినట్లు తెలిపారు.



బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజేష్ ఖన్నా

మోతీనగర్‌లో కార్తీక దీపోత్సవ వేడుకలు



వేడుకల్లో లంకల దేపక్‌రెడ్డి, గూడూరి చెన్నారెడ్డి

శ్రీనగర్‌కాలనీ: మోతీనగర్‌లోని శివాలయంలో ధ్వజస్తంభ దాతలైన చింతపల్లి వంశీమోహన్ రెడ్డి, చింతపల్లి శోభారెడ్డి ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి లంకల దీపక్‌రెడ్డి, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ తెలంగాణా అధ్యక్షుడు, ఆలయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ గూడూరి చెన్నారెడ్డిలు హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విజయలక్ష్మి, జి.శ్రీధర్‌రెడ్డి, రవిగౌడ్, సాయి కనిష్క, మనోమర్, సాయి శ్రీకాంత్, శ్రీనివాస్, రాజేష్, మనోహర్, నాగరాజు పాల్గొన్నారు.

టీజీపీసీబీ ఉద్యోగుల నిరసన



సనత్‌నగర్: వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయ సిబ్బందిపై దాడికి నిరసనగా మంగళవారం టీజీపీసీబీ ప్రధాన కార్యాలయ ఉద్యోగులు నిరసనకు దిగారు. వికారాబాద్ జిల్లాలో ఫార్మా సిటీ ఏర్పాటు చేయడానికి తీసుకున్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా జరిగిన భూసేకరణ సమావేశంలో జిల్లా కలెక్టర్‌పై దాడి చేయడం హేయకరమని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీవాత్సవ, ప్రధాన కార్యదర్శి కృపానంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొని విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై జరిగిన దాడిని ఖండించారు.

తుదిదశకు ఎస్పీఆర్‌హిల్స్ రిజర్వాయర్ నిర్మాణం

మూడు మిలియన్ లీటర్ల సామర్థ్యంతో భారీ రిజర్వాయర్



రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న జలమండలి డైరెక్టర్ సుదర్శన్ తదితరులు



- రూ.4.50 కోట్లతో పనులు
- వాటర్ కమిషనింగ్ పూర్తి చేసిన అధికారులు
- ట్రయల్ రన్ సక్సెస్ అయితే మంచి నీటి సరఫరా
- బోరబండ, రహమత్‌నగర్ డివిజన్లలో 52 బస్తీలకు తీరనున్న నీటి కష్టాలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని ఎస్పీఆర్‌హిల్స్ మంచినీటి రిజర్వాయర్ పరిధిలో 52 బస్తీలకు ప్రస్తుతం ఉన్న రిజర్వాయర్ సరిపోకపోవడంతో మూడు రోజులకోసారి మంచినీటిని విడుదల చేస్తున్నారు. దీంతో గత కొన్నేళ్లుగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అదనపు మంచినీటి రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టి వడివడిగా పనులు పూర్తి చేస్తున్నారు. ప్రస్తుతం ఒక మిలియన్ లీటరు (ఎంఎల్) సామర్థ్యంతో ఎస్పీఆర్‌హిల్స్ రిజర్వాయర్ 52 బస్తీలకు అరకొర నీటి సరఫరా చేస్తున్నది. ఇప్పుడు నిర్మిస్తున్న మూడు ఎంఎల్ సామర్థ్యం గల రిజర్వాయర్ నిర్మాణంతో ఇక్కడ నాలుగు ఎంఎల్ రిజర్వాయర్ అందుబాటులోకి రానుంది. ఫలితంగా మిగతా అన్ని ప్రాంతాల్లో లాగానే బోరబండ, రహమత్‌నగర్ డివిజన్ల పరిధిలోని ఈ 52 బస్తీలకు రోజు విడిచి రోజు నీరు సరఫరా కానున్నది. మంగళవారం జలమండలి డైరెక్టర్ (ఆపరేషన్స్) సుదర్శన్, సీజీఎం ప్రభు, డివిజన్–6 జీఎం హరిశంకర్‌లు కొత్తగా నిర్మించిన 3 ఎంఎల్ రిజర్వాయర్ పనులను పరిశీలించి వాటర్ కమిషనింగ్ పనులు పూర్తి చేశారు. ట్రయల్ రన్ సక్సెస్ అయితే వెంటనే నీటి సరఫరా చేపట్టేందుకు అనువుగా తగిన నిర్ణయాలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. బోరబండలో ఉన్న 6 ఎంఎల్ భారీ మంచినీటి రిజర్వాయర్ నుంచి ఎస్పీఆర్‌హిల్స్ రిజర్వాయర్‌కు నీటి సరఫరా చేస్తారు. ఇక్కడి నుంచి చుట్టూ ఉన్న 52 బస్తీలకు రోజువిడిచి రోజు నీటి సరఫరా చేయడం ద్వారా స్థానికంగా మంచినీటి సమస్య పరిష్కారం కానుంది. త్వరితగతిన ఈ పనులు పూర్తి చేయాలని, చిన్నచిన్న లోపాలు ఉంటే వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులు సూచించారు.

ప్రేమ, పెళ్లి పేరుతో మోసం

యువకుడిపై ఫిర్యాదు.. కేసు నమోదు

బంజారాహిల్స్: ఓ ప్రైవేటు మెడికల్ కళాశాలలో చదువుకుంటున్న యువతి గత ఏప్రిల్‌లో స్నేహితురాలితో కలిసి కేబుల్ బ్రిడ్జికి వెళ్లింది. అక్కడ శ్రీధర్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ మొబైల్ ఫోన్లతో పాటు ఇన్‌స్టా ఐడీలు కూడా షేర్ చేసుకుని రోజూ మాట్లాడుకునేవారు. గత జూన్‌లో ఆమెను ప్రేమిస్తున్నానని చెప్పిన శ్రీధర్ పెళ్లి కూడా చేసుకుంటానని చెప్పాడు. ఈ క్రమంలో ఆగస్టు నెలలో ఎల్ఎన్‌నగర్‌లోని శ్రీధర్ గదికి ఆమె వెళ్లగా శారీరకంగా లోబర్చుకున్నాడు. ఇటీవల ఆమె గర్భం దాల్చగా తనకిప్పుడే పిల్లలు ఇష్టం లేదని గర్భస్రావం చేయించాడు. ఈ మధ్య కాలంలోనే ఖర్చులు నిమిత్తం ఆమె నుంచి రూ.3 లక్షల వరకు తీసుకున్నాడు. ఎప్పుడు పెళ్లి మాట ఎత్తిన దాటవేస్తూ వస్తుండడంతో తాను మోసపోయానని గ్రహించి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.

స్పా ముసుగులో వ్యభిచారం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లో మౌంటెన్ బ్యూటీ స్పాలో కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. కాగా ఈ స్పా నిర్వహిస్తున్న ప్రశాంత్ పుత్‌ర్వార్, రవికుమార్‌లు ఇద్దరూ పరారీలో ఉండగా వీరిపై కేసు నమోదు చేశారు. అలాగే ఐదుగురు సెక్స్ వర్కర్లను పునరావాస కేంద్రానికి తరలించారు. సబ్ ఆర్గనైజర్‌తో పాటు విటుడిని జైలుకు తరలించారు. దుబాయ్‌లో ఉండే హసీబుల్లా అనే వ్యక్తి ఈ ఇంటిని కిరాయికి ఇవ్వగా వీరు అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లుగా గుర్తించిన పోలీసులు బిల్డింగ్‌ను సీజ్ చేశారు.

వాహన పూజ కోసం వస్తే... బంగారు గొలుసు మాయం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయంలో వాహన పూజకు వచ్చిన ఓ మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసు చోరీకి గురైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... బోరబండ అల్లాపూర్‌కు చెందిన నూక రవి పెద్దమ్మ గుడికి వాహన పూజ కోసం వచ్చాడు. వాహన పూజ అనంతరం బయటకు వచ్చి చూడగా ఆయన అత్త మెడలో ఉన్న బంగారు గొలుసు కనిపించలేదు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.



బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో ఈనెల 12,13,14 తేదీల్లో ఆకృతి ఎగ్జిబిషన్ జరగనుంది. ఈ సందర్భంగా మంగళవారం ఎగ్జిబిషన్‌ను డైరెక్టర్ సషినతా ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్‌లో వెరైటీ డిజైన్లతో కూడిన వస్త్ర, ఆభరణాలు ప్రదర్శించబతాయని ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

డిసెంబర్ 6 నుంచి పాదయాత్ర



మాట్లాడుతున్న నరాల సత్యనారాయణ

కాచిగూడ: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అవినీతి అక్రమాలపై డిసెంబర్ 6వ తేదీ నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపడుతున్నట్లు టీఆర్ఎస్ (డెమోక్రటిక్) పార్టీ అధ్యక్షుడు నరాల సత్యనారాయణ తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామగ్రామాన పల్లెనిద్ర చేసి కేసీఆర్ అవినీతి అక్రమాలను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయనున్నట్లు పేర్కొన్నారు. కేసీఆర్ నేతృత్వంలో కాళేశ్వరం ప్రాజెక్టులో, ఛత్తీస్‌ఘఢ్ విద్యుత్ ఒప్పందంలో, భూ బదలాయింపుల్లో వేలకోట్ల రూపాయల అవినీతి జరిగింది ఆయన ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగితే లక్షల ఉద్యోగాలు అని చెప్పి మోసం చేశారని అన్నారు. తెలంగాణ ఉద్యమకారులను నట్టేట ముంచడం జరిగిందన్నారు. ఆదివాసీలపై ఉక్కుపాదం మోపి, ఫారెస్ట్ అధికారులతో కలిసి వారిని, వారి పంటలను విధ్వంసం చేశారని అన్నారు. కేసీఆర్ అవినీతి అక్రమాల పైన చట్టపరంగా విచారణకు ఆదేశించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు కంచెర్ల మంజుషా, సురేఖ, కొత్తపల్లి శారద, పోచబోయిన రేఖ, మంద లావణ్య, గద్దెల లక్ష్మీ, వల్లూరి శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లో ఇటీవల మ్యూజిక్ డైరెక్టర్ చక్రవర్తికి చెందిన 20 గుంటల స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అక్కడ ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసింది. కేబీఆర్ పార్కు చౌరస్తాలో ఉన్న ఈ స్థలాన్ని బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు కేటాయించాలని ట్రాఫిక్ పోలీసులు ప్రతిపాదించారు. మంగళవారం ఈ స్థలాన్ని వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ పరిశీలించారు. షేక్‌పేట మండల తహశీల్దార్ అనితారెడ్డితో స్థల విషయమై మాట్లాడడం జరిగిందని, తాము ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లామని తెలిపారు. ఇక్కడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నిర్మిస్తే బంజారాహిల్స్‌కే తలమానికంగా ఉంటుందన్నారు. ఇక్కడ బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌తో పాటు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయాన్ని కూడా నిర్మించడానికి అనువుగా విశాలమైన స్థలం ఉందని, ఇది అన్ని రకాలుగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి అనువుగా ఉంటుందన్నారు.

'ప్రజాదరణ చూసి ఓర్వలేకనే తప్పుడు ఆరోపణలు'

లిబర్టీ: ప్రజాదరణ చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు అన్నారు. రాజకీయ ప్రయోజనాలకు బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు వెంపర్లాడుతున్నారని విమర్శించారు. మంగళవారం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం మూసీ నదిని పట్టించుకోలేదని, అంతేకాకుండా మురికి కూపంగా మార్చిందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో మూసీ నది ఎలా ప్రవహించిందో అదే తరహాలో మూసీ నదిని పునర్జీవనం చేయాలని పలు దేశాలు తిరిగి అధ్యయనం చేయడంతో పాటు అనేక చర్యలను వేగవంతం చేసిందన్నారు. మూసీ నదిని పునరుజ్జీవనం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక లక్ష 40 వేల కోట్లు ఖర్చు చేసి శుద్ధి చేయాలని నిర్ణయించడం అభినందించాల్సింది పోయి ఆరోపణలు చేయడం బీఆర్ఎస్ నాయకులకు తగదని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని, ప్రధాన ప్రతిపక్షం ప్రతి అంశాన్ని, సంక్షేమ పథకాలపై రాద్ధాంతం చేస్తూ లబ్ధిపొందే ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు.

'బీఆర్ఎస్ నాయకుల ప్రోద్బలంతోనే దాడులు'



కాచిగూడ: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బందిపై బీఆర్ఎస్ నాయకుల ప్రోద్బలంతోనే ఆ పార్టీ నేతలు దాడి చేశారని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఆరోపించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులపై విచక్షణ రహితంగా దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి చట్టరిత్యా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అధికారులపై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగిన దాడిగానే పరిగణించి దోషులను కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జేఏసీ నేతలు వీవీ గౌడ్, సాయిబాబా, రఘువేందర్, నగేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: ఎల్లమ్మ టెంపుల్, జనప్రియ 11 కెవీ ఫీడర్లు బేగంపేట, జనప్రియ సబ్‌స్టేషన్ మధ్య జరుగుతున్న మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎల్లమ్మ టెంపుల్ ఏరియా, బల్కంపేట, సాయిబాబా టెంపుల్, రేణుకానగర్, జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ మంగళవారం తెలిపారు. అదేవిధంగా డీకె రోడ్డు, న్యూశాస్త్రినగర్ 11 కెవీ ఫీడర్లు బేగంపేట, జనప్రియ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల వల్ల డీకె రోడ్డు, రోశయ్యలైన్, శివబాగ్, అవంతినగర్, పీఆర్ నగర్, న్యూ శాస్త్రినగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

సర్వే వివరాల్లో గోప్యత అవసరం

లిబర్టీ: కులగణనలో వ్యక్తిగత వివరాల గోప్యత అవసరమని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి కోరారు. అవసరమైన అంశాలను కులగణన సందర్భంగా వివరాలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులగణన మంచి విషయం అయినప్పటికీ వ్యక్తిగత వివరాలకు ఇబ్బంది కలిగించకూడదని అన్నారు. సమగ్ర ఇంటింటి సర్వేలో భాగంగా సేకరిస్తున్న సమాచారంతో వ్యక్తిగత గోప్యతకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కులగణన సర్వే మంచిదైనప్పటికి కేవలం అందుకు సంబంధించిన అంశాలకి పరిమితం కావాలని విన్నవించారు. ఇటీవల కాలంలో ఎక్కడ చూసినా సైబర్ నేరాలు జరుగుతున్నాయని కోట్లాది రూపాయలు సైబర్ నేరస్తులు దండుకుంటున్నారని పేర్కొన్నారు. వ్యక్తిగత గోప్యతను పాటించాలని వాటిని బహిరంగ పరచరాదని కోర్టులు సైతం చెప్పాయని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనకు శ్రీకారం చుట్టడం గొప్ప విషయమని అన్నారు.

గృహిణులు, మహిళలకు అంబేడ్కర్ వర్సిటీ దిక్సూచి

పూర్వ విద్యార్థిని, గోల్డ్‌మెడలిస్ట్ రుక్సానా

బంజారాహిల్స్: గృహిణులకు, మహిళలకు, పేద, మధ్యతరగతి విద్యార్థులకు అంబేడ్కర్ వర్సిటీ దిక్సూచి లాంటిందని పూర్వ విద్యార్థిని, గోల్డ్ మెడలిస్ట్ పరిశోధక విద్యార్థిని రుక్సానా అన్నారు. వర్సిటీ భూముల కేటాయింపులను నిరసిస్తూ అధ్యాపక, అధ్యాపకేతర, ఉద్యోగ సంఘాల నేతలు మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో విశ్వవిద్యాలయంలోని పరిపాలనా భవనం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రుక్సానా పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి పేద, దళిత, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు చాలామంది విద్యార్థులు ఉన్నారన్నారు. జేఏసీ చైర్‌పర్సన్ పల్లవీకాబ్డే, కన్వీనర్ వద్దాణం శ్రీనివాస్‌లు మాట్లాడుతూ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ భూములను ఎవరికి కేటాయించరాదన్నారు. కేటాయింపు లేఖను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు ఎండీ హబీబుద్దీన్, ప్రమీల కేతావత్, కాంతం ప్రేమ్‌కుమార్, అవినాష్, కిషోర్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ వ్యాపారం కోసం వెతికి...

రూ.22.780 పోగొట్టుకున్న యువతి

వెంగళరావునగర్: ట్రేడ్ వ్యాపారం పేరుతో ఆన్‌లైన్‌లో యువతి వద్ద నగదు దోచుకున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... యాదగిరినగర్‌లో నివసించే ఎం.రమ్య సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుంది. ఈనెల 10వ తేదీన ట్రేడ్ వ్యాపారం కోసం వెబ్‌సైట్స్‌లో వెతికింది. ఈ క్రమంలో తనకు నచ్చిన వెబ్‌సైట్‌లో లాగిన్ అయింది. అందులో సభ్యురాలిగా చేరడానికి రూ. 22,780 చెల్లించాలని అడిగారు. వాటి ద్వారా సభ్యురాలైతే తిరిగి పొందవచ్చని సూచించారు. దీంతో ఆమె ఆన్‌లైన్‌లో ఆ నగదు చెల్లించింది. అనంతరం వాటి కోసం ఎదురు చూసినప్పటికీ తిరిగి పంపలేదు. దీంతో అది ఫేక్ వెబ్‌సైట్‌గా నిర్ధారణకు వచ్చింది. తనకు న్యాయం చేయాలంటూ ఆమె మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విజయ్‌కుమార్‌గౌడ్‌కు జపాన్ డిప్లొమా

బంజారాహిల్స్: పునకోసి షాటోకాన్ కరాటే అసోసియేషన్ వరల్డ్ ఇటీవల గోవా నగరంలో నిర్వహించిన కరాటే ట్రైనింగ్ అండ్ గ్రేడింగ్ టెస్ట్‌లలో హైదరాబాద్‌కు చెందిన బంజారాహిల్స్ నివాసి ఇటిక్యాల్ విజయ్‌కుమార్‌గౌడ్ పాల్గొని కరాటేలో బ్లాక్ బెల్ట్ ఎనిమిదో డాన్ జపాన్ డిప్లొమా అందుకున్నారు. జపాన్ గ్రాండ్ మాస్టర్ కెవిన్ పునకోసి బృందం సమక్షంలో ఆయన ఈ ఘనతను సాధించారు. ఎనిమిదో డాన్ బ్లాక్ బెల్ట్ హైదరాబాద్ జిల్లాలో తనకు మాత్రమే రావడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొన్ని సంవత్సరాలుగా విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్‌లో ఆయన శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు 10వేల మందికి పైగా విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇచ్చారు.



బ్లాక్ బెల్ట్ ఎనిమిదో డాన్ జపాన్ డిప్లొమాను అందుకుంటున్న విజయ్‌కుమార్‌గౌడ్

సాక్షి
బుధవారం । 13 ।
నవంబర్ । 2024

గీత కార్మికుల ఉపాధికి చర్యలు చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీ రమణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో గీత కార్మికుల ఉపాధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 5 లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధార పడి జీవిస్తున్నాయని, వీరి ఉపాధి మెరుగుపడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వృత్తిలో ఉపాధి మెరుగు పడాలంటే ప్రధానంగా చెట్ల పెంపకానికి భూమి ఇవ్వాలని, నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రకృతి పానియం స్వచ్ఛమైన కల్లు ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీన్ని ఆధునిక పద్ధతుల ద్వారా ప్రజలకు అందజేయాలని ఆయన కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని నందనంలో గత ప్రభుత్వం నీరా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి రూ.8 కోట్లు కేటాయించిందన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని ఆ ప్రాజెక్టుకు మరిన్ని నిధులు కేటాయించి నీరా కేంద్రాన్ని ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బెల్లం కొండ వెంకటేశ్వర్లు, నాయకులు జయరాములు, సీతారాములు, రమేష్‌గౌడ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో 21 రకాల వైకల్యాలకు చోటు ఎక్కడ?


వల్లభనేని ప్రసాద్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సమగ్ర కుటుంబ సర్వేలో 21 రకాల వైకల్యాలకు చోటు కల్పించకపోవడం అత్యంత బాధాకరమని, వైకల్య రకాల కోడ్‌లు లేకుండా ముద్రించిన సర్వే పత్రాలను వెంటనే మార్చాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వల్లభనేని ప్రసాద్, కాటమోని వెంకటేశ్‌గౌడ్, వి.భారతి మాట్లాడారు. కుటుంబయజమాని, కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలు సేకరించడానికి పార్ట్–1 ఫారంలో 13వ నెంబర్ కాలంలో మీరు దివ్యాంగులా అని అడిగారని, 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం 21 రకాల వైకల్యాన్ని గుర్తించిదని వారు అన్నారు. సర్వే పత్రంలోని కాలం 13లో కోడ్ నింపడానికి సూచనల పేరుతో ప్రత్యేకంగా హ్యాండ్ బుక్ కూడా ఇచ్చారని, అయితే మిగతా వివరాలు సమగ్రంగా ఉన్నప్పటికీ వికలాంగుల వివరాలు మాత్రం సమగ్రంగా లేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేలో 21 రకాల వికలాంగులను విస్మరించడం దురదృష్టకరం అన్నారు. వికలాంగులను గుర్తించకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. ఈ విషయంపై వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ పి.శైలజకు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు.

పోలీసింగ్‌కు సిద్ధం

సమాజంలో శాంతిభద్రతలను కాపాడేందుకు వాళ్లు సిద్ధమయ్యారు.. టెక్నాలజీని వాడుకుంటూ సవాళ్లు విసురుతున్న సైబర్ నేరగాళ్ల పనిపట్టేందుకు వాళ్లు వస్తున్నారు.. యువత జీవితాలను మత్తులో ముంచేందుకు వివిధ మార్గాలను వెతుకుతున్న డ్రగ్ పెడ్లర్లను కటకటాల్లోకి పంపేందుకు వారు ట్రేన్డ్ అయ్యారు.. అన్ని అంశాల్లో తొమ్మిది నెలల పాటు అంబర్‌పేట పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో కఠోర శిక్షణ పొందిన కానిస్టేబుల్స్ త్వరలో బాధ్యతలను స్వీకరించనున్నారు.
- అంబర్‌పేట




అంబర్‌పేట పీటీసీలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

9 నెలల శిక్షణ పూర్తి చేసుకుని పాసింగ్ పరేడ్‌కు..

- చరిత్రాత్మక అంబర్‌పేట పీటీసీలో శిక్షణ
- 21న విధుల కోసం బయటకు వస్తున్న కానిస్టేబుళ్లు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ నోడల్ పోలీస్ శిక్షణ కేంద్రంగా పేరొందిన అంబర్‌పేట పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన కానిస్టేబుల్ అభ్యర్థులు బాధ్యతలను స్వీకరించేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 21వ తేదీన పాసింగ్ పరేడ్‌కు సన్నాహాలు జరుగుతున్నాయి. అంబర్‌పేట పోలీస్ ట్రైనింగ్ సెంటర్ పరిధిలో అంబర్‌పేట, మేడ్చల్ శిక్షణ కేంద్రాల్లో సుమారు 1300 మంది కానిస్టేబుల్ అభ్యర్థులు అన్ని అంశాల్లో పూర్తిస్థాయిలో శిక్షణ పొందారు. శారీరకంగా, మానసికంగా సాంకేతిక పరంగా తొమ్మిది నెలలు శిక్షణ పొందారు.

ఆధునిక నేరాలే సవాళ్లు..

ప్రస్తుతం సీసీటీవీ కెమెరాలతో పాటు ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఆధునిక సాంకేతికతను జోడించి ఎన్నో నేరాలను కట్టడి చేస్తున్నా.. సరికొత్త నేరాలు పోలీస్ విభాగానికి సవాళ్లు విసురుతునే ఉన్నాయి. ప్రధానంగా సైబర్ నేరాలు, డ్రగ్స్, హ్యూమన్ ట్రాఫికింగ్, లైంగికదాడులు, చిన్న పిల్లలపై నేరాలు వంటివి పోలీస్ విభాగానికి సవాళ్లుగా మారాయి. వివిధ మార్గాలను ఎంచుకుంటున్న సైబర్ నేరగాళ్లు నిముషాలు, గంటల వ్యవధిలోనే రూ.కోట్లలో కొల్లగొడుతున్నారు. చాలా సందర్భాల్లో విద్యావంతులే మోసపోతున్నారు. ఇలాంటి నేరాలపై తొమ్మిది నెలల్లో ప్రత్యేక శిక్షణ పొందారు. వీటితో పాటు మహిళ భద్రత, మతపరమైన విద్వేషాలు, నక్సలిజం వంటి సమస్యలను ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై శిక్షణ పొందారు. ప్రతి అభ్యర్థికి డ్రైవింగ్ మెళకువలతో పాటు బాధితుల పట్ల స్పందించే విధానంపై శిక్షణ అందించారు.

పోలీసింగ్ వంద శాతం చేసేలా శిక్షణ ఇచ్చాం



1300 వందల మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు తొమ్మిది నెలలు శిక్షణ ఇవ్వడం సంతృప్తిగా ఉంది. శాంతి భద్రతల అంశంలో తలెత్తే సవాళ్లపై శిక్షణ ఇచ్చాం. ప్రస్తుతం పరిస్థితులకు అనుగుణంగా సైబర్ నేరాలు, డ్రగ్స్ వంటి అంశాలపై ఎక్కువగా ఫోకస్ చేశాం. సమాజంలో పోలీస్ కానిస్టేబుల్ ఆఫీసర్ ఎలా ఉండాలో అలా తీర్చిదిద్దాం. వ్యక్తిగత క్రమశిక్షణ పట్ల శ్రద్ధ తీసుకున్నాం. కొత్త చట్టాలపై అవగాహన కల్పించాం.
- పరవస్తు మధుకర్‌స్వామి, ఎస్పీ, ప్రిన్సిపాల్ పీటీసీ అంబర్‌పేట.

70 శాతం గ్రాడ్యుయేట్లు..

పోలీస్ శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థుల్లో 70 శాతం గ్రాడ్యుయేట్లే ఉన్నారు. ఇంటర్ అర్హతతో ఎంపిక అయ్యే కానిస్టేబుల్ ఉద్యోగాలకు 30 శాతమే ఇంటర్ అర్హత ఉండగా, 70 శాతంలో ఇంజినీరింగ్, పీజీ విద్యా అర్హత ఉన్న అభ్యర్థులు ఉన్నారు. పాసింగ్ పరేడ్ అనంతరం వీరికి నిబంధనలకు అనుగుణంగా జిల్లాల వారీగా పోస్టింగ్‌లు ఇస్తారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ వంటి తీవ్ర నేరాల నియంత్రణకు కొందమందిని తీసుకోనున్నారు.

అన్ని విధాలా శిక్షణ పొందాం



తొమ్మిది నెలలుగా అంబర్‌పేట పీటీసీలో అన్ని అంశాలపై పూర్తిస్థాయిలో శిక్షణ పొందాం. ఇండోర్, ఆవుట్‌డోర్‌లలో ఎన్నో మెళకువలు నేర్చుకున్నాం. ప్రధానంగా సైబర్ నేరాలు, డ్రగ్స్ వంటి అంశాలపై శిక్షణలో ఎక్కువ ఫోకస్ చేశారు. పూర్తిస్థాయి కానిస్టేబుల్ అధికారిగా శిక్షణ పొందాం. శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇచ్చిన అధికారులు ఎంతో ప్రోత్సహించారు.
- మల్లం గణేశ్, కానిస్టేబుల్

ఎంతో దోహదపడుతుంది



దశాబ్దాలుగా అంబర్‌పేట పోలీస్ శిక్షణ కేంద్రానికి ప్రసిద్ధి. ఇలాంటి శిక్షణ కేంద్రంలో నేను శిక్షణ పొంది పోలీస్ అధికారిగా కావడం గర్వంగా ఉంది. ఈ శిక్షణ ఉద్యోగ జీవితంలో ఎంతో దోహదపడుతుంది. ఎన్నో అంశాలపై అవగాహన కల్పించారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యతగా నిర్వహిస్తాం.
- శ్రీనివాస్

అభివృద్ధి అన్నారు..
అసంపూర్తిగా వదిలేశారు!



సాక్షి, సిటీబ్యూరో: గుడిమల్కాపూర్ పూల మార్కెట్ ప్రాంగణంలో భారీ గుంత గుబులు పుట్టిస్తోంది. ఇక్కడికి నిత్యం వేలాది వాహనాలు వచ్చిపోతుంటాయి. అయితే ఆ ప్రదేశంలో పురాతన మెట్ల బావి ఉంది. వారసత్వ సంపదను పునరుద్ధరించి, అభివృద్ధి చేస్తామని ఏడాది క్రితం పెద్ద గుంత తవ్వారు. పురావస్తుశాఖ, జీహెచ్‌ఎంసీ సంయుక్తంగా ఈ పనులు ప్రారంభించాయి. ఆ తర్వాత ఏమైందో ఏమో పనులను అసంపూర్ణంగా వదిలేశారు. అభివృద్ధి మాట దేవుడెరుగు ఆ గుంత ప్రమాదకరంగా మారింది. దీంతో మార్కెట్‌కు వచ్చే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గవర్నర్ ఎమ్మెల్సీ కోటాలో 'షియా'కు ప్రాధాన్యం ఇవ్వాలి

- షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్


సమావేశంలో హైకోర్టును ఆదేశాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: గవర్నర్ ఎమ్మెల్సీ కోటాలో షియా ముస్లింలకు ప్రాధాన్యం ఇవ్వాలని షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ జాతీయ అధ్యక్షుడు హిదయత్ అలీ మీర్జా విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో ఏర్పాటు మంగళవారం చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో మైక్రో మైనారిటీలుగా ఉన్న షియా ముస్లింలకు చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. షియా జనాభాకు అనుగుణంగా రాజకీయ ప్రాధాన్యం లభించడంలేదని, అధికార పక్షాలు కూడా నామినేటెడ్ పదవులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆర్టికల్ 171 ప్రకారం తగిన ప్రాధాన్యం కోసం హైకోర్టును ఆశ్రయించగా ప్రభుత్వ సంస్థలకు నోటీసులు జారీ చేసిందని గుర్తు చేశారు. తెలంగాణలోనే 10 లక్షల పైనే షియా ముస్లింలు ఉన్నారని పేర్కొన్నారు. రాజకీయ, విద్య, ఉపాధి అన్ని రంగాల్లో షియాలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో డైరెక్టర్లు షబ్బీర్ అలీ మీర్జా, సయ్యద్ షకీల్ హైదర్, సయ్యద్ అబిద్ హుస్సేన్, మహమ్మద్ అలీ హైదర్ సయ్యద్ హైదర్ రజా నక్వీ, పీఆర్వో అక్బర్ అలీ మీర్జా తదితరులు పాల్గొన్నారు

స్థానిక పత్రికలపై సొంత రాష్ట్రంలో వివక్ష

- డబ్ల్యూజేఐ రాష్ట్రస్థాయి సదస్సులో పలువురు వక్తలు


మాట్లాడుతున్న రాణాప్రతాప్

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన స్థానిక పత్రికల యాజమాన్యాలు రాష్ట్రంలో అంతులేని వివక్షకు గురవుతున్నాయని డబ్ల్యుజేఐ రాష్ట్ర సదస్సు అభిప్రాయపడింది. రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి స్థానిక పత్రికల పట్ల సానుభూతి ఉన్నప్పటికీ, వాటి సమస్యలపై సరైన ప్రతినిధ్యం వహించే విషయంలో రాష్ట్ర జర్నలిస్టులకు సుదీర్ఘకాలం ప్రాతినిధ్య వహిస్తున్నామని చెప్పుకొంటున్న సంఘం వైఫల్యం చెందిందని ఆరోపించింది. తెలంగాణ స్థానిక పత్రికలు, యాజమాన్యాలు అక్రిడిటేషన్లు రేట్ కార్డులో వివక్ష.. డిమాండ్ల సాధన అంశాలపై బీఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూజేఐ) మంగళవారం నాగోల్‌లో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించింది. పలువురు మాట్లాడుతూ.. జాతి ప్రయోజనాలే లక్ష్యంగా జర్నలిస్టులు పనిచేయాలని వారు సూచించారు. సమాజంలో వెలుగులు నింపే వృత్తిని స్వచ్ఛందంగా స్వీకరించిన పాత్రికేయుల జీవితాలు చీకట్లో ఉండటం బాధాకరమన్నారు. పాత్రికేయ సంఘాలు జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి స్థానిక పత్రికల యజమానులు, ఎడిటర్లు, పాత్రికేయులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. డబ్ల్యూజేఐ గౌరవాధ్యక్షుడు నందనం కృపాకర్ అధ్యక్షత వహించిన ఈ సదస్సుకు సామాజికవేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీమనోహర్, వీ 3 న్యూస్, విశ్వంభర పత్రికల అధినేత డాక్టర్ కాచం సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. డబ్ల్యూజేఐ అధ్యక్షుడు రాణాప్రతాప్, ఉపాధ్యక్షులు తాడూరు కరుణాకర్, అనిల్ దేశాయ్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, కార్యదర్శులు శివనాద్రి ప్రమోద్‌కుమార్, క్రాంతి, సహ కార్య నిర్వాహక కార్యదర్శి బెజ్జంకి నరేశ్ కుమార్ ప్రసంగించారు.

మా ఉద్యోగాలను తిరిగి ఇవ్వండి


మాట్లాడుతున్న రాజేందర్

పంజగుట్ట: మానవత్వంతో తమ పిల్లల ముఖాలు చూసైనా తమ ఉద్యోగాలు తమకు తిరిగి ఇవ్వాలని టీజీఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చిన్నచిన్న తప్పులకు సస్పెండ్ చేయడంతో పాటు ఏకంగా ఉద్యోగాల నుంచే తీసేసి తమ ఐడెంటిటీ కార్డులను కూడా లాక్కున్నారని, ముఖ్యమంత్రి, రవాణాశాఖ మంత్రి, ఆర్టీసీ ఎండీ తమకు ఉద్యోగాలు ఇప్పించాలని వారు వేడుకున్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రిమూవ్ అయిన ఉద్యోగి రాజేందర్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు 500 మంది కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు, కానిస్టేబుల్స్ రిమూవ్ అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము 15 నుంచి 30 సంవత్సరాలు ఉద్యోగాలు చేశామని, చిన్నచిన్న తప్పులకే రిమూవ్ అంటే ఎలా అన్నారు. సమావేశంలో ప్రసాద్, నాగేష్, రాజన్న, గంగాధర్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వ్యవసాయం వైపు మారాలి

- ఐసీఏఆర్–నారమ్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌రావు



ప్రతినిధులకు జ్ఞాపికలను అందజేస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: రైతులు వ్యక్తిగత వ్యవసాయం నుంచి సామూహిక వ్యవసాయానికి మారాలని, దీని ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధ్యమవుతుందని, ఆహార భద్రత, సుస్థిర వ్యవస్థ అభివృద్ధి సాధ్యమవుతుందని ఐసీఏఆర్–నారమ్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌రావు, నూజివీడు సీడ్స్ ప్రతినిధి ప్రభాకర్‌రావు అన్నారు. రాజేంద్రనగర్‌లోని నారమ్స్‌లో భారతదేశంలోని స్థిరమైన వ్యవసాయ స్టార్టప్‌లు నిర్మించడంపై జాతీయ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ వ్యవసాయంలో అధిక లాభాల కోసం మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. విత్తన మార్పిడి, జన్యుపరంగా మార్పిడి చేసిన విత్తనాలు వాడటం, విలువ గొలుసులో నాణ్యమై విత్తనాలను వినియోగించడం, ఉద్యానవన విత్తన కేంద్రాల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయదారులు, వ్యాపారులు, వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మార్కెట్లను ఏర్పాటు చేయాలని, ఇందు కోసం రైతులకు అందుబాటులో ఉండే ప్రాంతాన్ని ఎంచుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయ స్టార్టప్‌ల కోసం రూపొందించిన పుస్తకాలను విడుదల చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లా నుంచి విద్యార్థులు, వ్యవసాయ నిపుణులు, ప్రభుత్వ అధికారులు, బ్యాంకర్లు, విద్యావేత్తలు, పెట్టుబడిదారులు, స్టార్టప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మిగిలిన పీజీ కోర్సుల సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

ఉస్మానియాయూనివర్సిటీ: మిగిలిన పీజీ కోర్సుల సీట్లకు త్వరలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు టీజీసీపీజీఈటీ–2024 కన్వీనర్ పాండురంగారెడ్డి మంగళవారం తెలిపారు. చివరి విడత ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ఇతర పీజీ కోర్సుల రిపోర్టింగ్ గడువు 12న ముగిసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ వర్సిటీల పరిధిలో మొత్తం 47,722 పీజీ సీట్లలో 22,556 మంది విద్యార్థులు ఆయా కాలేజీలో రిపోర్టు చేసినట్లు చెప్పారు. మిగిలిన పీజీ సీట్లకు స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డిని కలిసి టీజీసీపీఈటీ–2024 కౌన్సెలింగ్ వివరాలను అందజేసినట్లు కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు.

మంచర్ల నరేందర్‌కు బహుజన సాహితీ అవార్డు


జాతీయ అవార్డుకు సంబంధించిన పత్రాన్ని అందుకుంటున్న మంచర్ల నరేందర్

శంషాబాద్: శంషాబాద్ మండలం పోశెట్టి గూడెం గ్రామానికి చెందిన బీజేపీ ఎస్సీ మోర్చా కన్వీనర్ మంచర్ల నరేందర్‌కు బహుజన సాహితీ అకాడమీ అవార్డును ప్రకటించింది. ఈ మేరకు అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ మంగళవారం పత్రం అందజేశారు. డిసెంబర్ 25న ఢిల్లీలో జరిగే 17 జాతీయ సదస్సులో ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ బహుజన సాహితి అకాడమీ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ, బీజేపీ నాయకులు బోసుపతి ప్రతాప్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రాన్ని ప్రపంచ అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


గ్లోబల్ లాజిక్ కొత్త డెలివరీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు

గచ్చిబౌలి: డిజిటల్ ఇన్నోవేషన్, ట్రాన్స్‌ఫర్మేషన్‌లో ప్రపంచ అగ్రగామిగా రాష్ట్రాన్ని నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని డీఎల్‌ఎఫ్ భవనంలో గ్లోబల్ లాజిక్ కొత్త డెలివరీ సెంటర్‌ను మంగళవారం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు 220కి పైగా జీసీసీలు ప్రపంచస్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాలు, 1.5 లక్షల మంది ఇంజినీర్లతో సహా ఏటా 2.5 లక్షల మంది గ్రాడ్యుయేట్లను జోడించే ప్రతిభావంతులతో రాష్ట్ర ప్రపంచవ్యాప్తంగా ముందుకు ఆలోచించే సంస్థలకు భవిష్యత్తును రూపొందిస్తోందన్నారు. ఈ కొత్త సదుపాయం ఉద్యోగ కల్పనను ప్రోత్సహించడమే కాకుండా అత్యాధునిక ప్రతిభను పెంపొందిస్తుందన్నారు. అధిక ప్రభావ రంగాల్లో మన రాష్ట్ర నాయకత్వాన్ని బలపరుస్తుందన్నారు. ఇది ప్రపంచ వృద్ధి, ఆవిష్కరణల్లో అగ్రగామిగా ఉన్న తెలంగాణ స్థానాన్ని పటిష్టం చేస్తుందన్నారు. పెరుగుతున్న కార్యకలాపాలకు మద్దతుగా కొత్త నియామకాలపై దృష్టి సారించాలన్నారు. గ్లోబల్ లాజిక్‌లోని ఏపీఏసీ హెడ్, మేనేజింగ్ డైరెక్టర్ పీయూష్‌ఝూ మాట్లాడుతూ.. సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, డేటా అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, ఇతర నూతన సాంకేతికతలలో ప్రత్యేకించి జెన్‌ఏఐలో నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులను చేరుకోవడాన్ని మా రిక్రూట్‌మెంట్ ప్రయత్నాలు లక్ష్యంగా చేసుకుంటాయన్నారు. హైదరాబాద్ సెంటర్ ప్రతినిధులు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజాభవన్ వద్ద జూనియర్ లెక్చరర్ అభ్యర్థుల నిరసన



సాక్షి, సిటీబ్యూరో/లక్డీకాపూల్: తమ ఉద్యోగాలు తమకు ఇవ్వాలని ఇటీవల ఎంపికైన జూనియర్ లెక్చరర్స్ అభ్యర్థులు మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో నిరసన వ్యక్తం చేశారు. జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ప్రజాభవన్‌కు తరలివచ్చి, తమకు న్యాయం చేయాలని కోరారు. నోటిఫికేషన్ ఇచ్చి రెండేళ్లవుతున్నా ఇప్పటి వరకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. తుది ఫలితాలు విడుదలై నెలలు గడుస్తున్నా తమ గోడు వినేవారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలకు ఎంపికయ్యామని సంతోషపడాలో.. ఇన్ని నెలలు అవుతున్నా అపాయింట్‌మెంట్ రానందుకు బాధపడాలో అర్థం కావడం లేదని గోడు వెళ్లబోసుకున్నారు. ఇదే విషయంలో అనేకసార్లు మంత్రులు, అధికారులను కలిసి వినతి పత్రం అందించినా ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఉద్యోగాల్లో చేరేందుకు 1,392 మంది ఎదురు చూస్తున్నామని, తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, వెంటనే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వాలని కోరారు.

గోల్కొండ వద్ద ఓవర్ హెడ్ స్కై కేబుల్ జాయింట్ సర్వే


జాయింట్ సర్వేలో టూరిజం, కేంద్ర పురాతత్వ శాఖ అధికారులు

గోల్కొండ: సెవన్ టూమ్స్ నుంచి గోల్కొండ కోట వరకు ప్రతిపాదించిన ఓవర్ హెడ్ స్కై కేబుల్ ప్రాజెక్టుపై వివిధ శాఖ అధికారులు మంగళవారం జాయింట్ సర్వే నిర్వహించారు. సెవన్ టూమ్స్ చౌరస్తా నుంచి అధికారులు బంజారి దర్వాజా, కఠోరా హౌజ్, మీదుగా గోల్కొండ కోట వరకు ఓవర్ హెడ్ స్కై కేబుల్ వేయడానికి రూట్ సర్వే నిర్వహించారు. పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, అధికారులు హైదరాబాద్ యూనిఫైడ్ మెట్రో పాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ జీవన్‌బాబు, హైదరాబాద్ సర్కిల్ కేంద్ర పురాతత్వ శాఖ సూపరింటెండింగ్ డాక్టర్ స్మిత ఎస్ కుమార్ ఈ ప్రాజెక్టుకు సంబంధించిన బ్లూ ప్రింట్‌ను పరిశీలించడమే కాకుండా బంజారా దర్వాజా నుంచి రేశం బాగ్, గోల్కొండ మీదుగా పర్యటించారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి సెవన్ టూమ్స్, గోల్కొండ రూట్‌లలో ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారన్నారు. త్వరలోనే వివిధ శాఖల అధికారులతో కలిసి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర పురాతత్వ అధికారులు సైతం ఈ ప్రాజెక్టుకు సహకరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మహ్మద్ హర్షద్ అహ్మద్, రహీముద్దీన్ తదితరులున్నారు.

ఫీల్డ్ ట్రిప్.. చిన్నారులకు కిక్..



రైతులు కష్టపడి చేసే వ్యవసాయ పనులు, దుక్కి దున్నడం, నాట్లు వేయడం, పంట పొలాలకు నీళ్లు పెట్టడం.. ఇలాంటి ఎన్నో పనులను విద్యార్థులకు స్వయంగా చూపించేందుకు నాచారం అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ చిలక శివకుమార్ ఆధ్వర్యంలో వన్డే కిసాన్ థీమ్ పార్కుకు ఫీల్డ్ ట్రిప్ విజ్ఞాన యాత్రకు మంగళవారం వారిని తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లిన విద్యార్థులు చిన్నచిన్న పనులు చేస్తూ ఎంతో ఉత్సాహంగా గడిపారు.
- మల్లాపూర్

ఉస్మానియా పీఎస్ సీసీ ఫుటేజీ సమర్పించండి

- హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు స్పష్టం చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: అక్రమ నిర్బంధం కేసులో అక్టోబర్ 28 నుంచి 31వ తేదీ వరకు ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లోని సీసీ ఫుటేజీని సమర్పించాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. బీఎన్‌ఎస్‌ఎస్ 35(3) కింద ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తన సోదరుడు భరత్ సింహా రాయుడిని చట్టవిరుద్ధంగా నిర్బంధించారంటూ హైకోర్టులో రంగారెడ్డి జిల్లా రాగన్నగూడ ఎల్‌ఎంటీఎస్ కాలనీకి చెందిన జె.జోయల్‌బాబు పిటిషన్ దాఖలు చేశారు. తప్పుడు ఆరోపణలతో ఉస్మానియా వర్సిటీ ఎస్‌హెచ్‌ఓ, సబ్ ఇన్‌స్పెక్టర్ కాశయ్య హబ్సిగూడలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. స్కిజోఫ్రెనియా పేషెంట్ అని కూడా చూడకుండా వాస్తవాలను దాచిపెట్టి రిమాండ్ కేసు డైరీని సృష్టించారని పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన ఏసీపీ, ఎస్‌హెచ్‌ఓ, ఎస్‌ఐపై శాఖాపరమైన చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. తప్పుడు కేసు పెట్టి వేధింపులకు పాల్పడినందుకు పిటిషనర్‌కు రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని, పీఎస్ సీసీ ఫుటేజీ సమర్పించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ టీ.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఉస్మానియా వర్సిటీ పీఎస్ సీసీ ఫుటేజీని సమర్పించాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 13, నవంబర్, 2024

తాజ్‌కృష్ణలో డిజైర్ ఎగ్జిబిషన్



బంజారాహిల్స్: తాజ్‌కృష్ణ హోటల్‌లో ఏర్పాటు చేసిన డిజైర్ డిజైనరీ లగ్జరీ ఫ్యాషన్ ఉత్పత్తుల ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ ఎగ్జిబిషన్‌ను పలువురు మోడల్స్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు అనితా అగర్వాల్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌లో ఫెస్టివల్, వెడ్డింగ్ సీజన్ ఫ్యాషన్ డిజైనరీ దుస్తులు, ఆభరణాలు, ఇతర ఉత్పత్తులను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన దుస్తులు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు.

మిసెస్ ఆసియాకు విజయ శారదా రెడ్డి



నేటి నుంచి బ్యాంకాక్‌లో ఇంటర్నేషనల్ ప్రెజెంట్–2024 పోటీలు

లక్డీకాపూల్: ప్రఖ్యాత క్లాసిక్ మిసెస్ ఆసియా ఇంటర్నేషల్ పేజెంట్ 2024లో భారత్ తరఫున నగరానికి చెందిన ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ఏ విజయ శారదా రెడ్డి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక పోటీ ఈ నెల 13 నుంచి 19 వరకూ థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో జరగనుంది. ఈ ఏడాది మిసెస్ ఇండియా టైటిల్‌ను కైవసం చేసుకున్న విజయ గతేడాది మిసెస్ ఇండియా– తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టైటిల్‌ను సూపర్ క్లాసిక్ కేటగిరిలో సొంతం చేసుకోవడతో జాతీయ వేదికపై తనదైన ముద్ర వేశారు. తాజాగా అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించడం ఆమె అసాధారణ ప్రతిభ, మహిళలను ప్రేరేపించే కృషికి సాక్ష్యంగా నిలుస్తోంది. ఎన్నో రంగాల్లో విజయ కేతాలను ఎగురవేసిన విజయ రెండు సార్లు గిన్నిస్ వరల్డ్ రికార్డులు పొందడమే కాకుండా విద్య, వ్యాపార రంగాల్లో ఆమె చేసిన కృషికి జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వరించాయి. ఈ నేపథ్యంలో మిసెస్ ఆసియా ఇంటర్నేషనల్ పేజెంట్ 2024లో ఆమె పాల్గొనడం దేశానికే గర్వకారణంగా పేర్కొనవచ్చు. అందం, విజ్ఞానంలో ఉన్నత శిఖరాలు అధిరోహించారు. ఈ కాంటెస్టులో ఆసియా ఖండంలోని వివిధ దేశాలకు చెందిన వారు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు.


భాగ్యనగరాన్ని.. కమ్మేస్తున్న క్లౌడ్స్..

కరోనా అనంతరం క్లౌడ్ కిచెన్ ట్రెండ్



దేశంలోనే కాదు యావత్ ప్రపంచంలో.. విభిన్న ఆహార రుచులకు కేంద్రమైన నగరాల్లో హైదరాబాద్ కూడా ప్రముఖమైనది. ప్రస్తుత కాంటినెంటల్ వంటకాలే కాదు నిజాం కాలం నాటి స్థానిక సాంస్కృతిక వంటకాలతోనూ మన భాగ్యనగరం 'బౌల్ ఆఫ్ డెలిషియస్ డిష్'గా గుర్తింపు పొందింది. ఇందులో భాగంగా నగరంలో స్థానిక వంటకాలతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన రుచులు కూడా ఆదరణ పొందుతున్నాయి. ఈ రుచుల కోసమే ప్రత్యేకంగా రెస్టారెంట్లు కూడా వెలిశాయి. అయితే కరోనా అనంతరం ఈ రంగంలో పెను మార్పులు వచ్చాయి. ముఖ్యంగా క్లౌడ్ కిచెన్. ఇంటి నుంచి బయటికి వెళ్లకుండా ఫుడ్ ఆర్డర్ పెట్టుకోవడంతో మొదలైన ఈ కల్చర్.. వెళ్లే అవకాశమున్నా ఆన్‌లైన్ లోనే ఆర్డర్ పెట్టేంతగా మార్పు చెందింది.

- సాక్షి, సిటీబ్యూరో





- పలు 'ఫైవ్ స్టార్' హోటళ్లూ అదే దారిలో
- సిటీలో అతి పెద్ద వ్యాపారంగా అవతరణ
- ఊపందుకున్న స్విగ్గీ, జొమాటో
- బ్రాండ్ ఇమేజ్ దృష్ట్యా ఈ దారిలోకి రాని 5 స్టార్ హోటల్స్
- చెక్ పెడుతున్న ఐటీసీ వంటి స్టార్ హోటల్స్
- అథెంటిసిటీ మిస్ అవ్వకుండా సేవలు

హైదరాబాద్ వైబ్స్

నగరంలో విభిన్న రుచులు విభిన్న సంస్కృతుల సమ్మేళనానికి నిదర్శనంగా నిలుస్తుంది. హైదరాబాద్ బిర్యానీ మొదలు ఇక్కడి స్ట్రీట్ ఫుడ్ వరకూ అన్ని రుచులూ ఆన్‌లైన్, డిజిటల్ వేదికగా ఒక్కొక్క ఆర్డర్‌తో అందుబాటులో ఉన్నాయి. ఇందులో స్థానిక వంటకాలే కాదు చైనీస్, కొరియన్, మొగలాయి, కరాచి వంటి రుచులను అందించే రెస్టారెంట్లు తమ డోర్ స్టెప్ సేవలను అందిస్తున్నాయి. వీరికి వారధులుగా స్విగ్గీ, జొమాటో వంటి ఆన్‌లైన్ వేదికలు ఉన్నాయన్న విషయం విధితమే. అయితే.. ఈ కోవలోకి స్టార్ రెస్టారెంట్లు కాస్త విముఖతను ప్రదర్శించాయి. నాణ్యత, బ్రాండ్ వాల్యూ విషయంలో ఈ సేవలు అందించలేదనేది నిపుణుల మాట. కానీ ప్రస్తుతం నగరంలోని టాప్ 5 స్టార్ హోటల్స్, రెస్టారెంట్లు సైతం క్లౌడ్‌కిచెన్‌కు ఆసక్తి చూపిస్తున్నాయి. వాటి పాకశాస్త్ర నైపుణ్యాలతో నాణ్యత, ప్యాకింగ్, బ్రాండ్ వాల్యూ వంటి అంశాల్లో చాలా జాగ్రత్తలు తీసుకుని మరీ ఈ సేవలు ప్రారంభిస్తున్నాయి. విలాసవంతమైన జీవితాల్లో ఈ లోటును పూడ్చడానికి స్టార్ హోటళ్ల యాజమాన్యం ముందుకు వస్తున్నాయి. ముఖ్యంగా గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లో స్టార్ హోటళ్ల డిజిటల్ ఫుడ్ సేవలు ఊపందుకున్నాయి.

అందరూ అదే దారిలో..

డైనింగ్‌తో పాటు ఈ క్లౌడ్ కిచెన్‌లో కూడా మంచి లాభాలు వస్తుండటంతో పలు రెస్టారెంట్లు ఈ డిజిటల్ ఇన్నోవేషన్‌కు సై అంటున్నాయి. కానీ స్టార్ హోటళ్లు మాత్రం అంతగా ఆసక్తి చూపించలేదు. అయితే గత కొంత కాలంగా 5 స్టార్ హోటళ్లు సైతం క్లౌడ్ కిచెన్‌ను ప్రారంభించాయి. వాటి బ్రాండ్ వాల్యూను కొనసాగిస్తూనే, పాకశాస్త్ర నైపుణ్యాలను డిజిటల్ వేదికతో అనుసంధానం చేస్తూ సేవలందిస్తున్నాయి. ఇక క్లౌడ్ కిచెన్ సేవలను నగరవాసులు ఆస్వాదిస్తున్న తీరు అద్భుతం. ఈ నేపథ్యంలో వారికి మా సేవలను సైతం అందంచాలనే లక్ష్యంతో ఐటీసీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఫుడ్‌టెక్ సేవలు ప్రారంభించాం. స్విగ్గీ, జొమాటో వంటి వేదికలతో అనుసంధానమై మా పసందైన రుచుల పండుగను ఆహార ప్రియుల వద్దకే చేర్చుతున్నాం. ముఖ్యంగా మా ప్రయత్నంలో అధిక–నాణ్యత భోజనాన్ని అందించడంతో పాటుగా పర్యావరణహితమైన ప్యాకింగ్‌ను కొనసాగిస్తున్నాం.

డిజిటలీకరణతో అద్భుత ఫలితాలు

ఫుడ్, హోటల్స్ రంగంలో అధునాతన డిజిటలీకరణ అద్భుత ఫలితాలను అందిస్తుంది. ఫుడ్ సేఫ్టీ ప్రోటోకాల్స్‌లో పాకశాస్త్ర నిపుణులైన స్టార్ హోటల్ చెఫ్‌లు, కిచెన్ మేనేజర్లు విశేషమైన శిక్షణ ఉంటంతో ఈ విధమైన క్లౌడ్ కిచెన్‌కు మంచి ఆదరణ లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా వివిధ దశల్లో ఆహార పదార్థాల తనిఖీ, తయారీ విధానంలోనూ అధునాతన సాంకేతికత వినియోగించడంతో పాటు శాటిలైట్ కిచెన్‌లలో ఉపయోగించే యాప్‌లు ఈ వంటలకు మరింత నాణ్యతను, ఖచ్చితత్వాన్ని పెంపొందిస్తున్నాయి. ఈ ఫుడ్ టెక్ సేవలలో సుస్థిరతే ప్రధాన లక్ష్యంగా స్టార్ హోటల్స్ ప్యాకింగ్‌ను వినూత్నంగా చేపడుతున్నాయి. పర్యావరణ పరిరక్షణకు **ప్రాధాన్యతనిస్తూ, మారే ఉష్ణోగ్రతలు ఆహారాన్ని పాడు చేయకుండా స్పిల్లేజ్ ప్రూఫ్ కంటైనర్‌లను ఉపయోగిస్తుండటం విశేషం.**





ఫుడ్ లవర్స్ అభిరుచికి అనుగుణంగా..

నగరంలోని ఫుడ్ లవర్స్ ఇష్టపడే రుచులకు అనుగుణంగా, మా నాణ్యతా ప్రమాణాలను పెంచుకుంటూ 3 రకాల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చాం. ఇందులో భాగంగా ప్రముఖ మాస్టర్ చెఫ్‌లచే రూపొందించబడిన దాల్ మఖ్నీ, కబాబ్‌లు, ర్యానీలతో సహా గౌర్మెట్ నార్త్ ఇండియన్ వంటకాలను అందించడానికి 'ఐటీసీ మాస్టర్ చెఫ్ క్రియేషన్స్', ఆరోగ్యానికి హితమైన మిల్లెట్ కిచిడీ, ఇంటి వంటలను తలపించే చపాతీలు, అన్నం వంటి వాటికోసం 'ఐటీసీ ఆశీర్వాద్ సోల్ క్రియేషన్స్', క్రోసెంట్స్, బేగెల్స్, గౌర్మెట్ బ్రెడ్‌లు వంటి బేకరీ ఐటమ్స్ కోసం 'ఐటీసీ సన్‌ఫీస్ట్ బేక్ క్రియేషన్స్' సేవలు ఉన్నాయి. ఈ మూడు రకాల సేవలను హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నైలోని 19 క్లౌడ్ కిచెన్‌లలో ప్రారంభించాం.

– రోహిత్ భల్లా, ఫుడ్ టెక్ బిజినెస్ హెడ్, ఐటీసీ లిమిటెడ్.

'కామిక్ కాన్'తో యమహా..




సాక్షి, సిటీబ్యూరో: వినోదానికి చిరునామా లాంటి కామిక్ కాన్ ఈవెంట్ నగరంలో ఈ నెల 15న ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ ద్విచక్ర వాహనాల బ్రాండ్ యమహా.. కామిక్ కాన్ ఈవెంట్‌లో భాగం పంచుకోనుంది. ఈ విషయాన్ని యమహా నగర ప్రతినిధులు తెలిపారు. ఈ ఈవెంట్‌లో బ్లూ థీమ్డ్ డిజైన్‌తో ఒక ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను తాము ఏర్పాటు చేస్తున్నామని, పాప్ కల్చర్ ప్రియులైన నగరవాసులతో పాటు ఆటోమొబైల్ ఇంజనీరింగ్ విశేషాల పట్ల ఆసక్తి కలిగిన వారిని ఈ జోన్ ఆకట్టుకుంటుందని వివరించారు. తమ పెవిలియన్ సందర్శకులకు ఫొటో అవకాశాలను కూడా అందిస్తున్నామని తెలియజేశారు.

క్రేజీ క్యాండిల్ లైట్ కన్సర్ట్..



- సిటీలో ఘనంగా ప్రారంభం కానున్న గ్లోబల్ కన్సర్ట్
- పారిస్ నుంచి న్యూయార్క్ వరకూ యమ క్రేజ్
- ఈ నెల 15న గ్లోబల్ సింఫనీగా సందడి చేయనున్న నిఖిత్ దోర్బలా

సాక్షి, సిటీబ్యూరో: లైవ్ యువర్ సిటీ పేరుతో ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన 'క్యాండిల్ లైట్ కన్సర్ట్' నగరానికి కూడా వచ్చేసింది. ప్రపంచవ్యాప్తంగా 150కి పైగా నగరాల్లో ఉర్రూతలూగించిన ఈ సిరీస్ 'ట్రిబ్యూట్ టు కోల్డ్ ప్లే' పేరుతో హైదరాబద్‌లోనూ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 15న బంజారాహిల్స్‌లోని రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్ వేదికగా ప్రతిష్టాత్మకంగా ప్రీమియర్ షో ప్రారంభించనున్నారు. ఈ 'క్యాండిల్ లైట్ కన్సర్ట్'లో భాగంగా స్థానిక ఫేమస్ మ్యూజిక్ ఆర్టిస్టుల సంగీత స్వరాలతో పోడియం హోరెత్తనుంది. క్యాండిల్ లైట్స్ వెలుతురులో సంగీతాన్ని ఆస్వాదించే వినూత్న వేదికకు మన నగరం సాక్షిగా నిలవనుంది. ఈ వేడుక ప్రారంభం మాత్రమే.. రానున్న డిసెంబర్ నెలలో హయత్ హైదరాబాద్ గచ్చిబౌలి వేదికగా 'క్వీన్ వర్సెస్ అబ్బా' పేరుతో మరో కన్సర్ట్‌కు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మ్యూజిక్ కన్సర్ట్‌లో సారంగి, తబలా వంటి కాలాతీత శాస్త్రీయ వాయిద్యాలతో అలరించనున్నారు.



పారిస్ టూ న్యూయార్క్..

'క్యాండిల్ లైట్ కన్సర్ట్' సాధారణంగా నిర్వహించే కన్సర్ట్‌లాంటిది కాదు. పారిస్‌లోని చారిత్రాత్మక వేదికలు మొదలు న్యూయార్క్‌లోని మోడ్రన్ వేదికల వరకూ ప్రపంచ ప్రయాణం చేసి మిలియన్ల మ్యూజిక్ లవర్స్‌ను అలరించిన గ్లోబల్ షో. ఈ కన్సర్ట్‌కు అంతర్జాతీయంగా ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఉండటం విశేషం. ప్రస్తుతం యావత్ ప్రపంచం అంతా హైదరాబాద్ వైపు చూస్తున్న వేళ లైవ్ యువర్ సిటీ అంటూ నగరానికి విచ్చేసింది. ప్రముఖ భారతీయ పియానిస్ట్ నిఖిత్ దోర్బలా సందడి చేయనున్న షో ఈ నెల 15న జరగనుండగా, డిసెంబర్ 6, 22, జనవరి 11 తేదీల్లో నగరంలోని విభిన్న వేదికల్లో ఈ సంగీత కచేరి జరగనుంది.

థ్రిల్ కోసమే..

ఎపిక్ ఫుడ్ అడ్వెంచర్ ఫొటోలు పోస్ట్ చేసిన విజయ్‌దేవరకొండ



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ నటుడు విజయ్‌దేవరకొండ జైపూర్‌లో అత్యంత ఎత్తులో హాట్ ఎయిర్ బెలూన్‌లో విహరించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను థ్రిల్ కోసం జీవిస్తున్నాను. చేసే పనైనా, అభిరుచులైనా, అనుభవాలైనా నిత్యం గొప్పవాటి కోసం వెతుకుతుంటానని అన్నాడు. రుచి విషయంలో కేఎఫ్‌సీ ఎల్లప్పుడూ ఎపిక్‌గానే ఉంటుందన్నారు. హాట్, క్రిస్పీ చికెన్ నుండి చికెన్ పాప్‌కార్న్, జింజర్ బర్గర్‌ల వరకూ వారి ఫుడ్‌కి అభిమానినని తెలిపాడు. రానున్న చిత్రం కోసం అంతర్జాతీయ యాక్షన్ డైరెక్టర్‌తో కలిసి పనిచేస్తున్న విజయ్ తాజా ఎపిక్ ఫుడ్ అడ్వెంచర్‌కు సంబంధించిన చిత్రాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

దమన నీతి.. అరాచక రీతి

ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులు నొక్కేస్తున్న బాబు సర్కారు

ఏపీలో పోలీసులను అడ్డుపెట్టుకుని నిరంకుశత్వం

కంది పప్పు తూకంలో
తేడా ఉందన్నందుకు కేసు..
పింఛన్ కోసం పడిగాపులు పడుతూ
పడిపోయిన ఓ అవ్వ ఫొటోను సోషల్
మీడియాలో పెట్టినందుకు కేసు..
రెండేళ్ల క్రితం కార్టూన్‌ను
ఫార్వర్డ్ చేసినందుకూ కేసు..
బూట్లు వేసుకుని పూజలు
చేసిందెవరని అడిగినందుకు కేసు..
చంద్రబాబు జైలులోకెళ్తున్నప్పటి
ఫొటోను షేర్ చేసినందుకు కేసు..

ఇలా అతి సామాన్య విషయాలపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడాన్ని కూడా పాలకులు సహించలేక పోతున్నారంటే అర్థమేంటి? రాష్ట్రంలో నిరంకుశం రాజ్యమేలుతోందని స్పష్టమవుతోంది. రాజకీయాల్లోకి అడుగు పెట్టాక విమర్శలు సహజం. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట నెరవేర్చకుండా మోసం చేసినప్పుడు ఆ విమర్శలు బాణాల్లా గుచ్చుకునేలా ఉంటాయన్నది కూడా సహజం. ఇందుకు సిద్ధపడిన వారే రాజకీయాల్లో కొనసాగాలి. అలా కాకుండా ప్రశ్నిస్తే కేసులు పెట్టి తాట తీస్తాం అంటే సమాజం ఒప్పుకోదు. చూసినన్నాళ్లు చూసి తిరగబడుతుంది.



సాక్షి, అమరావతి : 'ఎన్నికల హామీలను గుర్తు చేస్తే నేరం.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే ఘోరం.. ఇది అన్యాయం అంటేనూ మహాపరాధం.. చివరికి వాట్సాప్ గ్రూపుల్లో ప్రభుత్వ కార్యకలాపాలపై చాటింగ్ చేసినా ఉపేక్షించం ' అంటోంది కూటమి ప్రభుత్వం. తమను ప్రశ్నించే వారే ఉండకూడదన్నట్లు నియంతృత్వంతో వ్యవహరిస్తోంది. రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటనా హక్కును కాలరాస్తోంది. ఇందులో భాగంగానే మూడు నాలుగు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియా యాక్టివిస్టులపై దుర్మార్గంగా తప్పుడు కేసులు పెడుతుండటం కనిపిస్తోంది. ప్రభుత్వ కార్యక్రమాలు, కార్యాకలాపాలపై ఏ రాష్ట్రంలో అయినా సరే విమర్శలు సహజం. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి కూడా ఇది ఉన్నదే. అప్పట్లో విమర్శలు, ప్రతి స్పందనలు రెండు మూడు రోజుల తర్వాత వార్తా పత్రికల్లో కనిపించేవి. ప్రస్తుతం శాస్త్ర సాంకేతిక విజ్ఞానం పెరిగి పోవడంతో ఆ పరిస్థితిలో పూర్తిగా మార్పు వచ్చింది. ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా వేదికలు పెరిగి పోవడంతో ఎప్పటికప్పుడు నిమిషాల వ్యవధిలో ప్రభుత్వ నిర్ణయాలపై పౌరుల నుంచి ప్రతి స్పందనలు వస్తున్నాయి. ఈ మార్పునకు అనుగుణంగా నడుచుకోవడం చేతకాని పాలకులు.. తమను ప్రశ్నించడమే నేరం అన్నట్లు పోలీసు వ్యవస్థను గుప్పెట్లో పెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారి ద్వారా ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులతో విరుచుకుపడుతోంది.

వివరాలకు
ఈ క్యూఆర్ కోడ్‌ను
స్కాన్ చేయండి

అదుపులోకి తీసుకున్న వారిని 24 గంటల్లో న్యాయ స్థానంలో హాజరు పరచకుండా నిరంకుశంగా వ్యవహరిస్తోంది. మహిళలు, వృద్ధులు.. అన్న విచక్షణ లేకుండా థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తోంది. ఎఫ్ఐఆర్‌లలో అక్కసున్న వారి పేర్లు చేరుస్తోంది. ఒక్కొక్కరిపై ఐదారు కేసులు నమోదు చేయిస్తూ రాక్షసానందం పొందుతోంది. నాలుగైదు రోజుల్లోనే 150 అక్రమ కేసులు నమోదు చేయడమే ఇందుకు నిదర్శనం.

భయభ్రాంతులకు గురి చేయడమే లక్ష్యం

సోషల్ మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక పోస్టులను కూటమి ప్రభుత్వ పెద్దలు ఏ మాత్రం సహించలేకపోతున్నారు. తప్పిదాలను సరిదిద్దుకోవాల్సింది పోయి.. తప్పులను ఎత్తి చూపిన వారిపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. ఇందులో భాగంగా లక్ష్యంగా ఎంచుకున్న వారి పేర్లతో తమ ప్రత్యేక సోషల్ మీడియా బృందాల ద్వారా ఫేక్ ఐడీలు సృష్టిస్తున్నారు. ఆపై వారే తప్పుడు పోస్టులు పెడుతున్నారు. అనంతరం ఆ పోస్టులు చూపుతూ వివిధ సెక్షన్లపై కేసులు నమోదు చేస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వంపై ఎవరైనా సోషల్ మీడియాలో విమర్శలు చేస్తే నేరుగా అరెస్ట్ చేయకూడదన్న సుప్రీంకోర్టు తీర్పును సైతం ఉల్లంఘిస్తున్నారు. ముందుగా 41 ఎ నోటీసు ఇచ్చి, విచారించాలన్న నియమాన్ని ఏ మాత్రం పాటించడం లేదు. విచారణల పేరుతో పోలీస్ స్టేషన్లకు రప్పించుకుని చిత్ర హింసలకు గురి చేస్తున్నారు. ఇందుకోసం తమ చెప్పు చేతల్లో పని చేసే పోలీసు అధికారులను వాడుకుంటున్నారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో తప్పుడు కేసులు నమోదు చేయించి కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటుండటం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. అయినా ప్రభుత్వ పెద్దలు లెక్కలేనితనంతో తప్పుడు కేసుల పరంపర కొనసాగిస్తుంటం బరితెగింపునకు నిదర్శనం. ప్రభుత్వ పెద్దల సూచనతో పోలీసు మూకలు అర్ధరాత్రి, అపరాత్రి అని కూడా చూడకుండా బీభత్సం సృష్టిస్తున్నారు. ఉన్నఫలంగా ఎత్తుకెళ్లిపోతున్నారు. కుటుంబ సభ్యులు స్థానిక పోలీసు స్టేషన్‌కు వెళ్లి అడిగితే మాకేం తెలీదని చెబుతున్నారు.



వర్రా రవీంద్రారెడ్డిని మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచేందుకు తీసుకెళుతున్న పోలీసులు

ఎన్‌కౌంటర్ చేస్తామని బెదిరించారు

మెజిస్ట్రేట్ ఎదుట పోలీసులపై సోషల్ మీడియా యాక్టివిస్ట్ వర్రా రవీంద్రారెడ్డి వాంగ్మూలం

కడప అర్బన్: తాము చెప్పినట్టు వినకపోతే ఎన్‌కౌంటర్ చేస్తామని పోలీసులు బెదిరించారని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ వర్రా రవీంద్రారెడ్డి మెజిస్ట్రేట్‌కు వాంగ్మూలం ఇచ్చారు. ఈ విషయాన్ని రవీంద్రారెడ్డి తరఫు న్యాయవాదులు నాగిరెడ్డి, ఓబులరెడ్డి మీడియాకు మంగళవారం తెలిపారు. న్యాయవాదులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్రా రవీంద్రారెడ్డిని ఈ నెల 4న రాత్రి పోలీసులు కడప తాలూకా పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి 41ఏ నోటీసు ఇచ్చారు. తరువాత తనతో వచ్చిన న్యాయవాది హరినాథరెడ్డి, స్నేహితుడు మహేశ్వర్‌రెడ్డిని పోలీసులు ఇబ్బందులకు గురి చేశారు. ఈ నేపథ్యంలోనే వర్రా రాఘవరెడ్డి హైదరాబాద్‌కు వెళ్లారు. కాగా.. రవీంద్రారెడ్డి కేసు విషయమై జిల్లా ఎస్పీని బదిలీ చేయడంతో పాటు, సీఐని సస్పెండ్ చేశారని తెలిసి అతడు స్వచ్ఛందంగా లొంగిపోయేందుకు స్నేహితులైన వెంకటసుబ్బారెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డితో కలిసి కారులో కడప వస్తుండగా.. ఈ నెల 8న కర్నూలు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తరువాత ఓ ఇంట్లోకి రవీంద్రారెడ్డిని తీసుకెళ్లి పోలీసులు విచారించారు. ఆ సమయంలో ఎన్‌కౌంటర్ చేసేందుకు వెనుకాడబోమని పోలీసు లు అతడిని బెదిరించారు. తాము చెప్పినట్టుగా వాంగ్మూలం ఇవ్వకపోతే భార్యను, కుమార్తెను అథోగతి పాల్జేస్తామని రవీంద్రారెడ్డిని హెచ్చరించారు. ఎంపీ అవినాష్‌రెడ్డి, అతడి పీఏ రాఘవరెడ్డి ప్రోద్బలంతోనే వైఎస్ విజయమ్మ, వైఎస్ షర్మిల, వైఎస్ సునీతపై పోస్టింగ్‌లు చేశానని ఒప్పుకో వాలంటూ బలవంత పెట్టారు. తాము చెప్పినట్టు వినకపోతే ఎక్కువగా కేసులను పెట్టి జీవితాంతం జైలులో ఉండేలా చూస్తామని కూడా పోలీసులు హెచ్చరించారు. ఆ నేపథ్యంలోనే పోలీసులు థర్డ్ డిగ్రీని ప్రయోగించారు. థర్డ్ డిగ్రీ కారణంగా తన శరీరంపై అయిన గాయాలను మెజిస్ట్రేట్‌కు రవీంద్రారెడ్డి చూపించారు.

పోలీసులపై ప్రైవేట్ కేసులు వేస్తా

- వేధింపులను న్యాయపరంగా ఎదుర్కొంటా
- ఇంటూరి రవికిరణ్ భార్య సుజన వెల్లడి



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ ఇంటూరి రవికిరణ్‌ను గత నెల 21 నుంచి పోలీసులు వేధిస్తూనే ఉన్నారని ఆయన భార్య సుజన చెప్పారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. గుడివాడలో రెండు కేసులు, అరండల్‌పేటలో ఒకటి, వైజాగ్‌లో రెండు ఇలా మొత్తం 9 కేసులు పెట్టారని చెప్పారు. గుడివాడ, గుంటూరు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పిన తర్వాత దువ్వాడ పోలీసులు వచ్చి సంతకం పెట్టాలని తీసుకెళ్లి దారుణంగా ప్రవర్తించారని ఆమె వాపోయారు. రాష్ట్రంలో ఎక్కడ కేసు నమోదైనా తన భర్త రవికిరణ్ పేరు పెడుతున్నారన్నారు. తన భర్తను వేధిస్తున్న పోలీసులపై ప్రైవేట్ కేసులు వేస్తానని, పోలీస్ కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటానని చెప్పారు. ఒక స్టేషన్‌లో స్టేషన్ బెయిల్ రాగానే.. ఇంకో పోలీస్ స్టేషన్ నుంచి పోలీసులొచ్చి తన భర్తను తీసుకెళుతున్నారని పేర్కొన్నారు. ఎక్కడికి తీసుకెళుతున్నారో, కేసు ఏమిటో అనేది కూడా చెప్పటం లేదన్నారు. రాజమండ్రి సీఐ తన భర్త పట్ల చాలా దారుణంగా ప్రవర్తించారని, ఆయనను కొట్టారని, రవి చెప్పనవి కూడా చెప్పినట్టు రాసి సంతకాలు పెట్టించుకున్నారని తెలిపారు. తన భర్త ఏ రోజూ ఇతరులపై అసభ్యకరంగా పోస్టులు పెట్టలేదని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఓటర్లకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ ప్రశ్నించటం తప్పా? అని ప్రశ్నించారు. పద్ధతిగా ఉంటూ సమాజంలో విలువలతో కూడిన జీవితాన్ని గడిపే తమను ఇలా వేధింపులకు గురి చేయటం ఏమిటని ఆమె ప్రశ్నించారు. పోలీసులు ఎలాంటి ఇబ్బందులకు గురి చేసినా న్యాయబద్ధంగానే ముందుకు వెళ్తామని ఆమె చెప్పారు. మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోషల్ మీడియా యాక్టివిస్ట్ ఇంటూరి రవికిరణ్ భార్య ఇంటూరి సుజన కలిశారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌ను కలిసి పోలీసులు తన భర్తను వేధిస్తున్నారని, ఆయన తప్పు చేసినట్టు బలవంతంగా సంతకాలు చేయించారని ఆమె వివరించారు. తన భర్తపై తప్పుడు కేసులు పెట్టి గతనెల 21 నుంచి స్టేషన్ల చుట్టూ తిప్పుకున్నారని ఆమె పేర్కొన్నారు. ఇంటూరి కుటుంబ సభ్యులకు వైఎస్ జగన్ ధైర్యం చెప్పి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఏపీలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోంది



ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్ విజయభారతికి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, మేడా రఘునాథ్ రెడ్డి, డాక్టర్ తనూజారాణి, గొల్ల బాబూరావు

- భావప్రకటన స్వేచ్ఛకు తూట్లు పొడుస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారు
- జాతీయ మానవ హక్కుల సంఘానికి వైఎస్సార్‌సీపీ ఎంపీల ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, భావ ప్రకటన స్వేచ్ఛకు పోలీసులు తూట్లు పొడుస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎంపీలు జాతీయ మానవ హక్కుల సంఘానికి (ఎన్‌హెచ్ఆర్‌సీకి) ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, మేడా రఘునాథ్ రెడ్డి, లోక్‌సభ సభ్యులు డాక్టర్ తనూజరాణి, గొల్ల బాబూరావు మంగళవారం ఢిల్లీలో ఎన్‌హెచ్ఆర్‌సీ చైర్‌పర్సన్ విజయ భారతిని కలిసి ఈమేరకు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో కొద్దిరోజులుగా జరుగుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తల అక్రమ అరెస్టులు, మానవ హక్కుల ఉల్లంఘనలు, ఎక్కడెక్కడ ఎవరెవర్ని అరెస్టు చేశారు, తమ కార్యకర్తలపై మోపిన కేసుల వివరాలన్నింటినీ ఎన్‌హెచ్ఆర్‌సీకి అందజేశారు. ప్రభుత్వ తీరును ప్రశ్నించిన ప్రతి ఒక్కరిపై కేసులు బనాయిస్తూ అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ అక్రమ అరెస్టులపై తక్షణం స్పందించి న్యాయం చేయాలని ఎన్‌హెచ్ఆర్‌సీని కోరారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కస్టోడియల్ టార్చర్ చేస్తున్నారని చెప్పారు. సోషల్ మీడియా కార్యకర్తలపై ప్రభుత్వం బీఎన్ఎస్ సెక్షన్ 111 పెట్టడం ఘోరమని అన్నారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు 57 మందిపై అక్రమ కేసులు పెట్టారని, పోలీసుల వేధింపుల కారణంగా 12 మంది ఆచూకీ తెలియడం లేదని చెప్పారు. కార్యకర్తలను హింసించి, భయపెట్టి వారికి అనుకూలమైన స్టేట్‌మెంట్లు తీసుకుంటున్నారని ధ్వజమెత్తారు.

ఇవ్వండి ఫిర్యాదు.. పెట్టేద్దాం కేసు

- సోషల్ మీడియా యాక్టివిస్టులపై కొనసాగుతున్న కేసుల పరంపర
- తుళ్లూరులో రాంగోపాల్ వర్మపై ఫిర్యాదు
- జనసేన నేత ఫిర్యాదుతో సినీ నటుడు పోసానిపై కేసు

సాక్షి నెట్‌వర్క్: వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ రాజకీయాలకు తెరతీసిన కూటమి పార్టీలు సోషల్ మీడియా యాక్టివిస్టులపై రెచ్చిపోతున్నా యి. ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి, ఇతర మంత్రులను సోషల్ మీడియాలో ప్రశ్నించారని ప్రభు త్వమే నేరుగా కేసులు పెట్టి వేధించడంపై విమర్శ లు రావడం, న్యాయస్థానం సైతం గట్టిగా ప్రశ్నించడంతో ప్రభుత్వం పచ్చ బ్యాచ్‌ను రంగంలోకి దించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియా లో పోస్టులు పెడుతున్న కొందరి పేర్లను ఎంపిక చేసి పచ్చ పార్టీ కార్యకర్తల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయిస్తోంది. ఫిర్యాదులు అందుకున్నదే తడవుగా పోలీసులు ఎక్కడికక్కడ కేసులు నమోదు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి చెందిన బుడితి సుజన్‌కుమార్ అనే దివ్యాంగుడు సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టారంటూ భీమవరం పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇద్దరు వ్యక్తుల సాయం ఉంటేనే గానీ అడుగు ముందుకు వేయలేని సుజన్‌కుమార్‌ను స్టేషన్‌కు రావాలంటూ పోలీసుల నుంచి పదేపదే ఫోన్లు రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మపై తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. రామ్‌గోపాల్ వర్మ సోషల్ మీడియాలో దున్నపో తులకు పవన్‌కళ్యాణ్, లోకేశ్ ఫొటోలు మార్ఫింగ్ చేసి పెట్టడం, చంద్రబాబును పవన్‌కళ్యాణ్ ఎత్తుకున్నట్టు పెట్టిన పోస్టులపై తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నూతలపాటి రామారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు





నమోదు చేశారు. విజయవాడ కమిషనరేట్ పరిధిలోని భవానీపురం పోలీసు స్టేషన్‌లో సినీ నటుడు పోసాని కృష్ణమురళిపై కేసు నమోదైంది. జనసేన సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోసాని కృష్ణమురళి గతంలో హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మీడి యా సమావేశం నిర్వహించి జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలు పార్టీ పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించడ మే కాకుండా రాష్ట్రంలో శాంతిభద్రతలకు ఆటంకం కలిగించే విధంగా ఉన్నాయని బాడిత శంకర్ ఫిర్యాదులో పేర్కొన్నారు.



నేడు ఏపీ బడ్జెట్‌పై వైఎస్ జగన్ మీడియా సమావేశం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024–25కు సంబంధించిన రాష్ట్ర బడ్జెట్‌పై బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఈ సమావేశం ఉంటుందని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం తెలిపింది.

కొత్తగా నాలుగు డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌లు

- హైదరాబాద్‌లో ఉన్న ల్యాబ్ ఆధునీకరణ
- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి
- ఫార్మా కంపెనీలు, దుకాణాల్లో విస్తృత తనిఖీలకు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా 4 కొత్త డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న ల్యాబ్ ఆధునీకరణతో పాటు కొత్త ల్యాబ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మషల్కర్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల సంఖ్యను పెంచేందుకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రస్తుతం 71 మంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే ఉన్నారని, అదనంగా కనీసం 150 (అదనంగా ఇంకో 80 పోస్టులు) మంది అవసరం అని అధికారులు మంత్రికి తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి అవసరమైన మేర పోస్టులు మంజూరు చేయిస్తామని మంత్రి పేర్కొన్నారు. మంగళవారం డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు, తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎంఎస్ఐడీసీ) అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. నాసిరకం, నకిలీ మందులు తయారు చేసే సంస్థలపై, వాటిని విక్రయించేవారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫార్మా కంపెనీలు, ఔషధ తయారీ యూనిట్లు, మందుల దుకాణాల్లో మరింత విస్తృతంగా తనిఖీలు చేయాలని సూచించారు. డ్రగ్స్‌కు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్లలో ఫిర్యాదుల విభాగాలు (కంప్లైంట్ సెల్స్), వీటి ఆకస్మిక తనిఖీల కోసం రాష్ట్ర స్థాయిలో విజిలెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు పంపిణీ చేసే మందుల కొనుగోలు విషయంలో టీజీఎంఎస్ఐడీసీకి అవసరమైన సహకారం అందించాలని డీసీఏ అధికారులకు సూచించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ, డీసీఏ డీజీ వీబీ కమలాసన్‌రెడ్డి, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ సహదేవరావు, డీసీఏ జాయింట్ డైరెక్టర్ జి.రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

రౌండప్

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

- ఢిల్లీ– చెన్నై మార్గంలో నిలిచిపోయిన రైళ్లు
- రాఘవాపూర్–రామగుండం మధ్యలో ప్రమాదం
- ఘజియాబాద్‌కు స్టీల్ లోడుతో వెళుతున్న గూడ్స్
- పూర్తిగా ధ్వంసమైన రైల్వే లైన్స్, కరెంట్ స్తంభాలు
- పునరుద్ధరణకు 24 గంటలు పట్టే అవకాశం



చెల్లాచెదురుగా పడిపోయిన వ్యాగన్లు

సాక్షి, పెద్దపల్లి/రామగుండం: పెద్దపల్లి జిల్లాలో ఓ గూడ్స్ రైలు మంగళవారం పట్టాలు తప్పటంతో ఢిల్లీ–చెన్నై మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. నిజామాబాద్ నుంచి ఘజియాబాద్ వైపు 43 వ్యాగన్లతో ఐరన్ కాయల్స్ లోడుతో వెళుతున్న గూడ్స్ రైలులోని 11 వ్యాగన్లు పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్–కన్నాల గేట్ మధ్యలో 282/35 పోల్ వద్ద పట్టాలు తప్పాయి. దీంతో ఈ మార్గంలో ఎటువైపు రైలు అటువైపు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పునరుద్ధరణ పనులు చేపట్టారు. మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, ఓదెల, జమ్మికుంట తదితర రైల్వే స్టేషన్లలో రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మూడు లైన్లు ధ్వంసం

కన్నాల గేట్ వద్ద 11 వ్యాగన్లు పట్టాలపై పడిపోవడంతో కాజీపేట్–బల్లార్షా మధ్య ఉన్న మూడు రైల్వే లైన్స్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాద తీవ్రతకు పట్టాలు విరిగిపోయి చెల్లాచెదరయ్యాయి. కరెంట్ పోల్స్ సైతం విరిగిపోయాయి. వ్యాగన్లు ఒక్కదానిపైకి ఒక్కటి ఎక్కడంతో ట్రాక్ పునరుద్ధరణ పనులు కష్టంగా మారాయి. రైలు ఇంజిన్, గార్డ్ వ్యాగన్ పట్టాలు తప్పలేదు. పునరుద్ధరణ పనులు రాత్రి 11 గంటల తరువాత మొదలయ్యాయి. రైలు ఇంజిన్‌వైపు ఉన్న 8 వ్యాగన్లతోసహా గూడ్స్‌ను రామగుండంకు తరలించారు. భాగ్యనగర్ రైలు రాఘవాపూర్‌కు చేరుకోగా, దానిని వెనుకకు మళ్లించి పెద్దపల్లిలో ప్రయాణికులను దింపివేశారు. వరంగల్ వైపు వెళ్లే మరికొన్ని సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రామగుండం, మంచిర్యాల రైల్వేస్టేషన్లలో నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. రైళ్ల రాకపోకలను పునరుద్ధరించేందుకు కనీసం 24 గంటల సమయం పట్టవచ్చని చెప్పారు. ప్రమాదానికి గల కారణాలపై రైల్వే ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ ప్రమాదం నుంచి లోకోపైలెట్లు ఇద్దరు, గార్డు సురక్షితంగా బయటపడ్డారు.

తెలుగులో సమగ్ర పదకోశం అవసరం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ వెల్లడి
- 52 మంది రచయితలు రాసిన కొత్త కథలు 6వ భాగం ఆవిష్కరణ



కొత్త కథలు 6వ భాగం ఆవిష్కరణ చేస్తున్న జస్టిస్ లక్ష్మణ్, వోలేటి పార్వతీశం, డాక్టర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆచార్యులు నిత్యానందరావు, సూర్య ధనుంజయ్‌లు

చిక్కడపల్లి (హైదరాబాద్): ఫిర్యాదుదారులు తమ మాతృభాషలో తీర్పులు తెలుసుకోవడం చాలా అవసరమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ చెప్పారు. మాతృభాషలో తీర్పులు అనువాదం చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో పొరుగు రాష్ట్రాల్లో తీర్పులు త్వరితంగా వారి మాతృభాషలో అనువాదం అవుతున్నాయన్నారు. ఆయా భాషలకు చెందిన పదకోశం సమగ్రంగా ఉన్నందున అది సాధ్యమవుతోందని చెప్పారు. అందువల్ల తెలుగు భాషలో కూడా సమగ్ర పదకోశం ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మంగళవారం శ్రీ త్యాగరాయ గానసభ వేదికపై వంశీ ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో 52 మంది రచయితలు రాసిన కొత్త కథలు 6వ భాగం ఆవిష్కరణ సభ జరిగింది. జస్టిస్ లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. వాస్తవాన్ని కథల రూపంలో అందించే రచయితలు సమాజ హితానికి దోహదపడతారని చెప్పారు. నేడు సమాజానికి సరైన దిశా నిర్దేశనం లేనందువల్లే ఫ్యామిలీ కోర్టుల్లో ఎక్కువ కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ.. సమాజ జీవితానికి, మనిషి జీవితానికి సంబంధం తెలిపేదే కథ అన్నారు. భారతీయ సాహిత్య చరిత్ర కథతోనే ఆరంభమైందన్నారు. కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యానందరావు, డాక్టర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షురాలు ఆచార్య సూర్య ధనుంజయ్, జర్నలిస్ట్ మాశర్మ, దర్శకుడు రేలంగి నర్సింహారావు, నాట్యగురువు డాక్టర్ ప్రసన్నరాణి, గాయని శారద ఆకునూరు, డాక్టర్ తెన్నేటి సుధాదేవి తదితరులు పాల్గొన్నారు. తొలుత జమున సంస్మరణలో రామకృష్ణ, సాయిమేఘన, తుషార నిలయలు మధురగానం చేశారు.



పిల్లలతో కలిసి పుష్ప సినిమా పాటకు స్టెప్పులేస్తూ...



పిల్లలకు బంధువులంటే ఇష్టం.
బాబాయ్, మావయ్య, పెదనాన్న,
పిన్ని, అత్తయ్య, అమ్మమ్మ...
బంధువులొస్తే వీరికి సంబరం.
కాని దురదృష్టవశాత్తు
కొందరు పిల్లలకు బంధువులుండరు.
ఒకోసారి అమ్మో, నాన్నో కూడా వారితో
ఉండకపోవచ్చు.
వీరికి బంధువుగా మారి ఆదుకుంటోంది
'వాల్మీకి గురుకులం' అనే శరణాలయం.
'బాలల దినోత్సవం' సందర్భంగా
దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి
ఈ పిల్లలను
తానొక బంధువుగా కలిసింది.
ఈ సమాజమే ఇటువంటి బాలలకు
బంధుగణం అని మాట కలిపింది.

అందరి బంధువులు



'వాల్మీకి గురుకులం'లోని పిల్లలతో ఫొటోకు పోజ్ ఇస్తున్న సుకృతి



అక్కడున్న పిల్లలు చాలా హుషారుగా ఉంటారు. స్కూల్‌కు వెళ్లి చదువుకుంటారు. అందరూ కలిసి ఆడుకుంటూ భోజనం చేస్తూ ఒకేచోట గడుపుతూ మనమంతా ఒకరికొకరం అనే స్థయిర్యంతో బతుకుతారు. అయితే ఒక్కోసారి వారిని దిగులు కమ్ముకోవచ్చు. అమ్మో నాన్నో గుర్తుకు రావచ్చు. ఆ సమయాన్ని మనం దాటించగలగాలి. ఇలాంటి చోటుకు వీలున్న సమయాలలో వెళుతూ పలకరిస్తూ ఉంటే, వారితో సమయం గడుపుతూ ఉంటే వారి లోకం మనకు పరిచయం అవుతుంది. వారి చిరునవ్వుకు మన చిరునవ్వు తోడైతే కారే కన్నీరు తోక ముడుస్తుంది. అందుకే రంగారెడ్డి జిల్లా మోకిలా సమీపాన ప్రొద్దుటూరులో ఉన్న వాల్మీకి ఫౌండేషన్‌లో సుమారు 50 మంది చిన్నారులు దర్శకుడు సుకుమార్ కుమార్తె, చైల్డ్ సెలబ్రిటీ అయిన సుకృతిని చూసి కేరింతలు కొట్టారు. షేక్‌హ్యాండ్‌లు ఇచ్చారు. సరదా కబుర్లతో సమయమే తెలియలేదు అన్నట్టుగా గడిపారు.

నవంబర్ 14 చిల్డ్రన్స్ డే సందర్భంగా సాక్షి మీడియా ఏర్పాటు చేసిన కార్యక్రమం ఇది. ఇక్కడి పిల్లల కోసం సుకృతి తెచ్చిన పండ్లు, చాక్లెట్లతో తియ్యని వేడుకగా మారింది. వంటి తియ్యటి కార్యక్రమమిది. ఇక సుకృతి తెచ్చిన పుస్తకాలు ఒక మంచి కానుక వారికి. ఈ సందర్భంగా ఇక్కడి పిల్లలు తమ గురించి తాము సుకృతితో మనసువిప్పి మాట్లాడారు.

ఈ బాధ్యత మనందరిదీ...

'సాక్షి' ఇలాంటి వినూత్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి నన్ను ఆహ్వానించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు. ఇక్కడికి రావడం వల్లే ఇలాంటి చిన్నారుల సామాజిక, మానసిక స్థితిగతులపైన అవగాహన వచ్చింది. వీళ్లు నాలాంటి చిన్నారులే.. వీళ్లలో ఎన్ని నైపుణ్యాలున్నాయో చూస్తే ఆశ్చర్యమేసింది. చదువులతో పాటు డ్యాన్సులు చేస్తున్నారు, క్రీడల్లో రాణిస్తున్నారు. వారు వచ్చిన నేపథ్యం వేరు.. ఇక్కడ పొందిన పరిపక్వత వేరు. వారి మదిని తడిమి చూస్తే మాత్రం ఊహించని వేదన దాగుంది. అది మనం తీర్చలేనిది. కానీ వీలైనంత ఆత్మీయత, ప్రోత్సాహం అందించడం మనందరి బాధ్యత. నేను ఇక్కడ పిల్లలు అందరితో కలిసి డ్యాన్సులు చేశాను. వారు నాకిష్టమైన అల్లు అర్జున్ గురించి, నా ఫేవరెట్ హాలిడే స్పాట్ పారిస్ గురించి, నా బెస్ట్ ఫ్రెండ్ సితార గురించి, నా చదువులు, లక్ష్యాలు ఇలా అన్నీ అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి పచ్చని పొలాల మధ్య ఉన్న వాల్మీకి గురుకులం నాకో మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుంది. నాన్న తెరకెక్కిస్తున్న పుష్ప–2 విషయాలు ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. మళ్లీ మళ్లీ ఇక్కడికి రావాలనుంది. నా ఆలోచనల్లో చాలా మార్పులకు ఈ విజిట్ కారణమైంది.

– సుకృతి

స్ఫూర్తిదాయకమైనది

నేను అమెరికాలో అంకాలజీ డాక్టర్‌గా పని చేశాను. గత కొన్నేళ్లుగా ఇక్కడి పిల్లల చదువులకు స్కూల్ ఫీజులు చెల్లిస్తున్నాను. ఇలాంటి వారికి ఇంగ్లీష్ మీడియం చదువులు చదివించాలనే ఆలోచన స్ఫూర్తిదాయకమైనది. ఏడాదికి సరిపడా ఫీజులు ఒకేసారి చెల్లిస్తాను. ఇక్కడి విద్యార్థులు ఉన్నత చదువులకు బయటకు వెళుతుంటే కాస్త బాధగానూ, అంతకు మించిన సంతోషంగానూ ఉంటుంది.

– డా. రోహిణీ,
సంస్థకు ప్రధాన సహాయకురాలు

ఎప్పుడూ చిల్డ్రన్స్ డేనే



మాకెప్పుడూ చిల్డ్రన్స్‌డేలానే ఉంటుంది. ఇక్కడ అన్ని విషయాల్లో సహకారం అందిస్తారు. బాగా చదువుకుని సాఫ్ట్‌వేర్ జాబ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. వీరు అందించిన ఏ సహకారాన్ని వృథాగా పోనివ్వను.

– మారుతి

మాదో కుటుంబం



మేముంటున్న 'వాల్మీకి గురుకులం' అనాథ ఆశ్రమంలా అనిపించదు. మాదో పెద్ద కుటుంబం. సౌకర్యాలు, వసతులే కాదు.. ఇక్కడ ప్రేమ, ఆప్యాయతలకు కొదువ లేదు. మాకెప్పుడూ ఒంటరి అనే ఫీలింగ్ రాకుండా చూసుకుంటారు. కాకపోతే రోజూ 14 కిలోమీటర్లు స్కూల్‌కు వెళ్లి రావడం కష్టంగా ఉంది. ఈ విషయంలో ఎవరైనా దాతలు సహకారమందిస్తే వెహికిల్ ఏర్పాటు చేసుకుంటాం.

– గౌతమ్ సాయి

ఇదే గురుకులానికి హెల్ప్ చేస్తా



నేను బాగా చదువుకుని, మంచి జాబ్ చేస్తూ ఇదే గురుకులంలోని మరి కొందరు చిన్నారులకు సహకారం అందించాలనుంది. ఇవాళ వచ్చిన సుకృతి అక్క మాతో చాలా బాగా కలిసిపోయింది. చాలా విషయాలు చెప్పింది. సినిమా హీరోలు ఎలా ఉంటారు... వారి జీవితాలు ఎలా గడుస్తాయి.. ఇలా ఎన్నో విషయాలు అడిగి తెలుసుకున్నాను.

– అనిల్

ప్రేమ, తోడ్పాటు కావాలి



అప్పుడప్పుడు బాధ అనిపించినా ఇక్కడ ఆ ఆలోచనలకు తావు లేదు. మేం చాలా గౌరవంగా, ఆరోగ్యంగా మంచి చదువులను పొందుతున్నాం. జాలి, దయ కన్నా ప్రేమ, తోడ్పాటు జీవితాన్ని ముందుకు తీసుకెళతాయని తెలుసుకున్నాను.

– భాను ప్రసాద్

లైబ్రరీ... కల్చరల్ టూర్



మా దగ్గర 55 మంది చిన్నారులు సేవలు పొందుతున్నారు. సీడబ్ల్యూసీ నియమాల ప్రకారం యుక్త వయసు వచ్చిన చిన్నారుల్ని అనాథ ఆశ్రమంలో ఉంచకూడదు... కాబట్టి ఆ వయసుకొచ్చిన 15 మందిని ఉన్నత చదువుల కోసం మంచి కాలేజీల్లో చదివిస్తూ, హాస్టల్స్‌లో చేర్చాం. అనాథలు, నిరుపేద పిల్లలు, సింగిల్ పేరెంట్ ఉన్న పిల్లలకు సేవలందిస్తున్నాం. ఆర్ట్ ఆఫ్ స్మైల్ పేరుతో వంద మందికి సరిపడేలా మంచి భవనాన్ని నిర్మించుకున్నాం. డైనింగ్, ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేశాం. అధునాతన కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీని నిర్మిస్తున్నాం. మా సేవలన్నీ దాతల విరాళాలపైనే నిర్వహిస్తున్నాం. పిల్లలకు చదువులు మాత్రమే కాదు... వినూత్న అనుభవాలు, ఆలోచనలు కల్పించాలనే లక్ష్యంతో కల్చరల్ టూర్‌ను ప్లాన్ చేశాం. ఇందులో భాగంగా చెన్నైలోని ఓ అనాథ ఆశ్రమానికి చెందిన పిల్లలకు ఇక్కడ 4 రోజుల విడిది కల్పించి విభిన్న ప్రాంతాల సాంస్కృతిక, చారిత్రక, అధునాతన జీవనశైలి పై అవగాహన కల్పించాం. మరికొద్ది రోజుల్లో మా చిన్నారులను కూడా చెన్నైకు తీసుకెళ్లనున్నాం. అంతేకాకుండా మా పిల్లలందరినీ విమానంలో గగనతల విహారం చేయించాం. న్యూట్రిషన్ కోసం ఎగ్ బ్యాంక్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా వాల్మీకి పిల్లల కోసమే కాకుండా దేశవ్యాప్తంగా ఇలాంటి చిన్నారులకు గుడ్లు అందిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదల విద్యకు 500కు పైగా సైకిళ్లను అందించాం.

– హరి కిషన్ వాల్మీకి, సంస్థ నిర్వాహకులు

నేటి మధ్యాహ్నం 12.15 గంటలకు సాక్షి టీవీలో

SAKSHI TV

ఈ వారమంతా లిటిల్ స్టార్స్ సందడిని సాక్షి యూట్యూబ్‌లో చూడటానికి ఈ qr కోడ్‌ను స్కాన్ చెయ్యండి

– డి.జి. భవాని
– హనుమాద్రి శ్రీకాంత్

అమ్మలకు అమ్మలు



సూర్ణపు స్వప్న



నౌషీన్ నాజ్

'మాతృత్వం' వరుసలో నిలిచే మరో గొప్ప మాట... మిడ్‌వైఫ్. 'మిడ్‌వైఫరీ' అనేది ఉద్యోగం కాదు. పవిత్ర బాధ్యత. అటువంటి పవిత్ర బాధ్యతను తలకెత్తుకున్న సూర్ణపు స్వప్న, నౌషీన్ నాజ్ అంకితభావంతో పనిచేస్తున్న మిడ్‌వైఫరీ నర్స్‌లలో ఒకరు. జపాన్‌లో ప్రత్యేక శిక్షణ కోసం మన దేశం నుంచి ఏడుగురు మిడ్ వైఫరీ నర్సులు ఎంపికయ్యారు. వారిలో కొత్తగూడెం ఆస్పత్రిలో పని చేస్తోన్న సూర్ణపు స్వప్న, వరంగల్ సీకేయం ఆస్పత్రిలో పనిచేస్తున్న నౌషీన్ నాజ్ ఉన్నారు. నవంబరు 12 నుంచి 24 వరకు జపాన్‌లో జరిగే లీడర్‌షిప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో వీరు పాల్గొంటున్నారు.

తెలంగాణా రాష్ట్రంలోని మహబూబాబాద్‌కు చెందిన స్వప్న తండ్రి సోమయ్య కమ్యూనిస్టు. ఆపదలో ఉన్నవారికి సేవ చేయాలని ఎప్పుడూ చెబుతుండేవాడు. ఆయన ప్రభావం వల్లనే బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసింది. తొలి పోస్టింగ్ కోసం ఆదిలాబాద్ జిల్లాలోని రిమ్స్‌ను ఎంచుకుంది. యునిసెఫ్ సహకారంతో హైదరాబాద్‌లో ప్రముఖ మెటర్నిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏడాదిన్నర పాటు డిప్లొమా ఇన్ మిడ్‌వైఫరీ శిక్షణ కోసం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 30 మందిని ఎంపిక చేసింది. అందులో స్వప్న ఒకరు.

భద్రాచలం ఏజెన్సీలో...

డిప్లొమా ఇన్ మిడ్‌వైఫరీలో నేర్చుకున్న నైపుణ్యాలను సార్థకం చేసుకునే అవకాశం స్వప్నకు భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో పని చేసేప్పుడు వచ్చింది. 'మా బ్యాచ్‌లో మొత్తం ముగ్గురం ఈ ఆస్పత్రికి వచ్చాం. అప్పుడు ఇక్కడ సగటున 70 శాతం వరకు సీ సెక్షన్ పద్ధతిలో ప్రసవాలు జరుగుతుండేవి. శిక్షణలో నేర్చుకున్న విషయాలను ఒక్కొక్కటిగా అమలు చేయడం మొదలుపెట్టాం. ముందుగా క్షేత్రస్థాయిలో ఆశ వర్కర్‌లకు సాధారణ ప్రసవాల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించాం. ఆ తర్వాత కాన్పు సులువుగా అయ్యేందుకు అవసరమైన వ్యాయామాలు ఎలా చేయాలి, మందులు ఎలా తీసుకోవాలి... మొదలైన విషయాల గురించి గర్భిణులకు ఎప్పటికప్పుడు చెబుతూ వారితో ఆత్మీయంగా కలిసిపోయేవాళ్లం. మేము పోస్టింగ్ తీసుకున్న తర్వాత ఏడాది వ్యవధిలోనే ఈ ఆస్పత్రిలో సీ సెక్షన్లు 70 శాతం నుంచి 30 శాతానికి తగ్గిపోయాయి. వైద్య పరంగా అత్యవసరం అనుకున్న వారికే సీ సెక్షన్లు చేసేవారు. ఈ ఆస్పత్రిలో ఒకే నెలలో 318 సాధారణ ప్రసవాలు చేసి రికార్డు సృష్టించాం' అంటుంది స్వప్న. భద్రాచలం ఆస్పత్రిలో స్వప్న బృందం తీసుకొచ్చిన మార్పునకు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు లభించింది.

– తాండ్ర కృష్ణగోవింద్, సాక్షి, భద్రాద్రి కొత్తగూడెం

ముఖ కవళికలతోనే...

భద్రాచలంలో పని చేస్తున్నప్పుడు ఒడిశాకు చెందిన ఆదివాసీ మహిళ కాన్పు కోసం వచ్చింది. మన దగ్గర కాన్పు చేయాలంటే బెడ్ మీద పడుకోబెడతాం. కానీ ఆ ఆదివాసీ మహిళ కింద కూర్చుంటాను అని చెబుతోంది. మా ఇద్దరి మధ్య భాష సమస్య ఉంది. ముఖకవళికలతోనే ఆమెకు ఎలా కంఫర్ట్‌గా ఉంటుందో కనుక్కుని బెడ్ మీదనే కూర్చునే విధంగా ఒప్పించి సాధారణ ప్రసవం చేయించాను. ఒకరోజు ఆస్పత్రికి వచ్చేసరికి ఒక గర్భిణీ స్పృహ కోల్పోయి ఉంది. బీపీ ఎక్కువగా ఉంది. పదేపదే ఫిట్స్ వస్తున్నాయి. హై రిస్క్ కేసు. బయటకు రిఫర్ చేద్దామంటే మరో ఆస్పత్రికి చేరుకునేలోగా తల్లీబిడ్డల ప్రాణాలు ప్రమాదంలో పడతాయి. మేము తీసుకున్న శిక్షణ, నేర్చుకున్న నైపుణ్యం, అనుభవంతో భద్రాచలం ఆస్పత్రిలోనే గైనకాలజిస్ట్ సాయంతో నార్మల్ డెలివరీ చేశాం. ఆస్పత్రికి వచ్చేప్పుడు స్పృహలో లేని మహిళ తిరిగి వెళ్లేప్పుడు తన బిడ్డతో నవ్వుతూ వెళ్లడాన్ని చూడటం మాటలకు అందని సంతోషాన్ని ఇచ్చింది. నా వృత్తి జీవితంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

– సూర్ణపు స్వప్న

సేవాపథం

'వైద్యులకు వైద్యసేవలు అందించే నైపుణ్యమే కాదు ఆత్మస్థైర్యాన్నిచ్చే శక్తి కూడా ఉంటుంది' అని తాత డాక్టర్ వారీజ్ బేగ్ చెప్పిన మాటలు హనుమకొండకు చెందిన నౌషీన్ నాజ్ మనసులో బలంగా నాటుకుపోయాయి. తాత మాటల స్ఫూర్తితో మెడిసిన్ ఎంట్రన్స్ రాసింది కానీ సీటు రాలేదు. అయినా నిరాశపడకుండా హైదరాబాద్‌లోని 'మెడిసిటీ స్కూల్ ఆఫ్ నర్సింగ్'లో జీఎన్ఎం కోర్సు చేరింది. ఆ తర్వాత మైనారిటీ కోటాలో ఎంబీబీఎస్ సీటు వచ్చినా కోర్సును కొనసాగించి నర్సింగ్ వృత్తిలో అత్యుత్తమ సేవలందిస్తూ ప్రత్యేక గుర్తింపు సాధించింది. మాతా శిశు మరణాలను తగ్గించడంలో భాగంగా 1500కు పైగా సాధారణ ప్రసవాలలో సహాయం అందించింది. భయంతో వచ్చే తల్లులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు సాధారణ ప్రసవం కోసం వ్యాయామాలు నేర్పిస్తుంటుంది. వరంగల్‌లో నిర్వహించిన ఆబ్‌స్టెట్రిక్స్ ఎమర్జెన్సీ(ఎంవోఎస్, మామ్స్) వర్క్‌షాప్‌లో యూకే నుంచి వచ్చిన మిడ్‌వైఫరీ నర్సులు సాధారణ ప్రసవాలపై ఇక్కడి వైద్యులకు శిక్షణ ఇచ్చారు. ఆ సమయంలో హైదరాబాద్‌లోని 'నేషనల్ మిడ్ వైఫరీ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్' గురించి తెలుసుకొని అర్హత పరీక్షలు రాసి ఎంపికైంది నౌషీన్. మిడ్‌వైఫరీ కోర్సులో బెస్ట్ స్టూడెంట్‌గా ఎంపికైంది. హైదరాబాద్‌లోని నీలోఫర్, కింగ్ కోఠి, వనస్థలిపురం మెటర్నిటీ ఆసుపత్రులలో పనిచేసింది. వాటర్ బర్త్, బ్రీచ్ బర్త్ డెలివరీల గురించి తెలుసుకొని వ్యాయామాల ద్వారా సాధారణ ప్రసవాలు చేయించింది. బ్రీచ్‌బర్త్ డెలివరీలలో చాలామంది తల్లుల గర్భంలో పాపలు ఎదురుకాళ్లతో ఉంటారు. వ్యాయామం ద్వారా తలపైకి, కాళ్లు కిందకు వచ్చేలా చేసి సాధారణ ప్రసవం అయ్యేలా చేసేది. ప్రస్తుతం అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో ఎంఏ సైకాలజీ కోర్సు చదువుతోంది. 'తల్లుల మానసిక స్థితి తెలుసుకునేందుకు ఈ చదువు ఉపయోగపడుతుంది' అంటుంది నౌషీన్.

– వాంకె శ్రీనివాస్, సాక్షి, వరంగల్

మరచిపోలేని జ్ఞాపకాలు

హైదరాబాద్ కింగ్ కోఠి ఆసుపత్రిలో పనిచేస్తున్నప్పుడు ఎస్ఐ పరీక్షలకు సిద్ధమవుతున్న లావణ్య అనే గర్భవతి మమ్మల్ని సంప్రదించింది. సిజేరియన్ అయితే పోలీసు ఉద్యోగం రావడం కష్టమవుతుందనడంతో ఆమె చేత కొన్ని ఎక్సర్‌సైజులు చేయించాను. ఎదురుకాళ్లు ఉన్న పాప గర్భంలో సరైన స్థితికి వచ్చేలా చూశాను. నొప్పులు రావడం లేదని టెన్షన్ పడితే ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేలా కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు రకరకాల వ్యాయామాలు చేయించి సాధారణ ప్రసవం అయ్యేలా చేశాను. వరంగల్ జిల్లా నెక్కొండకి చెందిన స్వప్న ఎత్తు తక్కువగా ఉండడంతో చాలా మంది సాధారణ ప్రసవం కాదని అంటుండేవారు. వరంగల్ సీకేఎం ఆసుపత్రిలో చైల్డ్ బర్త్ ఎడ్యుకేషన్ క్లాస్‌లు విన్నాక ఆమెలోని భయాలు తొలగిపోయాయి. సాధారణ ప్రసవం అయ్యింది. దుబాయ్‌లో ఉంటున్న నా చెల్లెలు సైన్నా నాష్ తొలి రెండు కాన్పులు సిజేరియన్ అయ్యాయి. మూడో కాన్పుకు సంబంధించి ఫోన్ ద్వారా నాతో మాట్లాడుతూ నేను చెప్పిన విధంగా వ్యాయామాలు చేసేది. చెల్లికి సాధారణ ప్రసవం కావడం ఎంతో సంతోషాన్నిచ్చింది.

– నౌషీన్ నాజ్

'ప్రసవం అనేది తల్లికి పునర్జన్మ' అంటారు. స్వప్న, నౌషీన్ నాజ్‌లు గతంలో తీసుకున్న శిక్షణ ఎంతోమంది తల్లులకు అండగా నిలవడానికి, ప్రతికూల పరిస్థితుల్లో ఎంతోమంది ప్రాణాలు కాపాడడానికి ఉపయోగపడింది. జపాన్‌లోని లీడర్‌షిప్ ప్రోగ్రామ్ ద్వారా వీరు మరెన్నో నైపుణ్యాలను సొంతం చేసుకోనున్నారు. ఆ నైపుణ్యాల 'పుణ్యం' ఊరకే పోదు. ఆపదలో ఉన్న ఎంతోమంది తల్లులకు ప్రాణవాయువు అవుతుంది.

గెస్ట్ కాలమ్

శతకాలు చూడచూడ రుచుల జాడ వేరు



పద్యం తెలుగువారి ఆస్తి. మరో భాషలో లేని ఈ సాహితీశిల్పాన్ని తెలుగువారు తరాలుగా కాపాడుకుంటూ వచ్చారు. పండితుల కోసం, శిష్ట పాఠకుల కోసం ఛందోబద్ధ పద్యాలు ఉంటే పిల్లలూ పామరులూ చెప్పుకోవడానికి శతకాలు ఉపయోగపడ్డాయి. సులభంగా, సరళంగా ఉండే శతక పద్యాలు కాలక్రమంలో ఇంటింటి పద్యాలుగా మారి జీవన మార్గదర్శకాలు అయ్యాయి. వేమన పద్యం రాని తెలుగువాడు లేడన్నది నిన్నటి వరకూ నిత్యసత్యం.

'శతకం' అంటే వంద అనే అర్థం. అలాగని శతకంలో కచ్చితంగా వంద పద్యాలే ఉండాలని లేదు. అంతకు మించి కూడా రాశారు. పద్యం చివర్లో 'మకుటం' ఉండడమే శతకాల విశిష్టత. 'మకుటం' అంటే కిరీటం. శతక పద్యంలో దీని స్థానం శిఖరాయమానం. పూర్వ మహాకవులే కాదు, ఇప్పటికీ ఎందరెందరో శతకాలు రాస్తూనే వున్నారు. తమ జీవితంలోని అనుభవాల నుంచి, అనుభూతుల నుంచి, ఇష్టదైవాల గురించి, ప్రియమైన వ్యక్తుల గురించి, భావోద్వేగాల నుంచి వందల కొద్దీ శతకాలు పుట్టిస్తున్నారు.

శతక పద్యాలకు నన్నయ ఆద్యుడంటారు. 'బహువన పాదపాబ్ధి... అనంతుడు మాకు ప్రసన్నుడయ్యెడున్' అనే పద్యాలు నన్నయగారి భారతంలోని 'ఉదంకోపాఖ్యానం'లో ఉంటాయి. 'అనంతుడు మాకు ప్రసన్నుడయ్యెడున్' అనే మకుటంతో నాలుగు పద్యాలు ముగుస్తాయి. ఈ పద్యాలన్నీ వరుసగా ఉంటాయి. అలా పద్యంలో 'మకుటం' పురుడు పోసుకుందని చెబుతారు. శతక పద్యాలకు ఎవరు ఆద్యులు అనేది పక్కనపెడితే నన్నయ నుంచి నేటి వరకూ వందల సంవత్సరాల నుంచి శతకాలు బతుకుతూనే ఉన్నాయి, బతికిస్తూనే ఉన్నాయి.

తెలుగు నేలపై ఎన్నో శతక పద్యాలు వ్యాప్తిలో ఉన్నప్పటికీ వేమన పద్యాలే మకుటాయమానంగా నిలుస్తున్నాయి. బద్దెన కూడా అంతే ప్రసిద్ధుడు. ఆయన రాసిన సుమతీ శతకం తెలుగువారికి సుపరిచయం. అలాగే భర్తృహరి సుభాషితాలు సుప్రసిద్ధం. 'సుభాషితాలు' అంటే మంచి వాక్కులు అని అర్థం. ఇవన్నీ సంస్కృతంలో ఉంటాయి. వీటిని తెనిగించి మనకు అందించిన మహనీయులు ముగ్గురు. వారు ఏనుగు లక్ష్మణకవి, ఏలకూచి బాల సరస్వతి, పుష్పగిరి తిమ్మన. ఇక భక్త రామదాసు రాసిన దాశరథీ శతకం, మారన కవి రాసిన భాస్కర శతకం, ధూర్జటి మహాకవి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకం, నృసింహకవి కలం నుంచి జాలువారిన శ్రీకృష్ణ శతకం, శేషప్పకవి రాసిన నరసింహ శతకం, కుమార శతకం, కాసుల పురుషోత్తమకవి విరచితమైన ఆంధ్ర నాయక శతకం... ఇలా ఎన్నెన్నో శతకాలను, శతకకారులను చెప్పుకోవచ్చు. అన్నీ మణిమాణిక్యాలే, జీవితాలను చక్కదిద్దే రసగుళికలే.



శతకాలు ఎందుకు నిలబడ్డాయి? అలతి అలతి పదాలతో లోకహితమైన సాహిత్య సృష్టి వాటిలో జరిగింది కనుక. సమాజంలోని దురాచారాలను, చాదస్తాలను, మూఢవిశ్వాసాలను మూకుమ్మడిగా ఖండిస్తూ జనానికి వాటిలో జ్ఞానబోధ జరిగింది కనుక. మానవ నైజంలోని విభిన్న రూపాల ఆవిష్కరణ జరిగి తద్వారా మేలుకొల్పు కలిగింది కనుక. ఫలితంగా సద్భక్తి భావనలు కలిగి, తల్లిదండ్రులు, గురువులు, పెద్దల యెడ మనుషులకు గౌరవ మర్యాదలు పెరిగాయి కనుక. నీతులు, లోకరీతులు తెలిశాయి కనుక. అందువల్లే జనులు వాటిని చేరదీశారు. తోడు చేసుకున్నారు. ఇలాంటి పద్యాలు మానసికంగా, శారీరకంగా వికసించే బాల్యంలో పిల్లలకు ఎంతో అవసరమని పెద్దలు భావించారు కాబట్టి శతకాలు నాటి కాలంలో బట్టీ వేయించేవారు.

ఉప్పు కప్పురంబు నొక్క పోలికనుండు
చూడ చూడ రుచుల జాడ వేరు
పురుషులందు పుణ్య పురుషులు వేరయా
విశ్వదాభిరామ వినుర వేమ

– (వేమన)

తాత్పర్యం : చూడడానికి ఉప్పు, కర్పూరం ఒకేలా కనిపిస్తాయి. కానీ వాటి రుచులు వేరు. అట్లే, మనుషులంతా ఒకేరకంగా వున్నా, అందులో పుణ్యపురుషులు అంటే గొప్పవారు వేరు.

అడిగిన జీతం బియ్యని
మిడిమేలపు దొరను కొల్చి మిడుగుట కంటెన్
వడి గల యెద్దుల కట్టుక
మడి దున్నుక బ్రతకవచ్చు మహిలో సుమతీ

– (బద్దెన)

తాత్పర్యం: మంచి జీతం ఇవ్వని యజమానిని నమ్ముకొని కష్టాలు పడేకంటే మంచి ఎద్దులను నమ్ముకొని పొలం దున్నుకుంటూ, సొంతంగా వ్యవసాయం చేసుకుంటూ హాయిగా బతుకవచ్చు.

ఇలా ఎన్నో పద్యాలను తలచుకోవచ్చు. వ్యక్తిత్వ వికాసం జరగాలంటే శతక పద్యాలు చదువుకోవాలి. శతకాలను బతికించుకుంటే అవి మనల్ని బతికిస్తాయి.

– మా శర్మ, సీనియర్ జర్నలిస్ట్



ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ కోచ్‌గా మునాఫ్ పటేల్

భారత మాజీ పేసర్ మునాఫ్ పటేల్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో తొలి సారి కోచింగ్ బృందంలో పని చేయనున్నాడు. ఐపీఎల్ టీమ్ ఢిల్లీ క్యాపిటల్స్ తమ బౌలింగ్ కోచ్‌గా మునాఫ్‌ను నియమించినట్లు ప్రకటించింది. గత సీజన్‌లో బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించిన ఆస్ట్రేలియన్ జేమ్స్ హోప్స్ స్థానంలో మునాఫ్‌కు అవకాశం దక్కింది. 2018లో ఆటకు రిటైర్మెంట్ ప్రకటించిన అనంతరం మునాఫ్ కొన్ని చిన్న స్థాయి లీగ్‌లు, రిటైర్డ్ ఆటగాళ్లతో కూడిన టోర్నీల్లో పాల్గొంటూ వచ్చాడు. అయితే ప్రతిష్టాత్మక లీగ్‌లో ఇప్పుడు అతను కోచింగ్ బాధ్యతల్లో అడుగు పెట్టడం విశేషం. క్యాపిటల్స్ టీమ్ డైరెక్టర్ వేణుగోపాల రావు, హెడ్ కోచ్ హేమంగ్ బదానీలతో కలిసి మునాఫ్ పని చేస్తాడు. 2006–2011 మధ్య భారత జట్టుకు మునాఫ్ ప్రాతినిధ్యం వహించాడు. 13 టెస్టుల్లో 35 వికెట్లు తీసిన అతను 70 వన్డేల్లో 86 వికెట్లు పడగొట్టాడు. మరో 3 టి20లు అతను ఆడాడు. కెరీర్ ఆరంభంలో భారత ఫాస్టెస్ట్ బౌలర్‌గా గుర్తింపు పొందిన మునాఫ్...2011లో వన్డే వరల్డ్ కప్‌లో 11 వికెట్లు తీసి జట్టు చాంపియన్‌గా నిలవడంలో కీలకపాత్ర పోషించాడు. కొన్నాళ్ల క్రితం లెజెండ్స్ లీగ్‌లో ఇండియా క్యాపిటల్స్ టీమ్‌కు అతను మెంటార్‌గా వ్యవహరించాడు.

షమీ పునరాగమనం

- గాయం నుంచి కోలుకున్న సీనియర్ పేసర్
- రంజీ ట్రోఫీలో బెంగాల్ తరఫున బరిలోకి



కోల్‌కతా: టీమిండియా సీనియర్ పేసర్ మొహమ్మద్ షమీ పునరాగమనానికి సిద్ధమయ్యాడు. గత ఏడాది వన్డే ప్రపంచకప్ తర్వాత గాయం కారణంగా జట్టుకు దూరమైన షమీ... శస్త్రచికిత్స అనంతరం తిరిగి కోలుకొని దేశవాళీ మ్యాచ్‌లు ఆడేందుకు రెడీ అయ్యాడు. రంజీ ట్రోఫీలో భాగంగా బుధవారం నుంచి మధ్యప్రదేశ్‌తో జరగనున్న మ్యాచ్‌లో షమీ బెంగాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ మేరకు బెంగాల్ క్రికెట్ సంఘం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. స్వదేశంలో జరిగిన 2023 వన్డే వరల్డ్‌కప్‌లో 7 మ్యాచ్‌ల్లో 24 వికెట్లు తీసి అదరగొట్టిన షమీ... ఆ తర్వాత గాయం కారణంగా మైదానానికి దూరమయ్యాడు. కాలి మడమకు శస్త్రచికిత్స చేయించుకున్న షమీ... ఇప్పుడు పూర్తిస్థాయిలో కోలుకున్నాడు. ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్న ఆస్ట్రేలియా పర్యటన వరకు అతడు కోలుకుంటాడనుకుంటే అది సాధ్యపడలేదు. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రీహాబిలిటేషన్‌లో ఉన్న షమీ మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాడు. 'భారత క్రికెట్ జట్టుతో పాటు, బెంగాల్ రంజీ టీమ్‌కు శుభవార్త. స్టార్ పేసర్ మొహమ్మద్ షమీ గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. మధ్యప్రదేశ్‌తో రంజీ మ్యాచ్‌లో షమీ బెంగాల్ జట్టు తరఫున ఆడతాడు' అని బెంగాల్ క్రికెట్ సంఘం కార్యదర్శి నరేశ్ ఓజా తెలిపాడు. షమీ ఫిట్‌నెస్ సాధించకపోవడంతో బీసీసీఐ సెలెక్షన్ కమిటీ అతడిని ఆస్ట్రేలియాతో జరిగే ఐదు టెస్టుల 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' కోసం ఎంపిక చేయలేదు. జస్‌ప్రీత్ బుమ్రా, మొహమ్మద్ సిరాజ్, ఆకాశ్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ రెడ్డి, ప్రసిద్ధ్ కృష్ణను ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ఎంపిక చేసిన బోర్డు... ముకేశ్ కుమార్, నవదీప్ సైనీ, ఖలీల్ అహ్మద్‌ను ట్రావెలింగ్ రిజర్వ్‌లుగా ప్రకటించింది. జట్టును ప్రకటించిన సమయంలో రోహిత్ మాట్లాడుతూ... పూర్తి ఫిట్‌నెస్ సాధించని షమీతో ప్రయోగాలు చేయబోమని ప్రకటించాడు.



దీపిక డబుల్ ధమాకా

- దక్షిణ కొరియాపై భారత్ విజయం
- ఆసియా మహిళల చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్

రాజ్‌గిర్ (బిహార్): ఆసియా మహిళల చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు జోరు కనబరుస్తోంది. తొలి రౌండ్ లీగ్ మ్యాచ్‌లో మలేసియాను చిత్తు చేసిన భారత జట్టు... రెండో మ్యాచ్‌లో దక్షిణ కొరియాను బోల్తా కొట్టించింది. హోరాహోరీగా సాగిన పోరులో సలీమా టిటె నాయకత్వంలోని భారత జట్టు 3–2 గోల్స్ తేడాతో దక్షిణ కొరియాపై గెలుపొందింది. మ్యాచ్ ముగియడానికి మూడు నిమిషాల ముందు స్ట్రయికర్ దీపిక కుమారి పెనాల్టీ స్ట్రోక్‌ను గోల్‌గా మలచడంలో భారత్ ఈ టోర్నీలో వరసగా రెండో విజయం ఖాతాలో వేసుకుంది. మన జట్టు తరఫున దీపిక (20వ, 57వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో మెరవగా... సంగీత కుమారి (3వ నిమిషంలో) ఒక గోల్ చేసింది. కొరియా తరఫున యూరీ లీ (34వ ని.లో), కెప్టెన్ ఇన్బి చియోన్ (38వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. మ్యాచ్ ఆరంభం నుంచి పూర్తి ఆధిపత్యం కనబరుస్తూ... దూకుడైన ఆటతో ముందుకు సాగిన భారత్... మూడో నిమిషంలోనే సంగీత కుమారి ఫీల్డ్ గోల్‌తో ఖాతా తెరిచింది. ఆ తర్వాత రెండో క్వార్టర్‌లో దీపిక మరో ఫీల్డ్ గోల్ చేయడంతో భారత్ 2–0తో సంపూర్ణ ఆధిక్యం కనబర్చింది. అప్పటి వరకు భారత గోల్ పోస్ట్‌పై ఒక్కసారి కూడా దాడి చేయలేకపోయిన కొరియా ప్లేయర్లు... మూడో క్వార్టర్స్‌లో నాలుగు నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ చేసి స్కోరు సమం చేశారు. ఇక అక్కడి నుంచి ఆధిక్యం కోసం ఇరు జట్లు హోరాహోరీగా ప్రయత్నించగా... చివరకు దీపిక గోల్‌తో భారత్ విజయపతాక ఎగరేసింది. మరోవైపు థాయ్‌లాండ్, జపాన్ మధ్య జరిగిన మ్యాచ్ 1–1తో 'డ్రా' కాగా... చైనా 5–0తో మలేసియాపై విజయం సాధించింది. తమ తదుపరి మ్యాచ్‌లో గురువారం థాయ్‌లాండ్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన భారత జట్టు 6 పాయింట్లతో పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది.

గాయత్రి–ట్రెసా జోడీ పరాజయం

జపాన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

కుమమొటో: జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత మహిళల డబుల్స్ జోడీ పుల్లెల గాయత్రి గోపీచంద్–ట్రెసా జాలీ జంట పరాజయం పాలైంది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీ మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో మంగళవారం గాయత్రి–ట్రెసా జాలీ జోడీ 16–21, 16–21తో సూ యిన్ హూ–లిన్ జి యున్ (చైనీస్ తైపీ) ద్వయం చేతిలో ఓడింది. 36 నిమిషాల పాటు సాగిన పోరులో ప్రపంచ 20వ ర్యాంక్‌లో భారత జోడీ... 24వ ర్యాంక్ చైనీస్ ద్వయం చేతిలో వరుస గేమ్‌ల్లో ఓటమి పాలైంది. సూ యిన్ హూ–లిన్ జి యున్ జంటపై గతంలో రెండు సార్లు విజయం సాధించిన గాయత్రి–ట్రెసా జాలీ జోడీ... ఈసారి అదే ప్రదర్శన పునరావృతం చేయలేకపోయింది. దీంతో డబుల్స్‌లో భారత్ పోరాటం ముగియగా... సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్ పూసర్ల వెంకట (పీవీ) సింధు, లక్ష్యసేన్ బరిలో ఉన్నారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో బుధవారం థాయ్‌లాండ్‌కు చెందిన ఎనిమిదో సీడ్ బుసానన్‌తో సింధు తలపడనుంది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో మలేసియాకు చెందిన లియోంగ్ జున్ హావోతో లక్ష్యసేన్ తలపడనున్నాడు. ఈ ఏడాది స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్న ఈ ఇద్దరూ ఈ టోర్నీలో సత్తాచాటేందుకు సిద్ధమయ్యారు.

ఆధిక్యంపై భారత్ కన్ను



నేడు దక్షిణాఫ్రికాతో మూడో టి20

- బ్యాటర్లపై భారం
- వరుణ్ స్పిన్‌పై సఫారీ కసరత్తు
- రా. గం. 8:30 నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో ప్రత్యక్షప్రసారం

సెంచూరియన్: సిరీస్‌లో పైచేయి సాధించడమే లక్ష్యంగా భారత జట్టు మూడో టి20 బరిలోకి దిగుతోంది. సూర్యకుమార్ సేన గత మ్యాచ్‌లో ఓడినా కూడా తక్కువ లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టును వణికించింది. తొలి మ్యాచ్‌లో బ్యాటర్లు, రెండో మ్యాచ్‌లో బౌలర్లు సత్తా చాటుకున్నారు. ఇప్పుడు ఈ రెండు విభాగాలు పట్టు బిగిస్తే మూడో మ్యాచ్ గెలవడం ఏమంత కష్టమే కాదు. మరోవైపు సొంతగడ్డపై రెండు మ్యాచ్‌ల్లోనూ సఫారీల ప్రభావం అంతంతే! గత మ్యాచ్ గెలిచినా... అది గట్టెక్కడమే కానీ సాధికారిక విజయం కానేకాదు. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా మూడో టి20 కోసం పెద్ద కసరత్తే చేసింది. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని ఎదుర్కొనేందుకు ప్రత్యర్థి బ్యాటర్లు నెట్స్‌లో చెమటోడ్చారు. ఇది నాలుగు మ్యాచ్‌ల సిరీస్ కావడంతో బుధవారం జరిగే పోరులో ఎవరు గెలిచినా ఆ జట్టు సిరీస్‌ను చేజార్చుకోదు.

నిలకడే అసలు సమస్య

ఓపెనర్లలో సంజూ సామ్సన్ తొలి మ్యాచ్‌లో చెలరేగాడు. గత మ్యాచ్‌లో అతను విఫలమైనా ఫామ్‌పై ఏ బెంగా లేదు. కానీ అభిషేక్ శర్మ వరుస వైఫల్యాలు జట్టు శుభారంభానికి ప్రతికూలంగా మారుతోంది. డర్బన్‌లో (7), పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో (4) సింగిల్ డిజిట్‌లకే పరిమితమయ్యాడు. ఇప్పుడు సెంచూరియన్‌లో అయినా అభిషేక్ బ్యాట్ ఝుళిపిస్తే బ్యాటింగ్ బలగం పెరుగుతుంది. రెండో మ్యాచ్‌లో టాపార్డర్ వైఫల్యం, నిలకడలేని మిడిలార్డర్‌తో భారత్ పరుగులు చేసేందుకు ఆపసోపాలు పడింది. ముఖ్యంగా డెత్ ఓవర్లలో 20, 30 పరుగులు వచ్చే చోట 11 పరుగులే చేయడం బ్యాటింగ్ లోపాల్ని ఎత్తిచూపుతోంది. సూర్యకుమార్ నుంచి కూడా అలరించే ఇన్నింగ్స్ ఇంకా రాలేదు. ఈ మ్యాచ్‌లో అతని 360 డిగ్రీ బ్యాటింగ్ చూపిస్తే ఇన్నింగ్స్ దూసుకెళుతుంది. ఈ సిరీస్‌లో స్పిన్నర్లు వరుణ్, రవి బిష్ణోయ్‌లు సత్తా చాటుకుంటున్నారు. ఈ బౌలింగ్ ద్వయంకు ఊతమిచ్చేలా బ్యాటింగ్ దళం కూడా బాధ్యత పంచుకుంటే భారత్ ఈ మ్యాచ్‌లో గెలుస్తుంది. లేదంటే గత మ్యాచ్‌లో ఎదురైన ఫలితం వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. టాపార్డర్‌లో లోపించిన నిలకడ గత మ్యాచ్‌కు సమస్యగా మారింది. వీటిని వెంటనే అధిగమిస్తేనే అనుకున్న ఫలితాలు సాధించవచ్చు.

పైచేయి కోసం ప్రయత్నం

మరోవైపు ఆతిథ్య దక్షిణాఫ్రికా కూడా సిరీస్‌లో పైచేయి సాధించాలని పట్టుదలగా ఉంది. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండు మ్యాచ్‌లు పూర్తయినా... సఫారీ ఆటతీరు అంతంత మాత్రంగానే ఉంది. డర్బన్‌లో రెండొందల పైచిలుకు లక్ష్యానికి చేతులెత్తేసిన బ్యాటర్లు... రెండో టి20లో 125 పరుగులు చేసేందుకు కూడా తెగ కష్టపడ్డారు. చివరకు ఏదోలా గెలిచినా ఇదే తీరు కొనసాగితే మాత్రం సిరీస్ కోల్పోక తప్పదు. రికెల్టన్, హెండ్రిక్స్, మార్క్‌రమ్‌లతో కూడిన టాపార్డర్, క్లాసెన్, మిల్లర్‌లాంటి హిట్టర్లతో కూడిన మిడిలార్డర్ భారత స్పిన్నర్లకు ఏమాత్రం నిలబడలేకపోతోంది. గత రెండు మ్యాచ్‌ల్లో కలిపి వరుణ్ (3/25, 5/17) 8 వికెట్లు తీశాడు. దీంతో సఫారీ జట్టు మేనేజ్‌మెంట్ అతన్ని ఎదుర్కొనేందుకు పెద్ద కసరత్తే చేసింది. సెంచూరియన్‌లో అది ఏ మేరకు ప్రభావం చూపుతుందో చూడాలి. బౌలర్లలో కొయెట్జీ, మార్కో జాన్సెన్ భారత బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నారు. పేస్‌కు అనుకూలించే సెంచూరియన్‌లో పోరు ఆసక్తికరంగా జరగడం ఖాయం.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ–పేపర్‌లో

సినిమా


ప్రభాస్

డిసెంబరులో స్టార్ట్

'స్పిరిట్' సినిమా సెట్స్‌కు వెళ్లే సమయం ఆసన్నమైంది. ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'స్పిరిట్'. ఈ చిత్రం కోసం తొలి సారిగా పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నాడు ప్రభాస్. కాగా తాజాగా 'స్పిరిట్' సినిమా గురించి ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరైన భూషణ్ కుమార్ స్పందించారు. ''స్పిరిట్' ప్రారంభోత్సవం ఈ ఏడాది డిసెంబరులో ప్లాన్ చేస్తున్నాం. వచ్చే ఏడాది స్టార్టింగ్‌లో ఈ మూవీని సెట్స్‌కు తీసుకువెళ్తాం. 2026 మధ్యలో రిలీజ్ ఉండొచ్చు. ప్రస్తుతం సందీప్ రెడ్డి 'స్పిరిట్' సాంగ్స్ పనుల్లో ఉన్నారు. నేను రెండు సాంగ్స్ విన్నాను.. బాగున్నాయి'' అని ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో భూషణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నారు.


నాగార్జున

తుదిదశలో కుబేర

నాగార్జున, ధనుష్ ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియన్ మూవీ 'కుబేర'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి ఎస్వీసీ ఎల్ఎల్‌పీ పతాకంపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్‌రావు నిర్మిస్తున్న ఈ సినిమా గ్లింప్స్ వీడియోని ఈ నెల 15న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, నాగార్జున ఇంటెన్స్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ''కుబేర' సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. పాటల చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉంది. ఇప్పటికే పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా మొదలయ్యాయి. ఫస్ట్ గ్లింప్స్‌తో పూర్తి స్వింగ్‌లో ప్రమోషన్స్‌ను స్టార్ట్ చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. తమిళ, తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీలో బాలీవుడ్ నటుడు జిమ్ సర్భ్ మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంగీతం: దేవి శ్రీ ప్రసాద్.



ఎస్ఎస్ రెడ్డి, ధనంజయ, ఈశ్వర్ కార్తీక్, చిరంజీవి, సత్యదేవ్, ప్రశాంత్ వర్మ, బాల సుందరం

అది మా తప్పు.. ప్రేక్షకులది కాదు

- చిరంజీవి

''నాలుగైదు పెద్ద సినిమాలు ఆడినంత మాత్రాన ఇండస్ట్రీ ఓహో అన్నట్లు కాదు. చిన్న సినిమాలు కూడా ఆడాలి. చిన్న, పెద్ద సినిమాలతో ఇండస్ట్రీ కళకళలాడాలి అనుకునే మాలాంటి వాళ్లకి, నాకు ఒకరకమైన బెరుకు వచ్చింది. కరోనా తర్వాత ఏ సినిమాలు చేయాలి? ఎలాంటి సినిమాలు చేసి రాణించాలి? అని. కానీ, అవన్నీ కరెక్ట్ కాదు. ప్రేక్షకుల్లో ఎప్పుడూ తప్పు ఉండదు. ఏదైనా తప్పు ఉండి సినిమాలు ఆడలేదు, రాణించలేదు అంటే అది వేదికపై ఉన్న మా అందరిదే తప్పు.. ప్రేక్షకుల తప్పు కానే కాదు'' అని హీరో చిరంజీవి అన్నారు. సత్యదేవ్, డాలీ ధనంజయ హీరోలుగా ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహించిన చిత్రం 'జీబ్రా'. 'లక్ ఫేవర్స్ ది బ్రేవ్' అన్నది ట్యాగ్‌లైన్. ప్రియా భవానీ శంకర్, జెన్నీఫర్ పిక్కినాటో హీరోయిన్లుగా నటించిన ఈ మూవీలో సునీల్, సత్యరాజ్, సత్య అక్కల కీలక పాత్రలు పోషించారు. పద్మజ ఫిల్మ్స్, ఓల్డ్ టౌన్ పిక్చర్స్‌పై ఎస్ఎన్ రెడ్డి, ఎస్. పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన 'జీబ్రా' మెగా ట్రైలర్ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన **చిరంజీవి మాట్లాడుతూ–** ''2024 'హను–మాన్' సినిమాతో శుభారంభం అయింది. అది తెలుగు సినిమా అనుకుంటే ఆల్ ఇండియా సినిమా అయిపోయింది. అక్కడి నుంచి చిన్న సినిమాల పట్ల ప్రారంభమైన ఈ ఆదరణని పెద్ద సినిమాల స్థాయికి మార్చారు మన తెలుగు ప్రేక్షకులు. ఆ తర్వాత వచ్చిన చిన్న సినిమాలు 'కమిటీ కుర్రోళ్లు', 'టిల్లు స్క్వేర్, ఆయ్, మత్తు వదలరా 2' ఇలా వరుసగా హిట్లు వచ్చాయి. మొన్న దీపావళికి వచ్చిన 'అమరన్, క, లక్కీ భాస్కర్' సినిమాలు ఎంతో ఆదరణ పొందాయి. ఈ సినిమాలో స్టార్లు లేరు.. పెద్ద డైరెక్టర్లు లేరు.. కోట్ల బడ్జెట్ లేదు. కానీ, కంటెంట్ ఉంది. అది సినిమాలకి ఆయువుపట్టు. కంటెంట్ బాగుండి, వినోదాన్ని అందించగలిగితే ఆస్వాదించడానికి ఎప్పుడూ ప్రేక్షకులు రెడీగా ఉంటారు. 'జీబ్రా'లో కూడా మంచి కంటెంట్, వినోదం, ఫ్యామిలీ అంశాలతో పాటు భావోద్వేగాలు.. అద్భుతమైన నటీనటులు ఉన్నారు. కచ్చితంగా 'జీబ్రా' సూపర్‌హిట్టు అవుతుంది.. అవ్వాలి.. అవుతుంది'' అని చెప్పారు. **సత్యదేవ్ మాట్లాడుతూ–** ''కెరీర్ పరంగా ఇండస్ట్రీలో నేను చాలా లోగా ఉన్నప్పుడు చిరంజీవి అన్నయ్యగారు పిలిచి 'గాడ్ ఫాదర్'లో విలన్‌గా అవకాశం ఇచ్చారు. నా జీవితంలో పెద్ద హై ఇచ్చిన సినిమా అది. నా కెరీర్‌లో 'జీబ్రా' చాలా పెద్ద సినిమా. ఈ సినిమాని అన్నయ్యకి అంకితం ఇస్తున్నా'' అన్నారు. ''వాల్తేరు వీరయ్య' లో బాబీ చేసిన క్యారెక్టర్‌ని నేను చేయాల్సింది. కానీ, మిస్ అయ్యాను'' అని తెలిపారు **డాలీ ధనంజయ.** ''జీబ్రా' చాలా ఎంగేజింగ్‌గా ఉంటుంది.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు **ఈశ్వర్ కార్తీక్, ఎస్ఎన్ రెడ్డి.** ''తెలుగు ప్రేక్షకులు మంచి కథ ఉన్న సినిమాల్ని ఎప్పుడూ సపోర్ట్ చేస్తారు. మా చిత్రం కూడా చాలా మంచి కంటెంట్‌తో రూపొందింది'' అని **దినేష్ సుందరం, బాల సుందరం** చెప్పారు.

ఈ వేడుకలో నిర్మాత వై.రవి శంకర్, డైరెక్టర్స్ ప్రశాంత్ వర్మ, వెంకటేశ్ మహా, కెమెరామేన్ సత్య పొన్మార్, సంగీత దర్శకుడు రవి బస్రూర్, నటీమణులు అమృత అయ్యంగార్, జెన్నీఫర్ పిక్కినాటో, ఎడిటర్ అనిల్ క్రిష్, లిరిక్ రైటర్ పూర్ణాచారి మాట్లాడారు.


మంచు మనోజ్

పవర్‌ఫుల్ గజపతి వర్మ

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్నారు. పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతీలాల్ గడ సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి గజపతి వర్మగా మంచు మనోజ్ ఫస్ట్ లుక్‌ని మంగళవారం రిలీజ్ చేశారు మేకర్స్. ''యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న చిత్రం 'భైరవం'. ఈ సినిమాలో గజపతి వర్మగా పవర్ ఫుల్ పాత్ర చేస్తున్నారు మనోజ్. ఇంతకు ముందు చూడని సరి కొత్త పాత్రలో కనిపించబోతున్నారాయన. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన సాయి శ్రీనివాస్, నారా రోహిత్ లుక్స్‌కి మంచి స్పందన వచ్చింది. వీరు ముగ్గురూ కలిసి నటిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు నెలకొన్నాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: హరి కె.వేదాంతం, సంగీతం: శ్రీ చరణ్ పాకాల.

అలా చేయలేని రోజు సినిమాలు మానేస్తాను

- కరుణ కుమార్



''సెట్‌లో కూడా స్టార్ హీరోలుగా ఉండే ఆర్టిస్టులను హ్యాండిల్ చేయడం నాకు కాస్త కష్టంగా ఉంటుంది. కానీ, తన స్టార్ హీరో ఇమేజ్‌ని బయట పెట్టి సెట్స్‌లో అందరితో హుందాగా ఉంటారు వరుణ్ తేజ్. 'పలాస 1978' సినిమాను ఎంత స్వేచ్ఛగా చేశానో, అంతే హాయిగా 'మట్కా'ని తీశాను. ఇరవై ఏళ్ల తర్వాత కూడా 'మట్కా' లోని వరుణ్ నటన గురించి చెప్పుకుంటారు. వరుణ్ లుక్స్ విషయంలో చిరంజీవిగారి గెటప్స్‌ను రిఫరెన్స్‌లుగా తీసుకున్నా'' అని దర్శకుడు కరుణ కుమార్ అన్నారు. వరుణ్ తేజ్ హీరోగా నటించిన చిత్రం 'మట్కా'. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్లు. విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మించిన ఈ చిత్రం రేపు(గురువారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా కరుణ కుమార్ మాట్లాడుతూ– ''బర్మా నుంచి వైజాగ్‌కు శరణార్థిగా వచ్చిన వాసు అనే వ్యక్తి కథే ఈ 'మట్కా'. రతన్ ఖత్రి జీవితాన్ని 'మట్కా'గా తీయలేదు. రతన్ ఖత్రీ ఏం చేసి ఉండేవాడోనని ఆలోచించి, ఓ ఐడియాతో ఈ స్క్రిప్టని రాశాను. 'మట్కా' గేమ్ గురించి కూడా ప్రేక్షకులకు అర్థమయ్యేలా చూపించాం. మొబైల్ ఫోన్స్ లేని రోజుల్లో కూడా దేశం మొత్తం ఒక నంబర్‌ని ఓ వ్యక్తి అతి తక్కువ సమయంలో ఎలా పంపాడు? అనే పాయింట్ ఈ సినిమాలో ఆసక్తికరంగా ఉంటుంది. జీవీ ప్రకాష్‌కుమార్ మంచి సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు. విజయేందర్ రెడ్డి, రజనీ చాలా సపోర్ట్ చేశారు. సినిమా అనేది కళతో కూడిన వ్యాపారమని నా అభిప్రాయం. నా నిర్మాతలు లాభపడాలనే కోరుకుంటాను. అందుకే ఎక్కువ ఫుటేజ్‌ని కూడా చిత్రీకరించను. నా ప్రతి సినిమాలో కూడా నా మార్క్ ఫిల్మ్‌మేకింగ్ సెన్సిబిలిటీస్ ఉంటాయి.. అలా చేయలేని రోజు సినిమాలు మానేస్తాను'' అని తెలిపారు.

దేవకీ నందన ప్రత్యేకం

- రానా



అర్జున్ జంధ్యాల, రానా, ప్రశాంత్ వర్మ, మానస, అశోక్ గల్లా

''మోడ్రన్ జనరేషన్‌కి మైథాలజీ స్టోరీలు చెప్పడంలో ప్రశాంత్ వర్మ మాస్టర్. ఆయన 'దేవకీ నందన వాసుదేవ' కథని రాయడం చాలా ఆనందంగా ఉంది. అర్జున్, బాలకృష్ణ కాంబినేషన్లో వస్తున్న ఈ చిత్రం ఒక ప్రత్యేక సినిమా అవుతుంది. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు'' అని హీరో రానా తెలిపారు. అశోక్ గల్లా, వారణాసి మానస జోడీగా నటించిన చిత్రం 'దేవకి నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకుడు. నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న రిలీజ్ కానుంది. మంగళవారం నిర్వహించిన ఈ మూవీ ట్రైలర్ విడుదల వేడుకకి అతిథిగా హాజరైన హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ– ''ఈ సినిమాని థియేటర్లో చూడటానికి చాలా ఉత్సాహంగా ఉన్నాను'' అన్నారు. ''మా సినిమా ట్రైలర్‌కు మంచి స్పందన రావడం ఆనందంగా అనిపించింది'' అని అశోక్ గల్లా చెప్పారు. ''ఈ సినిమాలో నాకు అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతలకు ధన్యవాదాలు'' అని పేర్కొన్నారు వారణాసి మానస. ''ప్రశాంత్ వర్మగారు లేకపోతే ఈ ప్రాజెక్టు లేదు. ఈ సినిమా మా అందరికీ మంచి జీవితం ఇస్తుంది'' అని సోమినేని బాలకృష్ణ చెప్పారు. ''మంచి కుటుంబ కథా చిత్రమిది. లవ్ స్టోరీ, యాక్షన్, ఎమోషన్స్.. ఇలా అన్నీ కుదిరాయి'' అని చిత్ర కథా రచయిత ప్రశాంత్ వర్మ తెలిపారు. ''మా సినిమా గురించి ట్రైలరే మాట్లాడుతుంది'' అని అర్జున్ జంధ్యాల చెప్పారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్ శంకర్, డైలాగ్ రైటర్ సాయి మాధవ్ బుర్రా మాట్లాడారు.


సన్య, సందీప్

హత్య నేపథ్యంలో...

సందీప్ అశ్వా హీరోగా, తరుణ్ సాగర్, అర్జున్ ఠాకూర్, విశ్వేష్, సన్య ఠాకూర్, జోయా ఝవేరి ఇతర పాత్రల్లో నటించిన చిత్రం 'రిస్క్: ఏ గేమ్ ఆఫ్ యూత్'. ప్రముఖ సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 25న రిలీజ్ కానుంది. ఈ చిత్రంలోని 'ఓ హసీనా..' పాట లిరికల్ వీడియోను నటుడు 'సత్యం' రాజేష్ విడుదల చేశారు. ''6టీన్స్' సినిమాకు సీక్వెల్‌గా, ప్రేక్షకులకు మర్డర్ మిస్టరీ అండ్ థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే యూత్‌ఫుల్ ఫిల్మ్ ఇది'' అన్నారు ఘంటాడి కృష్ణ.


టామ్ క్రూజ్

ఫైనల్ మిషన్

హాలీవుడ్ యాక్షన్ ఫ్రాంచైజీ 'మిషన్ ఇంపాజిబుల్' చివరి దశకు చేరుకుంది. ఈ ఫ్రాంచైజీ నుంచి ఆఖరి మూవీగా 'మిషన్ ఇంపాజిబుల్: ది ఫైనల్ రెకనింగ్' రానుంది. ఈ మూవీ టీజర్ ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. 'మిషన్ ఇంపాజిబుల్: ది ఫైనల్ రెకనింగ్' సినిమాలో హీరోగా నటిస్తూ, చిత్ర దర్శకుడు క్రిస్టోఫర్ మెక్‌క్వారీతో కలిసి నిర్మిస్తున్నారు టామ్ క్రూజ్. ఏఐ వల్ల కలిగే విపత్కర పరిస్థితులను ఎదుర్కొనే ఐఎమ్ఎఫ్ ఏజెంట్ ఏథాన్ హంట్‌గా టామ్ క్రూజ్ నటించనున్నారు. ఈ సినిమా 2025 మే 23 రిలీజ్ కానుంది.

సాక్షి బిజినెస్

బుధవారం
13-11-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
821	258
78,675	23,883

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	19,223	▽	76
డోజోన్స్	43,997	▽	296
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,026	▽	99
డాక్స్	19,034	▽	415
షాంఘై	3,421	▽	48
నికాయ్	39,376	▽	157

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
74,900	▽	1,940
బంగారం (99.5 స్వచ్ఛత)		
74,600	▽	1,932
వెండి (కిలో)		
88,252	▽	2,067

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.99	85.01
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	109.61	113.46
€	యూరో	ఒకటి	90.62	94.32
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.41	55.80
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.58	56.78
S$	సింగపూర్ డాలర్	ట్రావెలర్స్	61.55	66.32
SAR	సౌదీ రియాల్	ట్రావెలర్స్	21.61	23.16
UAE D	యూఏఈ దిర్హామ్	ట్రావెలర్స్	22.09	23.87
¥	చైనా యువాన్	ట్రావెలర్స్	10.84	12.66

పరిశ్రమ పరుగులు

- క్షీణత నుంచి వృద్ధి బాటలోకి పారిశ్రామిక ఉత్పత్తి
- సెప్టెంబర్‌లో 3.1 శాతం పురోగమనం

న్యూఢిల్లీ: భారత్ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) సెప్టెంబర్‌లో 3.1 శాతం వృద్ధిని (2023 ఇదే నెలతో పోల్చి) నమోదుచేసుకుంది. ఆగస్టు సూచీలో వృద్ధిలేకపోగా 0.1 శాతం క్షీణించిన సంగతి తెలిసిందే. తయారీ, మైనింగ్, విద్యుత్ ఉత్పత్తి రంగాలు సూచీని సమీక్షా నెల్లో వృద్ధి బాటన నిలబెట్టాయి. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) విడుదల చేసిన తాజా లెక్కల ప్రకారం... మైనింగ్ రంగం 0.2 శాతం పురోగమించింది. మొత్తం సూచీలో దాదాపు 70 శాతం వాటా ఉన్న తయారీ రంగం 3.9 శాతం వృద్ధిని సాధించింది. విద్యుత్ ఉత్పత్తి 0.5 శాతం ఎగసింది. ఆగస్టులో మైనింగ్ రంగం ఉత్పత్తి 4.3 శాతం, విద్యుత్ ఉత్పత్తి 3.7 శాతం క్షీణించగా, తయారీ రంగం కేవలం 1.1 శాతం వృద్ధిని నమోదుచేసుకుంది. కాగా తాజా సమీక్షా నెల్లో భారీ యంత్ర పరికరాల డిమాండ్‌కు సంబంధించిన క్యాపిటల్ గూడ్స్ విభాగంలో వృద్ధి రేటు 2.8 శాతంగా ఉంది. కన్జూమర్ నాన్ డ్యూరబుల్స్ విభాగంలో వృద్ధి రేటు 2 శాతంగా ఉంది. కన్జూమర్ డ్యూరబుల్స్‌లో వృద్ధి రేటు 6.5 శాతంగా నమోదయ్యింది.

ఆరు నెలల్లో 4 శాతం వృద్ధి

ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య ఐఐపీ 4 శాతం పురోగమించింది. గత ఏడాది ఇదే కాలంలో ఈ వృద్ధి రేటు 6.2 శాతం.



సరికొత్తగా కాక్స్ అండ్ కింగ్స్ కార్యకలాపాలు



న్యూఢిల్లీ: ట్రావెల్ సర్వీసుల బ్రాండ్ 'కాక్స్ అండ్ కింగ్స్' కార్యకలాపాలను సరికొత్తగా తీర్చిదిద్ది, కార్యకలాపాలను పునఃప్రారంభిస్తున్నట్లు సింగపూర్‌కి చెందిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థ విల్సన్ అండ్ హ్యాస్ వెల్లడించింది. ఇది ప్రధానంగా లీజర్, బిజినెస్, స్పెషలైజ్డ్ ట్రావెల్స్, ట్రావెల్ టెక్నాలజీ అనే నాలుగు విభాగాలపై దృష్టి పెడుతుందని పేర్కొంది. ఏఐ, డేటా వంటి అధునాతన సాంకేతికతలను ఉపయోగించి కస్టమర్లకు మెరుగైన ప్రయాణ అనుభూతి కల్పించేందుకు కృషి చేస్తామని సంస్థ డైరెక్టర్ కరణ్ అగర్వాల్ తెలిపారు. దివాలా ప్రక్రియ కింద కాక్స్ అండ్ కింగ్స్ బ్రాండ్‌తో పాటు దానికి అనుబంధంగా ఉన్న 200 పైచిలుకు సబ్–బ్రాండ్స్‌ను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ద్వారా విల్సన్ అండ్ హ్యాస్ ఈ ఏడాది జూన్‌లో కొనుగోలు చేసింది.

భద్రతా నిబంధనలు పూర్తి చేస్తే స్టార్‌లింక్‌కు లైసెన్స్

కేంద్ర టెలికం మంత్రి సింధియా వెల్లడి



న్యూఢిల్లీ: ఎలాన్ మస్క్‌కి చెందిన స్టార్‌లింక్ సంస్థ భద్రతా నిబంధనలన్నింటినీ పూర్తి చేశాక, దేశీయంగా శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలు అందించేందుకు లైసెన్సు ఇస్తామని కేంద్ర టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు. కంపెనీ ప్రస్తుతం అదే ప్రక్రియలో ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం దేశీయంగా భారతీ గ్రూప్‌నకు చెందిన వన్‌వెబ్‌కి, జియో–ఎస్‌ఈఎస్ జాయింట్ వెంచర్ జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్‌కి ప్రభుత్వం లైసెన్సులు ఇచ్చింది. స్పెక్ట్రం కేటాయింపు కోసం ఎదురు చూస్తున్న ఈ రెండు కంపెనీలు ఇంకా కార్యకలాపాలు ప్రారంభించాల్సి ఉంది. శాటిలైట్ కమ్యూనికేషన్స్ కోసం స్పెక్ట్రంను కేటాయించడంపై ధర, నిబంధనలు మొదలైన వాటిని టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ డిసెంబర్ 15 నాటికి ఖరారు చేసే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

ధరలకు రెక్కలు..

- అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 6.2 శాతం
- 14 నెలల గరిష్ట స్థాయికి జంప్

న్యూఢిల్లీ: భారత్ రిటైల్ ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో బెంబేలెత్తించింది. 14 నెలల గరిష్ట స్థాయిలో 6.2%గా (2023 ఇదే నెలతో పోల్చి) నమోదైంది. ఆర్‌బీఐ పాలసీకి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం 2 శాతం అటు ఇటుగా 4 శాతం వద్ద ఉండాలి. అంటే ఎగువదిశగా 6 శాతం పైకి పెరగకూడదు. తాజా గణాంకాల నేపథ్యంలో ఆర్‌బీఐ సమీప భవిష్యత్‌లో వడ్డీరేట్ల తగ్గుదలకు సంకేతాలు ఇవ్వకపోవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం 6.5 శాతంగా ఉన్న రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు) తగ్గే అవకాశాలు లేవని వారు విశ్లేషిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతం దిగువన కొనసాగింది.



- ఫుడ్ బాస్కెట్ ద్రవ్యోల్బణం సమీక్షా నెలలో 10.87 శాతం పెరిగింది.
- దేశ వ్యాప్తంగా రిటైల్ ద్రవ్యోల్బణం 6.2% ఉంటే, గ్రామీణ ప్రాంతాల్లో 6.68%గా, పట్టణ ప్రాంతాల్లో 5.62 శాతంగా నమోదయ్యింది.
- 1,114 పట్టణ, 1,181 గ్రామీణ మార్కెట్‌లలో ధరలను వారంవారీగా విశ్లేషించి జాతీయ గణాంకాల కార్యాలయం నెలవారీ రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు విడుదల చేస్తుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
హ్యుందాయ్ లాభం డౌన్
క్యూ2లో బీఎస్‌ఈ దూకుడు

24,000 దిగువకు నిఫ్టీ



79,000 స్థాయిని కోల్పోయిన సెన్సెక్స్

- ప్రపంచ మార్కెట్ల నుంచి ప్రతికూలతలు
- విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ఎఫెక్ట్

ముంబై: అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూలతలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలతో స్టాక్ సూచీలు మంగళవారం ఒకశాతానికి పైగా నష్టపోయాయి. దేశీయ అక్టోబర్ ద్రవ్యల్బోణ, సెప్టెంబర్ పారిశ్రామికోత్పత్తి గణాంకాల వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ రోజుకో కొత్త కనిష్టానికి దిగిరావడమూ ఒత్తిడి పెంచింది. ఫలితంగా సెన్సెక్స్ 821 పాయింట్లు నష్టపోయి 79 వేల దిగువన 78,675 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 258 పాయింట్లు క్షీణించి 24 వేల దిగువన 23,883 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన స్టాక్ సూచీలు వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. రియల్టీ, ఐటీ మినహా అన్ని రంగాల్లో విక్రయాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా బ్యాంకులు, ఆటో, విద్యుత్ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ఒక దశలో సెన్సెక్స్ 948 పాయింట్లు క్షీణించి 78,548 వద్ద, నిఫ్టీ 302 పాయింట్లు కోల్పోయి 23,839 వద్ద కనిష్టాలు తాకాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 1.25%, 1% నష్టపోయాయి. సెమికండక్టర్ల షేర్లతో పాటు చైనా మార్కెట్ వరుస పతనంతో ఆసియా మార్కెట్లు 3% పడ్డాయి. యూరప్ మార్కెట్లు 1.5% క్షీణించాయి. అమెరికా మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- అధిక వెయిటేజీ షేర్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 3%, ఎస్‌బీఐ 2.50%, ఏషియన్ పెయింట్స్ 2%, ఐటీసీ, ఎల్‌అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్ 1% నష్టపోయి సూచీల పతనానికి ప్రధాన కారణమయ్యాయి.
- అధిక వాల్యుయేషన్ల ఆందోళనల తో ప్రభుత్వరంగ కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఐటీఐ 10% పతనమైంది. హిందుస్థాన్ ఏరోనాటిక్స్, గెయిల్ 4.50%, భెల్, ఎన్‌ఎల్‌సీ 4%, ఎన్‌సీఎల్ 3.50% క్షీణించాయి.
- బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ మంగళవారం ఒక్కరోజే రూ.5.29 లక్షల కోట్లు హరించుకుపోయి రూ.437.24 లక్షల కోట్లకు తగ్గింది.
- సాగిలిటీ ఇండియా లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.30)తో పోలిస్తే 3.50% ప్రీమియంతో రూ.31 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 10% పెరిగి, చివరికి 2% నష్టంతో రూ.29.36 వద్ద ముగిసింది.

జోస్ ఆలుక్కాస్ 'హాస్పిటల్ ఆన్ వీల్స్'

త్రిస్సూర్: భారత గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుపరిచే దిశగా ప్రముఖ జ్యువెలరీ సంస్థ జోస్ ఆలుక్కాస్ ముందడుగు వేసింది. చైర్మన్ జోస్ ఆలుక్కా 80వ పుట్టినరోజు సందర్భంగా త్రిస్సూర్ జూబ్లీ మిషన్ హాస్పిటల్ భాగస్వామ్యంతో 'హాస్పిటల్ ఆన్ వీల్స్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. కోటి రూపాయల ఈ సంచార వైద్య కేంద్రాన్ని ప్రముఖ నటి మంజు వారియర్ ప్రారంభించారు. ఇందులో ఈసీజీ, మల్టీ పారా మోనిటర్లు, మినీ ల్యాబ్ ఉన్నాయి. ఒకేసారి ఆరుగురు రోగులకు చికిత్స చేయవచ్చు. ఆరోగ్య సంరక్షణలో అంతరాన్ని తగ్గించడం, అధునాతన వైద్యాన్ని మారుమూల ప్రజలకు చేర్చడమే 'హాస్పిటల్ ఆన్ వీల్స్' ముఖ్య లక్ష్యమని జోస్ ఆలుక్కా తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంస్థ ఎండీలు వర్గీస్ ఆలుక్కాస్, పాల్ జె ఆలుక్కాస్, జాన్ ఆలుక్కాస్, జూబ్లీ మిషన్ ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ సింటో కరేపరంబన్, సీఈవో డాక్టర్ బెన్నీ జోసెఫ్ నీలంకవిల్ తదితరులు పాల్గొన్నారు.



రూ. 440 కోట్లతో పోకర్ణ విస్తరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజనీర్డ్ స్టోన్ తయారీలో ఉన్న పోకర్ణ ఇంజనీర్డ్ స్టోన్ హైదరాబాద్ సమీపంలోని ప్లాంటు విస్తరణకు రూ.440 కోట్లు వెచ్చించనున్నట్టు ప్రకటించింది. మేకగూడ ప్లాంటులో ఇటలీకి చెందిన బ్రెటన్ ఎస్‌పీఏ సాంకేతిక సహకారంతో మూడవ లైన్‌ను జోడిస్తామని పోకర్ణ సీఎండీ గౌతమ్ చంద్ జైన్ తెలిపారు. 2026 మార్చిలో 8.1 లక్షల చదరపు మీటర్ల సామర్థ్యం తోడవనుందని అన్నారు. మేకగూడ కేంద్రంలో 2021 మార్చిలో యూనిట్–2 అందుబాటులోకి వచ్చిందని కంపెనీ సీఈవో పరాస్ కుమార్ జైన్ చెప్పారు. కాగా, సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో పోకర్ణ లిమిటెడ్ నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.33 కోట్ల నుంచి రూ.45 కోట్లకు చేరింది. టర్నోవర్ రూ.197 కోట్ల నుంచి రూ.253 కోట్లకు ఎగసింది.

పోకర్ణ షేరు ధర మంగళవారం 1.81% దూసుకెళ్లి రూ.1,103.20 వద్ద ముగిసింది.

ఎనర్జీ టెక్నాలజీ సదస్సు ప్రారంభం..



బెంగళూరు: సెంటర్ ఫర్ హై టెక్నాలజీ (సీహెచ్‌టీ), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎనర్జీ టెక్నాలజీ మీట్ (ఈటీఎం) 2024ను కేంద్ర పెట్రోలియం, నేచురల్ గ్యాస్ శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి ప్రారంభించారు. ఇది మూడు రోజుల పాటు నవంబర్ 14 వరకు కొనసాగుతుంది. దేశవిదేశాలకు చెందిన 1,300 మంది పైగా పరిశ్రమ నిపుణులు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు ఇందులో పాల్గొంటున్నారు. 2047 నాటికి భారత్‌లో ఇంధనాలకి డిమాండ్ రెట్టింపు కానుందని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. తటస్థ ఉద్గార లక్ష్యాలను సాధించే దిశగా ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, ప్రైవేట్ ఇంధన కంపెనీలు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాయని కితాబిచ్చారు. జీవ ఇంధనాల ప్రోత్సాహానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో రూ. 91,000 కోట్ల మేర దిగుమతి బిల్లుల భారం తగ్గిందన్నారు.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

» పూర్తిగా సిలబస్ పరిధిలోనే ప్రశ్న పత్రాలు
» కరెంట్ అఫైర్స్ నుంచి కనిపించని ప్రశ్నలు
» డేటా ఇంటర్‌ప్రిటేషన్‌లో సమయాభావం

గ్రూప్-1 మెయిన్స్.. ఎలా ఉందంటే!

టీజీపీఎస్సీ.. ఇటీవల 563 పోస్టుల భర్తీకి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. క్వాలిఫయింగ్ పేపర్ ఇంగ్లిష్‌తోపాటు మొత్తం ఏడు పేపర్లకు అక్టోబర్ 21 నుంచి 27 వరకు పరీక్షలు జరిగాయి. దీంతో అభ్యర్థుల్లో ప్రశ్నల సరళి ఎలా ఉంది.. టీజీపీఎస్సీ అభ్యర్థుల నుంచి ఏం ఆశిస్తోంది.. భవిష్యత్‌లో గ్రూప్స్ పరీక్షల ప్రిపరేషన్ ఎలా ఉండాలి తదితర సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో.. టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్‌పై విశ్లేషణాత్మక కథనం..

టీజీపీఎస్సీ అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్1 మెయిన్స్ పరీక్షలకు 67.17 శాతం హాజరు నమోదైంది. మొత్తం 31,383 మందికి మెయిన్స్‌కు అర్హత లభించగా.. 21,093 మంది హాజరయ్యారు. పరీక్షలు ముగియడంతో పరీక్ష రాసిన అభ్యర్థులు కటాఫ్ గురించి ఆలోచిస్తుంటే.. భవిష్యత్తు ఔత్సాహికులు ప్రశ్నల సరళిపై ఆరా తీస్తున్నారు. ఈ పరీక్షల సరళిని తెలుసుకోవడం ద్వారా తాము గ్రూప్స్ పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలనే విషయంపై స్పష్టత వస్తుందని అభ్యర్థులు భావిస్తున్నారు.

పూర్తిగా సిలబస్ పరిధిలోనే

గ్రూప్–1 మెయిన్స్ ఆరు పేపర్ల ప్రశ్నల సరళిని పరిశీలిస్తే.. అన్ని పేపర్లలోనూ ప్రశ్నలు పూర్తిగా సిలబస్ పరిధిలోనే అడిగారని చెబుతున్నారు. అయితే కరెంట్ అఫైర్స్ సమ్మిళిత ప్రశ్నలు లేవని పేర్కొంటున్నారు. దీంతో.. కరెంట్ అఫైర్స్‌ను అనుసంధానం చేసుకుంటూ ఆయా సబ్జెక్ట్‌లను చదివిన వారు కొంత నిరాశ చెందారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సిలబస్‌ను పూర్తిగా చదివి.., అన్ని కోణాల్లో సబ్జెక్టులను అవగాహన చేసుకున్న వారు సమర్థంగా సమాధానాలు రాసే అవకాశముందని చెబుతున్నారు. ముఖ్యంగా అభ్యర్థుల విశ్లేషణ సామర్థ్యాన్ని పరిశీలించే విధంగా ప్రశ్నలు అడిగారని పేర్కొంటున్నారు.

రెండు ప్రశ్నలు తప్పనిసరి

గ్రూప్–1 మెయిన్స్‌లో జనరల్ ఎస్సే మినహా ప్రతి పేపర్‌లో.. ప్రతి సెక్షన్‌లో 1, 2 ప్రశ్నలకు తప్పనిసరిగా సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. 3,4,5 ప్రశ్నలకు ఇంటర్నల్ ఛాయిస్ విధానం అమలు చేశారు. దీంతో..కంపల్సరీ కొశ్చన్స్ విషయంలో అభ్యర్థులు కొంత ఇబ్బంది పడ్డారనే వాదన వినిపిస్తోంది.

జనరల్ ఎస్సే.. మోస్తరుగా

గ్రూప్–1 మెయిన్స్‌లో కీలకంగా భావించే జనరల్ ఎస్సే పేపర్ మోస్తరు క్లిష్టతతో ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సామాజిక పరిస్థితులపై అవగాహన పొందిన వారు మాత్రం సమాధానాలు రాసే అవకాశం ఉంది. ఉదాహరణకు.. అసమాన అభివృద్ధి దేశంలో ప్రాంతీయవాదం పెరుగుదలకు దారితీసింది–చర్చించండి; దేశంలో సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ ప్రక్రియలో భాగంగా ఆర్థిక అసమానతలు, ప్రాంతీయ వ్యత్యాసాలు పెరిగాయి–చర్చించండి; జాతీయ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆవిష్కరణ విధానం వంటి ఎస్సేలను పేర్కొనొచ్చు. అయితే ఎస్సే రాసే విషయంలో అభ్యర్థులు కొంత సమయాభావానికి గురయ్యారని చెబుతున్నారు.

పేపర్-2.. సిలబస్ పరిధిలోనే

మెయిన్స్ పేపర్–2 (హిస్టరీ, కల్చర్, జాగ్రఫీ)లో సిలబస్ పరిధిలోనే లోతైన ప్రశ్నలు అడిగినట్లు పేర్కొంటున్నారు. దీంతో.. సిలబస్‌పై పూర్తి స్థాయి పట్టు సాధించిన వారే సమాధానాలు సరిగా రాసి ఉంటారని చెబుతున్నారు. ఉదాహరణకు గాంధార, మధుర కళలకు మధ్య వ్యత్యాసాలు; సంతాల్ తిరుగుబాటు; ఇండో–ఇస్లామిక్ వాస్తుశైలి, సాయుధ రైతాంగ పోరాటం; శాతవాహనులు–ఇక్ష్వాకుల మధ్య కాలంలో ప్రజల సామాజిక, సాంస్కృతిక జీవన పరిణామం వంటి ప్రశ్నలు సిలబస్‌లో లోతైన పరిజ్ఞానం, విశ్లేషణ నైపుణ్యం ఉన్న వారు మాత్రమే సమాధానం ఇవ్వగలిగేవిగా ఉన్నాయని అభ్యర్థులు,సబ్జెక్ట్ నిపుణులు పేర్కొంటున్నారు.



పేపర్-3 ఇలా

మెయిన్స్‌లో అభ్యర్థులు ఎంతో కీలకంగా భావించే పేపర్–3 (సొసైటీ, కాన్‌స్టిట్యూషన్, గవర్నెన్స్)లో సైతం సిలబస్ పరిధిలోనే ప్రశ్నలు అడిగారు.

గవర్నెన్స్‌కు సంబంధించి అభ్యర్థుల పాలన దక్షతను పరిశీలించేలా ప్రశ్నలు ఉన్నాయని అంటున్నారు. ఉదాహరణకు.. జాతీయ విద్యా విధానం, న్యాయ వ్యవస్థ క్రియాశీలత, సుపరిపాలన–వికేంద్రీకరణ, లౌకిక వాదం, పారిశ్రామిక జల వివాదాలు వంటి ప్రశ్నలు అడిగినట్లు పేర్కొన్నారు. సామాజిక సమస్యలపై అవగాహన, రాజ్యాంగంపై పట్టుతోపాటు విశ్లేషణ సామర్థ్యం పెంచుకున్న అభ్యర్థులు ఈ పేపర్‌ను సమర్థంగా రాసే అవకాశముందని నిపుణులు పేర్కొన్నారు.

పేపర్-4.. ఎకానమీ అండ్ డవలప్‌మెంట్

ఇందులో సామాజిక ఆర్థికాభివృద్ధి అంశాలు సమ్మిళితంగా ప్రశ్నలు అడిగారు. ఉదాహరణకు.. భారత దేశంలో ఆర్థిక సంస్కరణల తర్వాత కాలంలో వివిధ రాష్ట్రాల్లో పేదరికం తగ్గింపు తీరు ఒకే తీరుగా లేదు–పరిశీలించండి. అదే విధంగా తెలంగాణ ప్రాంత ప్రాధాన్యమైన ప్రశ్నలు కూడా ఈ పేపర్‌లో అడిగారు. ఉదాహరణకు.. 'తెలంగాణ వ్యవసాయ వృద్ధి, ఆహార భద్రత విషయంలో నీటి పారుదల కీలకమైన పాత్రను పోషిస్తుంది' రాష్ట్ర ప్రభుత్వం నిరంతరంగా చేపడుతున్న కార్యక్రమాల దృష్ట్యా దీనిని సమర్థించండి. పారిశ్రామిక విధానం .. దేశ, రాష్ట్ర పారిశ్రామిక వేగాన్ని, తీరును నిర్ణయిస్తుంది. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక ప్రాజెక్ట్ ఆమోదం, స్వీయ ధ్రువీకరణ వ్యవస్థను (టీఎస్–ఐపాస్) దృష్టిలో పెట్టుకుని దీనిపై వ్యాఖ్యానించండి.. వంటి ప్రశ్నలు అడిగారు.

పేపర్-5.. డేటా ఇంటర్‌ప్రిటేషన్ అత్యంత క్లిష్టం

ఈ పేపర్‌లో డేటా ఇంటర్‌ప్రిటేషన్ సెక్షన్ క్లిష్టంగా ఉందని చెబుతున్నారు. ఈ సెక్షన్‌లో 20 శాతానికి మించి సమాధానాలు ఇచ్చి ఉండరనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విభాగంలో ప్రశ్నల నిడివి ఎక్కువగా ఉండడం, అదే విధంగా ప్రశ్నల సంఖ్య ఎక్కువగా ఉండడంతో.. ఒక్కో ప్రశ్నకు రెండు నిమిషాలకు మించి అభ్యర్థులకు సమయం లభించని పరిస్థితి తలెత్తిందని పేర్కొంటున్నారు. సమాధానాలు ఇచ్చే క్రమంలో కనీసం మూడు లేదా నాలుగు అంచెల్లో సాధించాల్సిన పరిస్థితి, రెండు మార్కుల ప్రశ్నలనే అడగడంతో అభ్యర్థులు ఇబ్బందికి గురయ్యారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగానికి సంబంధించి స్టాక్ అంశాలపైనే ప్రశ్నలు (ఉదా: సోలార్ ఎనర్జీ, రెన్యువబుల్ ఎనర్జీ) అడగడంతో.. ఈ విభాగంలో కరెంట్ అఫైర్స్ సంబంధ ప్రశ్నలు వస్తాయని భావించిన అభ్యర్థులు కొంత నిరాశకు గురయ్యారనే వాదన వినిపిస్తోంది.

పేపర్-6 ఊహించిన రీతిలోనే

టీజీపీఎస్సీ గ్రూప్–1 మెయిన్స్‌లో తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావంపై ప్రశ్నలు ఊహించిన విధంగానే ఉన్నాయి. 1969 నుంచి జరిగిన పరిణామాలపై సహజమైన ఆసక్తి, అవగాహన కలిగిన అభ్యర్థులు సునాయాసంగా సమాధానాలు రాసే వీలుంది. అయితే విస్తృతమైన సబ్జెక్టు కావడంతో కొన్ని ప్రశ్నలకు అధికంగా సమాచారం రాస్తూ పోయిన అభ్యర్థులు చివర్లో మిగతా ప్రశ్నలకు సమయం సరిపోక ఇబ్బందిపడినట్లు చెబుతున్నారు. అదేవిధంగా ఈ పేపర్‌కు సంబంధించి నిర్దిష్ట పుస్తకాలు లేకపోవడంతో.. గణాంకాలు, సంవత్సరాలు ప్రస్తావించాల్సిన సందర్భంలో అభ్యర్థులు పొరపాట్లు చేసే అవకాశముందనే వాదన వినిపిస్తోంది.



సిడ్బీలో 72 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

లక్నోలోని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సిడ్బీ).. దేశవ్యాప్తంగా ఉన్న సిడ్బీ బ్రాంచ్‌లలో గ్రేడ్–ఎ,గ్రేడ్–బి కేటగిరిలో అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 72.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–ఎ(జనరల్)–50, అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–బి(జనరల్)–10, అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–బి(లీగల్)–06, అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–బి(ఐటీ)–06.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఏదైనా డిగ్రీ, బీఈ/బీటెక్(సీఎస్/ఐటీ/ఈసీసీ), ఎల్ఎల్‌బీ, సీఏ, సీఎస్, సీఎంఏ, ఐసీడబ్ల్యూఏ, సీఎఫ్‌ఏ, ఎంబీఏ, ఎంసీఏ, పీజీడీఎం ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 08.11.2024 నాటికి గ్రేడ్–ఎ కేటగిరికి 21 నుంచి 30 ఏళ్లు, గ్రేడ్–బి కేటగిరికి 25 నుంచి 33 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు గ్రేడ్–ఎ కేటగిరికి సుమారుగా రూ.44,500 నుంచి రూ.1,00,000;గ్రేడ్–బి కేటగిరికి సుమారుగా రూ.55,200నుంచి 1,15,000
» **ఎంపిక విధానం:** ఫేజ్–1(ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష), ఫేజ్–2(ఆన్‌లైన్ పరీక్ష), ఫేజ్–3(ఇంటర్వ్యూ), ఆన్‌లైన్ సైకోమెట్రిక్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.12.2024.
» **ఆన్‌లైన్ పరీక్ష తేది (ఫేజ్–1):** 22.12.2024.
» **ఆన్‌లైన్ పరీక్ష తేది (ఫేజ్–2):** 19.01.2025.
» **ఇంటర్వ్యూ షెడ్యూల్:** ఫిబ్రవరి 2025.
» **వెబ్‌సైట్:** https://www.sidbi.in

యునైటెడ్ కమర్షియల్ బ్యాంక్ 12 పోస్టులు

కోల్‌కతాలోని యునైటెడ్ కమర్షియల్ బ్యాంక్‌లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
» **పోస్టుల వివరాలు:** చీఫ్ రిస్క్ ఆఫీసర్(సీఆర్‌వో)–01, డేటా ప్రొటెక్షన్ ఆఫీసర్–01, చీఫ్ మేనేజర్–డేటా అనలిస్ట్–01, మేనేజర్ డేటా అనలిస్ట్–04, సెక్షన్ మేనేజర్ –క్లైమేట్ రిస్క్–01, మేనేజర్ ఎకనామిస్ట్–02, ఆపరేషనల్ రిస్క్ అడ్వైజర్–01, డిఫెన్స్ బ్యాంకింగ్ అడ్వైజర్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ,డిగ్రీ, బీఈ/బీటెక్,ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 65 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ల పరిశీలన, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.11.2024.
» **వెబ్‌సైట్:** https://ucobank.com

హాల్ బెంగళూరులో 24 పోస్టులు

బెంగళూరులోని హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్) షార్ట్‌టర్మ్ ప్రాతిపదికన స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 24.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ స్పెషలిస్ట్–8, మిడిల్ స్పెషలిస్ట్–12, సీఎంఎం(లెవల్–5) ఇంజనీర్–4.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ (మెకానికల్ /ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/కంప్యూటర్ సైన్స్/ఏరోనాటికల్ /మెటలర్జీ/కెమికల్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** సీఎంఎం పోస్టుకు 45 ఏళ్లు, మిడిల్ స్పెషలిస్ట్ పోస్టుకు 40 ఏళ్లు, జూనియర్ పోస్టుకు 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు సీఎంఎం పోస్టుకు రూ.60,000, మిడిల్ స్పెషలిస్ట్ పోస్టుకు రూ.50,000, జూనియర్ పోస్టుకు రూ.40,000 వేతనం లభిస్తుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.11.2024.
» **వెబ్‌సైట్:** https://hal-india.co.in

యూసీఐఎల్, జార్ఖండ్‌లో 82 పోస్టులు

జార్ఖండ్‌లోని యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(యూసీఐఎల్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 82.
» **పోస్టుల వివరాలు:** మైనింగ్ మేట్–సి–64, బ్లాస్టర్–బి–08, వైండింగ్ ఇంజిన్ డ్రైవర్–బి–10.
» **అర్హత:** పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. మైనింగ్ మేట్, వైండింగ్ ఇంజిన్ డ్రైవర్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలి. » **వయసు:** మైనింగ్ మేట్–సి పోస్టులకు 35 ఏళ్లు, మిగతా పోస్టులకు 32 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు మైనింగ్ మేట్–సి పోస్టులకు రూ.29,190 నుంచి రూ.45,480, మిగతా పోస్టులకు రూ.28,790 నుంచి రూ.44,850.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.11.2024.
» **వెబ్‌సైట్:** https://ucil.gov.in

బెల్ బెంగళూరులో 78 ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్).. హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ అండ్ స్మార్ట్ సిటీ బిజినెస్ ఎస్‌బీయూ (హెచ్‌ఎల్‌ఎస్–ఎస్‌సీబీ ఎస్‌బీయూ) ప్రాజెక్ట్ కోసం తాత్కాలిక ప్రాతిపదికన ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 78.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ ఫీల్డ్ ఆపరేషన్ ఇంజనీర్–06, ఫీల్డ్ ఆపరేషన్ ఇంజనీర్–41, ప్రాజెక్ట్ ఇంజనీర్–13, ట్రైనీ ఇంజనీర్–18.
» **విభాగాలు:** ఐటీ సెక్యూరిటీ అండ్ అసిస్టెంట్ మేనేజర్, డీసీ సపోర్ట్, ఐటీ సపోర్ట్ స్టాఫ్, కంటెంట్ రైటర్, ఐటీ హెల్ప్ డెస్క్ స్టాఫ్, డిస్ట్రిక్ టెక్నికల్ సపోర్ట్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్, ఎంఈ/ఎంటెక్/ఎంసీఏ/ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** సీనియర్ ఫీల్డ్ ఆపరేషన్ ఇంజనీర్ పోస్టులకు 45 ఏళ్లు, ఫీల్డ్ ఆపరేషన్ ఇంజనీర్ పోస్టులకు 40 ఏళ్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులకు 32 ఏళ్లు, ట్రైనీ ఇంజనీర్ పోస్టులకు 28 ఏళ్లు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు సీనియర్ ఫీల్డ్ ఆపరేషన్ ఇంజనీర్ పోస్టులకు రూ.80,000, ఫీల్డ్ ఆపరేషన్ ఇంజనీర్ పోస్టులకు రూ.60,000, ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులకు రూ.40,000, ట్రైనీ ఇంజనీర్ పోస్టులకు రూ.30,000 వేతనం లభిస్తుంది.
» **ఎంపిక విధానం:**రాతపరీక్ష,ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.11.2024.
» **వెబ్‌సైట్:** https://bel-india.in

ప్రభాస్ హెయిర్ స్టైల్ కావాలి



జుట్టు పెంచుకొనేందుకు అనుమతివ్వాలి | టీచర్ల మాదిరిగా చీర కట్టుకోవాలని ఉంది | ఫిర్యాదుల బాక్సుల్లో విద్యార్థుల అభ్యర్థనలు | వరంగల్ జిల్లా రెసిడెన్షియల్ వెల్ఫేర్ స్కూళ్లలో విచిత్రాలు

'మాకు హీరో ప్రభాస్‌లాగా హెయిర్ స్టైల్ కావాలి.. జుట్టు పొడుగ్గా పెంచుకొనేందుకు అనుమతి ఇవ్వాలి.. గాజులు వేసుకొనేందుకు పర్మిషన్ ఇవ్వాలి. టీచర్ల మాదిరిగా చీరలు కట్టుకోవాలని ఉంది'..

–వరంగల్ జిల్లా రెసిడెన్షియల్ వెల్ఫేర్ స్కూళ్లలో సమస్యలు తెలుసుకొనేందుకు అధికారులు ఏర్పాటుచేసిన ఫిర్యాదుల బాక్సుల్లో విద్యార్థులు వేసిన వినతులు ఇవి. ఆహారం బాగా లేదనో, హోం వర్క్ ఎక్కువ ఇస్తున్నారో, పుస్తకాలు లేవనో ఫిర్యాదులు వస్తాయని అధికారులు ఆశించారు. కానీ, ఫిర్యాదు బాక్సుల్లో మాత్రం ఇలాంటి వినతులు కనిపించాయి. దీనిపై ఓ విద్యార్థిని ఒక సీనియర్ అధికారి ప్రశ్నించగా.. 'స్థానిక బార్బర్ అబ్బాయిలందరికీ ఒకే రకమైన ఫ్లాట్ హెయిర్ కట్ 'తాపేలి కట్'చేస్తున్నాడు. అది నచ్చడం లేదు. అందుకే హీరోల వంటి హెయిర్ కట్ కావాలని కోరాం 'అని తెలిపాడు. ఈ విషయంలో వారు సీరియస్‌గానే ఉన్నారని ఆ అధికారి చెప్పారు. 'ఈ పిల్లలకు ఫోన్లు అందుబాటులో లేవు. తల్లిదండ్రులతో క్రమం తప్పకుండా మాట్లాడలేరు. అందుకే ఫిర్యాదు పెట్టెలను పెట్టించాం. వీళ్ల ఫిర్యాదులు ఆసక్తికరంగా ఉన్నాయి. తమ భావాలను స్పష్టంగా వ్యక్తీకరిస్తున్నారు'అని జిల్లా ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. గణేశ్ ఉత్సవాల సందర్భంగా కొంత మంది విద్యార్థులు పాఠశాలలో పూజలు ఏర్పాటు చేయాలని కోరారు. కొంతమంది విద్యార్థినులు సీనియర్లు తమను వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

సోషల్ మీడియా ప్రభావమే...

ఇదంతా సోషల్ మీడియా ప్రభావమేనని విద్యారంగ నిపుణులు అంటున్నారు. 'క్యాంపస్‌లలో ఫోన్లను అనుమతించనప్పటికీ, చాలా పాఠశాలల్లో కంప్యూటర్ సైన్స్ ల్యాబ్‌లు ఉన్నాయి. వాటి ద్వారా పిల్లలు సోషల్ మీడియాలో లేటెస్ట్ ట్రెండ్లను తెలుసుకుంటున్నారు. వాళ్లు తమ మనసులోని మాటలను చెప్పడం మంచిదే. వాళ్లపై ఏవి ప్రభావం చూపుతున్నాయో తెలియాలి' అని పాఠశాల పిల్లలతో కలిసి పనిచేసే డెవలప్‌మెంట్ ప్రొఫెషనల్ కన్సల్టెంట్ ఒకరు చెప్పారు. కోవిడ్ –19కి ముందు ఎక్కువ ఫిర్యాదులు ఆహారం నాణ్యత, ఉపాధ్యాయుల శిక్షణ గురించి ఉండేవని.. ఇప్పుడు ఇలా ఉంటున్నాయని చెప్పారు.

–సాక్షి, వరంగల్

హోటళ్లకు సర్కారీ రేటింగ్

- వైద్య, ఆరోగ్యశాఖ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వమే హోటళ్లకు రేటింగ్‌లు ఇవ్వాలని వైద్య, ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఆహార నాణ్యత, పరిశుభ్రత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని రేటింగ్‌లు ఇవ్వనుంది. వినియోగదారులకు మంచి ఆహారం అందించడమే లక్ష్యంగా రేటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఈ మేరకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేశారు. హోటళ్లు, రెస్టారెంట్లు, కేఫెటేరియాలు, దాబాలు, బేకరీలు, స్వీట్‌షాపులు, మాంసం, రిటైల్ షాపులు ఇలా అన్నింటికీ రేటింగ్‌లు ఇస్తారు. హోటళ్లకు రేటింగ్‌లు ఎలా ఇవ్వాలనే దానిపై వైద్య, ఆరోగ్యశాఖ చెక్‌లిస్ట్‌తో కూడిన మార్గదర్శకాలను విడుదల చేసింది. చెక్‌లిస్ట్ ఆధారంగా వీటన్నింటికీ రేటింగ్ ఇవ్వనుంది. ఆ రేటింగ్ వివరాలను వెబ్‌సైట్లో ప్రదర్శిస్తుంది. ఆ రేటింగ్ ఆధారంగా వినియోగదారులు తమకు ఇష్టమైనచోటకు వెళ్లి ఆహార పదార్థాలను ధైర్యంగా తినవచ్చని వైద్య, ఆరోగ్యశాఖ భరోసా ఇస్తోంది. మంచి రేటింగ్ కలిగిన వాటిల్లో ఎలాంటి అనుమానాలు లేకుండా తినొచ్చనే ధైర్యాన్ని కల్పిస్తామని సంబంధిత వర్గాలు చెప్పాయి. అనవసర రంగులు, కల్తీ నూనె, కల్తీ పదార్థాలు లేకుండా పరిశుభ్రమైన వాటితో తయారవుతున్న హోటళ్లకే మంచి రేటింగ్ ఇస్తామన్నాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



మధ్యమానేరు బ్యాక్ వాటర్‌లో సూర్యోదయం అందాలు



పువ్వుపై సూర్యోదయం



మధ్యమానేరు బ్యాక్‌వాటర్‌లో పచ్చటి మొక్కల ప్రతిబింబం

విరిసిన సూర్యాసుమం

శీతాకాలం వేకువజామున పొగమంచుతో ప్రకృతి అందాలను సంతరించుకుంటుంది. మంగళవారం ఉదయం మధ్య మానేరు జలాశయం బ్యాక్‌వాటర్‌లో సూర్యోదయం మరింత అందంగా కనిపించింది. బ్యాక్ వాటర్‌లో నిశ్చలంగా ఉన్న పచ్చటి మొక్కలు తమ నీడని తామే చూసుకొని మురిసిపోయాయి. – వంకాయల శ్రీకాంత్, సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

14న ప్రజాపాలన విజయోత్సవ ప్రారంభ కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్: ఈనెల 14న ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న ప్రజాపాలన విజయోత్సవాల ప్రారంభ కార్యక్రమ ఏర్పాట్లను ప్రభుత్వ అధికారులు పరిశీలించారు. మంగళవారం సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ ఎస్.హరీశ్, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకటరావు, సమాచార శాఖ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ రాధాకిషన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ జయరామ్మూర్తి, రోడ్లు, భవనాల శాఖ అధికారులు, ఇంజనీర్లు ఈ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి డిసెంబర్ 7వ తేదీకి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో సీఎం, మంత్రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు. ఏడాది కాలంలో విద్యార్థుల కోసం చేసిన గణనీయమైన మార్పులు, డైట్ చార్జీల పెంపు, రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఇంటి గ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ తదితర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దాదాపు 14 వేల మంది పాఠశాల విద్యార్థులతో విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులకు, ప్రతినిధులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.

కేసీఆర్ కుటుంబాన్ని కాంగ్రెస్, బీజేపీ టార్గెట్ చేశాయి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు కుటుంబాన్ని కాంగ్రెస్, బీజేపీ లక్ష్యంగా చేసుకున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విమర్శించారు. రెండు పార్టీలు కలిసికట్టుగా బీఆర్ఎస్ పార్టీని ఖతం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. ఢిల్లీలో బీజేపీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుమ్మ క్కు అయ్యారని, రేవంత్ రెడ్డి 27 పర్యాయాలు ఢిల్లీకి వెళ్లినా మంత్రివర్గ విస్తరణ జరగడం లేదన్నారు. పార్టీ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి మంగళవారం తెలంగాణ భవన్‌లో సుధీర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అమృత్ టెండర్ల కుంభకోణంపై కేంద్రమంత్రికి ఫిర్యాదు చేసేందుకు ఢిల్లీకి వెళ్లిన కేటీఆర్‌పై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. తాము మూసీ అభివృద్ధికి వ్యతిరేకం కాదని, మూసీ పేరిట ఇళ్ల కూల్చివేతలను తాము ప్రశ్నిస్తున్నామన్నారు. ఫార్మాసిటీ ఏర్పాటుకు గత ప్రభుత్వం 19 వేల ఎకరాలు సేకరించి పెట్టినా లగచర్లలో నాలుగు వేల ఎకరాల భూసేకరణకు రేవంత్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సుధీర్‌రెడ్డి తెలిపారు.


కలెక్టర్‌పై దాడి ఘటనపై న్యాయవిచారణ జరిపించాలి

- బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

సాక్షి, హైదరాబాద్: కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో వికారాబాద్ కలెక్టర్‌పై దాడి ఘటనలో పూర్తి స్థాయి న్యాయవిచారణ జరిపించాలని బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ ఘటన అధికారులపై దాడి కాదని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో కట్టలు తెంచుకున్న ఆగ్రహమే ఆ విధంగా వ్యక్తమైందన్నారు. తనపై దాడి జరగలేదని జిల్లా కలెక్టర్ బహిరంగంగా ప్రకటించినప్పటికీ.. గ్రామాల్లో నిర్బంధం విధించి అక్రమంగా 50 మందిపై కేసులు నమోదు చేశారన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రజాపాలన అని చెప్పి కాంగ్రెస్ సర్కార్ గ్రామాల్లో పోలీసు నిర్బంధంతో భయానక వాతావరణం సృష్టిస్తున్నదని ధ్వజమెత్తారు.

ఔషధాల కొండ

- కురవిలోని కందికొండ గుట్ట వనమూలికలు, ఔషధ మొక్కలకు ప్రసిద్ధి
- కార్తీకపౌర్ణమి రోజు సేకరణతో మంచి ఫలితాలు
- సుదూర ప్రాంతాల నుంచి వచ్చి తీసుకెళ్తున్న ఆయుర్వేద వైద్యులు, కోయ గిరిజనులు



ఔషధ మొక్కలకు నిలయంగా ఉన్న కందికొండ

కురవి: దేశంలో పూర్వకాలంలో ఆయుర్వేద వైద్యం విరాజిల్లింది. ప్రకృతిలో లభించే వనమూలికలు, ఔషధమొక్కలతో పలు రకాల రోగాలను నయం చేసేవారు. ప్రస్తుతం ఆయుర్వేద వైద్యం మనుగడలోకి వస్తోంది. వన మూలిక మొక్కలు ప్రకృతిలో ఎక్కువగా కొండలు, గుట్టల్లో లభిస్తాయి. అలాంటి ఔషధ మొక్కలకు మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కందికొండ గుట్ట నిలయంగా పేరుగాంచింది. మునులు తపస్సు చేసిన ప్రాంతం కందికొండపై ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. కొండ పైకి నడక దారి, మార్గమధ్యలో గుహలు, పైన దేవాలయం, కోనేర్లు ఉన్నాయి. ఈ క్షేత్రంలో పూర్వం కపిల వాయి మహాముని, స్కంద మహాముని వంటి వారు తపస్సులు చేసినట్లు చరిత్ర చెబుతోంది. అయితే అప్పటి నుంచి ఈ కొండపై తపస్సుకు వినియోగించే మొక్కలతో పాటు, వైద్యం చేసేందుకు ఉపయోగపడే ఔషధ మొక్కలు కూడా పెంచినట్లు చరిత్ర చెబుతోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొండ పరిసర ప్రాంతాలకు వెళ్లగానే ఏదో అనుభూతి, ప్రత్యేకమైన సువాసన వెదజల్లుతోందని స్థానికులు చెబుతారు.

ఔషధ మొక్కల పేర్లు..

గుట్టపై ఉన్న కోనేరులో నాలుగు రకాల మొక్కలు కనిపిస్తాయి. ఈరజడ, రక్తజడ, అంతర దామెర, మద్దెడ వీటిని గుట్ట ఎక్కిన భక్తులు తెంపుకుని తీసుకెళ్తుంటారు. ఈరజడ ఆకులను ఇంటికి తీసుకెళ్లి చిన్నారులకు ఊదు పడుతుంటారు. వీటికి తోడు రాజహంస, పరంహంస, పందిచెవ్వు చెట్టు, నల్ల ఉసిరి చెట్టు, అడవి నిమ్మ, బుర్రజమిడి, నల్ల వాయిలి చెట్లు ఉన్నాయి. గుడి దగ్గర బండ పువ్వు లభిస్తుంది. అలాగే నాగసారం గడ్డ, నేల ఏను మొక్కల ఆకులను పశువులకు రోగాలు వచ్చినప్పుడు ఉపయోగిస్తారు. కొండ మామిడి చెట్టుతో కాళ్లు, చేతులు విరిగితే కట్టు కడుతుంటారు. పాం దగరుగుడు చెక్క, నల్లెడ తీగలు, బురుదొండ, అడవిదొండ లాంటి మొక్కలు లభిస్తా యని గ్రామస్తులు తెలిపారు. గొర్రెలు, మేకల కు రోగాలు వస్తే న యం చేసేందుకు చే గొండ ఆకు, ఉప్పుచెక్క, ముచ్చతునక చెట్టు ఆకులను వాడుతుంటారని గొర్రెలు, మేకల పెంపకందారులు చెబుతున్నారు. అలాగే కలములక చెట్టు మనుషలకు దగ్గుదమ్ముకు, సోమిడిచెట్టు చెక్క, ఆకులు చిన్న పిల్లలకు జబ్బు చేస్తే వాడుతుంటారని చెబుతున్నారు.

మూలికల సేకరణ..

గుట్టపై పెద్ద కందిచెట్టు ఉండేదని, అందుకే ఇది కందికల్ గుట్టగా చరిత్రలో లిఖించి ఉందని పూర్వీకులు చెబుతుంటారు. కొండ అనేక వనమూలికలకు ప్రసిద్ధి అని, ఇక్కడికి సాధువులు, కోయ గిరిజనులు, ఆయుర్వేద వైద్యులు వచ్చి వనమూలికలు, ఔషధ మొక్కలను తీసుకెళ్తుంటారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికీ కొంత మంది కోయ జాతికి చెందిన గిరిజనులు వచ్చి మొక్కలను తీసుకెళ్తుంటారని చెబుతుంటారు. గుట్ట ఎక్కుతుంటే మధ్యలో భోగం గుడి ఎదురుగా రెండు కోనేర్లు ఉంటాయి. అందులో అనేక ఔషధమొక్కలు కనిపిస్తుంటాయి. గుడి ముందు మరో కోనేరు ఉంటుంది. ఈ కోనేటిలో స్నానాలు ఆచరించడం వల్ల రోగాలు నయమవుతాయని నమ్మకం. అయితే కార్తీక పౌర్ణమితో పాటు, ఇతర శుభ దినాల్లో మూలికలను సేకరిస్తే మంచి ఫలితం ఉంటుందని సాధువులు చెబుతారు. అందుకోసమే తెలంగాణ ప్రాంతంలోని జంగాలు ఈ ప్రాంతం నుంచి ఔషధ మొక్కలు, వన మూలికలు సేకరించి తయారు చేసిన ఆయుర్వేద మందులు చెన్నై, ముంబై, సింగపూర్, ఢిల్లీ వంటి ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకు వెళ్లి వైద్యం చేసి వస్తారు.



కార్తీక పౌర్ణమిరోజు మూలికలు సేకరిస్తారు

కందికొండ గుట్టపై అనేక ఔషధ మొక్కలుంటాయి. మొక్కల కోసం ఏటా కోయ జాతి గిరిజనులు, ఆయుర్వేద వైద్యులు, సాధువులు వస్తుంటారని గ్రామంలో చర్చించుకుంటారు. కార్తీక పౌర్ణమిరోజు మూలికలు సేకరిస్తే మంచిగా పని చేస్తాయని నమ్మిక.

– బి.హేమలత, కందికొండ మాజీ సర్పంచ్



ప్రతీ మొక్కలో ఔషధ గుణమే

కొండపైన ఉన్న ప్రతీ మొక్కకు ప్రత్యేకత ఉంది. మనం రోజువారీగా చూసే మొక్కలతోపాటు, రకరకాల మొక్కలు దొరుకుతాయి. పెద్ద పెద్ద రోగాలను కూడా నయం చేసే మొక్కలు ఇక్కడ దొరుకుతాయట. దూర ప్రాంతం నుంచి వచ్చిన వారు గొర్రెల కాపరులను తీసుకెళ్లి మొక్కలు తెస్తారు.

– మెట్టు ఉప్పలయ్య, కందికొండ



ఆయుర్వేద కళాశాల ఏర్పాటు చేయాలి

మా ఊరు సరిహద్దులో కందికొండ గుట్ట ఉంటుంది. ఇక్కడ దొరికే ఔషధ మొక్కలు ఎక్కడ దొరకవు అంటారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న గుట్టపై ఉన్న మందు మొక్కలను పరిరక్షించాలి. దీనిని రాబోయే తరాలకు, ఆయుర్వేదంలో ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలి. ఈ ప్రాంతంలో ఆయుర్వేద కళాశాల ఏర్పాటు చేయాలి.

– గాండ్ల సతీశ్, సూదనపల్లి



కోనేటిలోని ఈరజడ ఆకులు



గుట్టపైన కోనేరు



గుడి కింది భాగంలో ఔషధ చెట్లు

మిల్లర్లతో సర్కారు కుమ్మక్కైంది

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైస్ మిల్లర్లు, దళారులతో కుమ్మక్కైందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లు మొదలై 15 రోజులు గడిచినా మార్కెట్ యార్డుల్లో రైతుల ధాన్యం కొనుగోలు చేయకుండా ఆలస్యం చేస్తోందన్నారు. ధాన్యం కొనుగోలు కోసం ప్రతి పైసా వడ్డీతో సహా కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దళారుల ప్రమేయంతో రైతులు సుమారు క్వింటాలు బియ్యానికి రూ.700–800 మేర నష్టపోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో అనేక చోట్ల వడ్ల కొనుగోలు కేంద్రాల్లో టోకెన్లు ఇవ్వకుండా, కాంటా పెట్టకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. కొనుగోళ్లు ఆలస్యం చేస్తుండటంతో రైతులు 40 శాతం మేర ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జడ్చర్లలో బీజేపీ ఎంపీ డీకే అరుణ, ఇతర నేతలతో కలిసి తాను వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించినపుడు ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తే 40 కిలోల ధాన్యానికి కిలోన్నర ధాన్యం తరుగు తీస్తున్నారని రామచంద్రారెడ్డి వివరించారు. రైస్ మిల్లులకు వెళ్లేసరికి 100 కిలోలకు 3 కిలోల చొప్పున తాలు, తరుగు పేరుతో కోత పెడుతున్నారని విమర్శించారు.

అధికారులపై దాడులు సరికాదు

రైతుల ముసుగులో బీఆర్ఎస్ విధ్వంసాలు: అన్వేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రైతులకు భిన్నాభిప్రాయాలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసురావాలని, అధికారులపై దాడులు చేయడం సరికాదని టీపీసీసీ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి తెలిపారు. వికారాబాద్ కలెక్టర్‌తో పాటు సబ్ కలెక్టర్, అధికారులపై దాడులను ఖండిస్తున్నామని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. లగచర్లలో రైతుల ముసుగులో బీఆర్ఎస్ విధ్వంసానికి తెగ పడిందని, ప్రభుత్వాన్ని బద్నాం చేయాలన్న బీఆర్ఎస్ పార్టీ కుట్రలో భాగమే ఈ దాడి అని ఆరోపించారు. రైతులకు అభ్యంతరాలుంటే శాంతియుతంగా నిరసన తెలుపుతారని, అదే లగచర్లలో మాత్రం కర్రలు, రాళ్లతో బీఆర్ఎస్ గూండాలు అధికారుల మీద దాడులు చేయించారని విమర్శించారు. ఇవన్నీ చేసిన వారే సిగ్గు లేకుండా తిరగబడ్డ తెలంగాణ అని ఎక్స్‌లో కేటీఆర్, హరీశ్‌లు పోస్టులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల మీద దాడులు చేయడమే తిరుగుబాటు అయితే, మీ హయాంలో అబ్దుల్లాపూర్‌మెట్‌లో మహిళా ఎమ్మార్వోను దహనం చేసి చంపారు.. దాన్ని కూడా తిరుగుబాటే అంటారా అని ప్రశ్నించారు.

టోక్యోలోని గాంధీ విగ్రహానికి నివాళులు

సాక్షి, హైదరాబాద్: జపాన్ దేశ పర్యటనలో భాగంగా మంగళవారం టోక్యోలోని మహాత్మాగాంధీ విగ్రహానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, లెజిస్లేచర్ సెక్రటరీ నరసింహాచార్యులు, సిక్కిం రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరిగిన 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న తెలంగాణ శాసన బృందం.. స్టడీ టూర్‌లో భాగంగా జపాన్ చేరుకుంది.

పాతుకుపోయిన మర్రి ఊడలు



ఆ మర్రిచెట్టు వేర్లు, మొదలు చూసిన వాళ్లు తమ ఊరిలో ఎవరూ లేరని గ్రామస్తులు చెబుతున్నారు. తమ తాతలు, వారి తాతలు, వారి తాతల కాలం నాటి మర్రిచెట్టు తన ఊడలతో నేలలో నాటుకుపోయిందని, తమ గ్రామానికి, మండలానికి కూడా మంచి పేరు తెచ్చిందంటున్నారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూరులో అతిపెద్ద ఊడలమర్రి 'సాక్షి'కి ఇలా అందంగా కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

మా ఇంట మహాలక్ష్మి పుట్టిందంటూ..



తల్లీబిడ్డలను పూలబాట వేసి స్వాగతం పలుకుతున్న కుటుంబ సభ్యులు



క్రాంతికుమార్, సుమ దంపతులకు పుట్టిన కూతురు

పూలబాటతో స్వాగతం పలికిన కుటుంబ సభ్యులు

కేసముద్రం: మా ఇంట మహాలక్ష్మి పుట్టిందని ఆనందం వ్యక్తం చేస్తూ.. ఆ తల్లీబిడ్డలకు పూలబాట వేసి అత్తారిల్లు స్వాగతం పలికింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన పొడకంటి క్రాంతికుమార్, సుమ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. ఈనెల 10న మానుకోట జిల్లా ఆస్పత్రిలో సుమ డెలివరీ కాగా (మూడో కాన్పులో) ఆడపిల్ల జన్మించింది. ఆడపిల్ల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ఆ ఇంట అమ్మాయి పుట్టడంతో కుటుంబ సభ్యులంతా ఆనందంలో మునిగిపోయారు. మంగళవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన సుమ తన అత్తగారింటికి ఆడబిడ్డతో ఇంట్లోకి వస్తున్న క్రమంలో, పలు రకాల పూలతో బాట వేసి అపూర్వస్వాగతం పలికారు.

అలెక్సా.. లైట్సాన్

'అలెక్సా..లైట్సాన్ అంటే చాలు మీ వీధిలో వీధి దీపాలన్నీ వెంటనే వెలుగులు విరజిమ్ముతాయి. ఆఫీస్‌లోనుంచి డ్యాష్ బోర్డులో చూసి ఎక్కడ ఇబ్బందులుంటే ఇట్టే పరిష్కరిస్తాం'.. ఏంటీ.. ఎక్కడో విన్నట్లుంది కదా.. ఎన్నికల ప్రచారంలో విజనరీ బాబు చెప్పినమాటలే ఇవి. పాపం.. విజయవాడ నగర వాసులు మాత్రం ప్రస్తుతం ఇలా రాత్రి పూట రహదారులపై అలెక్సా కోసం వెతుకులాడుతున్నారు. మంగళవారం రాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో పరిస్థితి ఇలా ఉంది..

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ


విజయవాడ కనకదుర్గఫ్లైఓవర్‌పై వెలగని లైట్లు


విజయవాడ కృష్ణలంక జాతీయ రాహదారి ఫ్లైఓవర్‌పై పరిస్థితి


భవానీపురం ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఓ వీధి

మనకడ్డేంటి.. ఆక్రమించండి..


రాఫిన్ రియల్ ఎస్టేట్ ఎదురుగా ఆక్రమణకు గురైన 5.70 ఎకరాల భూమి

కూటమి ప్రభుత్వంలో చెలరేగిన టీడీపీ వర్గీయులు

- భూ ఆక్రమణలు, దౌర్జన్యాలతో రెచ్చిపోతున్న వైనం
- ఆలయ భూములనూ వదలని అక్రమార్కులు
- ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గంలో ఇదీ సంగతి!

కామవరపుకోట: కూటమి ప్రభుత్వం రాగానే ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గంలో మొదలైన టీడీపీ నేతల అరాచకాలు, భూ కబ్జాలకు అడ్డూఅదుపు కనిపించడంలేదు. అధికారులను కూడా బెదిరిస్తూ యథేచ్ఛగా అక్రమాలు కొనసాగిస్తున్నారు. దేవుడి భూములను సైతం చెరబడుతున్నారు. గతంలో ఎవరూ ఇంతగా బరితెగించేవారు కాదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇలాంటి కబ్జాలను అరికట్టడానికే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చారని, కానీ టీడీపీ నాయకులు దానిపై తప్పుడు ప్రచారం చేసి ఇప్పుడిలా అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొంటున్నారు. ఇటీవల తెలుగుదేశం నేతలు పాల్పడిన భూ అక్రమాల్లో కొన్ని..

- జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి కొత్తూరు చెక్‌పోస్ట్ సెంటర్‌లో శ్రీవీరభద్రస్వామి ఆలయానికి సంబంధించి సర్వే నంబర్ 702/4లో 97 సెంట్ల భూమి ఉంది. దానివిలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.10 కోట్లకుపైనే. ఆ స్థలంలో 1,950 గజాలను 2021లో స్థానికుడైన వందనపు లక్ష్మణరావుకు.. ఏడాదికి రూ.11.40 లక్షలు చెల్లించే విధంగా 11 సంవత్సరాలకు దేవదాయశాఖ లీజుకు ఇచ్చింది. ఆ స్థలంలో షాపులు నిర్మించి అద్దెకిస్తున్న ఆయన కూటమి ప్రభుత్వం రాగానే మిగిలిన భూమిని కూడా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. అంతకుముందు లీజును కూడా అధికారులు నామమాత్రపు ధరకు తగ్గించినట్లు తెలిసింది.

- ఈ ఆలయ భూమిలోనే కామవరపుకోట మండలం వెంకటాపురానికి చెందిన శ్రీనివాసరావు తెలుగుదేశం అండదండలతో కారు సర్వీసింగ్ సెంటర్ కోసం భారీ షెడ్డు నిర్మించాడు. భూమి కబ్జాచేసి షెడ్డు వేసినా దేవదాయశాఖ అధికారులు స్పందించలేదు.

- కామవరపుకోట మండలం కొత్తూరు సమీపంలోగల రాఫిన్ రియల్ ఎస్టేట్ ఎదురుగా జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు ప్రధాన రహదారిని అనుకుని సర్వే నంబరు 390/1లో 5.70 ఎకరాల భూమి ఉంది. ఇది గతంలో భూదాన కార్యక్రమంలో భాగంగా కొత్తూరు గ్రామానికి చెందిన మేడంకి అర్జయ్యకు ప్రభుత్వం ఇచ్చింది. అతడికి భార్య సుశీల, కుమారుడు రవీంద్ర, కుమార్తె ఉన్నారు. అర్జయ్య మృతిచెందడంతో ఆ భూమిని తన పేరిట మార్చుకున్న సుశీల.. 2019లో కుమారుడు రవీంద్ర పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించింది. 2020లో రవీంద్ర అనారోగ్యంతో మృతిచెందాడు. కూటమి అధికారంలోకి రాగానే.. రూ.10 కోట్ల విలువైన ఆ భూమిని కబ్జా చేయాలని కామవరపుకోటకు చెందిన ఓ డాక్యుమెంట్ రైటర్ ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఒక మహిళను అడ్డుపెట్టుకుని ఆ భూమిని బొర్రంపాలెం గ్రామానికి చెందిన ఒక భూస్వామికి అమ్మడానికి ప్రయత్నిస్తున్నాడని సుశీల ఆరోపిస్తోంది.

- టీడీపీ నాయకుడు, చింతలపూడి మాజీ ఎమ్మెల్యే గంటా మురళి, ఆయన సోదరుడు, అనుచరులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఏలూరుకు చెందిన ఈడుపుగంటి హరిభగవాన్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆవేదన వ్యక్తం చేశారు. టి.నరసాపురం మండలం బొర్రంపాలెం నుంచి కామవరపుకోట వెళ్లే రోడ్డు వెంబడి 15 ఎకరాల పామాయిల్ తోటను హరిభగవాన్ బ్యాంకు ఆన్‌లైన్ వేలంలో రూ.3.70 కోట్లకు పాడుకున్నారు. తను ఆ భూమిలోకి వెళ్లకుండా గంటా మురళి, ఆయన సోదరుడు, అనుచరులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని హరిభగవాన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కొయ్యలగూడెం మండలం రాజవరం గ్రామానికి చెందిన దళితుడైన బిరుదుగట్ల కృష్ణమూర్తికి జంగారెడ్డిగూడెం మండలం తిరుమలాపురం రెవెన్యూ పరిధిలో 597/3లో 2.10 ఎకరాల భూమి ఉంది. దాన్లో పామాయిల్ సాగు చేస్తున్నాడు. ఆ భూమిని కబ్జా చేసేందుకు యర్రంపేటకు చెందిన తెలుగుదేశం వర్గీయుడు చెరుకూరి సత్యజానకి నరసింహారావు ప్రయత్నిస్తున్నాడు. కృష్ణమూర్తిని పొలంలోకి వెళ్లకుండా అడ్డుకుని దౌర్జన్యం చేశాడు. కృష్ణమూర్తి అధికారుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా, మానసికంగా నలిగిపోతున్నాడు.



ఆలయ భూములను పరిరక్షించాలి



కూటమి ప్రభుత్వం రాగానే టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పేదల భూములను కబ్జా చేసేందుకు తెగబడుతున్నారు. దేవాలయ భూములను సైతం ఆక్రమించేందుకు తెరతీశారు. ప్రభుత్వం స్పందించి బాధితులకు న్యాయం చేసి, వారికి రక్షణ కల్పించడంతో పాటు కబ్జాదారుల నుంచి ఆలయ భూములను పరిరక్షించాలి.

– కంభం విజయరాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్, చింతలపూడి

రక్షణ కల్పించండి



బ్యాంకు వేలంలో భూమిని ఆన్‌లైన్‌లో కోర్టు ద్వారా డబ్బులు చెల్లించి కొనుగోలు చేశాను. స్థానిక టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గంటా మురళి, ఆయన సోదరుడు, అనుచరులు నాపై దౌర్జన్యం చేసి, భూమిని ఆక్రమించేందుకుప్రయత్నిస్తున్నారు. వారినుంచి నాకు రక్షణ కల్పించండి.

– ఈడుపుగంటి హరిభగవాన్, చైత్ర హాస్పిటల్ యజమాని, ఏలూరు

న్యాయం చేయండి



మా తాతల నుంచి నాకు సంక్రమించిన భూమిలో పామాయిల్ సాగుచేస్తున్నాను. టీడీపీ నాయకుడు చిలుకూరి సత్యజానకి నరసింహారావు దళితుడినైన నాపై దౌర్జన్యం చేసి నా పొలం ఆక్రమించాడు. దీనిపై అధికారుల చుట్టూ తిరుగుతున్నా వారు పట్టించుకోవడం లేదు. నరసింహారావు నుంచి నాకు రక్షణ కల్పించి, న్యాయం చేయండి.

– బిరుదుగడ్ల కృష్ణమూర్తి, రాజవరం

నాగార్జునపై పెట్టిన కేసును ఏం చేస్తారు?

- తప్పుడు ఫిర్యాదు ఇచ్చానని ఫిర్యాదుదారే అఫిడవిట్ ఇచ్చారు
- ఆమె ఫిర్యాదు మేరకు పెట్టిన కేసును కొనసాగిస్తారో లేదో చెప్పండి
- పోలీసులకు హైకోర్టు ఆదేశం.. విచారణ 28కి వాయిదా
- అప్పటి వరకు కఠిన చర్యలొద్దన్న న్యాయస్థానం

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి మేరుగు నాగార్జున, మరొకరిపై తాను చేసిన ఆరోపణలన్నీ అసత్యాలని, ఆయన తనపై అత్యాచారం చేయలేదంటూ ఫిర్యాదుదారే ప్రమాణపూర్వక అఫిడవిట్ దాఖలు చేసినందున, ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసును ఏం చేయదలచుకున్నారో చెప్పాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఆ కేసును కొనసాగిస్తారో లేదో పూర్తి వివరాలను లిఖితపూర్వకంగా తమ ముందుంచాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. అప్పటివరకు నాగార్జునపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కేసు కొట్టేయాలంటూ నాగార్జున పిటిషన్

ఉద్యోగం, కాంట్రాక్ట్‌లు ఇప్పిస్తానంటూ తన వద్ద డబ్బులు తీసుకున్నారని, లైంగికంగా వేధించారంటూ విజయవాడకు చెందిన పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగార్జునపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు కొట్టేయాలని కోరుతూ నాగార్జున హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గత వారం విచారణకు రాగా.. పద్మావతి కోర్టు ముందు హాజరై, నాగార్జునపై తానిచ్చిన ఫిర్యాదులోని అంశాలు అవాస్తవాలని తెలిపారు. తనపై లైంగిక దాడి చేయలేదని, తమ ఇద్దరి మధ్య ఎలాంటి ఆర్థిక లావాదేవీలు కూడా లేవని చెప్పారు. సమాజంలో చాలా పెద్ద వారు, రాజకీయ బలం ఉన్న వారు చేసిన ఒత్తిడి వల్ల నాగార్జునపై ఫిర్యాదు ఇచ్చినట్లు వివరించారు. ఆ మేరకు ఓ అఫిడవిట్ దాఖలు చేశారు. దీంతో ఈ కేసు డైరీ (సీడీ)ని తమ ముందుంచాలని న్యాయమూర్తి పోలీసులను ఆదేశించారు.

రాజకీయ ఒత్తిళ్లతోనే ఫిర్యాదు చేశానని మరోసారి కోర్టుకు చెప్పిన పద్మావతి

ఈ వ్యాజ్యం మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది. పోలీసుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) సాయి రోహిత్ సీడీ ఫైల్‌ను న్యాయమూర్తికి అందజేశారు. దానిని న్యాయమూర్తి పరిశీలించారు. అనంతరం పద్మావతితో న్యాయమూర్తి మాట్లాడారు. ప్రమాణ పత్రం గురించి ప్రశ్నించారు. దానిని తానే దాఖలు చేశానని పద్మావతి తెలిపారు. నాగార్జున తనపై లైంగిక దాడి చేయలేదని, రాజకీయ ఒత్తిళ్లతోనే ఫిర్యాదు చేశానని మరోసారి చెప్పారు. కేసు ఎందుకు పెట్టాల్సి వచ్చిందో సవివరంగా అఫిడవిట్ దాఖలు చేస్తామని పద్మావతి తరఫు న్యాయవాది టి.నాగార్జున రెడ్డి తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్‌పై తప్పుడు ఫిర్యాదు ఇచ్చానంటూ ఫిర్యాదుదారే ప్రమాణపూర్వకంగా చెప్పినందున, కేసును ఏం చేస్తారో చెప్పాలని పోలీసులను ఆదేశించారు.

కనీస వేతనాలు తక్షణమే పెంచాలి

సాక్షి, అమరావతి: సిమెంట్ ఫ్యాక్టరీల్లో కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు వెంటనే పెంచేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సుబ్బయ్య మంగళవారం సచివాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్మికుల కనీస వేతనాల జీవోను 13 ఏళ్ల కిందట ఉమ్మడి రాష్ట్రంలో విడుదల చేశారని, అనంతరం జీవోను సవరించలేదని తెలిపారు. దీంతో కార్మికులు ప్రస్తుత ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

సంతోష్ ట్రోఫీకి సర్వం సిద్ధం

అనంతపురం: ఫుట్‌బాల్ క్రీడలో దేశంలోనే ప్రతిష్టాత్మకంగా భావించే సంతోష్ ట్రోఫీ మ్యాచులకు అనంతపురం జిల్లా ఆతిథ్యం ఇవ్వనుంది. అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో ఈ నెల 15 నుంచి 19 వరకు జరిగే మ్యాచుల్లో భారత ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులు సైతం పాల్గొననున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి దాకా సంతోష్ ట్రోఫీ మ్యాచులు ఎక్కడా నిర్వహించలేదు. తొలిసారి అనంతపురం నగరంలో నిర్వహించనుండడం విశేషం. భారత ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్యాణ్ చౌదరి ముఖ్య అతిథిగా హాజరై మ్యాచులను ప్రారంభించనున్నారు. ఇక్కడ జరిగే తొలి విడత మ్యాచుల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, అండమాన్ నికోబార్ జట్లు పాల్గొననున్నాయి.

నారాయణ పరువు నష్టం కేసులో వ్యక్తిగత హాజరు నుంచి జగన్‌కు మినహాయింపు

తదుపరి విచారణ డిసెంబర్ 20కి వాయిదా

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ బడా నేతల భూ దాహంపై 2016లో 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన వరుస కథనాలపై అప్పట్లో పురపాలక శాఖ మంత్రి హోదాలో పొంగూరు నారాయణ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి హైకోర్టు ఊరటనిచ్చింది. విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యే కేసుల ప్రత్యేక కోర్టులో జరుగుతున్న ఈ కేసులో విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి జగన్‌కు మినహాయింపునిచ్చింది. కింది కోర్టు విచారణకు జగన్ స్థానంలో ఆయన న్యాయవాది హాజరయ్యేందుకు అనుమతినిచ్చింది. 'సాక్షి'లో వచ్చిన కథనాలకు తనను బాధ్యుడిగా చేస్తూ నారాయణ దాఖలు చేసిన ఈ కేసును కొట్టేయాలని కోరుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాఖలు చేసిన ఈ వ్యాజ్యంపై మంగళవారం మరోసారి విచారణ జరిపిన హైకోర్టు.. ఈ ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 20కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీఎస్టీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాసులు



సాక్షి, అమరావతి: 'బడి, బాధ్యత, భవిష్యత్తు' నినాదంతో అన్ని మేనేజ్‌మెంట్లలోని అన్ని కేటగిరీల ఉపాధ్యాయులతో ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) ఉపాధ్యాయ సంఘాన్ని ఏర్పాటు చేసినట్టు అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ సంఘం పనిచేస్తుందన్నారు. ఈమేరకు మంగళవారం విజయవాడలో నిర్వహించిన సమావేశంలో అన్ని జిల్లాలకు చెందిన వారితో రాష్ట్ర కమిటీని ప్రకటించినట్టు తెలిపారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా కాడిశెట్టి శ్రీనివాసులు (సత్యసాయి జిల్లా), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నక్కా వెంకటేశ్వరరావు (కాకినాడ), సహాధ్యక్షుడిగా జీజేఏ స్టీవెన్ (ఏలూరు), ప్రధాన కార్యదర్శిగా తమ్మినాన చందనరావు (శ్రీకాకుళం), జాయింట్ కార్యదర్శిగా బాదిరెడ్డి రమేశ్ (విజయనగరం), కోశాధికారిగా టి.పుల్లయ్య (సత్యసాయి), రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మజ్జి చిన్నబాబు (శ్రీకాకుళం), ఎం.వి.కృష్ణారెడ్డి (సత్యసాయి), జి.జె.ప్రభువరం (పశ్చిమ గోదావరి), రాష్ట్ర కార్యదర్శులుగా టి.కుమారరెడ్డి (ఎన్టీఆర్), కె.శ్రీనివాసరావు (కాకినాడ) నియమితులయ్యారు.

జ్వాలాతోరణం.. సర్వపాపహరణం

- ఈ నెల 15న శ్రీశైలంలో కార్తీకపౌర్ణమి ఉత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న దేవస్థాన అధికారులు


శ్రీశైల దేవస్థానంలో జ్వాలాతోరణోత్సవం (ఫైల్)

శ్రీశైలంటెంపుల్: కార్తీకమాసంలో పౌర్ణమికి ప్రత్యేకత ఉంది. ఆ రోజున శ్రీశైల దేవస్థానంలో దేదీప్యమానంగా జ్వాలాతోరణోత్సవం నిర్వహిస్తారు. అలాగే పాతాళగంగ వద్ద కృష్ణమ్మకు శాస్త్రోక్తంగా పుణ్యనది హారతి ఇస్తారు. ఆయా కార్యక్రమాల కోసం దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.

జ్వాలాతోరణోత్సవం

శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 15న శుక్రవారం కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని సాయంత్రం శ్రీశైల ఆలయం ఎదురుగా గంగాధర మండపం వద్ద జ్వాలాతోరణోత్సవం నిర్వహిస్తారు. అధికసంఖ్యలో భక్తులు జ్వాలాతోరణోత్సవాన్ని దర్శించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. నేతితో తడిపిన నూలు ఒత్తులను వత్తులను తోరణంగా ఏర్పాటు చేసి వెలిగిస్తారు. ఈ భస్మాన్ని నుదుట రాసుకోవడం వల్ల ఆయుష్షు, ఐశ్వర్యం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి జ్వాలాతోరణం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేస్తారు.

శివపార్వతులతో ముడిపడిన పురాణగాథ

పూర్వం కృతయుగంలో అమృతం కోసం దేవదానవులు కలిసి క్షీరసాగరాన్ని మథించారు. అందుకు భూమి మధ్యలో ఉన్న మంధర పర్వతాన్ని కవ్వంగా, వాసుకీ సర్పాన్ని తాడుగా చేసుకున్నారు. పర్వతాన్ని సముద్రంలోకి దించగానే అది పట్టు తప్పి పడిపోవడంతో శ్రీమహావిష్ణువు కూర్మావతారం ధరించి సాగరం అడుగుకు వెళ్లి తన వీపుపై పర్వతాన్ని ఎత్తగా దేవతలు, రాక్షసులు క్షీరసాగరాన్ని మథించడం ప్రారంభించారు. అందులోనుంచి మొదట హాలాహలం జనించడంతో సకల లోకాలనూ దహించివేయగల కాలకూట విషమైన హాలహలాన్ని పరమశివుడు లోకహితం కోసం సేవించి కంఠంలో ఉంచుకోవడంతో శివుడికంఠం నీలంగా మారింది. దీన్ని చూసి భయాందోళనకు గురైన పార్వతీదేవి తన భర్తకు ఏ కీడు తగలకుండా ఈ ఆపద నుంచి బయటపడితే.. తాను భర్తతో పాటు చిచ్చుల తోరణం కింద మూడుసార్లు నడిచి వస్తానని అనుకుందట. తర్వాత శివుడికి ఎలాంటి ఆపద కలగకపోవడంతో పార్వతీదేవి శివుడితో కలిసి కార్తీక పౌర్ణమి నాడు జ్వాలాతోరణం కింద మూడుసార్లు నడిచినట్లు అప్పటి నుంచి జ్వాలాతోరణోత్సవం ప్రారంభమైనట్లు పురాణ గాథ.

విస్తృత ఏర్పాట్లు చేస్తున్న దేవస్థానం

ఈ నెల 15న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని జ్వాలాతోరణోత్సవానికి ఆలయం ఎదురుగా గల గంగాధర మండపం వద్ద ఏర్పాట్లు మొదలయ్యాయి. అలాగే పాతాళగంగ వద్ద కృష్ణమ్మకు పుణ్యనదీహారతి ఇచ్చేందుకు ఆయా ఏర్పాట్లు చేస్తున్నారు. జ్వాలాతోరణోత్సవాన్ని భక్తులు అధికసంఖ్యలో వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పుణ్యనదీహారతి


కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పాతాళగంగ వద్ద ఉన్న కృష్ణమ్మ తల్లి విగ్రహానికి సాయంత్రం పుణ్యనదీహారతి కార్యక్రమం నిర్వహిస్తారు. పాతాళగంగ స్నానఘాట్ల వద్ద కృష్ణ నదీమతల్లికి విశేష పూజలు, సారె సమర్పణ, నీరాజనం కార్యక్రమాలతో పాటు పుణ్యనదికి నవ హారతులు ఇస్తారు.



శ్రీవారి దర్శనానికి 6 గంటలు


తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కేవలం ఒకే ఒక కంపార్ట్‌మెంట్ మాత్రమే నిండింది. సోమవారం అర్ధరాత్రి వరకు 73,917 మంది స్వామివారిని దర్శించుకోగా 25,161 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో భక్తులు హుండీలో రూ.3.45 కోట్లు సమర్పించారు.

నేడు సత్యదేవుని తెప్పోత్సవం




అన్నవరం: క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం సందర్భంగా పరమాత్మ స్వరూపుడైన సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల తెప్పోత్సవం పంపా తరగలపై బుధవారం కన్నుల పండువగా నిర్వహించనున్నారు. సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన హంస వాహనంపై.. పండితుల వేద మంత్రోచ్చారణలు, కళ్లు మిరుమిట్లు కొలిపే బాణసంచా కాల్పుల నడుమ.. స్వామి, అమ్మవార్లు పంపా నదిలో విహరించే ఈ వేడుకను చూసేందుకు వేలాదిగా భక్తులు తరలి రానున్నారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ



అన్నవరం: కార్తిక శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా రత్నగిరి సత్యదేవుని ఆలయానికి మంగళవారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. సుమారు 60 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారులు అంచనా వేశారు. వ్రతాలు 5,924 జరిగాయి. ఏకాదశి తిథి కావడంతో సత్యదేవునికి ఉదయం ఏడు గంటలకు స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. అనంతరం ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ కుంకుమార్చన నిర్వహించి, స్వామి, అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, ప్రసాదాలు నివేదించారు.

అప్పన్నకు స్వర్ణతులసీ దళార్చన



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం స్వర్ణ తులసీ దళార్చన విశేషంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి ఈ పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై కొలువుంచారు. ఉభయదాతలకు కంకణ ధారణ చేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ తులసీ దళాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు గడుపు పెంపునకు వినతి

తిరుపతి సిటీ: ఎస్వీయూ దూర విద్యా పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంచాలని విద్యార్థి సంఘాల నేతలు కోరారు. మంగళవారం ఈ మేరకు రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు ఫీజు చెల్లించలేక పోయారన్నారు. తమ విన్నపంపై రిజిస్ట్రార్ స్పందించి ఈనెల 20వ తేదీ వరకు గడుపు పొడిగించారని వెల్లడించారు.



17న జిల్లా స్థాయి చెస్ పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన నాయుడుపేటలో అండర్–13 ఓపెన్, బాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస సూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు 2011 జనవరి ఒకటో తేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులని, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 15వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 98852 38474 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యార్థులందరికీ ఆపార్ ఐడీ సృష్టించండి

తిరుపతి సిటీ: ప్రతి విద్యార్థికీ అపార్ ఐడీని సృష్టించాల్సి అవసరం ఉందని ఎస్వీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. ఎస్వీయూ సెనేట్ హాల్ వేదికగా రాష్ట్ర ఉన్నత విద్య, కేంద్ర ఎలక్ట్రానిక్ అండ్ ఇన్ఫర్మేషన్ మినిస్ట్రీ డిజిటల్ ఇండియా కార్పొరేషన్, ఎన్ఏడీ డిజీ లాకర్ సంయుక్తంగా ఆధ్వర్యంలో మంగళవారం అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్, అపార్ ఐడీ క్రియేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు ప్రారంభించి, ప్రసంగించారు.

సాగుబడి
విశాఖ కార్తె: నవంబర్ 6 నుంచి

కరువును తట్టుకునే దీర్ఘకాలిక పంట

కేపర్

(కోకిలాక్షము)



కేపర్ (కప్పారిస్ స్పినోస).. కటిక కరువును, తీక్షణమైన ఎండను, చలిని తట్టుకునే అరుదైన సుగంధ ద్రవ్య పంట. ఒక మీటరు నుంచి 6 అడుగుల ఎత్తు వరకు పెరిగే పొద జాతి దీర్ఘకాలిక మొక్క ఇది. ఆఫ్రికా, మిడిల్ ఈస్టన్, మెడిటర్రేనియన్ ప్రాంతాలకు చెందినది. కేపర్‌ను కేపర్ బెర్రీ పంట అని కూడా అంటారు. భారతీయ స్పైసెస్ బోర్డు సమాచారం ప్రకారం దీనికి భారతీయ భాషల్లోనూ పేర్లున్నాయి. తెలుగులో 'కోకిలాక్షము', కన్నడలో ముల్లుకట్టారి, మరాఠీలో కాబుర్, హిందీలో కబ్ర అని పిలుస్తారు.

క్రీమియా, ఆర్మేనియా, అల్జీరియా, ఈజిప్ట్, మొరాకో, ట్యునీసియ, సైప్రస్, స్పెయిన్, ఇటలీ, ఇరాన్‌లలో సాగవుతోంది. వేడి వాతావరణం, తీవ్రమైన సూర్యరశ్మి ఉన్న ప్రాంతాల్లో పెరుగుతుంది. తక్కువ నీటితో బతుకుతుంది. ఏడాదికి 350 ఎం.ఎం. వర్షపాతం అంటే మన రాయలసీమలో పడే వర్షం కన్నా తక్కువ వర్షం పడినా బతకగలదు. 40 డిగ్రీల ఉష్ణోగ్రతనే కాదు, 8 డిగ్రీల సెంటీగ్రేడ్ చలిని కూడా తట్టుకుంటుంది. నిస్సారమైన, నీరు నిలవని మెరక ప్రాంతాల్లో రాళ్ల భూముల్లో సైతం పెరిగే మొండి మొక్క కేపర్. చౌడు నేలల్లోనూ పెరగగలదు. పోషకాలను, నీటి తేమను గ్రహించుకునేందుకు వీలుగా దీని వేరు వ్యవస్థ భూమి లోపలికి చొచ్చుకెళ్ల గలదు.

ఒకసారి వేస్తే దశాబ్దాల పాటు ప్రతి ఏటా సీజన్‌లో పూలను, కాయలను ఇస్తుంటుంది. మన దేశంలో దీని సీజన్ మార్చి – అక్టోబర్. తెల్లగా, ఊదారంగు పోగులతో ఆకర్షణీయగా ఉండే కేపర్ పూలు ఉదయం విచ్చుకొని, సాయంత్రం ముడుచుకుంటాయి.

ఉపయోగాలు

కేపర్స్‌కు సుగంధ ద్రవ్య పంటగా పేరుంది. దీని పూమొగ్గలు, పచ్చి కాయలు, చిగుళ్లతో కూడిన లేత పూలతో ఊరగాయ పెడుతుంటారు. సుగంధం, ఉప్పదనంతో కూడిన రుచి కలిగి ఉండటం వల్ల పాస్తా సాస్‌లు, పిజ్జాలు, చేపలు, మాంసం, సలాడ్లలో కలుపుకొని తినటానికి ఈ ఊరగాయలు బాగుంటాయి. కేపర్స్‌తో తయారయ్యే టానిక్‌లు తదితర ఔషధాలు కీళ్ల నొప్పులు, గ్యాస్‌ల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. కాలేయం పనితీరును మెరుగుపరుస్తాయి. ఆర్టీరియోస్కెలెరోసిస్‌ను తగ్గిస్తాయి. యాంటీ ఆక్సిడెంట్ గుణాలు కలిగి ఉండి రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. కేపర్ కాయల గుజ్జు, నూనెలను సౌందర్యసాధనాల తయారీలో వాడతారు.







వంద ఎకరాల్లో సాగు

తమిళనాడు టుటికోరిన్‌కు 45 కిలోమీటర్ల దూరంలోని నిరవి పుదుపట్టి గ్రామంలో గల ఇష్క ఫామ్స్‌లో మన దేశంలో మొట్టమొదటిగా కేపర్ పంటను సాగు చేస్తున్నారు. పన్నెండేళ్ల క్రితం ఫియోన అర్కల్, శ్రీకాంత్ సూర్యానారాయణ అనే జంట ఈ క్షేత్రాన్ని నెలకొల్పి విదేశీ పంట కేపర్ ను విస్తారంగా సాగు చేయనారంభించారు. 2017 నుంచి బ్రైన్డ్ కేపర్స్, కేపర్ సాల్ట్, తరిగిన కేపర్ బెర్రీలతో పాటు అనేక సరికొత్త ఆహారోత్పత్తులని రూపొందించి విక్రయిస్తున్నారు. ఇప్పుడు దేశంలో కేపర్ ఉత్పత్తులు ఏ రెస్టారెంట్లలో, పచారీ కొట్లలో కనిపించినీ అవి ఇష్క ఫామ్స్ నుంచి వచ్చినవే అయ్యుంటాయి. ఈ జంట ఏకంగా 365 ఎకరాల నల్లరేగడి మెట్ట భూమిని కొని కేపర్స్ సాగుకు శ్రీకారం చుట్టారు. భూగర్భజలాలు వాడకుండా, శిలాజ ఇంధనాలపై పెద్దగా ఆధారపడకుండా, తీవ్రమైన ఎండలను తట్టుకొని నిలబడగలిగే పంట ఏదైనా ఉంటే దాన్ని సాగు చేద్దామని వెతికి మరీ వీరిద్దరూ కేపర్ పంటను ఎంపికచేసుకున్నారట.

టిష్యూ గ్రాఫ్టింగ్

ప్రస్తుతం ఇష్కా ఫామ్స్‌లో వంద ఎకరాల్లో కేపర్ మొక్కల్ని సాగు చేస్తున్నారు. దీన్ని విత్తనాల ద్వారా వ్యాప్తి చేయటం కష్టం కావటంతో టిష్యూకల్చర్ పద్ధతిని అనుసరిస్తున్నారు. టిష్యూ గ్రాఫ్టింగ్ ద్వారా మొక్కల్ని నర్సరీలో ఆరు వారాలు, గ్రోబాగ్స్‌లో మరో రెండు నెలలు పెంచి అంటు మొక్కల్ని తయారు చేస్తున్నారు.

లేబరేటరీలో మొక్కల్ని ఉత్పత్తి చేసి నాటుతున్నారు. పూర్తిగా సేంద్రయ పద్ధతుల్లో నాణ్యమైన కేపర్ కాయలను సాగు చేయటంతో పాటు విలువ జోడించి అనేక ఉత్పత్తుల్ని తయారు చేసే ఫ్యాక్టరీని నెలకొల్పిన ఈ జంట గ్రామస్తులకు ఏడాది పొడవునా ఉపాధికల్పిస్తున్నారు. జీవామృతం, పంచగవ్య వంటి సేంద్రియ ఎరువులను మాత్రమే ఉపయోగిస్తున్నామని ఇష్క ఫామ్స్ డైరెక్టర్ ఫియోన అర్కల్ చెబుతున్నారు.

ప్రతికూల పర్యావరణ పరిస్థితులను తట్టుకొని నీరు పెద్దగా అవసరం లేకుండా పెరిగే కేపర్ పంటను దీర్ఘకాలంగా సేంద్రియంగా పండించి, అనేక ఆహారోత్పత్తుల్ని తయారు చేసి దేశ విదేశాల్లో విక్రయిస్తున్నాం. స్థానిక మహిళలకు పని కల్పిస్తున్నాం అంటున్నారు ఫియోన అర్కల్ సంతృప్తిగా!



ఫ్యామిలీ ఫార్మింగ్

విద్యార్థులకు ప్రకృతి సేద్య శిక్షణ



ప్రకృతి వ్యవసాయ పద్ధతులను హైస్కూలు నుంచి యూనవర్సిటీ స్థాయి వరకు విద్యార్థులకు అలవాటు చేయటం ఎంతో అవసరమనే విషయంతో ఇప్పుడు ఏకీభవించని వారు బహుశా ఎవరూ ఉండరు. రసాయనిక అవశేషాల్లేని ఆరోగ్యదాయకమైన ఆహారోత్పత్తి ద్వారానే మహాభాగ్యమైన ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్నారు. అయితే, ఈ బృహత్ కార్యక్రమాన్ని వ్యాప్తిలోకి తేవటానికి విద్యాసంస్థలతో కలసి పనిచేస్తూ స్ఫూర్తిని నింపుతూ విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయ పనులను అలవాటు చేయటంలో ప్రత్యక్ష కృషి చేస్తున్న వారిని వేళ్లపై లెక్కించవచ్చు. ఈ కోవలో మొదటి పేరు డాక్టర్ గంగాధరం.



డా. గంగాధరం

దాదాపు రెండు దశాబ్దాలుగా సేంద్రియ / ప్రకృతి వ్యవసాయ విజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో ఆచరణాత్మక శిక్షణ ద్వారా విశేష కృషి చేస్తున్న ప్రకృతి సేద్య ప్రేమికుడు డాక్టర్ వర్ధ్ గంగాధర్. ఇప్పటికే వేలాది మంది రైతులకు, విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఘనత వర్ధ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు తిరుపతికి చెందిన డాక్టర్ ఎం గంగాధర్‌కే దక్కుతుంది.

తిరుపతిలో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆవరణలో విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసుకునే పద్ధతులను ఆయన గత కొన్ని నెలలుగా నేర్పిస్తున్నారు. 20 అడుగుల వెడల్పు × 20 అడుగుల పొడవు విస్తీర్ణంలో చిన్న చిన్న ఎత్తుమడులు ఏర్పాటు చేసి విద్యార్థుల చేత 15 రకాల ఆకుకూరలు, 4 రకాల కూరగాయల సాగు చేయిస్తున్నారు. ఈ నమూనాకు కుటుంబ వ్యవసాయం (ఫ్యామిలీ ఫార్మింగ్) అని పేరు పెట్టారు. డాక్టర్ గంగాధరం యూనవర్సిటీలో కొందరికి ముందుగానే శిక్షణ ఇచ్చి 'గ్రీన్ టీమ్'లను ఏర్పాటు చేశారు. డా. గంగాధరం మార్గదర్శకత్వంలో ఈ గ్రీన్ టీమ్‌ల ఈ కుటుంబ వ్యవసాయాన్ని పర్యవేక్షిస్తున్నారు. గ్రీన్ టీం సభ్యులు ప్రతి రోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యాలయంలోని వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులను ఇంటింటల కుటుంబ వ్యవసాయ నమూనా మడుల దగ్గరకు ఆహ్వానించి వారికి అవగాహన కల్పిస్తున్నారు.

ప్రకృతి సేద్య వ్యాప్తికి దోహదం

ఈ ఫ్యామిలీ ఫార్మింగ్ నమూనా ముఖ్య ఉద్దేశం గురించి వివరిస్తూ డా. గంగాధరం (98490 59573) ఇలా అన్నారు.. 'ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆరోగ్యకరమైన 15 రకాల కూరగాయలను ఏ విధంగా సాగు చేయవచ్చో నేర్పిస్తున్నాం. ఈ నమూనా ద్వారా విశ్వవిద్యాలయ విద్యార్థులందరూ పూర్తిస్థాయిలో నమూనాపై అవగాహన తెచ్చుకోగలుగుతారు. వివిధ ప్రాంతాలలో వారి సొంత పొలాల్లో కూడా కొంచెం విస్తీర్ణంలో అయినా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అమలు చేయటం ప్రారంభిస్తారు. ఆ విధంగా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ప్రాచుర్యానికి ఎంతో దోహదపడుతుంది. అట్లే తిరుపతి పట్టణంలో ప్రజలందరికీ ఉపయోగపడుతుందని ఆశాభావం..' అన్నారు. తిరుపతి పట్టణంలోని ప్రజలు కూడా సాయంత్రం 4–5 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనవచ్చని, తమ ఇంటి వద్ద తక్కువ స్థలంలో వివిధ రకాల కూరగాయలు సాగు చేసే పద్ధతులను తెలుసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో యువత విశ్వవిద్యాలయం నుంచి హైస్కూల్ వరకు ఈ నమూనా వ్యాప్తి చెంది రాష్ట్రమంతా యువత ప్రకృతి వ్యవసాయంపై పట్టు సాధించగలరని భావిస్తున్నానన్నారు. ఈ కృషి ఫలించాలని ఆశిద్దాం.

డ్రిప్ కన్నా తక్కువ నీటితోనే

ఎంచక్కా ఇంటిపంటలు!

అతి తక్కువ నీటితోనే సేంద్రియ ఇంటిపంటలు పండించుకునే ఉపాయం ఉంది. దీన్ని పాటిస్తే డ్రిప్ కన్నా తక్కువ నీరే సరిపోతాయి.. అది కూడా రోజూ అక్కర్లేదు. వారానికోసారి నీరు పోస్తే చాలు! బాగుంది కదూ.. 'వికింగ్ బెడ్స్' ద్వారానే ఇది సాధ్యం! మరి ఆ విశేషాలేంటో చూసేద్దామా?

అతి తక్కువ నీటి ఖర్చుతో రసాయనిక అవశేషాల్లేని సహజాహారాన్ని ఇంటిపట్టున పండించుకోవడానికి ఉపకరించే కంటెయినర్ పేరే 'వికింగ్ బెడ్'. ఈ వికింగ్ బెడ్‌కు రోజూ నీరు పోయాల్సిన పనిలేదు. ఇందులో అమర్చిన పీవీసీ పైపులో వారానికోసారి నిండుగా నీరు పోస్తే చాలు.

- వికింగ్ బెడ్స్‌ను మేడ మీద, నేల మీద, గచ్చు మీద ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చు. పెద్ద పీపాను మధ్యలోకి నిలువునా కోసి, అందులో వికింగ్ బెడ్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. ఫైబర్ తొట్లలో ఏర్పాటు చేసుకోవచ్చు. నేలలో గొయ్యి తవ్వి, గోతిలో ప్లాస్టిక్ షీట్ పరచి వికింగ్ బెడ్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు.
- సాగుకు పనికిరాని భూమిలోనూ వికింగ్ బెడ్‌ను నిర్మించి ఎంచక్కా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించుకోవచ్చు.
- చెక్క ముక్కలతో చేసిన పెట్టెలోనూ ప్లాస్టిక్ షీట్ వేసి వికింగ్ బెడ్‌ను నిర్మించవచ్చు. పట్టణాలు, నగరాల్లో భవనాల్లో నివసించే వారికి టెర్రస్ మీద వీటిని ఏర్పాటు చేసుకోవచ్చు.
- రైతులు కూడా అన్ని కాలాల్లో అన్ని పంటలూ పండించరు కాబట్టి వికింగ్‌బెడ్స్ వారికీ అవసరమే. ఓ రైతు తన ఇంటి దగ్గర ఏర్పాటు చేసిన 8 వికింగ్ బెడ్స్ ద్వారా 3 కుటుంబాలకు సరిపడా కూరగాయలు, ఆకుకూరలు ఏడాది పొడవునా పండిస్తున్నారు. ఒక్కో బెడ్‌కు వారానికోసారి బిందె నీరు పోస్తే చాలు.

ఇంతకీ వికింగ్ బెడ్ తయారీ ఎలా అనేదేగా మీ ప్రశ్న.. అక్కడికే వస్తున్నా..

- వికింగ్ బెడ్ 4 అడుగుల వెడల్పు, 2 అడుగుల లోతు ఉంటే సదుపాయంగా ఉంటుంది. పొడవు 6 అడుగులు పెట్టొచ్చు (అవసరాన్ని బట్టి పొడవు ఎంతైనా పెట్టుకోవచ్చు).
- 6X4X2 అడుగుల సైజు వికింగ్ బెడ్‌ను తయారు చేసుకోవాలంటే.. తొలుత ఆ సైజు కంటెయినర్‌ను





తీసుకోవాలి.

- 4 అంగుళాల చుట్టుకొలతతో కూడిన రెండు పీవీసీ పైపులు తీసుకోవాలి. వీటిల్లో ఒకటి 6 అడుగులు, 2.5 అడుగుల పొడవుండాలి.
- 6 అడుగుల పీవీసీ పైపునకు అంగుళానికొకటి చొప్పున బెజ్జాలు చేయాలి. దీన్ని కంటెయినర్ లో పెట్టాలి. ఒక వైపు ఎండ్ క్యాప్‌తో మూసివేసి.. మరో చివర నుంచి 2.5 అంగుళాల పైపును ఎల్ ఆకారంలో నిలువుగా అమర్చాలి. ఆ తర్వాత దీనిలోనే నీటిని అందించాలి.
- కంటెయినలో అడుగున పెట్టిన పీవీసీ పైపుపైన 5–6 అంగుళాల ఎత్తున ముతక రాళ్లను లేదా కొబ్బరి బొండం డొక్కలను పేర్చాలి. కంటెయినర్ గోడకు చిన్న బెజ్జం పెట్టి అదనపు నీరు బయటకు పోవడానికి చిన్న పైపును అమర్చాలి. దానిపైన గ్రీన్ షేడ్‌నెట్ కప్పాలి.
- దానిపైన మట్టి, కొబ్బరిపొట్టు మిశ్రమాన్ని 16 అంగుళాల మందాన పోయాలి. మట్టి మిశ్రమానికి అడుగున కూడా అదనపు నీరు బయటకు పోవడానికి చిన్న డ్రెయిన్‌ను ఏర్పాటు చేయాలి... అంతే.. వికింగ్ బెడ్ సిద్ధమైనట్లే.







- ఇలా సిద్ధం చేసిన వికింగ్ బెడ్‌పై తొలిసారి మట్టిపైన నీటిని చల్లి.. విత్తనాలు లేదా మొక్కలు నాటాలి. ఆ తర్వాత నుంచి మట్టిపైన నీరు పోయాల్సిన పని లేదు. అప్పుడప్పుడూ పీవీసీ పైపులో నిండుగా నీటిని నింపాలి.
- కంటెయినర్‌లో అడుగున అమర్చిన చిల్లుల పీవీసీ పైపులో నుంచి మట్టి మిశ్రమం ద్వారా మొక్కల వేళ్లకు నీటి తేమ అందుతూ ఉంటుంది. అందువల్ల నీటి వృథా బాగా తగ్గుతుంది. అందువల్లే వారానికోసారి నీటిని పీవీసీ పైపులో నింపితే సరిపోతుంది.
- వారాంతాల్లో తప్ప ఇతర రోజుల్లో ఎక్కువ సమయాన్ని ఇంటిపంటలకు కేటాయించలేని వారికి, నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో వారికి వికింగ్ బెడ్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

గార్బేజ్ ఎంజైమ్ అంటే?



Day 1



1 month



2 months



3 months

ఇంటి పంట

పండ్లు, కూరగాయల వ్యర్థాలను మురగ బెడితే గార్బేజ్ ఎంజైమ్ తయారవుతుంది. భూసార వర్ధినిగా, పురుగుల మందుగా ఉపయోగపడుతుంది. థాయ్‌లాండ్‌కు చెందిన డాక్టర్ రోసుకాన్ పూమ్‌పాన్‌వాంగ్ ఈ ఎంజైమ్‌ను తొలుత తయారు చేశారు. కూరగాయలు, పండ్ల తొక్కలు, ముక్కలు.. మార్కెట్లలో చెత్తకుప్పలో పోసిన మిగలపండిన పండ్లు, కూరగాయలు వంటివి ఎందుకూ పనికిరాని వ్యర్థాలే కదా అని అనుకోనక్కర్లేదు. వీటికి కొంచెం నల్లబెల్లం లేదా మొలాసిస్ లేదా సేంద్రియ పంచదార కలిపితే 90 రోజుల్లో గార్బేజ్ ఎంజైమ్ తయారవుతుంది.

గార్బేజ్ ఎంజైమ్ తయారీ ఇలా..

మూత బిగుతుగా పెట్టడానికి వీలుండే గాజు లేదా ప్లాస్టిక్/ఫైబర్ డ్రమ్ముల్లో దీన్ని తయారు చేయవచ్చు. కావాల్సిన పదార్థాలు : కూరగాయలు, పండ్ల వ్యర్థాలు (తొక్కలు, ముక్కలు, కుళ్లినవి) 3 పాళ్లు + నల్ల బెల్లం లేదా మొలాసిస్ లేదా సేంద్రియ (బ్రౌన్) పంచదార 1 పాలు + నీరు 10 పాళ్ల చొప్పున కలపాలి.

మార్కెట్లు, దుకాణాల్లో మిగిలిపోయిన, కుళ్లిపోయిన కూరగాయలు, పండ్లను ముక్కలు చేసి వాడుకోవచ్చు. మిగిలిపోయిన అన్నం, కూరలు కూడా కలపొచ్చు. అయితే, జారుగా ఉండే గ్రేవీ కలపకూడదు. మాంసం, మందంగా ఉండే పనస పండ్ల తొక్కలు కలపకూడదు.

ఈ మిశ్రమాన్ని ప్లాస్టిక్ డబ్బాలో వేసి గాలి చొరబడకుండా గట్టిగా మూత బిగించాలి. ఎండ తగలకుండా సాధారణ ఉష్ణోగ్రతల వద్ద నిల్వ ఉంచాలి. 90 రోజులకు గార్బేజ్ ఎంజైమ్ సిద్ధమవుతుంది. మొదటి 30 రోజుల పాటు.. రోజుకోసారి మూత తీసి వాయువులు బయటకు వెళ్లాక, మళ్లీ గట్టిగా మూత బిగించాలి. ఆ తర్వాత 60 రోజుల పాటు మూత తీయనక్కర్లేదు. ద్రావణం పులియటం వల్ల తెల్లటి పొర ఏర్పడుతుంది. మొత్తం 90 రోజులు గడిచాక ద్రావణాన్ని వడకట్టి, నిల్వ చేసుకొని అక్కడి నుంచి 60 రోజుల వరకు వాడుకోవచ్చు. వడపోతలో వచ్చే వ్యర్థాలను ఎండబెట్టి మొక్కలకు ఎరువుగా వాడవచ్చు లేదా మళ్లీ గేర్బేజ్ ఎంజైమ్ తయారీకి వాడుకోవచ్చు.

పలు ప్రయోజనాలు

గార్బేజ్ ఎంజైమ్ లో ఉన్న సూక్ష్మజీవరాశి, ఔషధ గుణాలు నేలను సారవంతం చేస్తాయి. ఇది సహజ భూసార వర్ధినిగా, కీటకనాశినిగా పనిచేస్తుంది. తెగుళ్ల బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చు. దీన్ని వాడితే పంట మొక్కల్లో నత్రజనిని గ్రహించే శక్తి పెరుగుతుంది. గార్బేజ్ ఎంజైమ్‌ను నీటిలో తగిన పాళ్లలో కలిపి వాడుకోవాలి.

ఎరువుగా.. 1:1000 పాళ్లలో(అంటే.. 1 మిల్లీలీటరు ఎంజైమ్‌కు 100 మిల్లీలీటర్ల నీరు) కలిపి నేలలో పోయవచ్చు లేదా పిచికారీ చేయవచ్చు.

పురుగులు/ తెగుళ్ల నాశినిగా..
1:100 మోతాదులో కలిపి పిచికారీ చేయాలి.

దిగుబడి పెంపుదలకు.. 1:500 పాళ్లలో కలిపి పిచికారీ చేయాలి.

బిజినెస్ రీల్

ఇన్వెస్టర్లకు యూపీఐ సదుపాయాన్ని అందించండి

క్యూఎస్‌బీలకు సెబీ ఆదేశం

న్యూఢిల్లీ: సెకండరీ మార్కెట్లో ట్రేడింగ్ కోసం క్లయింట్లకు యూపీఐ ఆధారిత బ్లాక్ విధానాన్ని లేదా త్రీ-ఇన్-వన్ ట్రేడింగ్ అకౌంటు సదుపాయాన్ని అందించాలని క్వాలిఫైడ్ స్టాక్ బ్రోకర్స్‌కు (క్యూఎస్‌బీ) మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆదేశించింది. ప్రస్తుత ట్రేడింగ్ విధానంతో పాటు ఫిబ్రవరి 1 నుంచి ఈ రెండింటిలో ఒక సదుపాయాన్ని తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచించింది. త్రీ-ఇన్-వన్ ట్రేడింగ్ అకౌంటులో సేవింగ్స్ అకౌంటు, డీమ్యాట్ అకౌంట్, ట్రేడింగ్ అకౌంట్ మూడూ కలిసి ఉంటాయి.

హల్దీరామ్ భుజియావాలాలో భారత్ వేల్యూ ఫండ్ పెట్టుబడులు

ముంబై: ఆర్థిక సేవల సంస్థ పాంటోమత్‌లో భాగమైన భారత్ వేల్యూ ఫండ్ కొత్తగా హల్దీరామ్ భుజియావాలాలో మైనారిటీ వాటాలు దక్కించుకుంది. ఇందుకోసం రూ. 235 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. దాదాపు ఆరు దశాబ్దాలుగా కార్యకలాపాలు సాగిస్తున్న హల్దీరామ్ భుజియావాలా 'ప్రభూజీ' బ్రాండ్ పేరిట స్నాక్స్ విక్రయిస్తోంది. సుమారు 2,000 మంది డిస్ట్రిబ్యూటర్లు, రెండు లక్షల పైగా రిటైలర్ల నెట్‌వర్క్ ఉంది.

హెచ్‌ఎస్‌బీసీ ఇండియాతో మారుతీ సుజుకీ జట్టు

న్యూఢిల్లీ: ఇన్వెంటరీ ఫండింగ్ కోసం హాంకాంగ్ అండ్ షాంఘై బ్యాంకింగ్ కార్పొరేషన్‌తో (హెచ్‌ఎస్‌బీసీ) ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా వెల్లడించింది. ఇది దేశవ్యాప్తంగా ఉన్న 4,000 పైచిలుకు కంపెనీ సేల్స్ ఔట్‌లెట్స్‌కి ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపింది. తమ డీలర్ భాగస్వాములు నిర్వహణ మూలధన అవసరాలను తీర్చుకునేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడగలదని కంపెనీ తెలిపింది. సాధారణంగా సీజనల్ అవసరాల కోసం మరింతగా కొనుగోళ్లు చేసేందుకు లేదా వర్కింగ్ క్యాపిటల్ అవసరాల కోసం, వ్యాపార సంస్థలు ప్రస్తుతం తమ దగ్గరున్న నిల్వలను తనఖాగా ఉంచి తీసుకునే స్వల్పకాలిక రుణాలను ఇన్వెంటరీ ఫండింగ్‌గా వ్యవహరిస్తుంటారు.

హ్యుందాయ్ లాభం డౌన్

క్యూ2లో రూ. 1,375 కోట్లు



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 16 శాతం క్షీణించి రూ. 1,375 కోట్లకు పరిమితమైంది. దేశీయంగా అమ్మకాలు నీరసించడం ప్రభావం చూపాయి. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 1,628 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 7 శాతం పైగా తగ్గి రూ. 17,260 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 18,660 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఈ కాలంలో 1,91,939 వాహనాలను విక్రయించింది. ఎస్‌యూవీల హవాతో వీటిలో దేశీయంగా 1,49,639 వాహనాలు అమ్ముడయ్యాయి. 42,300 యూనిట్లను ఎగుమతి చేసింది.

క్రెటా ఈవీకి రెడీ

గత నెలలో లిస్టయిన హ్యుందాయ్ మోటార్ ఇండియా తొలిసారి త్రైమాసిక ఫలితాలు వెల్లడించింది. రానున్న కాలంలో క్రెటా ఈవీని ప్రవేశపెట్టనున్నట్లు కంపెనీ ఎండీ అన్సూ కిమ్ పేర్కొన్నారు. ఈవీ మార్కెట్లో ఇది గేమ్‌చేంజర్‌గా నిలవగలదని అంచనా వేశారు. కాగా, ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో(ఏప్రిల్-సెప్టెంబర్) రూ. 34,605 కోట్ల ఆదాయం సాధించగా.. రూ. 2,865 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం 3,83,994 వాహనాలను విక్రయించింది. 84,900 యూనిట్లను ఎగుమతి చేసింది.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు బీఎస్‌ఈలో 1% నీరసించి రూ. 1,804 వద్ద ముగిసింది.

పీటీసీ ఇండియా లాభం అప్

రూ. 234 కోట్లుగా నమోదు

న్యూఢిల్లీ: విద్యుత్ రంగ పీఎస్‌యూ.. పీటీసీ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 16 శాతం ఎగసి రూ. 234 కోట్లకు చేరింది. అధిక ఆదాయం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 202 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 5,088 కోట్ల నుంచి రూ. 5,134 కోట్లకు బలపడింది. ఈ కాలంలో విద్యుత్ ట్రేడింగ్ పరిమాణం 13 శాతం పుంజుకుని 24,039 మిలియన్ యూనిట్లను తాకింది. కాగా.. ఎస్‌హెచ్‌పీసీ డైరెక్టర్ రజనీష్ అగర్వాల్‌ను నామినీ డైరెక్టర్‌గా ఎంపిక చేసినట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో పీటీసీ షేరు బీఎస్‌ఈలో 4.6% పతనమై రూ. 171 వద్ద ముగిసింది.



ఆర్‌పీఎల్ స్టాక్ కేసులో

ముకేశ్‌కు సుప్రీం ఊరట

శాట్ ఉత్తర్వుపై సెబీ అప్పీల్ కొట్టివేత



న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్)తో 2009లో విలీనమైన పెట్రోలియం లిమిటెడ్ (ఆర్‌పీఎల్)కు సంబంధించిన షేర్లలో 2007లో అవకతవకల జరిగాయన్న ఆరోపణల విషయంలో ముకేశ్ అంబానీ మరో రెండు సంస్థలకు ఊరట లభించింది. ఇందుకు సంబంధించి మార్కెట్ రెగ్యులేటర్ సెబీ విధించిన జరిమానా విధింపును కొట్టివేస్తూ శాట్ (సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్) ఇచ్చిన రూలింగ్‌ను తాజాగా సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. ఈ విషయంలో సెబీ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. శాట్ జారీ చేసిన ఉత్తర్వుపై జోక్యం చేసుకునే ప్రసక్తే లేదని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ''మా జోక్యాన్ని కోరే ఈ అప్పీల్‌లో చట్టం ప్రమేయం లేదు. మీరు ఒక వ్యక్తిని ఏళ్ల తరబడి వెంబడించలేరు' అని బెంచ్ పేర్కొంది.


కేసు వివరాలు ఇవీ...

- నవంబర్ 2007లో నగదు, ఫ్యూచర్స్ విభాగాల్లో ఆర్‌పీఎల్ షేర్ల విక్రయం, కొనుగోలులో అవకతవకలు జరిగాయన్నది కేసు సారాంశం.
- 2009లో ఆర్‌ఐఎల్‌తో విలీనం అయిన లిస్టెడ్ అనుబంధ సంస్థ- ఆర్‌పీఎల్‌లో దాదాపు 5 శాతం వాటాను విక్రయించాలని 2007 మార్చిలో ఆర్‌ఐఎల్ నిర్ణయం తీసుకుంది.
- ఈ నేపథ్యంలోనే 2007 నవంబర్‌లో ఆర్‌పీఎల్ ఫ్యూచర్స్‌లో లావాదేవీలు చేపట్టేందుకు ఆర్‌ఐఎల్ 12 మంది ఏజెంట్లను నియమించిందని, ఈ 12 మంది ఏజెంట్లు కంపెనీ తరఫున ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్‌అండ్‌ఓ) సెగ్మెంట్‌లో షార్ట్ పొజిషన్లు తీసుకున్నారని, అదే సమయంలో కంపెనీ నగదు విభాగంలో ఆర్‌పీఎల్ షేర్లలో లావాదేవీలు చేపట్టిందని సెబీ ఆరోపించింది.
- ఈ కేసు విషయంలో సెబీ 2021 జనవరిలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్)పై రూ. 25 కోట్లు, కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముకేశ్ అంబానీపై రూ. 15 కోట్లు, నవీ ముంబై సెజ్ ప్రైవేట్ లిమిటెడ్‌పై రూ. 20 కోట్లు, ముంబై సెజ్‌పై రూ. 10 కోట్లు జరిమానా విధించింది. నవీ ముంబై సెజ్, అలాగే ముంబై సెజ్‌ను ఒకప్పుడు రిలయన్స్ గ్రూప్‌లో పని చేసిన ఆనంద్ జైన్ ప్రమోట్ చేయడం గమనార్హం. 12 సంస్థలకు నిధులు సమకూర్చడం ద్వారా మొత్తం మానిప్యులేషన్ స్కీమ్‌కు నవీ ముంబై సెజ్, ముంబై సెజ్ పాత్రధారులుగా మారినట్లు ఆరోపణ.
- అంబానీ, నవీ ముంబై సెజ్, ముంబై సెజ్‌లపై 2021లో సెబీ జారీ చేసిన ఉత్తర్వులను శాట్ 2023లో రద్దు చేసింది. జరిమానాకు సంబంధించి డిపాజిట్‌గా ఉంచిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని శాట్ ఆదేశించింది. కార్పొరేట్ సంస్థలు చట్టాన్ని ఉల్లంఘించే ప్రతి ఆరోపణకు మేనేజింగ్ డైరెక్టర్‌ను బాధ్యునిగా చేయలేవని పేర్కొంది. ఇద్దరు సీనియర్ అధికారులు అక్రమ లావాదేవీలు నిర్వహించారని స్పష్టమవుతోందని, ఈ విషయంలో ముకేశ్ అంబానీ పాత్ర ఉన్నట్లు సెబీ రుజువుచేయలేకపోయిందని పేర్కొంది. ఆర్‌ఐఎల్‌పై ఆరోపణలను మాత్రం శాట్ కొట్టివేయకపోవడం గమనార్హం.
- కాగా, శాట్ రూలింగ్‌ను సవాలుచేస్తూ, డిసెంబర్ 2023 డిసెంబర్ 4న సెబీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు | Q2 RESULTS

బీఎస్‌ఈ దూకుడు

క్యూ2లో రూ. 346 కోట్లు



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం బీఎస్‌ఈ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం మూడు రెట్లు జంప్‌చేసి రూ. 346 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 118 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 819 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 367 కోట్ల ఆదాయం సాధించింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో(ఏప్రిల్- సెప్టెంబర్) రూ. 1,493 కోట్ల రికార్డ్ ఆదాయాన్ని అందుకున్నట్లు బీఎస్‌ఈ ఎండీ, సీఈవో సుందరరామన్ రామమూర్తి పేర్కొన్నారు. రెండో త్రైమాసికంలో నగదు విభాగం సగటు రోజువారీ టర్నోవర్ రూ. 5,922 కోట్ల నుంచి రూ. 9,768 కోట్లకు జంప్ చేసింది. ఈక్విటీ డెరివేటివ్స్ విభాగంలో ప్రీమియం టర్నోవర్ రూ. 768 కోట్ల నుంచి రూ. 8,203 కోట్లకు దూసుకెళ్లింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈ షేరు ఎన్‌ఎస్‌ఈలో 2 శాతం బలపడి రూ. 4,705 వద్ద ముగిసింది.

జైడస్ లైఫ్‌సైన్సెస్ లాభం ప్లస్



న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ రంగ దిగ్గజం జైడస్ లైఫ్‌సైన్సెస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 14 శాతం ఎగసి రూ. 911 కోట్లను అధిగమించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 801 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 4,369 కోట్ల నుంచి రూ. 5,237 కోట్లకు బలపడింది. ఫార్ములేషన్లు, కన్జూమర్ వెల్‌నెస్‌తోకూడిన దేశీ బిజినెస్ 10 శాతం పుంజుకుని రూ. 1,944 కోట్లను తాకింది. యూఎస్ నుంచి 30 శాతం అధికంగా రూ. 2,417 కోట్ల అమ్మకాలు సాధించింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి 20 శాతం వృద్ధితో రూ. 539 కోట్ల ఆదాయం అందుకుంది. అయితే ఏపీఐ బిజినెస్ 15 శాతం క్షీణించి రూ. 119 కోట్లకు పరిమితమైంది.

ఫలితాల నేపథ్యంలో జైడస్ లైఫ్ షేరు బీఎస్‌ఈలో 2% క్షీణించి రూ. 950 వద్ద ముగిసింది.

ఎవరెడీ ఇండస్ట్రీస్ లాభం అప్



న్యూఢిల్లీ: బ్యాటరీలు, ఫ్లాష్‌లైట్ల తయారీ దిగ్గజం ఎవరెడీ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 16 శాతం ఎగసి దాదాపు రూ. 30 కోట్లకు చేరింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 25.5 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం స్వల్ప క్షీణతతో రూ. 363 కోట్లకు పరిమితమైంది. గత క్యూ2లో రూ. 365 కోట్ల టర్నోవర్ నమోదైంది. అల్కాలైన్‌తో పోలిస్తే కార్బన్ జింక్ బ్యాటరీల అమ్మకాలు నీరసించడం ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. అయితే ఫ్లాష్‌లైట్ల అమ్మకాలు రెండంకెల వృద్ధిని అందుకున్నట్లు తెలియజేసింది. కాగా.. మొత్తం వ్యయాలు 2 శాతం తగ్గి రూ. 328 కోట్లుగా నమోదయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో ఎవరెడీ షేరు బీఎస్‌ఈలో 2.3 శాతం క్షీణించి రూ. 381 వద్ద ముగిసింది.

బాంబే డయింగ్‌కు లాభాలు



న్యూఢిల్లీ: టెక్స్‌టైల్స్ రంగ దిగ్గజం బాంబే డయింగ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై-సెప్టెంబర్(క్యూ2)లో నష్టాలను వీడింది. రూ. 393 కోట్ల నికర లాభం ఆర్జించింది. ప్రధానంగా భూముల విక్రయాలు ఇందుకు సహకరించాయి. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 52 కోట్ల నికర నష్టం ప్రకటించింది. అయితే రూ. 502 కోట్ల అనుకోని లాభాలను మినహాయిస్తే రూ. 28 కోట్ల నష్టం నమోదైనట్లు కంపెనీ వెల్లడించింది. కాగా.. మొత్తం ఆదాయం 14 శాతం వెనకడుగుతో రూ. 381 కోట్లకు పరిమితమైంది. గత క్యూ2లో రూ. 441 కోట్ల టర్నోవర్ సాధించింది. మొత్తం వ్యయాలు 25 శాతం తగ్గి రూ. 438 కోట్లుగా నమోదయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 3.2 శాతం క్షీణించి రూ. 214 వద్ద ముగిసింది.

బాష్ లాభం నేలచూపు



న్యూఢిల్లీ: ఇంజినీరింగ్ దిగ్గజం బాష్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 46 శాతం పడిపోయి రూ. 536 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 1,000 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 4,130 కోట్ల నుంచి రూ. 4,394 కోట్లకు స్వల్పంగా(6 శాతం) బలపడింది. అకాల వర్షపాత ప్రభావానికితోడు స్థూల ఆర్థిక పరిస్థితులు ఆటోమోటివ్ పరిశ్రమను దెబ్బతీసినట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో బాష్ షేరు బీఎస్‌ఈలో 4.5 శాతం పతనమై రూ. 33,394 వద్ద ముగిసింది.


నాట్కో మధ్యంతర డివిడెండ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ నాట్కో ఫార్మా 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రెండవ మధ్యంతర డివిడెండ్ రూ.1.5 చెల్లించాలని బోర్డు నిర్ణయించింది. సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో కంపెనీ నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 83 శాతం ఎగసి రూ.676 కోట్లు నమోదు చేసింది. టర్నోవర్ రూ.1,031 కోట్ల నుంచి రూ.1,371 కోట్లను తాకింది.

ఫలితాల నేపథ్యంలో నాట్కో షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో మంగళవారం 0.19 శాతం క్షీణించి రూ.1,393.15 వద్ద స్థిరపడింది.

నైకా లాభం హైజంప్

క్యూ2లో రూ. 13 కోట్లు



న్యూఢిల్లీ: నైకా బ్రాండ్ కంపెనీ ఎఫ్‌ఎస్‌ఎన్ ఈకామర్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 66 శాతం జంప్‌చేసి రూ. 13 కోట్లకు చేరింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 8 కోట్లు మాత్రమే ఆర్జించింది. బ్యూటీ, లైఫ్‌స్టైల్ ఈకామర్స్ సంస్థ మొత్తం ఆదాయం సైతం 24 శాతం ఎగసి రూ. 1,875 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 1,507 కోట్ల టర్నోవర్ అందుకుంది.

ఫలితాల నేపథ్యంలో నైకా షేరు బీఎస్‌ఈలో 3 శాతం పతనమై రూ. 178 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో)

13-11-2024

విశాఖ	525-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.80

నేటి బోర్డు సమావేశాలు

ఏజీఐ ఇన్ఫ్రా, అల్కేమ్ ల్యాబ్స్, అపోలో టైర్స్, బాలకృష్ణ పేపర్ మిల్స్, దిలీప్ బిల్డ్‌కాన్, డిష్ టీవీ, ఐషర్ మోటార్స్, హ్యాపీయెస్ట్ మైండ్స్, హెచ్‌ఈజీ, కళ్యాణ్ జ్యువెలర్స్, కావేరీ సీడ్స్, వోకార్డ్, వోడాఫోన్ ఐడియా, టొరెంటో పవర్, సన్ టీవీ నెట్‌వర్క్స్, శ్రేయాస్ షిప్‌యార్డ్

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	6,508.00	0.42
SUNPHARMA	1,797.00	0.13
HCLTECH	1,868.35	0.06
INFY	1,861.00	0.05
ICICIBANK	1,269.00	-0.02

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BRITANNIA	5,038.00	-7.3
BEL	289.3	-3.49
NTPC	380.3	-3.12
ASIANPAINT	2,470.30	-2.86
HDFCBANK	1,719.00	-2.68

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	5,535
ఎన్‌ఎస్‌ఈ	90,244
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	2,05,745
ఎఫ్‌ఐఐ	- 3,024
డీఐఐ	+ 1,854

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.37	$ 68.04
బ్రెంట్	72.12	$ 71.83

విస్తరణ బాటలో రాడిసన్ హోటల్ గ్రూప్

2027 నాటికి 200కు ప్రాపర్టీల సంఖ్య



ముంబై: రాడిసన్ హోటల్ గ్రూప్ పెద్ద ఎత్తున కార్యకలాపాలను విస్తరించనుంది. 2027 నాటికి భారత్‌లో ప్రాపర్టీల సంఖ్యను 200కు పెంచుకోవాలని భావిస్తోంది. అలాగే, కొత్త పర్యాటక ప్రాంతాలతో పాటు 3, 4వ శ్రేణి పట్టణాల్లోనూ మరిన్ని హోటల్స్‌ను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు ఎండీ నిఖిల్ శర్మ తెలిపారు. తమకు దేశీయంగా ప్రస్తుతం తొమ్మిది బ్రాండ్స్ ఉన్నాయని చెప్పారు. వచ్చే ఏడాది త్రిసూర్ (కేరళ), బెంగళూరు వంటి నగరాల్లో పార్క్ ఇన్ అండ్ సూట్స్ బై రాడిసన్ హోటల్స్‌ను ప్రారంభిస్తున్నట్లు శర్మ చెప్పారు. ఈ ఏడాది రాడిసన్ ఇండివిడ్యువల్స్ పేరిట ఆరు ప్రారంభించినట్లు తెలిపారు. కొత్త బ్రాండ్స్‌తో కార్యకలాపాల విస్తరణ మరింత వేగవంతమవుతుందని వివరించారు. 2025 నాటికి తమ నిర్వహణలో 150 పైచిలుకు హోటల్స్ ఉంటాయని పేర్కొన్నారు. వ్యవసాయ రంగం తర్వాత అత్యధికంగా ఆతిథ్య రంగమే ఉపాధి కల్పిస్తోందని శర్మ చెప్పారు. ఆతిథ్య రంగంలో అదనంగా జతయ్యే ఒక్కో గదికి పది ఉద్యోగాల కల్పన జరుగుతుందని తెలిపారు. సుశిక్షితులైన సిబ్బందిని తీసుకునేందుకు హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వివరించారు.

7.66 లక్షల మందికి కొత్తగా ఉపాధి

- 2023-24లో 6.6 శాతం అధికం
- ఈపీఎఫ్ పరిధిలో మొత్తం సభ్యులు 7.37 కోట్లు
- గణాంకాలు విడుదల చేసిన కార్మిక శాఖ



న్యూఢిల్లీ: సంఘటిత రంగంలో గడిచిన ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 7.66 లక్షల మందికి ఉపాధి లభించింది. ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) సభ్యుల సంఖ్య 6.6 శాతం మేర పెరిగింది. దీంతో ఈపీఎఫ్‌వో సభ్యుల సంఖ్య 7.37 కోట్లకు చేరినట్టు కేంద్ర కార్మిక శాఖ గణాంకాలు విడుదల చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నివేదికను ఈ నెల 8న జరిగిన ఈపీఎఫ్‌వో సెంట్రల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ 109వ సమావేశం పరిగణనలోకి తీసుకున్నట్టు కేంద్ర కార్మిక శాఖ తెలిపింది. ఈపీఎఫ్‌వో కింద చందాలు జమ చేసే సంస్థలు 6.6 శాతం పెరిగి 7.66 లక్షలకు చేరాయి. చందాలు జమ చేసే సభ్యులు 7.6 శాతం పెరిగి 7.37 కోట్లుగా ఉన్నారు. మొత్తం 4.45 కోట్ల క్లెయిమ్‌లకు పరిష్కారం లభించింది. 2022-23లో ఇవి 4.13 కోట్లుగా ఉన్నాయి. కొత్త కారుణ్య నియామక ముసాయిదా విధానం, 2024ను సైతం ఎగ్జిక్యూటివ్ కమిటీ పరిగణనలోకి తీసుకున్నట్టు కార్మిక శాఖ ప్రకటించింది. ఐటీ, మెరుగైన పరిపాలనా, ఆర్థిక సంస్కరణలపై చర్చించినట్టు.. వచ్చే కొన్ని నెలల పాటు ప్రతి నెలా సమావేశమైన సంస్కరణల పురోగతిని సమీక్షించాలని నిర్ణయించనట్టు తెలిపింది.

ఓరియంట్ సిమెంట్ డీల్ కోసం

సీసీఐ ముందుకు అంబుజా సిమెంట్స్

న్యూఢిల్లీ: ఓరియంట్ సిమెంట్‌లో మెజారిటీ వాటాల కొనుగోలుకు సంబంధించి సీసీఐ అనుమతుల కోసం అంబుజా సిమెంట్ దరఖాస్తు చేసుకుంది. ఇందుకు సంబంధించి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియాకి (సీసీఐ) కంపెనీ ఇచ్చిన సమాచారం ప్రకారం ప్రతిపాదిత డీల్ రెండు దశల్లో ఉంటుంది. ఓరియంట్ సిమెంట్‌లో కంపెనీ ముందుగా 46.80 శాతం వాటాను కొనుగోలు చేస్తుంది. ఆ తర్వాత టేకోవర్ నిబంధనల ప్రకారం 26 శాతం వాటాల కోసం ఓపెన్ ఆఫర్ ఇస్తుంది. మొత్తం మీద 72.80 శాతం వాటాను కొనుగోలు చేస్తుంది. ఈ డీల్ విలువ సుమారు రూ. 8,100 కోట్లుగా ఉంటుంది. సీకే బిర్లా గ్రూప్‌నకు చెందిన ఓరియంట్ సిమెంట్‌కి తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలో మూడు తయారీ ప్లాంట్లు ఉన్నాయి.

850 శాఖల మైలురాయి దాటిన కరూర్ వైశ్యా బ్యాంక్

ముంబై: ప్రైవేట్ రంగ కరూర్ వైశ్యా బ్యాంక్ 850 శాఖల మైలురాయిని అధిగమించింది. బ్యాంకు ఎండీ రమేశ్ కుమార్ చెన్నైలో 850వ బ్రాంచీని ప్రారంభించారు. ఇది కాకుండా మరో అయిదు శాఖలను కూడా ప్రారంభించడంతో మొత్తం బ్రాంచీల సంఖ్య 854కి చేరింది. వీటిలో రెండు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, విజయవాడలో ఉన్నాయి. దీనితో తెలుగు రాష్ట్రాల్లో మొత్తం శాఖల సంఖ్య 205కి చేరినట్లు బ్యాంకు తెలిపింది. 56 శాతం బ్రాంచీలు గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఉన్నాయని వివరించింది. సెప్టెంబర్ త్రైమాసికం ఆఖరునాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ. 1,75,138 కోట్లుగా ఉండగా, ఉద్యోగుల సంఖ్య 9,085గా ఉంది.

డెలివరీ సేవలకు 10,000 ఈవీలు: ఫ్లిప్‌కార్ట్

ముంబై: డెలివరీ సేవల కోసం 10,000 ఎలక్ట్రిక్ వెహికిల్స్‌ను వినియోగిస్తున్నట్లు ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. 'ఈవీలను వినియోగంతో కార్యాచరణ సామర్థ్యం గణనీయంగా పెరిగింది. హబ్ స్థాయిలో ఆర్డర్‌కు వ్యయం తగ్గింది. సంప్రదాయ డెలివరీ వాహనాలతో పోలిస్తే లాస్ట్-మైల్ డెలివరీ వేగం 20 శాతం మెరుగుపడింది' అని ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. 2030 నాటికి లాస్ట్ మైల్ డెలివరీకి వినియోగించే వాహనాలు పూర్తిగా ఈవీలే ఉండాలన్నది లక్ష్యమని వివరించింది. ఈవీల్లో 75 శాతం ప్రథమ స్థాయి నగరాల్లోనే ఉన్నాయని తెలిపింది.

భాన్‌జూ నిధుల సమీకరణ



ముంబై: ఎడ్‌టెక్ ప్లాట్‌ఫాం భాన్‌జూ 16.5 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 139 కోట్లు) నిధులను సమీకరించినట్లు వెల్లడించింది. ప్రస్తుత ఇన్వెస్టర్లయిన లైట్‌స్పీడ్ వెంచర్స్, ఎయిట్ రోడ్స్‌తో పాటు ఎపిక్ క్యాపిటల్, జెడ్3 పార్ట్‌నర్స్ తదితర సంస్థలు ఇన్వెస్ట్ చేసినట్లు తెలిపింది. కార్యకలాపాల విస్తరణకు ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు సంస్థ సీఈవో నీలకంఠ భాను తెలిపారు. అమెరికాలో గణిత బోధనకి సంబంధించిన మార్కెట్లో గణనీయంగా వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోనున్నట్లు వివరించారు. భాన్‌జూ ప్రస్తుతం భారత్‌తో పాటు అమెరికా, బ్రిటన్, మధ్యప్రాచ్య దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది.

ఢిల్లీ, పుణేరి హోరాహోరీ

- ఉత్కంఠ పోరు 38–38తో 'టై'
- ప్రొ కబడ్డీ లీగ్

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో హోరాహోరీ సమరాలు కొనసాగుతున్నాయి. మంగళవారం దబంగ్ ఢిల్లీ–పుణేరి పల్టన్ మధ్య జరిగిన పోరు 38–38 పాయింట్లతో 'టై'గా ముగిసింది. దబంగ్ ఢిల్లీ తరఫున అషు మాలిక్ 17 పాయింట్లతో సత్తాచాటగా... మోహిత్ దేశ్వాల్ (6 పాయింట్లు) అతడికి సహకరించాడు. ఇతర ఆటగాళ్లు పెద్దగా ఆకట్టుకోలేకపోయినా... తన సూపర్ రెయిడ్‌లతో అషు పాయింట్లు సాధించడంతో ఢిల్లీ జట్టు పోటీలో నిలిచింది. మరోవైపు పల్టన్ తరఫున ఆకాశ్ షిండే (8 పాయింట్లు), మోహిత్ గోయత్ (6 పాయింట్లు), అమన్ (6 పాయింట్లు) రాణించారు. ఓవరాల్‌గా దబంగ్ ఢిల్లీ మ్యాచ్‌లో 24 రెయిడ్ పాయింట్లు సాధిస్తే... పుణేరి పల్టన్ 18 పాయింట్లకే పరిమితమైంది. ట్యాకిలింగ్‌లో ఢిల్లీ 9 పాయింట్లు సాధిస్తే... పల్టన్ 13 పాయింట్లతో సత్తాచాటింది. ఇరు జట్లు రెండేసి సార్లు ఆలౌట్ కాగా... దంబగ్ ఢిల్లీ జట్టుకు ఒక సూపర్ రెయిడ్ పాయింట్ దక్కింది. ఈ ఫలితంతో తాజా సీజన్‌లో 9 మ్యాచ్‌లు ఆడిన పుణేరి పల్టన్ 5 విజయలు, 2 పరాజయాలు, 2 'టై'లతో 33 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక 'టాప్'ప్లేస్‌లో కొనసాగుతోంది. 10 మ్యాచ్‌లాడిన దబంగ్ ఢిల్లీ 4 విజయాలు, 5 పరాజయాలు, ఒక 'టై'తో 27 పాయింట్లు సాధించి పట్టిక ఐదో స్థానంలో ఉంది.


దబంగ్ ఢిల్లీ, పుణేరి పల్టన్ మ్యాచ్ లో ఓ దృశ్యం

అర్జున్ అదరహో..

పీకేఎల్‌లో భాగంగా మంగళవారమే జరిగిన మరో మ్యాచ్‌లో మాజీ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ ఘనవిజయం సాధించింది. షహీద్ విజయ్ సింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన పోరులో జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు 39–32 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది. పింక్ పాంథర్స్ తరఫున అర్జున్ దేశ్‌వాల్ 19 పాయింట్లతో దుమ్మురేపాడు. రెండుసార్లు పీకేఎల్ టైటిల్ సాధించిన జైపూర్ జట్టును అర్జున్ ఒంటి చేత్తో విజయం సాధించి పెట్టాడు. రెయిండింగ్‌లో అర్జున్ దూకుడు కనబరిస్తే... డిఫెన్స్‌లో లక్కీ శర్మ 6 పాయింట్లతో ఆకట్టుకున్నాడు. ప్రదీప్ నర్వాల్ గైర్హాజరీలో బరిలోకి దిగిన బెంగళూరు బుల్స్ ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది. ప్రధాన ఆటగాడు దూరం కావడంతో... ఆ జట్టు పింక్ పాంథర్స్‌కు పోటీనివ్వలేకపోయింది. అజింక్యా పవార్ (9 పాయింట్లు) పోరాడినా ఫలితం లేకపోయింది. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 21 రెయిడ్ పాయింట్లు సాధిస్తే... పింక్ పాంథర్స్ 19 పాయింట్లు సాధించింది. ట్యాకిలింగ్‌లో బుల్స్ 8 పాయింట్లకు పరిమితం కాగా... జైపూర్ 14 పాయింట్లతో సత్తాచాటింది. జైపూర్ పింక్ పాంథర్స్‌కు 8 మ్యాచ్‌ల్లో ఇది నాలుగో విజయం కాగా... 3 పరాజయాలు, ఒక 'టై'తో 25 పాయింట్లు సాధించి పట్టికలో ఏడో స్థానంలో కొనసాగుతోంది. ఆడిన తమ్మిది మ్యాచ్‌ల్లో ఏడో పరాజయం మూటగట్టుకున్న బెంగళూరు బుల్స్ పట్టికలో కింది నుంచి రెండో స్థానంలో ఉంది.

భవ్‌తేగ్ సింగ్‌కు పసిడి

వరల్డ్ యూనివర్సిటీ షూటింగ్ చాంపియన్‌షిప్



న్యూఢిల్లీ: ప్రపంచ యూనివర్సిటీ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ భవ్‌తేగ్ సింగ్ గిల్ పసిడి పతకంతో మెరిశాడు. మంగళవారం జరిగిన పురుషుల స్కీట్ విభాగంలో 21 ఏళ్ల భవ్‌తేగ్ సింగ్ గిల్ 58 పాయింట్లు స్కోరు చేసి అగ్ర స్థానంలో నిలిచాడు. జూనియర్ స్థాయిలో నిలకడైన ప్రదర్శన కనబరుస్తున్న భవ్‌తేగ్ సింగ్... ఇప్పటి వరకు అంతర్జాతీయ స్థాయిలో నాలుగు పతకాలు సాధించాడు. వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లోనూ భవ్‌తేగ్ సింగ్ అదిరే గురితో ఆకట్టుకోగా... పెట్రోస్ ఎంగ్లెజోడిస్ (సిప్రస్)కు రజతం, భారత షూటర్ అభయ్ సింగ్‌కు కాంస్య పతకాలు లభించాయి. అంతకుముందు క్వాలిఫయింగ్ రౌండ్‌లో 125 పాయింట్లకుగానూ 122 పాయింట్లు సాధించిన అభయ్ సింగ్ అగ్రస్థానంలో నిలవగా... 119 పాయింట్లు సాధించి నాలుగో స్థానంతో భవ్‌తేగ్ ఫైనల్‌కు అర్హత సాధించాడు. దీంతో పాటు మంగళవారం భారత్ ఖాతాలో మరో మూడు కాంస్య పతకాలు కూడా చేరాయి. మహిళల 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్, మహిళల స్కీట్ విభాగంలో యశస్వి రాథోడ్, పురుషుల స్కీట్ ఈవెంట్‌లో అభయ్ సింగ్ షెఖాన్ కాంస్యాలు గెలుచుకున్నారు. మహిళల స్కీట్‌లో యశస్వి 38 పాయింట్లతో కాంస్యం గెలుచుకుంది. గియాడా లోంఘీ (ఇటలీ), అడెలా సుపెకోవా (స్లొవకియా) వరుసగా స్వర్ణ, రజతాలు దక్కించుకున్నారు. అంతకుముందు క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో యశస్వి 114 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి తుదిపోరుకు చేరింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో సిమ్రన్‌ప్రీత్ 30 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచి కాంస్యం గెలుచుకుంది. కిమ్ మినెసో (35 పాయింట్లు; కొరియా), ఫొరె హెలోయిస్ (34 పాయింట్లు; ఫ్రాన్స్) వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచారు. ఈ పోటీల్లో 23 దేశాలకు చెందిన 220 మంది షూటర్లు పాల్గొంటున్నారు.

వన్డేలకు మొహమ్మద్ నబీ వీడ్కోలు

చాంపియన్స్ ట్రోఫీ చివరిదన్న ఆల్‌రౌండర్



షార్జా: సుదీర్ఘ కాలంగా అఫ్గానిస్తాన్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్న ఆల్‌రౌండర్ మొహమ్మద్ నబీ... అంతర్జాతీయ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించాడు. వచ్చే ఏడాది జరిగే చాంపియన్స్ ట్రోఫీ తర్వాత వన్డే ఫార్మాట్‌కు వీడ్కోలు పలకనున్నట్లు నబీ మంగళవారం వెల్లడించాడు. బంగ్లాదేశ్‌తో వన్డే సిరీస్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచిన 39 ఏళ్ల నబీ... మ్యాచ్ ముగిసిన తర్వాత తన నిర్ణయం ప్రకటించాడు. 'గత ఏడాది వన్డే ప్రపంచకప్ ముగిసినప్పటి నుంచి దీని గురించి ఆలోచిస్తున్నా. కానీ మా జట్టు చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించింది. దీంతో ఆ టోర్నీ ఆడాలనుకున్నా. అది ముగిసిన తర్వాత వన్డేల నుంచి తప్పుకుంటా' అని నబీ అన్నాడు. ఇప్పటి వరకు జాతీయ జట్టు తరఫున 167 వన్డేలు ఆడిన నబీ... 27.48 సగటుతో 3,600 పరుగులు చేయడంతో పాటు 172 వికెట్లు పడగొట్టాడు. 2009లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన నబీ... 2 సెంచరీలు, 17 అర్ధశతకాలు తన పేరిట రాసుకున్నాడు. గత ఏడాది భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో చక్కటి ప్రదర్శన కనబర్చిన అఫ్గానిస్తాన్ జట్టు... ఆరో స్థానంలో నిలవడం ద్వారా తొలిసారి చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించింది.

మెద్వెదెవ్ విజయం

- అలెక్స్ డి మినార్‌పై గెలుపు
- ఏటీపీ ఫైనల్స్ టోర్నీ



ట్యూరిన్ (ఇటలీ): టాప్ టెన్నిస్ స్టార్ల మధ్య జరుగుతున్న ఏటీపీ ఫైనల్స్ టోర్నమెంట్‌లో రష్యా ప్లేయర్ డానిల్ మెద్వెదెవ్ రెండో లీగ్ మ్యాచ్‌లో గెలిచి గట్టెక్కాడు. మంగళవారం జరిగిన పోరులో మెద్వెదెవ్ 6–2, 6–4తో అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. ఆదివారం జరిగిన పోరులో వరుస సెట్లలో టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) చేతిలో కంగుతిన్న రష్యన్ స్టార్ ఈ సారి ఆ పొరపాటు చేయలేదు. ఆరంభం నుంచే తన రాకెట్‌కు పదును పెట్టిన మెద్వెదెవ్ ఆస్ట్రేలియా ప్రత్యర్థిపై అలవోక విజయం సాధించాడు. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) టాప్–8 ర్యాంకింగ్ ప్లేయర్లను గ్రూపులో నలుగురు చొప్పున విభజించి రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో ఈ సీజన్ ముగింపు టోర్నీని నిర్వహిస్తారు. ఒక్కో గ్రూప్ నుంచి తొలిరెండు స్థానాల్లో నిలిచిన ఆటగాళ్లు సెమీఫైనల్స్‌కు అర్హత సంపాదిస్తారు. గురువారం జరిగే పోటీల్లో సినెర్‌తో మెద్వెదెవ్, ఫ్రిట్జ్‌తో డి మినార్ తలపడతారు. మరో గ్రూప్ మ్యాచ్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) 6–4, 6–4తో రుబ్లెవ్ (రష్యా)పై గెలుపొందాడు. డబుల్స్ పోరులో ఏడో సీడ్ హ్యారి హెలియోవార (ఫిన్లాండ్)–హెన్రీ ప్యాటెన్ (బ్రిటన్) జోడీ 7–6 (8/3), 7–5తో ఆస్ట్రేలియాకు చెందిన ఐదో సీడ్ జోర్డాన్ థాంప్సన్–మ్యాక్స్ పుర్సెల్ జంటపై గెలుపొందింది.

దక్షిణాఫ్రికాలో చాంపియన్స్ ట్రోఫీ!

న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చాంపియన్స్ ట్రోఫీ వేదిక విషయంలో తర్జన భర్జన పడుతోంది. షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పాకిస్తాన్ వేదికగా ఈ టోర్నీ జరగాల్సి ఉండగా... పాకిస్తాన్‌లో ఆడేందుకు భారత జట్టు నిరాకరించడంతో ఇప్పుడు వేదికను మార్చేందుకు ఐసీసీ ప్రయత్నాలు చేస్తోంది. హైబ్రిడ్ మోడల్ (భారత్ ఆడే మ్యాచ్‌లు తటస్థ వేదికపై నిర్వహించే విధంగా)కు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సుముఖంగా లేదు. దీంతో ప్రత్యామ్నాయంగా దక్షిణాఫ్రికాలో టోర్నీ నిర్వహించాలని ఐసీసీ యోచిస్తున్నట్లు సమాచారం. తమ దేశంలో భద్రత విషయంలో ఐసీసీకి పీసీబీ నచ్చజెప్పినా పెద్దగా ఫలితం లేనట్లు కనిపిస్తోంది. ఇటీవల తమ దేశంలో ఇంగ్లండ్, న్యూజిలాండ్ పర్యటించాయని ఐసీసీకి పీసీబీ వివరణ ఇచ్చిన ఫలితం సానుకూలంగా రానట్లు సమాచారం. గత ఏడాది ఆసియా కప్ సమయంలోనూ పాకిస్తాన్‌లో మ్యాచ్‌లు ఆడేందుకు భారత్ అంగీకరించకపోవడంతో టీమిండియా ఆడే మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహించారు. ఇప్పుడు అదే రీతిలో మ్యాచ్‌లు నిర్వహించేందుకు పీసీబీ సుముఖత వ్యక్తం చేయడం లేదు. ఇలాంటి దశలో దక్షిణాఫ్రికాలో చాంపియన్స్ ట్రోఫీ నిర్వహించే దిశగా ఐసీసీ యోచిస్తోంది.

'బౌన్సీ పిచ్‌పై జురేల్ బ్యాటింగ్ భళా'

ధ్రువ్‌పై టిమ్ పైన్ ప్రశంసలు


జురేల్


టిమ్ పైన్

సిడ్నీ: ఆస్ట్రేలియా గడ్డపై అనధికారిక టెస్టు మ్యాచ్‌లో రెండు అర్ధశతకాలతో ఆకట్టుకున్న భారత వికెట్ కీపర్ ధ్రువ్ జురేల్... 'బోర్డర్–గావస్కర్' సిరీస్ తుది జట్టులో చోటు దక్కించుకుంటాడని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ టిమ్ పైన్ ఆశాభావం వ్యక్తం చేశాడు. బౌన్సీ పిచ్‌లపై మెరుగైన ప్రదర్శన చేసిన ధ్రువ్ జురెల్ ఆసీస్‌తో సిరీస్‌లో ఆడకపోతే తాను ఆశ్చర్యపోతానని వెల్లడించాడు. ప్రతిష్టాత్మక సిరీస్‌కు ముందు ఆస్ట్రేలియా పిచ్‌పై అవగాహన కోసం భారత్ 'ఎ', ఆస్ట్రేలియా 'ఎ' జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల అనధికారిక టెస్టు సిరీస్ నిర్వహించారు. ఇందులో పలువురు భారత జట్టు ఆటగాళ్లు బరిలోకి దిగగా... రెండో మ్యాచ్‌లో కేఎల్ రాహుల్, ధ్రువ్ జురేల్ కూడా ఆడారు. ఈ పోరులో చక్కటి ఆటతీరు కనబర్చిన 23 ఏళ్ల ధ్రువ్ జురెల్... బౌన్సీ వికెట్‌పై పేసర్లను సమర్థంగా ఎదుర్కొని తొలి ఇన్నింగ్స్‌లో 80, రెండో ఇన్నింగ్స్‌లో 68 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా 'ఎ' జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ టిమ్ పైన్... ధ్రువ్ బ్యాటింగ్‌పై ప్రశంసలు కురిపించాడు. 'ఆస్ట్రేలియా పిచ్‌లపై అతడి బ్యాటింగ్ శైలి చూసిన తర్వాత బోర్డర్–గావస్కర్ సిరీస్ తుది జట్టులో అతడు ఆడకపోతే ఆశ్చర్యపోవాల్సిందే. ధ్రువ్ ఇప్పటి వరకు ఆడిన మూడు టెస్టుల్లోనూ ఆకట్టుకున్నాడు. ప్రస్తుతం అతడి ఆటతీరు చూస్తుంటే... సహచర ఆటగాళ్ల కంటే ఎంతో మెరుగ్గా కనిపిస్తోంది. ఆసీస్ పిచ్‌లపై రాణించాలంటే పేస్‌ను, బౌన్స్‌ను ఎదుర్కోవడం తెలిసి ఉండాలి. అది ధ్రువ్‌లో చూశాను. సాధారణంగా భారత జట్టు ఆటగాళ్ల ప్రదర్శన కన్నా అతడు మెరుగైన షాట్ సెలెక్షన్‌తో ఆకట్టుకున్నాడు. మెల్‌బోర్న్ పిచ్‌పై అతడు చేసిన పరుగులు చాలా విలువైనవి. ఆసీస్ పేసర్లను ఎదుర్కోవడం అంత సులువు కాకపోయినా... జురేల్‌లో ఆ సత్తా ఉందని మాత్రం చెప్పగలను. రిషబ్ పంత్ రూపంలో టీమిండియాకు అత్యుత్తమ వికెట్ కీపర్ అందుబాటులో ఉన్నా... కనీసం ప్లేయర్‌గానైనా ధ్రువ్ భారత జట్టులో ఉంటాడని అనుకుంటున్నా' అని పైన్ అన్నాడు. ఈ ఏడాది ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ సందర్భంగా అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ధ్రువ్ జురెల్... కొన్ని చక్కటి ఇన్నింగ్స్‌లు ఆడాడు. అయితే ప్రమాదం నుంచి కోలుకొని రిషబ్ పంత్ తిరిగి జట్టులోకి రావడంతో జురేల్‌కు తుదిజట్టులో చోటు దక్కడం కష్టంగా మారింది. ఇటీవల న్యూజిలాండ్‌తో సిరీస్‌లోనూ జురేల్ జట్టులో ఉన్నప్పటికీ మ్యాచ్ ఆడే అవకాశం మాత్రం రాలేదు. ఆస్ట్రేలియాతో ప్రతిష్టాత్మక సిరీస్‌కు ముందు ఆడిన అనధికారిక టెస్టులో రాణించడంతో ధ్రువ్‌ను తుది జట్టులోకి తీసుకోవాలనే వాదన బలంగా వినిపిస్తోంది. ఇదే జరిగితే మిడిలార్డర్‌లో నిలకడ లేమితో ఇబ్బంది పడుతున్న సర్ఫరాజ్ ఖాన్‌కు బదులు ధ్రువ్ జురెల్ జట్టులో చోటు దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి.

పాక్‌లో అంధుల ప్రపంచకప్...
ఆడేందుకు అనుమతించండి

కేంద్రానికి భారత అంధుల జట్టు వినతి

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌లో వచ్చే ఏడాది జరిగే చాంపియన్స్ ట్రోఫీ ఆడేందుకు టీమిండియా నిరాకరిస్తుండగా... మరోవైపు అంధుల టి20 ప్రపంచకప్ ఆడేందుకు అనుమతించాలని డిఫెండింగ్ చాంపియన్ భారత అంధుల క్రికెట్ జట్టు కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) కోసం కేంద్ర క్రీడా శాఖ, హోం శాఖ, విదేశీ వ్యవహారాల శాఖలకు దరఖాస్తు చేసుకుంది. లాహోర్, ముల్తాన్ వేదికలపై ఈ నెల 22 నుంచి వచ్చే నెల 3 వరకు అంధుల ప్రపంచకప్ టోర్నమెంట్ జరుగుతుంది. 17 సభ్యులు గల భారత జట్టుకు క్రీడాశాఖ తమ ఆమోదం తెలుపుతూ ఎన్‌ఓసీని జారీ చేసింది. అయితే హోం, విదేశీ వ్యవహారాల శాఖ నుంచి ఆమోదం రాకపోవడంతో జట్టు నిరీక్షిస్తుంది. భారత ప్రభుత్వం అనుమతించి, అంతా అనుకున్నట్లు జరిగితే వాఘా సరిహద్దు గుండా భారత అంధుల క్రికెట్ జట్టు ఈ నెల 21న పాకిస్తాన్‌కు బయల్దేరనుంది. కాగా... వచ్చే ఏడాది పాక్ ఆతిథ్యమిచ్చే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీలో టీమిండియా హైబ్రిడ్ మోడల్ అయితేనే ఆడతామని స్పష్టం చేసింది. అంటే భారత్ ఆడే మ్యాచ్‌ల్ని తటస్థ వేదికపై నిర్వహిస్తేనే ఆడతామని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి స్పష్టమైన సమాచారమిచ్చింది. అయితే ఆతిథ్యాన్ని అయినా వదులుకుంటాం కానీ హైబ్రిడ్ పద్ధతిలో టోర్నీ నిర్వహించబోమని పాకిస్తాన్ బోర్డు (పీసీబీ) పట్టుదలకు పోతోంది. దీంతో ఈ టోర్నీపై సందిగ్ధత కొనసాగుతోంది. ఆతిథ్య హక్కులు పాక్ వదులుకుంటే ఐసీసీ... దక్షిణాఫ్రికాకు తరలించే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేస్తోంది.

'డెత్ ఓవర్లలో బౌలింగ్ కత్తి మీద సామే'

భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్



సెంచూరియన్: పరిస్థితులకు తగ్గట్లు తన బౌలింగ్‌ను మార్చుకుంటూ ముందుకు సాగుతున్నానని భారత యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ అన్నాడు. దక్షిణాఫ్రికాతో టి20 సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్న అర్ష్‌దీప్... ఒత్తిడిలో బౌలింగ్ చేయడాన్ని ఇష్టపడతానని వెల్లడించాడు. 2022లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన అర్ష్‌దీప్ ఇప్పటి వరకు జాతీయ జట్టు తరఫున 58 టి20 మ్యాచ్‌లు ఆడి 89 వికెట్లు పడగొట్టాడు. 'స్పష్టమైన గేమ్ ప్లాన్‌తో మైదానంలో అడుగుపెడతా. పరిస్థితులకు తగ్గట్లు దాన్ని మార్చుకుంటూ ఉంటా. జట్టుకు ఏం అవసరమో దాన్ని గుర్తిస్తా. వికెట్లు తీయడం ముఖ్యమా... లేక పరుగులు నియంత్రించాల అనేది చూసి బౌలింగ్‌లో మార్పులు చేసుకుంటా. డెత్ ఓవర్లలో బౌలింగ్ చేయడం కత్తిమీద సాము లాంటిది. ప్రతిసారి మనం అనుకున్న ఫలితం రాదు. అయినా దాని గురించి అతిగా ఆలోచించను. ఆరంభంలో రెండు ఓవర్లు వేసి మళ్లీ చివర్లో రెండు ఓవర్లు వేయడం మధ్య చాలా సమయం దక్కుతుంది. ఆ లోపు జట్టుకు ఏం కావాలో అర్థం అవుతుంది. రోజు రోజుకు మెరుగవడంపైనే ప్రధానంగా దృష్టి పెడతా. ఇటీవలి కాలంలో బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లో కూడా జట్టుకు సహాయ పడేందుకు ప్రయత్నిస్తున్నా. భారీ షాట్లు ఆడటం ఇష్టమే. నెట్స్‌లో కేవలం బౌలింగ్‌పైనే కాకుండా బ్యాటింగ్, ఫీల్డింగ్‌పై కూడా దృష్టి పెట్టా. ఆ దిశగా కష్టపడుతున్నా. బుమ్రాతో కలిసి బౌలింగ్ చేయడాన్ని బాగా ఆస్వాదిస్తా. అతడి లాంటి బౌలర్ మరో ఎండ్ నుంచి ఒత్తిడి పెంచుతుంటే వికెట్లు తీయడం చాలా సులువవుతుంది. మ్యాచ్‌పై పట్టు కొనసాగించడం ముఖ్యం. అది ప్రారంభ ఓవర్ అయినా... లేక చివరి ఓవర్ అయినా ఒకే విధంగా ఆలోచిస్తా' అని అర్ష్‌దీప్ వివరించాడు. పొట్టి ఫార్మాట్‌లో ప్రమాదక బౌలర్‌గా ఎదిగిన అర్ష్‌దీప్... జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించడమే తన ప్రధాన లక్ష్యమని వెల్లడించాడు.

వన్డే సిరీస్ అఫ్గానిస్తాన్‌దే

చివరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై విజయం



షార్జా: సమష్టి ప్రదర్శనతో సత్తాచాటిన అఫ్గానిస్తాన్ జట్టు... బంగ్లాదేశ్‌పై వన్డే సిరీస్ కైవసం చేసుకుంది. ఈ ఫార్మాట్‌లో అఫ్గాన్‌కు ఇది వరుసగా మూడో సిరీస్ విజయం కావడం విశేషం. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆఖరి వన్డేలో అఫ్గాన్ 5 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తుచేసింది. ఫలితంగా 2–1తో సిరీస్ చేజిక్కించుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 244 పరుగులు చేసింది. మహ్మదుల్లా (98 బంతుల్లో 98; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) త్రుటిలో సెంచరీ చేజార్చుకోగా... కెప్టెన్ మెహదీ హసన్ మిరాజ్ (119 బంతుల్లో 66; 4 ఫోర్లు) అర్ధ శతకంతో రాణించాడు. అఫ్గానిస్తాన్ బౌలర్లలో అజ్మతుల్లా 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో అఫ్గాన్ 48.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 246 పరుగులు చేసింది. ఓపెనర్ రహమానుల్లా గుర్బాజ్ (120 బంతుల్లో 101; 5 ఫోర్లు, 7 సిక్సర్లు) భారీ సిక్సర్లతో విరుచుకుపడి సెంచరీ పూర్తి చేసుకోగా... అజ్మతుల్లా (77 బంతుల్లో 70 నాటౌట్; 3 ఫోర్లు, 5 సిక్సర్లు) హాఫ్ సెంచరీ నమోదు చేసుకున్నాడు. చివర్లో మొహమ్మద్ నబీ (34 నాటౌట్; 5 ఫోర్లు) కీలక పరుగులు చేశాడు. బంగ్లా బౌలర్లలో నహీద్ రాణా, ముస్తఫిజుర్ రహమాన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన అజ్మతుల్లాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', మొహమ్మద్ నబీకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

కోట్లు పలికిన ప్రతిమ

విలువ తెలియక తలుపు అడ్డుగా వాడుకున్న జనం ● అరుదైన శిల్పానికి చివరకు అసలైన ఆదరణ



హైదరాబాద్ సంస్థానాన్ని పాలించిన నిజాం ప్రభువు మహబూబ్ అలీఖాన్ గతంలో కొనుగోలుచేసి దురదృష్టంగా భావించి షూలోపల పడేసిన ప్రపంచ ప్రఖ్యాత జాకబ్ వజ్రాన్ని ఆయన కుమారుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ చాన్నాళ్లు తన టేబుల్‌పై పేపర్‌వెయిట్‌గా వాడారని చరిత్ర చెబుతోంది. అది వందల కోట్ల విలువచేస్తుందని ఆయన తెలీదు. అచ్చం అలాగే కోట్లుపలికే పాలరాతి ప్రతిమను చాలా సంవత్సరాలపాటు బ్రిటన్‌లో ఒక పారిశ్రామికవాడలోని షెడ్డు తలుపు మూసుకుపోకుండా అడ్డుగా వాడారు. చివరకు అది ప్రముఖ శిల్పకారుడు ఎడ్మీ బౌచర్‌డన్ చెక్కిన అద్భుత ప్రతిమ అని తెల్సి ఇప్పుడు ఔత్సాహిక కుబేరుడు కోట్లు పెట్టి కొనేందుకు ముందుకొస్తున్నారు. ఒకాయన ఏకంగా రూ.27 కోట్లు చెల్లించేందుకు సుముఖత చూపడంతో ఈ శిల్పం కథాకమామిషు తెల్సుకునేందుకు అంతా గూగుల్ తల్లి వద్ద సెర్చింగ్‌లు మొదలుపెట్టారు.

ఫ్రాన్స్‌కు చెందిన 15వ లూయిస్ రాజు వద్ద ఆస్థాన శిల్పకారుడైన ఎడ్మీ చౌదర్‌డన్ 18వ శతాబ్దంలో ఈ ప్రతిమను చెక్కారు. బ్రిటన్‌లో భాగమైన స్కాట్లాండ్‌లోని హైల్యాండ్స్ కౌన్సిల్ ప్రాంతంలో ఆనాటి భూస్వామి, రాజకీయనాయకుడు జాన్ గార్డన్.. ఎడ్మీతో తన స్వీయ ప్రతిమను చెక్కించుకున్నాడు.

18వ శతాబ్దంలో చెక్కిన శిల్పం

తర్వాతి కాలంలో ఆయన ఈ ప్రాంతంలో ఇన్వర్‌గార్డన్ పట్టణానికి రూపకల్పనచేశారు. తర్వాత 19వ శతాబ్దంలో ఒక కోట తగలబడిన ఘటనలోనూ ఇది చెక్కుచెదరలేదు. ఆ సంఘటన తర్వాత 1930వ సంవత్సరంలో అదే ఇన్వర్‌గార్డన్ పట్టణ కౌన్సిల్ కేవలం ఐదు పౌండ్లకు కొనుగోలుచేసింది. అయితే తర్వాత అది అదృశ్యమైంది. కేవలం ఐదు పౌండ్ల విలువచేసే శిల్పం ఎక్కడో శిథిలమై ఉంటుందని కౌన్సిల్ సభ్యులు భావించారు. అంతా దానిని మర్చిపోయారు. దశాబ్దాల తర్వాత అంటే 1998లో హైల్యాండ్స్ పారిశ్రామికవాడలోని కర్మాగారం గేటు వద్ద దానిని కౌన్సిల్‌సభ్యురాలు మాక్సిన్ స్మిత్ చూశారు. తలుపు మూసుకుపోకుండా అప్పుడు అడ్డుగా దానిని వాడుతున్నారు. మిలమిల మెరిసిపోతున్న ఈ ప్రతిమకు ఏదో ప్రత్యేకత ఉండి ఉంటుందని భావించి దానిని హైల్యాండ్ కౌన్సిల్ స్థానిక ప్రభుత్వానికి అప్పజెప్పారు. ప్రభుత్వాధికారులు దానిని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శనకు ఉంచారు. తర్వాత దానిని పారిస్ నగరంలోని 'ది లారీస్', లాస్‌ఏంజిల్స్‌లోని 'ది గెట్టీ మ్యూజియం'లోనూ ప్రదర్శించారు. ఆనోటా ఈనోట విన్నాక అది ప్రఖ్యాత శిల్పకారుడు చెక్కిన శిల్పమని స్పష్టమైంది. అరుదైనదికావడంతో అది చాలా విలువైనదని గ్రహించి దానిని స్థానిక ప్రభుత్వం అపహరణకు గురికాకుండా లోపల భద్రపరిచింది.

సహాయక నిధుల కోసం వేలానికి..

విలువైన వస్తువును దగ్గర పెట్టుకోవడం కంటే దానిని విక్రయిస్తే వచ్చే సొమ్ముతో స్థానికుల సంక్షేమ పథకాలను అమలుచేయొచ్చని స్థానిక ప్రభుత్వం భావించింది. అమ్మడానికి సిద్ధమైంది. వచ్చే నిధులను ఇన్వర్‌గార్డన్ కామన్‌గుడ్ ఫండ్ కింద ఖర్చుచేస్తామని చాటింపు వేయించింది. చారిత్రక వస్తువును సొంత ఆస్తిగా భావించి వేలం ఎలా వేస్తారని కొందరు కోర్టుకెక్కారు. దీనిపై హైల్యాండ్స్ టెయిన్ షరీఫ్ కోర్టు తాజాగా తీర్పు చెప్పింది. అది వారసత్వ ఆస్తి కాదని తేల్చిచెప్పింది. ఈలోపే గత ఏడాది అక్టోబర్‌లోనే దానిని రూ.27 కోట్లకు కొంటానని ఒక కుబేరుడు ఆసక్తి చూపించారు. తాజాగా కోర్టు తీర్పుతో ప్రతిమ వేలానికి రంగం సిద్ధమైంది. నవంబర్ ఏడోతేదీన తొలిసారిగా వేలానికి పెట్టారు. రోజు రోజుకూ దీనికి బిడ్డింగ్ ధర పెరుగుతోంది. విషయం తెల్సుకున్న ఆనాటి కౌన్సిల్‌సభ్యురాలు మాక్సిన్ స్మిత్ మీడియాతో మాట్లాడారు. ''నువ్వు తొలిసారి చూసినప్పుడే దానిని మూడోకంటికి తెలీకుండా ఇంటికి పట్టుకుపోతే బాగుండేది. కోటీశ్వరురాలివి అయ్యేదానివి అని నా స్నేహితులు ఇప్పటికీ నన్ను ఆటపట్టిస్తారు''అని ఆమె అన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



ఉత్తచేతుల్తో పంపకూడదు

● వర్ధమాన దేశాలకు సంపన్న దేశాలు వాతావరణమార్పు నిరోధక నిధులివ్వాల్సిందే
● ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ డిమాండ్



బాకు: వాతావరణమార్పుల విపరిణామాలను ఎదుర్కొంటున్న వర్ధమాన దేశాలకు దుష్పరిణామాలను అడ్డుకునే స్థాయిలో నిధులను సమకూర్చాల్సిందేనని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ డిమాండ్‌చేశారు. అజర్‌బైజాన్‌లోని బాకు సిటీలో సోమవారం మొదలైన కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(కాప్) 29 సమావేశాల్లో గుటెరస్ మంగళవారం మాట్లాడారు. ''సంపన్న దేశాలు అత్యధిక శిలాజఇంధనాలను మండిస్తూ కర్బనఉద్గారాలను వెదజల్లుతుంటే అత్యల్ప ఉద్గారాలను వెదజల్లే దేశాలపైనే దాని ప్రభావం ఉంటోంది. ధనిక దేశాలు సమస్యను సృష్టించి జఠిలం చేస్తుంటే పేద, వర్ధమానదేశాలు సమస్య ప్రభావాన్ని తీవ్రంగా ఎదుర్కొంటున్నాయి. సువిశాల రష్యా, అమెరికాలనుద్దేశించి గుటెరస్ విమర్శించారు. సంపన్న దేశాలు ఉద్గారాలను విపరీతంగా వెదజల్లుతున్నా విశాల భూభాగం కారణంగా వాటికెలాంటి ఇబ్బంది కలగట్లేదు. కానీ దాని ప్రభావ వాతావరణమార్పుల కారణంగా చిన్నపేద దేశాల్లో ఆహార అభద్రత, మౌలికవసతుల విధ్వంసంతోపాట జీవవైవిధ్యం దెబ్బతింటోంది. ఇకనైనా వర్ధమానదేశాలకు వాతావరణమార్పు నిరోధక నిధులివ్వాల్సిందే. ఇస్తాం ఇస్తాం అంటూ ఊరిస్తూ కట్టిన ఆశల గోడలను బద్దలుకొట్టాలి. ఈసారి పేదదేశాలను సమావేశాల నుంచి ఉత్తచేతుల్తో పంపకూడదు. సమగ్ర ఒడంబడిక కుదుర్చుకోవాలి. ఒప్పందం కుదురుతుందని బలంగా నమ్ముతున్నా''అని గుటెరస్ అన్నారు.

కొత్త ముసాయిదాపత్రానికి నో చెప్పిన చైనా, జీ77 కూటమి

వర్ధమాన దేశాలకు ఈ మేరకు నిధులు ఇవ్వాలన్న దానిపై రూపొందుతున్న 'నూతన వాతావరణమార్పు నిరోధక సహాయకనిధి లక్ష్యం ముసాయిదా పత్రం'ను జీ77 కూటమి, చైనా వ్యతిరేకించాయి. 130 అభివృద్ధిచెందుతున్న దేశాలు జీ77 కూటమిగా ఏర్పడ్డాయి. తమ దేశాల డిమాండ్లు, ఆకాంక్షలకు తగ్గట్లు ముసాయిదా పత్రం రూపుదిద్దుకోట్లేదని తిరస్కరణ సందర్భంగా జీ77, చైనా చెప్పాయి. వీటికి భావసారుప్యతగల అభివృద్ధిచెందుతున్న దేశాలు(ఎల్‌ఎండీసీ), అభివృద్ధిచెందుతున్న చిన్నద్వీపాల కూటమి, పేదదేశాల కూటమి(ఎల్‌డీసీ), లాటిన్ అమెరికా కరేబియన్ స్వతంత్ర కూటమి(ఏఐఎల్‌ఏసీ) మద్దతు పలికాయి.

భారత మార్కెట్లోకి స్టార్‌లింక్!

● ప్రభుత్వ నియమనిబంధనలను పాటిస్తానని ప్రకటించిన మస్క్ కంపెనీ
● మార్గదర్శకాల్లో భాగంగా యూజర్ల డేటాను భారత్‌లో నిల్వచేయనున్న సంస్థ

న్యూఢిల్లీ: పలు దేశాలకు ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలను అందిస్తున్న ప్రపంచకుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ సంస్థ భారతీయ విపణిలో అడుగుపెట్టేందుకు రంగం సిద్ధంచేసుకుంటోంది. భారత చట్టాల ప్రకారం సంస్థను నడిపేందుకు స్టార్‌లింగ్ ముందుకు వచ్చిందని జాతీయ మీడియాలో వార్తలొచ్చాయి. ప్రభుత్వ సవరించిన నియమనిబంధనల ప్రకారం ఏదైనా విదేశీ కంపెనీ తమ భారతీయ యూజర్ల సమాచారాన్ని దేశీయంగానే నిల్వచేయాల్సి ఉంటుంది. ఇందుకు స్టార్‌లింక్ ఒప్పుకుందని తెలుస్తోంది. ఇప్పటికే కేంద్ర టెలికమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో స్టార్‌లింక్ ప్రతినిధులు పలుమార్లు సమావేశమై చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవల(జీఎంపీసీఎస్) లైసెన్స్ మంజూరుకు అనుసరించాల్సిన విధివిధానాలను పాటిస్తామని సంస్థ తెలిపింది. స్టార్‌లింక్ సంస్థ ఇంకా తమ సమ్మతి పత్రాలను సమర్పించాల్సి ఉంది. సమర్పణ పూర్తయితే సంస్థ కార్యకలాపాలు లాంఛనంగా ప్రారంభంకానున్నాయని తెలుస్తోంది. 2022 అక్టోబర్‌లో జీఎంపీసీఎస్ లైసెన్స్ కోసం స్టార్‌లింక్ దరఖాస్తు చేసుకుంది. ఈ రంగంలోని భారత నియంత్రణసంస్థ ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్(ఇన్–స్పేస్) సంబంధిత అనుమతులను మంజూరుచేయనుంది. ఆలోపు తమ అభ్యంతరాలపై సరైన వివరణ ఇవ్వాలని స్టార్‌లింక్‌ను ఇన్–స్పేస్ కోరింది. స్టార్‌లింక్‌కు పోటీగా మరో ప్రపంచ కుబేరుడు జెఫ్ బెజోస్‌కు చెందిన అమెజాన్ సంస్థలో భాగమైన 'ప్రాజెక్ట్ కూపర్'సంస్థ సైతం జీఎంపీసీఎస్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంది. ఈ రెండు సంస్థల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోందని ఇన్–స్పేస్ చైర్మన్ పవన్ గోయంకా చెప్పారు. భద్రతా నియమాలకులోబడి సంస్థ కార్యకలాపాలు కొనసాగించాల్సి ఉంటుందని కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మంగళవారం అన్నారు. అగ్రరాజ్యాధినేతగా తన సన్నిహితుడు ట్రంప్ బాధ్యతలు స్వీకరిస్తున్న తరుణంలో భారత్‌సహా కీలక శాటిలైట్ ఇంటర్నెట్ సేవల మార్కెట్లలో మెజారిటీ వాటా కైవసంచేసుకోవాలని మస్క్ ఉవ్విళ్లూరుతున్నారు. స్పెక్ట్రమ్ కేటాయింపులు, తుది ధరలపైనే భారత్‌లో స్టార్‌లింక్ భవితవ్యం ఆధారపడిఉంటుంది. భారత ప్రభుత్వం ఇప్పటికే భారతి గ్రూప్‌కు చెందిన వన్‌వెబ్, జియా–ఎస్‌ఈఎస్ సంయుక్త సంస్థ అయిన జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్‌కు లైసెన్సులు ఇచ్చింది. వీటికి ఇంకా స్పెక్ట్రమ్ కేటాయింపులు జరగలేదు. అయితే స్పెక్ట్రమ్ కేటాయింపులకు సంబంధించిన సిఫార్సులకు ట్రాయ్ డిసెంబర్ 15వ తేదీలోపు తుది రూపునివ్వనుంది.

రష్యా, ఉత్తరకొరియా

రక్షణ ఒప్పందం

మాస్కో: రష్యా, ఉత్తర కొరియా రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం శత్రు దేశాల దాడులను ఎదుర్కొనేందుకు అవి పరస్పరం సాయం చేసుకోనున్నాయి. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి గత జూన్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో జరిగిన శిఖరాగ్ర భేటీలో ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధానికి మద్దతుగా రష్యాకు ఉత్తర కొరియా వేలాదిగా సైనికులను పుంపుతోందన్న వార్తలు రావడం తెలిసిందే. 10,000 మందికి పైగా ఉత్తర కొరియా సైనికులు ఉక్రెయిన్ యుద్ధంలో నిమగ్నమయ్యారని అమెరికా పేర్కొనడం తెలిసిందే.

సీఐఎస్ఎఫ్‌లో మహిళల బెటాలియన్

అనుమతి మంజూరు చేసిన హోం శాఖ

న్యూఢిల్లీ: కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, సీఐఎస్ఎఫ్)లో మొట్టమొదటి మహిళా బెటాలియన్ ఏర్పాటుకు కేంద్రం అనుమతి తెలిపింది. పూర్తిగా మహిళలతో కూడిన ఈ బెటాలియన్‌లో వెయ్యి మంది సభ్యులుంటారు. ఇటీవలి కాలంలో విమానాశ్రయాల వంటి కీలక ప్రదేశాలు, ప్రముఖుల భద్రత విధులు సీఐఎస్ఎఫ్‌కు తలకుమించిన భారంగా మారిన నేపథ్యంలో కేంద్ర హోం శాఖ మంగళవారం ఈ నిర్ణయం వెలువరించినట్లు సమాచారం. సీఐఎస్ఎఫ్‌కు మంజూరైన 2 లక్షల మంది బలగాల్లోనే మహిళల రిజర్వుడు బెటాలియన్ కూడా ఉంటుందని ఓ అధికారి తెలిపారు. మొత్తం 1,025 మంది సభ్యులకుగాను సీనియర్ కమాండెంట్ ర్యాంకు అధికారి నాయకత్వం వహిస్తారు. తాజాగా ప్రకటించిన బెటాలియన్ ఎంపిక, శిక్షణ, కేటాయించే విధులకు సంబంధించిన ఏర్పాట్లు మొదలయ్యాయని ఆ అధికారి తెలిపారు. ప్రస్తుతం సీఐఎస్ఎఫ్‌లోని 1.80 లక్షల మందిలో ఏడు శాతం వరకు మహిళలున్నారు.

కబ్జాకోరు వక్ఫ్ బోర్డ్‌లో

మార్పులకు సమయమిదే

జార్ఖండ్ ఎన్నికల ర్యాలీలో హోం మంత్రి అమిత్ షా

ఝరియా/బఘ్మారా: ప్రజల, ఆలయాల భూములను కబ్జా చేసిన వక్ఫ్ బోర్డ్ చట్టంలో మార్పులు చేపట్టాల్సిన సమయం వచ్చిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. జార్ఖండ్‌లో మంగళవారం ఆయన ఎన్నికల ర్యాలీల్లో మాట్లాడారు. 'వక్ఫ్ బోర్డ్ భూ కబ్జాను అలవాటుగా మార్చుకుంది. కర్ణాటకలో ప్రజల ఆస్తుల్ని మింగేసింది. ఆలయాలు, రైతులు, గ్రామస్తుల భూముల్ని ఆక్రమించుకుంది. ఇటువంటి వక్ఫ్ చట్టం నిబంధనల్లో మార్పులు చేయాల్సిన సమయం వచ్చింది. హేమంత్ బాబు(సీఎం హేమంత్ సోరెన్), రాహుల్ గాంధీ వద్దంటున్నారు. మీరు అలాగే అంటూ ఉండండి. బీజేపీ వక్ఫ్ బిల్లును చట్టంగా తెస్తుంది. మమ్మల్ని ఎవరూ ఆపలేరు'అని స్పష్టం చేశారు. చొరబాటుదార్లకు అడ్డుకట్ట వేసే ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) అమలును ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. యూసీసీ నుంచి గిరిజనులను మినహాయింపు కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే అక్రమ చొరబాటుదార్లతో కూడిన రైళ్లను బంగ్లాదేశ్‌కు పంపిస్తామని చెప్పారు. ఓబీసీలకు రిజర్వేషన్లను కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటోందని ఆరోపిస్తూ ఆయన.. రాహుల్ గాంధీ తర్వాత నాలుగు తరాల వారు కూడా ఆ రిజర్వేషన్లను టచ్ చేయలేరన్నారు.

అంతరించిపోతున్న

ఆఫ్రికన్ సవన్నా, ఫారెస్ట్ ఏనుగులు



భూమండలంపై అత్యంత భారీ కాయంతో సంచరించే శాకాహార బాహుబలిగా ఏనుగు మనందరికీ చిరపరిచితం. ఆఫ్రికా ఖండంలోని పీఠభూముల్లో సర్వసాధారణంగా కనిపించే 'సవన్నా', 'అటవీ'జాతి ఏనుగులు అత్యంత వేగంగా అంతర్ధానమవుతున్నాయి. అటవీప్రాంతాల్లో విచ్చలవిడిగా పెరిగిన మానవ కార్యకలాపాలు, విస్తరిస్తున్న వ్యవసాయం, విజృంభిస్తున్న అక్రమ వేటతో ఏనుగుల సంఖ్య భారీగా తగ్గిపోయింది. తాజాగా జరిపిన అధ్యయనం ప్రకారం గత యాభై సంవత్సరాల్లో.. సర్వేచేసిన ప్రాంతాల్లో సవన్నా జాతి ఏనుగుల సంఖ్య 70 శాతం తగ్గిపోయింది. 'ఫారెస్ట్'జాతి ఏనుగుల సంఖ్య ఏకంగా 90 శాతం క్షీణించడం ఏనుగుల ఉనికినే ప్రశ్నార్థకం చేస్తోంది. అయితే కొన్ని ప్రాంతాల్లో ఏనుగుల సంఖ్య పెరగడం ఒకింత ఉపశమనం కల్పిస్తోంది.

అత్యంత తెలివి

అత్యంత తెలివితేటలతోపాటు మానవునిలా సామూహికంగా జీవించే నైపుణ్యమున్న వన్యప్రాణిగా ఏనుగు పేరొందింది. 1964 నుంచి 2016 సంవత్సరం దాకా ఆఫ్రికా ఖండంలోని 37 దేశాల్లోని 475 భిన్న ప్రదేశాల్లో ఏనుగుల జాడపై విస్తృతస్థాయి గణన, పరిశోధన చేశారు. ఇటీవలి దశాబ్దాల్లో ఇంతటి విస్తృత సర్వే చేపట్టడం ఇదే తొలిసారి. సంబంధిత నివేదిక సోమవారం వెల్లడైంది. దీనిలో దిగ్భ్రాంతికర వాస్తవాలు వెలుగుచూశాయి. సవన్నా, ఫారెస్ట్ జాతి ఏనుగుల సంఖ్య సగటున ఏకంగా 77 శాతం తగ్గిపోయింది. విడిగా చూస్తే సవన్నా జాతి 70 శాతం, ఫారెస్ట్ జాతి సంఖ్య 90 శాతం తగ్గిపోయింది. ఒకప్పుడు గుంపులగుంపులుగా కనిపించిన కొన్ని ప్రాంతాల్లో ఇప్పుడు అవి ఒక్కటికూడా లేవని సర్వేలో తేలింది. అయితే కొన్ని చోట్ల స్థానిక ప్రభుత్వాల పరిరక్షణ చర్యలతో వాటి సంఖ్య పెరిగిందని నివేదిక పేర్కొంది. ''తగ్గిపోయిన సంఖ్యను ఎలాగూ పెంచలేము. ఉన్న ఏనుగుల సంఖ్యా వేగంగా క్షీణిస్తోంది. మాలి, చాద్, నైజీరియా వంటి దేశాల్లో మరీ దారుణంగా పడిపోయింది''అని కొలరాడో స్టేట్ వర్సిటీలో వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ విభాగ ప్రొఫెసర్ జార్జ్ విటిమర్ చెప్పారు.

కొన్ని చోట్ల మెరుగైన పరిస్థితులు

ఆఫ్రికా ఖండం దక్షిణ దేశాల్లో కొన్ని ప్రాంతాల్లో ఎంతో శ్రమకోర్చి ఏనుగుల సంతతిని కాపాడుతున్నారు. ప్రభుత్వాల చొరవ, స్థానికుల అండతో ఏనుగుల సంఖ్య అక్కడ పెరిగింది. బొట్స్వానా, జింబాబ్వే, నమీబియాలో ఇప్పటికే వాటి సంఖ్య భారీగానే ఉంది. ''కొన్ని చోట్ల మనం విజయం సాధించాం. ఈ విషయంలో మనకు మనం శెభాష్ చెప్పకోవాల్సిందే. అయితే ఇంకా ఏఏ ప్రాంతాల్లో విజయావకాశాలు ఉన్నాయో కనిపెట్టి కార్యసాధకులం కావాల్సిన తరుణమొచ్చింది''అని ప్రొఫెసర్ జార్జ్ విటిమర్ అన్నారు.

ఏనుగు దంతాలపై మోజుతో..

చాలా పొడవుండే ఆఫ్రికన్ ఏనుగుల దంతాలకు అంతర్జాతీయ మార్కెట్లో చాలా విలువ ఉంది. వీటి కోసమే వేటగాళ్లు ఏనుగులను చంపేస్తున్నారు. వేటగాళ్లను అడ్డుకోగలిగితే ఈ వన్యప్రాణులను కాపాడవచ్చని జంతుప్రేమికులు చెబుతున్నారు. అడవుల్లో పెరుగుతున్న వ్యవసాయం కారణంగా ఏనుగులు తమ ఆవాసాలను, ఆహార వనరులను కోల్పోతున్నాయి. ''అడవుల విస్తరణకు ఏనుగులు మూలాధారం. ఎన్నో రకాల చెట్ల కాయలు, పండ్లను తింటూ వాటి గింజలను జీర్ణంచేయకుండా వేర్వేరు చోట్ల విసర్జించి కొత్త మొక్కల అంకురార్పణకు ఆజ్యం పోస్తాయి. నిత్యం వనవృద్ధి కార్యం చేసే ఏనుగుల సంఖ్య తగ్గడం భూమాతకు తీరని శోకం''అని సౌత్ ఆఫ్రికాలోని నెల్సన్ మండేలా యూనివర్సిటీలోని ఆఫ్రికన్ కన్జర్వేషన్ ఎకాలజీ అధ్యయనకారుడు, నివేదిక సహరచయిత డేవ్ బల్ఫోర్ ఆందోళన వ్యక్తంచేశారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

నిబంధనల మేరకే నేతల

హెలికాప్టర్లలో సోదాలు

ఉద్ధవ్ ఠాక్రే బ్యాగేజీ తనిఖీపై ఈసీ వర్గాల వివరణ

న్యూఢిల్లీ: శివసేన(ఉద్ధవ్)చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే తన బ్యాగును ఎన్నికల అధికారులు తనిఖీ చేయడాన్ని ప్రశ్నించిన ఉదంతంపై ఎన్నికల కమిషన్ స్పందించింది. ఎన్నికల వేళ ప్రామాణిక నియమావళి(ఎస్‌వోపీ) మేరకే వివిధ రాజకీయ పార్టీల అగ్ర నేతలు ప్రయాణించే విమానాలు, హెలికాప్టర్లలో తనిఖీలు చేపడుతున్నట్లు ఈసీ వివరించింది. గత ఎన్నికల సమయంలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్‌షాలు ప్రయాణించిన విమానాలు, హెలికాప్టర్లలో సోదాలు జరిపినట్లు ఈసీ గుర్తు చేసింది. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఏప్రిల్ 24న బిహార్‌లోని భాగల్పూర్‌లో బీజేపీ చీఫ్ నడ్డా హెలికాప్టర్‌ను, ఏప్రిల్ 21న కటిహార్‌లో హోం మంత్రి అమిత్‌ షా హెలికాప్టర్‌లోనూ ఎస్‌ఓపీ ప్రకారం సోదాలు చేపట్టినట్లు ఈసీ వివరించింది. ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు అన్ని పార్టీల నేతలు ప్రయాణించే హెలికాప్టర్లను చెక్ చేయాలంటూ ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఇచ్చిన ఆదేశాలను యంత్రాంగం అమలు చేస్తోందని ఈసీ వివరించింది. సోమవారం మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లాలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఉద్ధవ్ ఠాక్రే బ్యాగును ఎన్నికల అధికారులు సోదా చేయడం, దీనిపై ఆయన ప్రధాని మోదీ, ఇతర సీనియర్ నేతల లగేజీని తనిఖీ చేస్తారా అంటూ వారిని ప్రశ్నించడం తెలిసిందే.

షారుఖ్‌ను చంపేస్తానంటూ

బెదిరించిన లాయర్ అరెస్ట్

రాయ్‌పూర్(ఛత్తీస్‌గఢ్): బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్‌ను చంపేస్తానంటూ హెచ్చరించిన ఛత్తీస్‌గఢ్‌కు చెందిన లాయర్‌ను ముంబై పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. రూ.50 లక్షలు ఇవ్వకుంటే షారుఖ్‌ను చంపుతానంటూ ఈ నెల 5న ముంబైలోని బాంద్రా పోలీసుల వాట్సాప్ నంబర్‌కు మెసేజీ అందింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌కు చెందిన ఫైజాన్ ఖాన్ అనే లాయర్ పేరుతో రిజిస్టరయిన ఫోన్ నుంచి ఆ బెదిరింపు అందినట్లు గుర్తించారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన బాంద్రా పోలీసులు ఈ నెల 7న ఛత్తీస్‌గఢ్ వెళ్లి ఫైజాన్ ఖాన్‌ను రెండు గంటలపాటు ప్రశ్నించింది. ఆ ఫోన్‌ను ఈ నెల 2న పోగొట్టుకున్నానని, ఈ మేరకు పాండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఫైజాన్ వివరించాడు. బాంద్రా పోలీసులు మంగళవారం రాయ్‌పూర్‌కు చేరుకుని ఫైజాన్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పాండ్రి పోలీసులకు సమాచారమందించారు. ఈ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు ఫైజాన్‌ను ప్రశ్నించాల్సి ఉందంటూ రాయ్‌పూర్ కోర్టుకు విన్నవించారు. కోర్టు మంజూరు చేసిన ట్రాన్సిట్ రిమాండ్‌తో అతడిని ముంబై తరలించారు. మరో బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు ఇటీవల లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో పలుమార్లు బెదిరింపులు రావడం తెలిసిందే.

బీజేపీని కుక్కను చేసే సమయమిదే

మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ పటోలె వివాదాస్పద వ్యాఖ్యలు

అకోలా: బీజేపీని కుక్కను చేసే అవకాశం వచ్చిందంటూ ఓటర్లను రెచ్చగొట్టిన మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలె చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. అకోలాలో సోమవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో నానా పటోలె మాట్లాడారు. 'ఇతర వెనుకబడిన కులాల వారిని కుక్కలంటూ పేర్కొనడం బీజేపీ అహంకారానికి నిదర్శనం. అలాంటి వారికి మీరు ఓటేస్తారా? బీజేపీనే కుక్కను చేసే అవకాశం ఇప్పుడు మీముందుకు వచ్చింది'అని పేర్కొన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ సమాజంలో విభజనలు తెచ్చేందుకు బీజేపీ యత్నిస్తోందని ఆరోపించారు. మహారాష్ట్రలో మార్పు మొదలైందని, డిప్యూటీ సీఎం ఫడ్నవీస్ మొదటిసారిగా ఓటమి చవిచూడబోతున్నారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిస్పృహతో ఉన్నాయనేందుకు ఈ వ్యాఖ్యలే అద్దం పడుతున్నాయని బీజేపీ నేత కిరీట్ సోమయ్య తిప్పికొట్టారు. ఈ ఎన్నికల్లో తమ మహాయుతి ఘన విజయం ఖాయమన్నారు.

బంగ్లాదేశీ అక్రమ చొరబాట్లపై

ఈడీ సోదాలు

జార్ఖండ్, పశ్చిమబెంగాల్‌లో విస్తృత తనిఖీలు

రాంచీ: బంగ్లాదేశ్ జాతీయులు అక్రమంగా జార్ఖండ్, పశ్చిమబెంగాల్‌లోకి చొరబడిన కేసులో మనీలాండరింగ్ కోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టింది. రెండు రాష్ట్రాల్లోని 17 ప్రాంతాల్లో రాంచీశాఖ ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తొలిదఫా పోలింగ్‌కు ఒక్కరోజు ముందు ఇలా ఈడీ రంగంలోకి దిగడం గమనార్హం. రాంచీలోని హోటల్, రిసార్టులలోనూ సోదాలు కొనసాగాయి. బంగ్లాదేశీ మహిళలను జార్ఖండ్‌లోకి తరలిస్తూ కొందరు అక్రమంగా డబ్బు సంపాదిస్తున్న ఉదంతం గతంలో వెలుగుచూసింది. దీంతో జూన్‌లో రాంచీ పోలీసులు ఒక కేసు నమోదుచేయగా దానిలో మనీలాండరింగ్ కోణంలో సెప్టెంబర్‌లో ఈడీ విడిగా కేసు నమోదుచేసి దర్యాప్తు మొదలెట్టడం తెల్సిందే. అక్రమచొరబాట్లు ఎక్కువవడంతో జార్ఖండ్‌లో జనసంఖ్య పెరిగి సంథాల్ పరగణ, కొల్హాన్ రీజియన్‌లలో స్థానిక గిరిజనుల ప్రయోజనాలకు విఘాతం ఏర్పడుతోందని ఇటీవల ప్రచారసభల్లో ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తంచేయడం తెల్సిందే. మయన్మార్ రోహింగ్యా ముస్లింలకు, బంగ్లాదేశ్ చొరబాటుదారులకు జార్ఖండ్‌ముక్తిమోర్చా సర్కార్ జార్ఖండ్‌ను ధర్మసత్రంగా మార్చిందని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆగ్రహంవ్యక్తంచేశారు.

కశ్మీర్‌లో 119 మంది ఉగ్రవాదులు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో చురుగ్గా వ్యవహరించే ఉగ్రవాదులు ఎందరన్న దానిపై నిఘా వర్గాలు ఒక అంచనాకు వచ్చాయి. మొత్తం 119 మంది ఉగ్రవాదులు హింసాత్మక కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు తేల్చాయి. ఉగ్రవాదుల ఉనికి, వారి కార్యకలాపాల తీవ్రత, కొత్త వారిని చేర్చుకుంటున్న తీరును బట్టి నిఘా వర్గాలు ఈ మేరకు అంచనాకు వచ్చినట్లు సమాచారం. మొత్తం 119 మందిలో పీర్ పంజాల్ పర్వత శ్రేణుల్లోని ఉత్తర ప్రాంతంలో 79 మంది ఉండగా వీరిలో 16 మంది స్థానికులు కాగా, 61 మంది విదేశీయులని తేలింది. పర్వత శ్రేణుల దక్షిణ భాగంలో చురుగ్గా వ్యవహరిస్తున్న 40 మంది ముష్కరుల్లో ఏకంగా 34 మంది విదేశీయులు కాగా, ఆరుగురు మాత్రమే స్థానికంగా ఎంపికైన వారిగా నిఘా వర్గాలు గుర్తించాయి.

జెయింట్ వీల్‌లో జుత్తు ఇరుక్కుని..

కన్నౌజ్: ఎగ్జిబిషన్‌లో సరదాగా జెయింట్ వీల్ ఎక్కిన ఓ బాలికకు భయంకరమైన అనుభవం ఎదురైంది. ఆమె జుత్తు అనూహ్యంగా జెయింట్ వీల్ రాడ్‌లో చిక్కుకుని తీవ్రంగా గాయపడింది. యూపీలో చోటుచేసుకున్న ఈ ఘటన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కన్నౌజ్‌కు చెందిన ధర్మేంద్ర కథేరియా కుమార్తె అనురాధ(14) శనివారం సాయంత్రం స్థానికంగా జరుగుతున్న ఎగ్జిబిషన్‌కు వెళ్లింది. అక్కడున్న జెయింట్ వీల్ ఎక్కింది. ఆమె పొడవాటి జుత్తు అనుకోకుండా వీల్ రాడ్‌లో చిక్కుకుని మెలిదిరిగింది. ఆ తీవ్రతకు ఆమె కపాలం సహా జుత్తు రాడ్‌కు చుట్టుకుపోయింది. తీవ్రంగా గాయపడిన అనురాధ ప్రస్తుతం లక్నోలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని ఇంటెన్సివ్ కేర్ విభాగంలో చికిత్సపొందుతోంది. ధర్మేంద్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన జరిగినప్పటి నుంచి కనిపించకుండా పోయిన జెయింట్ వీల్ నిర్వాహకుడి కోసం గాలిస్తున్నారు.

కుమారస్వామికి క్షమాపణ చెప్పిన కాంగ్రెస్ నేత

మైసూరు: కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామినినల్లన్న అంటూ హేళనగా మాట్లాడిన కాంగ్రెస్ నేత, కర్ణాటక మంత్రి జమీర్ ఖాన్ వెనక్కి తగ్గారు. తన వ్యాఖ్యతో జేడీఎస్ శ్రేణులు బాధపడితే క్షమాపణ కోరుతున్నానన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడారు. 'కుమారస్వామితో నాకు ఏళ్ల నుంచి సన్నిహిత సంబంధాలున్నాయి. ఆయన నన్ను పొట్టివాడు (కుళ్లన్న) అంటే, నేను నల్లన్న(కరియన్న) అని పిలిచేవాడిని. అలాగే పిలుచుకోవడం మాకు ఎప్పటి నుంచో అలవాటు. నా మాటలతో జేడీఎస్ కార్యకర్తలకు ఇబ్బంది కలిగితే క్షమాపణ కోరుతున్నా'అని జమీర్ ఖాన్ అన్నారు.

సాక్షి ప్లస్
బుధవారం । 13-11-2024

రాజ్యాంగ సవరణ విధానం

భారత రాజ్యాంగం 1950, జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చింది. ఆపై అనేక రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టగా, ఇప్పటివరకు పార్లమెంటు ఆమోదం పొంది, 106 రాజ్యాంగ సవరణలు జరిగాయి. రాజ్యాంగాన్ని పరిస్థితులకు అనుగుణంగా మార్చడం ఎంతైనా అవసరం. దీన్ని గుర్తించిన భారత రాజ్యాంగ నిర్మాతలు తదనుగుణంగా రాజ్యాంగ సవరణ విధానాన్ని రూపొందించారు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

'పరిణామరహితంగా, జడత్వంగా ఉండే ఏ రాజ్యాంగమైనా ముందు తరాల వారికి గుదిబండే' -జవహర్‌లాల్ నెహ్రూ

భారత రాజ్యాంగాన్ని ఆర్టికల్-368 ప్రకారం సవరించొచ్చు. వీటి గురించి రాజ్యాంగంలోని 20వ భాగంలో పొందుపరిచారు. రాజ్యంగ సవరణ విధానాన్ని దక్షిణాఫ్రికా రాజ్యాంగం నుంచి గ్రహించారు.

రాజ్యాంగ సవరణ

- రాజ్యాంగ సవరణ బిల్లును సంబంధిత మంత్రి లేదా సాధారణ సభ్యుడు పార్లమెంటు (ఏ సభలోనైనా)లో ప్రవేశపెట్టొచ్చు.
- పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించిన తర్వాత రాష్ట్రపతి సంతకంతో రాజ్యాంగ సవరణ బిల్లు చట్టంగా మారుతుంది.
- కొన్ని ముఖ్య రాజ్యాంగ సవరణలకు రాష్ట్ర అసెంబ్లీల ఆమోదం తప్పనిసరి.
- రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టేందుకు రాష్ట్రపతి అనుమతి అవసరం లేదు.
- పార్లమెంటు ఆమోదించిన రాజ్యాంగ సవరణ బిల్లును రాష్ట్రపతి తప్పకుండా ఆమోదించాలి (1971లో 24వ సవరణ ద్వారా చేర్చారు).
- రాజ్యాంగ సవరణ బిల్లును ఒక సభ ఆమోదించి.. రెండో సభ తిరస్కరిస్తే ఆ బిల్లు వీగిపోతుంది.
- రాజ్యాంగ సవరణ బిల్లు విషయంలో ఉభయ సభల మధ్య సందిగ్ధత ఏర్పడితే సంయుక్త సమావేశానికి అవకాశం లేదు.

రాజ్యాంగ సవరణ పద్ధతులు

భారత రాజ్యాంగాన్ని కింది పద్ధతుల్లో సవరిస్తారు. అవి..

పార్లమెంటు సాధారణ మెజారిటీ పద్ధతి..

రాజ్యాంగంలోని కొన్ని అంశాలను పార్లమెంటు ఉభయ సభలు సాధారణ మెజారిటీతో సవరించొచ్చు. ఈ పద్ధతి ద్వారా సవరించే అంశాలు.

1. నూతన రాష్ట్రాల ఏర్పాటు, విలీనం (ఆర్టికల్- 3, 4).
2. భారత పౌరసత్వ పద్ధతుల్లో మార్పులు (ఆర్టికల్-5).
3. ఒక రాష్ట్రంలో విధాన పరిషత్ ఏర్పాటు లేదా రద్దు (ఆర్టికల్-169).
4. పార్లమెంటు సమావేశం కావడానికి అవసరమైన కోరంలో మార్పులు (ఆర్టికల్-100).
5. పార్లమెంటులో ఉపయోగించే భాష (ఆర్టికల్-120).
6. ఉన్నత పదవులకు సంబంధించిన జీతభత్యాలు
7. నియోజకవర్గాల పునర్విభజన (ఆర్టికల్-82)
8. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య మార్పు (ఆర్టికల్-124)
9. కేంద్రపాలిత ప్రాంతాలకు విధానసభ, మంత్రిమండలి ఏర్పాటు(ఆర్టికల్-239A)
10. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు సంబంధించిన సాధారణ విషయాలు.

పార్లమెంటు ప్రత్యేక మెజారిటీ పద్ధతి

రాజ్యాంగంలోని కొన్ని అంశాలను పార్లమెంటు (ఉభయసభలు) ప్రత్యేక మెజారిటీ (2/3వ వంతు)తో మాత్రమే సవరించగలదు. ప్రత్యేక మెజారిటీ అంటే మొత్తం సభ్యుల్లో కనీసం సగం మంది సభ్యులు హాజరు కావాలి. హాజరైన వారిలో 2/3వ వంతు మంది ఆమోదించాలి. ఈ పద్ధతిలో సవరించే అంశాలు

ప్రాథమిక హక్కులు (IIIవ భాగం)
ఆదేశిక సూత్రాలు (IVవ భాగం)

పై అంశాలతోపాటు మొదటి, మూడో రాజ్యాంగ సవరణ పద్ధతుల్లో చేర్చని అంశాలను ఈ పద్ధతిలో సవరించొచ్చు.

పార్లమెంటు ప్రత్యేక మెజారిటీ, రాష్ట్ర శాసనసభల ఆమోదం..

రాజ్యాంగంలోని అత్యంత ప్రధాన అంశాలను సవరించాలంటే పార్లమెంటు ప్రత్యేక మెజారిటీతో, సగానికి తగ్గకుండా రాష్ట్రాల శాసనసభలు సాధారణ మెజారిటీతో ఆమోదించాలి.

ఈ పద్ధతిలో సవరించే అంశాలు..

1. రాష్ట్రపతి ఎన్నిక విధానం.
2. కార్యనిర్వాహక శాఖ అధికారాల మార్పు.
3. భారత సమాఖ్య వ్యవస్థకు సంబంధించిన అంశాలు.
4. సుప్రీంకోర్టు, హైకోర్టు అధికారాల మార్పు.
5. ఏడో షెడ్యూల్‌లోని జాబితాల్లో మార్పు.
6. పార్లమెంటు ఉభయ సభల ప్రాతినిధ్యంలో మార్పు.
7. కేంద్ర, రాష్ట్రాల శాసన నిర్మాణాధికారాలు.

రాజ్యాంగ సవరణ స్వభావం

రాజ్యాంగ సవరణ విధానాన్ని పరిశీలిస్తే భారత రాజ్యాంగాన్ని దృఢ, అదృఢల సమ్మేళనంగా చెప్పొచ్చు.

- మొదటి పద్ధతి ప్రకారం రాజ్యాంగాన్ని సులభంగా సవరించొచ్చు. ఇది అదృఢ లేదా సరళ లక్షణం.
- రెండో పద్ధతి ప్రకారం రాజ్యాంగాన్ని కొంత క్లిష్టంగా సవరించొచ్చు. ఇది పాక్షిక దృఢ లక్షణం.
- మూడో పద్ధతి ప్రకారం రాజ్యంగ సవరణ క్లిష్టం. ఇది దృఢ స్వభావాన్ని సూచిస్తోంది.
- భారత రాజ్యాంగంలోని ఎక్కువ అంశాలను రెండో పద్ధతి ద్వారా సవరిస్తారు.
- పార్లమెంటు ఆమోదించిన రాజ్యాంగ సవరణ బిల్లును రాష్ట్రపతి ఎన్ని రోజుల్లోగా ఆమోదించాలనే విషయాన్ని రాజ్యంగంలో పేర్కొనలేదు.

రాజ్యాంగ సవరణ- పరిణామం

- భారత రాజ్యాంగానికి మొదటి సవరణను 1951, జూన్ 18న చేశారు. దీనిద్వారా భూసంస్కరణలు, రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడంతోపాటు వాటిని న్యాయ సమీక్ష నుంచి మినహాయించారు.
- మొదట రాజ్యాంగ సవరణ నాటికి భారత పార్లమెంటు ఏర్పడలేదు. దాంతో రాజ్యాంగ పరిషత్.. తాత్కాలిక పార్లమెంటు హోదాలో ఆ సవరణ చేసింది.
- ఇప్పటి వరకు భారత రాజ్యాంగానికి చేసిన సవరణల్లో 42వ రాజ్యాంగ సవరణ చట్టం అతి పెద్దది.
- 1976లో ఇందిరాగాంధీ హయాంలో చేసిన ఈ సవరణను (42) 'మినీ రాజ్యాంగం'గా పేర్కొంటారు. దీని ప్రకారం రాజ్యాంగంలోని చాలా అంశాలను సవరించారు.
- 1978లో మొరార్జీ దేశాయ్ ప్రధానిగా ఉన్న సమయంలో చేసిన 44వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని రెండో మినీ రాజ్యాంగంగా వ్యవహరిస్తారు.



42వ రాజ్యాంగ సవరణ చట్టం (1976)

దేశంలో అత్యవసర పరిస్థితిని విధించిన కాలంలో ఈ రాజ్యాంగ సవరణ చేశారు. దీని ద్వారా రాజ్యాంగంలో చాలా మార్పులు చేశారు. వాటిలో ముఖ్యమైనవి..

- రాజ్యాంగ ప్రవేశికలో సామ్యవాద, లౌకిక, సమగ్రత పదాలను చేర్చారు.
- రాజ్యాంగంలోని IVA భాగంలో 51A ఆర్టికల్‌లో పది ప్రాథమిక విధులను చేర్చారు.
- రాజ్యాంగంలోని XIV-A భాగంలో 323-A, 323-B ఆర్టికల్స్‌లో పరిపాలనా ట్రిబ్యునల్స్ గురించి పొందుపరిచారు.
- విద్య, అడవులు, తూనికలు-కొలతలు, జనాభా నియంత్రణ, దిగువస్థాయి న్యాయ పరిపాలన అంశాలను రాష్ట్ర జాబితా నుంచి ఉమ్మడి జాబితాలోకి మార్చారు.
- లోక్‌సభ, అసెంబ్లీ పదవీకాలాన్ని ఒక సంవత్సరం పెంచారు.
- న్యాయస్థానాల న్యాయ సమీక్షాధికారాన్ని తగ్గించారు.
- రాజ్యాంగ సవరణకు సంబంధించి పార్లమెంటు సర్వాధికారి. దీన్ని కోర్టులు ప్రశ్నించరాదు.
- రాష్ట్రపతి కేబినెట్ సలహాను తప్పనిసరిగా పాటించాలి.
- ఆదేశిక సూత్రాల అమలు ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉంటే ఆదేశిక సూత్రాలే ఆధిక్యతను కలిగి ఉంటాయి.
- కింది ఆదేశిక సూత్రాలను నూతనంగా చేర్చారు.
- ఆర్టికల్ 39 (A)- పేదలకు ఉచిత న్యాయ సహాయం.
- ఆర్టికల్ 43 (A)- పరిశ్రమల్లో కార్మికులకు భాగస్వామ్యం.
- ఆర్టికల్ 48 (A) -పర్యావరణ పరిరక్షణ.

44వ రాజ్యాంగ సవరణ చట్టం (1978)

మొరార్జీ దేశాయ్ నాయకత్వంలోని జనతా ప్రభుత్వం 44వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా కింది మార్పులు చేసింది.

1. ప్రాథమిక హక్కుల జాబితా నుంచి ఆస్తిహక్కును (ఆర్టికల్ 31) తొలగించి.. చట్టబద్ధమైన హక్కుగా ఆర్టికల్ 300 (A)లో పొందుపరిచారు.
2. న్యాయస్థానాల న్యాయసమీక్షాధికారాన్ని పునరుద్ధరించారు.
3. సాధారణ బిల్లులను పునఃసమీక్షించే అధికారాన్ని రాష్ట్రపతికి కల్పించారు.
4. అత్యవసర పరిస్థితిని విధించేందుకు ఆర్టికల్ 352లో ఉన్న 'అంతర్గత కల్లోలం' అనే పదాన్ని తొలగించి ఆ స్థానంలో 'సాయుధ తిరుగుబాటు' అనే పదాన్ని చేర్చారు.
5. రాష్ట్రపతి అత్యవసర పరిస్థితిని కేంద్ర కేబినెట్ లిఖిత పూర్వక సలహా ప్రకారం విధించాలి.

రాజ్యాంగ మౌలిక స్వరూపం

- రాజ్యాంగ సవరణ అధికారాన్ని రాజ్యాంగం భారత పార్లమెంటుకు కల్పించింది. దాంతో పార్లమెంటు రాజ్యాంగాన్ని ఇష్టానుసారంగా సవరించుకుంటూ పోయింది. కానీ, గోలక్‌నాథ్ Vs స్టేట్ ఆఫ్ పంజాబ్ (1967) కేసులో ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు లేదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పును అధిగమించేందుకు ఇందిరాగాంధీ ప్రభుత్వం 24వ రాజ్యాంగ సవరణ చట్టం (1971) తీసుకొచ్చింది. దీనిద్వారా రాజ్యాంగంలోని ఏ అంశాన్నయినా సవరించే అధికారం పార్లమెంటుకు సంక్రమించింది.
- కేశవానంద భారతీ Vs స్టేట్ ఆఫ్ కేరళ కేరళ (1973)కేసులో ఎస్.ఎం. సిక్రీ నేతృత్వంలోని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ..రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు ఉందని.. కానీ, దాని మౌలిక స్వరూపాన్ని మార్చరాదని తీర్పు చెప్పింది. రాజ్యాంగ సవరణ రాజ్యాంగ మౌలికతకు లోబడి ఉండాలని స్పష్టం చేసింది.
- సుప్రీంకోర్టు రాజ్యాంగ మౌలికత గురించి స్పష్టం చేయనప్పటికీ వివిధ కేసుల్లో ఇచ్చిన తీర్పులను బట్టి కింది అంశాలు రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగంగా ఉంటాయని అర్థమవుతోంది.

ఎ) న్యాయ సమీక్ష
బి) ప్రాథమిక హక్కులు
సి) లౌకిక విధానం
డి) పార్లమెంటరీ విధానం
ఇ) సమాఖ్య వ్యవస్థ
ఎఫ్) ప్రజాస్వామ్యం
జి) సామ్యవాదం
హెచ్) సమన్యాయపాలన తదితరాలు..

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీయూఐఏఎంఎల్‌లో వివిధ ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్(ఏపీయూఐఏఎంఎల్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 09.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్(పీపీపీ సెల్)-02, మేనేజర్ (పీపీపీ సెల్)-01, మేనేజర్ (పీపీపీ సెల్-రోడ్ సెక్టార్)-01, మేనేజర్ (పీపీపీ సెల్-ఫైనాన్స్)-01, సీనియర్ మేనేజర్(పీపీపీ సెల్)-01, వైస్ ప్రెసిడెంట్(పీపీపీ సెల్)-01, సీనియర్ మేనేజర్(ఆర్కిటెక్చరల్)-01, సీనియర్ మేనేజర్ (హెచ్ఆర్-అడ్మిన్)-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ,బీఈ/బీటెక్,బీ.ఆర్క్., ఎంబీఏ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:**అసెస్‌మెంట్,ఇంటర్వ్యూ, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. (అభ్యర్థులు సీవీని ఈమెయిల్‌కి పంపించాలి). -ఈమెయిల్:[illegible]
» **ఈమెయిల్ చేయాల్సిన చివరితేది:**17.11.2024
» **వెబ్‌సైట్:** https://www.apurban.com

జీఆర్ఎస్ఈ, కోల్‌కతాలో 24 పోస్టులు

కోల్‌కతాలోని గార్డెన్ రీసెర్చ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ లిమిటెడ్ (జీఆర్ఎస్ఈ).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 24.
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ సూపరింటెండెంట్-03, డిప్యూటీ జనరల్ మేనేజర్-06, సీనియర్ మేనేజర్-09, మేనేజర్-04, డిప్యూటీ మేనేజర్-02.
» **విభాగాలు:** టెక్నికల్, మెడికల్, ఫైనాన్స్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, సీఏ, బీఈ /బీటెక్(మెకానికల్/ఎలక్ట్రికల్/మెరైన్/ఎలక్ట్రానిక్స్/సివిల్/నావల్), ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** ప్రాజెక్ట్ సూపరింటెండెంట్ పోస్టులకు 54 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టుకు 48 ఏళ్లు, సీనియర్ మేనేజర్‌కు 45 ఏళ్లు, మేనేజర్‌కు 42 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్ పోస్టుకు 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ సూపరింటెండెంట్ పోస్టులకు రూ.1,20,000 నుంచి రూ.2,80,000, డీజీఎం పోస్టులకు రూ.80,000 నుంచి రూ.2,20,000, ఎస్ఎం పోస్టులకు రూ.70,000 నుంచి రూ.2,00,000, ఎంజీఆర్ పోస్టులకు రూ.60,000 నుంచి రూ.1,80,000, డీఎం పోస్టులకు రూ.50,000 నుంచి రూ.1,60,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.11.2024.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://grse.in

హెచ్ఏఎల్ కోరాపుట్‌లో 178 ట్రేడ్ అప్రెంటిస్‌లు

కోరాపుట్(ఒడిశా)లోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్).. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 178.
» **ట్రేడులు:** ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, టర్నర్, మెషినిస్ట్, వెల్డర్(గ్యాస్-ఎలక్ట్రిక్), ఫౌండ్రీమ్యాన్, పీఏఎస్ఏఏ, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ మెకానిక్,మెకానిక్ మోటార్ వెహికల్.
» **అర్హత:**పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 15.11.2024 నాటికి 23 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హత పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.11.2024
» **ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి తేదీ:** 25.11.2024.
» **డాక్యుమెంట్ వెరిఫికేషన్ తేది:** 15.12.2024.
» **అప్రెంటిస్‌షిప్ శిక్షణ ప్రారంభం:** 01.01.2025.
» **వెబ్‌సైట్:** https://hal-india.co.in

సాయ్, న్యూఢిల్లీలో 50 యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

న్యూఢిల్లీలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 50.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, సీఏ, డిగ్రీ, ఎల్ఎల్‌బీ, బీఈ/బీటెక్, ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 32 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి రూ.70,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.11.2024
» **వెబ్‌సైట్:** http://sportsauthorityofindia.gov.in

విద్యార్థి సామర్థ్యాన్ని సూచించేవి?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
ఎస్‌జీటీ - సైన్స్ మెథడాలజీ

విజ్ఞానశాస్త్ర బోధన లక్ష్యాలు

- సాధారణంగా ఉద్దేశాలు, గమ్యాలు, లక్ష్యా లు అనే పదాలను పర్యాయపదాలుగా వాడతారు.
- **గమ్యాలు:** విశాలమైన, దీర్ఘకాలిక అంతిమ ప్రయోజనాన్ని తెలిపేవి గమ్యాలు.
  ఉదా: విద్యకు పరమార్థం మోక్షం. - **ఉపనిషత్తులు**
- **ఉద్దేశాలు:** గమ్యాల నుంచి ఏర్పడినవి ఉద్దేశాలు. ఇవి గమ్యాల కంటే నిర్దిష్టమైనవే కాకుండా విద్యా దిశలను కూడా సూచి స్తాయి.
  ఉదా: విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్ర జ్ఞానం కలిగించడం.
- **లక్ష్యాలు:** స్వల్పకాలంలో చేరగలిగే గమ్యాలను లక్ష్యాలనవచ్చు.
  ఉదా: డీఈడీ పరీక్ష పాసవడం.

విజ్ఞానశాస్త్ర అధ్యయన విలువలు:

1. సామాజిక విలువలు
2. సాంస్కృతిక విలువలు
3. నైతిక విలువలు
4. వృత్తిపరమైన విలువలు
5. ఔపయోగిక విలువలు

సామాజిక విలువలు- రకాలు:

1. బౌద్ధిక విలువ 2. సృజనాత్మక విలువ 3. సౌందర్య విలువ.

విద్యా లక్ష్యాలను ఈ కింది విధంగా చూపొచ్చు

- **గాగ్నే అనే విద్యావేత్త సూచించిన వర్గీకరణ:** గాగ్నే అభ్యసనాన్ని వివిధ రకాలుగా విడమర్చి చెప్పారు. అవి..

సూచీ అభ్యసనం- ఉద్దీపన- ప్రతిస్పందన అభ్యసనం, భావనాభ్యసనం, సూత్రాల అభ్యసనం, సమస్యా పరిష్కారం. ఇవి సరళం నుంచి సంక్లిష్టం వరకు ఒక క్రమ పద్ధతిలో అమిరి ఉంటాయి.

- **బెంజిమన్ బ్లూమ్, క్రాత్‌హోల్, డేవిడ్ సూచించిన వర్గీకరణ:** వీరు విద్యా లక్ష్యాలను మూడు వర్గాలుగా విభజించారు. అవి..

ఎ) జ్ఞానాత్మక రంగం
బి) భావావేశ రంగం
సి) మానసిక చలనాత్మక రంగం

- జ్ఞానాత్మక రంగంపై బెంజిమన్ బ్లూమ్, భావావేశ రంగంపై డేవిడ్.ఆర్. క్రాత్‌హోల్, మానసిక చలనాత్మక రంగంపై ఎలిబత్ సింప్సన్, ఆర్.హెచ్. దవే కృషి చేశారు.
- జ్ఞానాత్మక రంగం మెదడుకు, భావావేశ రంగం హృదయానికి, మానసిక చలనా త్మక రంగం మనసుకు, శరీరానికి సంబం ధించినవి.
- ఏ అంశం గురించి అయినా ఈ మూడు రంగాల్లో విద్యార్థులను అభివృద్ధి చేయాలి.

విజ్ఞాన శాస్త్రంలో లక్ష్యాలు - స్పష్టీకరణలు -వివరణలు

ఎ. జ్ఞాన రంగంలో లక్ష్యాలు:

- జ్ఞప్తికి తెచ్చుకోవడం • గుర్తించడం

లక్ష్యం-I

1. **జ్ఞప్తికి తెచ్చుకోవడం :** విద్యార్థి విజ్ఞానశాస్త్ర సంబంధమైన పదాలు, సత్యాలు, భావన లు, సూత్రాలు, నిర్వచనాలు, నియమాలు పద్ధతులు జ్ఞప్తికి తెచ్చుకొంటాడు.
   ఉదా: చంద్ర గ్రహణం అంటే ఏమిటి?
2. **గుర్తించడం:** విద్యార్థి విజ్ఞానశాస్త్ర సం బంధమైన సత్యాలు, భావనలు, సూత్రా లు, నియమాలు, పద్ధతులు గుర్తిస్తాడు.
   ఉదా: కుంభాకార, పుటాకార దర్పణాల్లో భేదాలను గుర్తించడం.

లక్ష్యం-II అవగాహన:

విద్యార్థి విజ్ఞానశాస్త్ర సంబంధమైన పదా లు, సత్యాలు, భావనలు మొదలైన వాటిని అవగాహన చేసుకుంటాడు.

స్పష్టీకరణలు:

- భావనలు, నియమాలు, సూత్రాలకు ఉదాహరణలిస్తాడు.
  ఉదా: సజీవులకు ఉదాహరణనిస్తాడు.
- వివిధ భావనలు, సూత్రాలు, నియమాలను వివరిస్తాడు.
- ఇచ్చిన వాక్యంలోని దోషాన్ని సవరించి సరి చేస్తాడు.
- వివిధ భావనలు, సూత్రాలు నియమా లను సరి చేస్తాడు.
- చిత్రపటాలకు, రేఖా పటాలకు, దత్తాంశాలకు వ్యాఖ్యానం రాస్తాడు.
- విజ్ఞాన సూత్ర సత్యాలను, భావాలను వర్గీకరిస్తాడు.
- సమస్యలను సాధిస్తాడు.
- విజ్ఞానశాస్త్ర పరికరాలను, రసాయనాలను ఎంపిక చేసుకుంటాడు.
- భౌతిక రాశులకు సరైన ప్రమాణాలు తెలుపుతాడు.
- శాస్త్ర సత్యాలు, భావనలను, ప్రక్రియలను సరిపోల్చుతాడు.

లక్ష్యం - III వినియోగం: విద్యార్థి తాను నేర్చుకున్న విజ్ఞానశాస్త్ర విజ్ఞానాన్ని పరిస్థితులకనుగుణంగా వినియోగిస్తాడు.

స్పష్టీకరణలు:

- భావనలు, సూత్రాలు, నియమాలు మొదలైన వాటిని విశ్లేషిస్తాడు.
- విద్యార్థులు నేర్చుకున్న జ్ఞానాన్ని నేరుగా వినియోగిస్తారు.

విద్యా లక్ష్యాలు
↓
స్థాయిలవారీగా విద్యా లక్ష్యాలు
↓
సబ్జెక్టుల వారీగా విద్యా లక్ష్యాలు
↓
తరగతుల వారీగా విద్యా లక్ష్యాలు



- శాస్త్ర ప్రక్రియలకు, దృగ్విషయాలకు కారణాలను తెలుపుతాడు.
- కారణానికి, ఫలితానికి మధ్య సంబం ధాన్ని ఏర్పరుస్తాడు.
- శాస్త్ర పరిశీలనలను వ్యాఖ్యానిస్తాడు.
- సామాన్యీకరణలను ప్రతిపాదిస్తాడు.
- సరైన ప్రయోగ విధానాలు, పరికరాలను సూచిస్తాడు.
- ప్రాగుక్తీకరించగలడు.
- దత్తాంశం ఆధారంగా నిర్ణయం తీసుకుంటాడు.

భావావేశ రంగం లక్ష్యాలు:

లక్ష్యం I: శాస్త్రీయ వైఖరుల అభివృద్ధి
లక్ష్యం II: అభిరుచి
లక్ష్యం III: అభినందన

మానసిక చలనాత్మక రంగ లక్ష్యాలు

లక్ష్యం I: చిత్రలేఖన నైపుణ్యం
లక్ష్యం II: హస్త నైపుణ్యాలు
లక్ష్యం III: పరిశీలన నైపుణ్యాలు
లక్ష్యం IV: అభివ్యంజన నైపుణ్యాలు
లక్ష్యం V: నివేదన నైపుణ్యాలు

విజ్ఞాన శాస్త్రం- సహ సంబంధం

సహ సంబంధం ఆవశ్యకత:

- జ్ఞానాన్ని సంయుక్తపరచడం
- సమర్థవంతమైన అభ్యసనం
- శ్రమ ఆదా
- అభ్యసన బదలాయింపు

సహ సంబంధం- రకాలు:

- సహజసిద్ధం
- కృత్రిమ సహ సంబంధం
- వ్యవస్థీకృత సహ సంబంధం
- విజ్ఞానశాస్త్రానికి విద్యా ప్రణాళికలోని ఇతర పాఠ్యవిషయాలకు సంబంధం
- విజ్ఞానశాస్త్రం- భాష
- విజ్ఞానశాస్త్రం - చరిత్ర
- విజ్ఞానశాస్త్రం - భౌగోళిక శాస్త్రం
- విజ్ఞానశాస్త్రం- గణితం
- విజ్ఞానశాస్త్రం - చిత్రలేఖనం
- విజ్ఞాన శాస్త్రం - చేతిపని
- విజ్ఞాన శాస్త్రం-దైనందిన జీవితానికి సంబంధం.

విద్యా లక్ష్యాలు

జ్ఞాన రంగం	భావావేశ రంగం	మానసిక చలనాత్మక రంగం
జ్ఞానానికి సంబంధించిన వాటిని జ్ఞప్తికి తెచ్చుకోవడం, గుర్తించడం, మానసిక సామర్థ్యాలు, నైపుణ్యాలను అభివృద్ధి పరచడం.	ఆసక్తులు, విలువల్లో మార్పులు, అభినందనను పెంపొందించడం	హస్తలాఘవ, మోటార్ నైపుణ్యాలు అభివృద్ధి చేయడం

బ్లూమ్ సూచించిన లక్ష్యాల వర్గీకరణ

శిశువు (ప్రవర్తన)

జ్ఞాన రంగం	భావావేశ రంగం	మానసిక చలనాత్మక రంగం
1. జ్ఞానం	1. గ్రహించడం	1. అనుకరణ
2. అవగాహన	2. ప్రతిస్పందించడం	2. హస్తలాఘవం
3. వినియోగం	3. విలువకట్టడం	3. సునిశితత్వం
4. విశ్లేషణ	4. వ్యవస్థాపనం	4. ఉచ్చారణ
5. సంశ్లేషణ	5. శీలస్థాపనం	5. స్వాభావీకరణం
6. మూల్యాంకనం		

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జీవ వైవిధ్యం అంటే ఏమిటి?

ప్రకృతిలో జీవుల మధ్య సహజంగా కనిపించే భిన్నత్వాన్ని /ఒక భౌగోళిక ప్రాంతంలోని భిన్నజాతుల సముదాయాన్ని జీవవైవిధ్యం (Biodiversity) అంటారు. దీంతోపాటు ఒక జాతి జీవుల మధ్య కూడా అనేక రకాల జన్యుపరమైన వ్యత్యాసాలుంటాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని పర్యావరణవేత్తలు జీవవైవిధ్య భావనను మరింత విస్తరించారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఎన్విరాన్‌మెంట్ - బయోడైవర్సిటీ

స్విట్జర్లాండ్‌లోని గ్లాండ్ నగరంలో ఉన్న (International Union for Conservation of Natural Resources) (IUCN) ప్రకారం ఒక జాతి జీవుల మధ్య, విభిన్న జాతుల జీవుల మధ్య, అవి నివసిస్తున్న ఆవరణ వ్యవస్థల మధ్య ఉన్న వైవిధ్యాన్నే జీవ వైవిధ్యం అంటారు.

జీవ వైవిధ్య భావన అభివృద్ధి

ప్రారంభంలో సహజ ఆవరణ వ్యవస్థల పరిరక్షణ అనేది కేవలం కలపతోపాటు కొన్ని ముఖ్యమైన వన్య జీవుల సంరక్షణకు మాత్రమే పరిమితమై ఉండేది. తర్వాతి కాలంలో ఆవరణ వ్యవస్థలోని ప్రతి సూక్ష్మ జీవి కూడా జీవావరణ సమతుల్యతకు కారణమవుతుందని పర్యావరణవేత్తలు గుర్తించారు. ఆధునిక బయోటెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తర్వాత సాధారణ జీవవైవిధ్యం కంటే జీవుల్లోని జన్యుపరమైన వైవిధ్యం మనిషికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో జీవ వైవిధ్యం భావన ప్రాముఖ్యతను సంతరించుకుంది. 1968లో అమెరికాకు చెందిన ప్రముఖ పర్యావరణవేత్త రేమండ్ ఎఫ్. డాస్‌మన్ 'A Different Kind of Country' అనే గ్రంథంలో తొలిసారిగా Biological Diversity అనే పదాన్ని (జీవ సంబంధ వైవిధ్యం) ఉపయోగించారు.

1985లో డబ్ల్యు.ఎస్.రోజెన్ అనే మరో పర్యావరణవేత్త, జీవ వైవిధ్యం (Biodiversity) అనే సంక్షిప్త పదాన్ని ప్రతిపాదించారు. 1988లో ఇ.ఒ.విల్సన్ రచించిన గ్రంథంలో జీవవైవిధ్యం అనే పదాన్ని ఉపయోగించారు. తర్వాతి కాలంలో జీవ సంబంధ వైవిధ్యం అనే పదమే అధికంగా వాడుకలోకి వచ్చింది.

జీవ వైవిధ్య స్థాయిలు: జీవ వైవిధ్యం ప్రధానంగా మూడు స్థాయిల్లో ఉంటుంది.

1. జన్యు వైవిధ్యం (Genetic Diversity)

- ఇది ఒక జాతి జీవుల్లో ఉన్న వైవిధ్యం. సాధారణంగా తమలో తాము అంతర ప్రజననం చెందుతూ సమాన లక్షణాలున్న జీవుల సమూహాన్ని జాతి అంటారు.
  ఉదా: మనుషులు అందరూ ఒకే జాతికి చెందినవారైనా, వారి మధ్య జన్యుపరమైన భేదాలుంటాయి. దీన్నే జన్యు వైవిధ్యం అంటారు.
  ఉదా: మనిషి జాతిలో భిన్న తెగలు (ఆస్ట్రలాయిడ్, మంగోలాయిడ్, కాకసాయిడ్, నీగ్రాయిడ్), భిన్న రక్త గ్రూపులు.

2. జాతి వైవిధ్యం (Species Biodiversity)


ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రాంతంలో ఉన్న భిన్న జీవ జాతుల సముదాయాన్ని జాతి వైవిధ్యం అంటారు. ఈ వైవిధ్యాన్ని ఒక చదరపు కిలోమీటర్/రాష్ట్రం /దేశం పరిధులతోపాటు ప్రపంచం మొత్తానికి లెక్కించొచ్చు. ఈ రకమైన జాతి వైవిధ్యాన్ని జీవుల వర్గీకరణలో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఒక దేశంలోని భిన్న ప్రాంతాల మధ్య, భిన్న దేశాల మధ్య జీవ వైవిధ్య భేదాలను గుర్తించేందుకు, తులనాత్మక అంచనాకు జాతి వైవిధ్య అధ్యయనం ఉపయోగపడుతుంది. దీని ఆధారంగానే Conservation International అనే అంతర్జాతీయ పరిరక్షణ సంస్థ అత్యధిక జీవ వైవిధ్యం కలిగిన 17 మెగా బయోడైవర్సిటీ కేంద్రాలను గుర్తించింది.

3. ఆవరణ వ్యవస్థల వైవిధ్యం (Ecosystem Biodiversity)

భూమిపై ఉన్న విభిన్న, భూ, జలచర జీవ మండలాల వైవిధ్యం, ఆవరణ వ్యవస్థ వైవిధ్యం, ఉష్ణోగ్రత, వర్షపాతం, సారవంతం లాంటి అంశాల్లో ఆవరణ వ్యవస్థలు ఒకదానికొకటి భిన్నంగా ఉంటాయి. ఆవరణ వ్యవస్థలోని జాతి, జన్యు జీవ వైవిధ్యాన్ని భౌతిక, రసాయన నిర్జీవ కారకాలు నిర్దేశిస్తాయి.

ఉదా: టండ్రా, ఆల్పైన్, కోనిఫెరస్ అడవులు, బోరియల్ అడవులు, సమశీతోష్ణ సతత హరిత అడవులు, వర్షాధార అడవులు, గడ్డినేలలు, ఎడారుల వంటి భూచర మండలాలు.

- సముద్ర, నదీ ముఖద్వారాల వంటి జలచర మండలాలు. మనిషి కూడా కొన్ని కృత్రిమ ఆవరణ వ్యవస్థలను సృష్టించాడు.
  ఉదా: వ్యవసాయ భూములు, జంతు ప్రదర్శనశాలలు, బొటానికల్ గార్డెన్స్, ఆర్బోరెటం, సామాజిక అడవులు మొదలైనవి.



జీవ వైవిధ్య హాట్‌స్పాట్

అధిక జీవ వైవిధ్యానికి నిలయాలుగా ఉంటూ తీవ్రస్థాయి ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న జీవ భౌగోళిక ప్రాంతాన్నే జీవ వైవిధ్య హాట్‌స్పాట్/బయోడైవర్సిటీ హాట్‌స్పాట్/జీవ వైవిధ్య సునిశిత ప్రాంతంగా పిలుస్తారు. ఆయా ప్రాంతాలను ప్రారంభం నుంచి నిర్లక్ష్యం చేయడం వల్ల తీవ్రస్థాయిలో దెబ్బతిన్నాయి.

బ్రిటన్ పర్యావరణ పరిరక్షణవేత్త నార్మన్ మెయర్స్ తొలిసారిగా హాట్‌స్పాట్ భావనను ప్రతిపాదించారు. 1988, 1990ల్లో తన 'The Environment' అనే గ్రంథంలో వీటి గురించి వివరించారు. 1989లో 'Conservation International' (CI) సంస్థ హాట్‌స్పాట్‌ల భావనను ఆమోదించింది. పర్యావరణ పరిరక్షణవేత్తలు 1996లో హాట్‌స్పాట్‌లపై విస్తృత అధ్యయనాన్ని ప్రారంభించి 1999లో వాటిని గుర్తించడానికి కావాల్సిన ప్రమాణాలను రూపొందించారు.

1. ఒక భౌగోళిక ప్రాంతాన్ని హాట్‌స్పాట్‌గా గుర్తించేందుకు కనీసం 1500 నాళికా కణజాలయుత మొక్కలు ఆ ప్రాంతానికి మాత్రమే స్థానీయ జాతులుగా ఉండాలి.
2. ఆయా భౌగోళిక ప్రాంతం అప్పటికే 70 శాతానికి పైగా తన సహజ ఆవాసాన్ని, వృక్షజాలాన్ని కోల్పోయి ఉండాలి. 1999లో మెయర్స్ 'Hotspots Earth's Biologically Richest & Most Endangered Terrestrial Ecoregions' అనే గ్రంథాన్ని ప్రచురించారు. 2000లో అంతర్జాతీయ జర్నల్ 'Nature'లో ఈ అధ్యయనం ప్రచురితమైంది. మెయర్స్ అధ్యయనాలను రివైజ్ చేస్తూ రసల్స్ మిట్టర్‌మియర్ అనే శాస్త్రవేత్త 2004లో Hotspots Revisited అనే పుస్తకం రాశారు. ప్రారంభంలో 25 హాట్‌స్పాట్‌లను గుర్తించినా ప్రస్తుతం వాటి సంఖ్య 35కు చేరింది.

ప్రపంచ జీవ వైవిధ్య హాట్‌స్పాట్‌లు

1. ఉత్తర, మధ్య అమెరికా - 4
1) కాలిఫోర్నియా ఫ్లోరిస్టిక్ ప్రావిన్స్
2) మాడ్రియన్ పైన్ ఓక్ వుడ్‌ల్యాండ్స్
3) మీసో అమెరికా
4) కరేబియన్ దీవులు

2. దక్షిణ అమెరికా-5
1) టంబెస్ చోకో మగ్దలేనా
2) ట్రాపికల్ ఆండెస్
3) చిలియన్ వింటర్ రెయిన్ ఫాల్ వాల్డీవియన్ దీవులు
4) బ్రెజిల్ సెర్రాడో
5) బ్రెజిల్ అట్లాంటిక్ అడవి

3. యూరోప్ మధ్య ఆసియా - 4
1) కాకాసస్
2) మధ్యధరా ప్రాంతం
3) ఇరానో అనతోలియన్
4) మధ్య ఆసియా పర్వతాలు

4. ఆఫ్రికా-8
1) పశ్చిమ ఆఫ్రికా గినియా అడవులు
2) సక్కులెంట్ కేర్
3) కేప్ ఫ్లోరిస్టిక్ ప్రాంతం
4) మపుటో ల్యాండ్, పోండోల్యాండ్ ఆల్బనీ
5) తూర్పు ఆఫ్రికా తీర అడవులు
6) ఈస్టర్న్ ఆఫ్రోమోంటేన్
7) హార్న్ ఆఫ్ ఆఫ్రికా
8) మడగాస్కర్ అండ్ హిందూ మహాసముద్ర దీవులు

5. ఆసియా పసిఫిక్-14
1) పశ్చిమ కనుమలు - శ్రీలంక
2) ఇండో బర్మా
3) హిమాలయాలు
4) నైరుతి చైనా
5) సుందాల్యాండ్
6) వాలేసియా
7) ఫిలిప్పీన్స్ 8) జపాన్
9) న్యూ కాలిడోనియా
10) తూర్పు మెలనేసియా దీవులు
11) పాలీనేసియా - మైక్రోనేసియా
12) న్యూజిలాండ్
13) నైరుతి ఆస్ట్రేలియా
14) తూర్పు ఆస్ట్రేలియా

పశ్చిమ కనుమలు - శ్రీలంక, ఇండో బర్మా, హిమాలయాలు, సుందాల్యాండ్ అనే నాలుగు హాట్‌స్పాట్‌ల్లో భారత్ భూభాగం విస్తరించింది.

మెగా బయోడైవర్సిటీ దేశాలు

ప్రపంచవ్యాప్తంగా 17 దేశాలను అత్యధిక జీవ వైవిధ్యం గల మెగా బయోడైవర్సిటీ దేశాలుగా గుర్తించారు. 1998లో కన్జర్వేషన్ ఇంటర్నేషనల్ వీటిని గుర్తించింది. 2002లో మెక్సికో Like Minded Mega diverse Countries అనే ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసింది. అధిక జీవ వైవిధ్యంతోపాటు అపార సంప్రదాయ విజ్ఞానం కలిగిన దేశాలు ఇందులో భాగంగా ఉంటాయి. బ్రెజిల్, చైనా కొలంబియా, కోస్టారికా, ఇండియా, ఇండోనేసియా, కెన్యా, మెక్సికో, పెరూ, ఫిలిప్పీన్స్, దక్షిణాఫ్రికా, వెనెజువెలా దేశాలకు చెందిన ప్రతినిధులు 2002 ఫిబ్రవరి 18న మెక్సికోలోని కాంకన్ నగరంలో ఈ సంస్థను ప్రారంభించారు. ప్రస్తుతం Like Minded Mega diverse Countries సంఘంలో 20 దేశాలున్నాయి. అయితే Conservation International గుర్తించిన మెగా బయోడైవర్సిటీ దేశాల జాబితాలో 17 దేశాలున్నాయి. అవి..

- ఆస్ట్రేలియా, బ్రెజిల్, చైనా, కొలంబియా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వెడార్, ఇండియా, ఇండోనేసియా, మడగాస్కర్, మలేసియా, మెక్సికో, పపువా న్యూగినియా, పెరూ, ఫిలిప్పీన్స్, దక్షిణాఫ్రికా, అమెరికా, వెనెజువెలా.

The telephone is an example of..

BANK EXAMS

COMPUTER KNOWLEDGE

1. What is the responsibility of the logical unit in the CPU of a computer?
   a) Producing result
   b) Comparing numbers
   c) Controlling flow of information
   d) Performing mathematical operations
   e) Controlling flow of data
2. Abacus was the first ___
   a) Electronic computer
   b) Mechanical computer
   c) Electronic calculator
   d) Mechanical calculator
   e) Electronic chip
3. If in a computer, 16 bits are used to specify address in a RAM, the number of addresses will be ___
   a) 216 b) 65,536
   c) 64K d) 128K e) 135K
4. Instructions and memory address are represented by ___
   a) Character code
   b) Binary code c) Binary word
   d) Parity bit e) Bite code
5. The terminal device that functions as a cash register, computer terminal and OCR reader is:
   a) Data collection terminal
   b) OCR register terminal
   c) Video Display terminal
   d) POS terminal
   e) None of the above
6. A set of flip flops integrated together is called ____
   a) Counter b) Adder
   c) Register d) Flip flop
   e) All of the above
7. People often call ______ as the brain of computer system.
   a) Control Unit
   b) Arithmetic Logic Unit
   c) Central Processing Unit
   d) Storage Unit e) Store data



8. Which of the following is used for manufacturing chips?
   a) Bus b) Control unit
   c) Semiconductors
   d) a and b only
   e) None of the above
9. The value of each bead in heaven is ___
   a) 1 b) 3 c) 5 d) 7 e) 8
10. The first computer introduced in Nepal was ___
    a) IBM 1400 b) IBM 1401
    c) IBM 1402 d) IBM 1406
    e) IBM 1405
11. Bluetooth is a type of radio wave information transmission system that is good for about:
    a) 30 feet b) 30 yards
    c) 30 miles d) 300 miles
    e) 3000 miles
12. The telephone is an example of a(n)____ signal.
    a) analog b) digital
    c) modulated d) demodulated
    e) compiler
13. A credit card-sized expansion board that is inserted into portable computers that connects the modem to the telephone wall jack is:
    a) Internal modem
    b) External modem
    c) PC Card modem
    d) Wireless modem
    e) Wired modem
14. A modem that is contained within the system unit is called:
    a) External b) Internal
    c) Wireless d) Wi-Fi
    e) Bluetooth
15. A modem that doesn't need to be connected to a telephone line is the ___ modem.
    a) external b) internal
    c) wireless d) DSL e) NSL
16. A special high-speed line used by large corporations to support digital communications is known as:
    a) satellite/air connection service lines
    b) cable modems
    c) digital subscriber lines
    d) T1, T2, T3 and T4 lines
    e) None of the above
17. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called ________.
    a) ISDN b) microwave
    c) cable modem
    d) DSL e) ALU
18. The capacity of a communication channel is measured in ___
    a) Bandwidth b) Bit capacity
    c) Baud rate d) Data flow
    e) Store data
19. A relatively new technology that allows wireless connectivity:
    a) Bluetooth b) Black tooth
    c) Blue band d) Broadband
    e) Wi- fi
20. In MS-DOS 5.0, which is the number that acts as a code to uniquely identify the software product?
    a) MS b) DOS
    c) MS DOS d) 5.0 e) 4.2.0
21. A page fault:
    a) Is an error in a specific page
    b) Occurs when a program accesses a page of memory
    c) Is an access to a page not currently in memory
    d) None of the above
    e) All of the above
22. The process of transferring data intended for a peripheral device into a disk or intermediate store so that it can be transferred to peripheral at a more convenient time or in bulk, is known as ___.
    a) Multiprogramming
    b) Spooling c) Caching
    d) Virtual programming
    e) Code programming
23. An instruction in a programming language that is replaced by a sequence of instructions prior to assembly or compiling:
    a) Procedure b) Macro
    c) Label d) Literal
    e) External
24. Banker's algorithm for resource allocation deals with:
    a) Deadlock prevention
    b) Deadlock avoidance
    c) Deadlock recovery
    d) Mutual exclusion
    e) Data recovery
25. The state of a process after it encounters an I/O instruction is _____.
    a) Ready b) Blocked/ Waiting
    c) Idle d) Running e) Compiling
26. The number of processes compl-eted per unit time is known as__.
    a) Output b) Throughput
    c) Efficiency d) Capacity
    e) Input
27. Which of the following file name extension suggests that the file is Backup copy of another file?
    a) TXT b) COM
    c) BAS d) BAK e) BAT

KEY:

1) b; 2) d; 3) b; 4) b; 5) d;
6) c; 7) c; 8) c; 9) c; 10) b
11) a; 12) a; 13) c; 14) b; 15) c;
16) d; 17) d; 18) a; 19) a; 20) d;
21) c; 22) b; 23) b; 24) b; 25) b;
26) b; 27) d.

ఉద్యోగ సమాచారం

నిట్ మణిపూర్‌లో 22 టీచింగ్ పోస్టులు

మణిపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీఎం) అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 22.
» **విభాగాలు:** సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెకానికల్, ఫిజిక్స్, మ్యాథమేటిక్స్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మార్కులతో బీఈ/బీటెక్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.11.2024
» **వెబ్‌సైట్:** www.nitmanipur.ac.in

నెల్లూరు డీఎంహెచ్‌వోలో 10 పోస్టులు

నెల్లూరు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో ఒప్పంద/ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
» **పోస్టుల వివరాలు:** ల్యాబ్ టెక్నీషియన్-03, ఫార్మసిస్ట్(గ్రేడ్-2)-02, డేటా ఎంట్రీ ఆపరేటర్-02, లాస్ట్ గ్రేడ్ సర్వీస్-03.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, డిగ్రీ, బీఎస్సీ(ఎంఎల్‌టీ), డీఎంఎల్‌టీ, డీఫార్మసీ, బీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **గరిష్ఠ వయో పరిమితి:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తును జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం, నెల్లూరు, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 13.11.2024.
» **వెబ్‌సైట్:** https://spsnellore.ap.gov.in

నిట్ వరంగల్‌లో లైబ్రరీ ట్రైనీ పోస్టులు

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ)ఒప్పంద ప్రాతిపదికన లైబ్రరీ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో ఎంఎల్ఐఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి. బేసిక్ కంప్యూటర్ అప్లికేషన్స్ పరిజ్ఞానం, ఇంగ్లిష్/హిందీ భాషల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండాలి.
వయసు: 28 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.20,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.11.2024
» **వెబ్‌సైట్:** https://nitw.ac.in

ఎన్‌బీటీ. ఇండియా, ఢిల్లీలో 12 పోస్టులు

ఢిల్లీలోని నేషనల్ బుక్ ట్రస్ట్(ఎన్‌బీటీ) ఇండియా ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
» **పోస్టుల వివరాలు:** కన్సల్టెంట్ గ్రేడ్ 2-01, కన్సల్టెంట్ గ్రేడ్1-01, ఈవెంట్ ఆఫీసర్-01, యంగ్ ప్రొఫెషనల్(కల్చరల్ కోఆర్డినేటర్)-01, యంగ్ ప్రొఫెషనల్(సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్)-01, ప్రోటోకాల్ ఆఫీసర్-01, కన్సల్టెంట్(ఎస్టాబ్లిష్‌మెంట్)-01, సెక్షన్ ఆఫీసర్-01, వీడియో ఎడిటర్-01, గ్రాఫిక్ డిజైనర్-01, ఇల్లస్ట్రేటర్-01, ఎడిటర్(ఒడియా)-01.
» **విభాగాలు:** ఎస్టాబ్లిష్‌మెంట్, సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్, కల్చరల్ కోఆర్డినేటర్, విజువల్ డిజైన్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 35 నుంచి 65 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు కన్సల్టెంట్ గ్రేడ్-2 పోస్టులకు రూ.1,45,000 నుంచి రూ.2,65,000, కన్సల్టెంట్ పోస్టులకు రూ.1,25,000 నుంచి రూ.1,50,000, కన్సల్టెంట్ గ్రేడ్-1 పోస్టులకు రూ.80,000 నుంచి రూ.1,45,000, ప్రోటోకాల్ ఆఫీసర్ పోస్టులకు రూ.70,000 నుంచి రూ.80,000, మిగతా పోస్టులకు రూ.50,000 నుంచి రూ.70,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.11.2024
» **వెబ్‌సైట్:** www.nbtindia.gov.in